# కృప చేత మాత్రమే
# (By Grace alone)

## సైద్ధాంతిక అధ్యయనము
## (A Doctrinal Study)




రచయిత

## జిమ్ మెక్లార్టి

by

## Jim McClarty

Copy right 2011
www.truth.co.in

ఈ పుస్తకమును వాణిజ్యపరముగా పంపిణీ చేయాలనుకున్నవారు మా లిఖితపూర్వక అనుమతిని తప్పక తీసుకోవాలి. ఉచిత పంపిణీ కొరకు మా అనుమతి తీసుకొననవసరము లేదు.

Web masters
www.truth.co.in

"నేను బోధించునది క్రొత్తదేమి కాదు, వినూత్న  సిద్ధాంతము మేమి కాదు; కాల్వినిజమ్ అనే మారు పేరుతో పిలువబడు  బలమైన సనాతన సిద్ధాంతములను బోధించుట నాకు చాలా ప్రీతి. ఎందుకనగా ఇవి క్రీస్తులో ప్రత్యక్షపరచబడిన దేవుని సత్యములు. ఈ సత్యాధారముగా గత శతాబ్దముల సంఘచరిత్రలోనికి  అడుగిడితే, ముందుకు  వెళ్తున్న కొలది పితామహుల వెంబడి పితామహులు, ఒప్పకోలుదారుల వెంబడి ఒప్పకోలుదారులు, హతస్సాక్షులు వెంబడి హతస్సాక్షులు, తదితరులు బారులు తీరి నాతో కరచాలనం చేయుట చూడగలను. ఒకవేళ నేను స్వేచ్ఛాసిద్ధాంతాన్ని నమ్మే పెలేజియన్‌ను అయినట్లైతే శతాబ్దాల తరబడి ఒంటరి పయనం సాగించవలసియుండేది. అక్కడక్కడ కొందరు అబద్ధ బోధకులు, గుణహీనులైనవారు నన్ను వారిలో ఒకనిగా, సహోదరునిగా పరిగణించి పలకరించేవారేమో.  అయితే, ఈ సత్యాలను నా విశ్వాస ప్రమాణంగా తీసుకున్నప్పడు మన పితురులదేశము  నా సహోదరులతో నిండియుండినట్లు చూడగలుగుతున్నాను. అనేక ప్రజా సమూహాలు నావలె ఒప్పకోలు చేయుచు దేవుని స్వంతసంఘము యొక్క విశ్వాసప్రమాణం ఇదే అని అంగీకరించుట చూడగలను".

చార్లెస్. హెచ్. స్పర్జన్
మెట్రోపాలిటన్ టాబర్నకల్ (1834-1892)

# విషయ సూచిక

**తొలి పలుకులు** 5

**చరిత్ర** 6

**కృపాసిద్ధాంతాలు** 10

ఒకటవ అధ్యాయము
**సంపూర్ణ  పతనము** 13

రెండవ అధ్యాయము
**భేషరతు ఎన్నిక** 22

మూడవ అధ్యాయము
**పరిమిత ప్రాయశ్చిత్తము** 38

నాల్గవ అధ్యాయము
**అభేధ్యమైన కృప** 59

ఐదవ అధ్యాయము

**పరిశుద్ధుల పదిలత** 75

# తొలి పలుకులు

నేను బైబిలు బోధకుడను గనుక మీ సంఘము ఏమి నమ్ముతుందని చాలామంది నన్ను తరుచుగా ప్రశ్నిస్తుంటారు. అయితే దీనికి జవాబుగా "మేము బైబిలునే నమ్ముతాము" అని చెప్పట సరిపడదు. దాదాపు క్రైస్తవ సంఘాలన్నియు ఇచ్చే జవాబు అదే కదా. అందుకే గ్రేస్ క్రిస్టియన్ అసెంబ్లి ఏమి నమ్ముతుంది? ఎందుకు నమ్ముతుంది? మున్నగునవి వివరించుటయే ఈ పుస్తకము యొక్క ప్రధాన ఉద్దేశ్యము.

సమకాలీన కాలములో ఈ సిద్ధాంతములను ప్రతిపాదించి అందించిన రచయితను నేనొక్కడినే కాదు. అయితే ఈ అంశాలు చాలా లోతైనవి, గంభీరమైనవి; తరుచుగా ఇటువంటి విషయాలను సగటు మానవుడికి అర్థంకాని విధంగా కఠినమైన పదజాలముతో వివరిస్తుంటారు. గనుక మొదటి పేజినుండి చివరి పేజి వరకు అంతా అగమ్యగోచరంగా అగుపిస్తుంది. కాని నా యీ పుస్తకములో పొందుపరచబడ్డ విషయాలు, "చూచుటకు కన్నులు గల వారికి" సులభంగా, స్పష్టమైన విధానములో, అందరు చదవదగిన విధంగా ఉండాలని నా ఆకాంక్ష నిరీక్షణ.

బైబిలు వివరణలో మొదటి నియమము - బైబిలు ఏమి సెలవిస్తుందో దానినే ఉద్దేశిస్తుంది. దేనిని ఉద్దేశిస్తుందో దానినే సెలవిస్తుంది. రెండవ నియమము కూడా మొదటి నియమము వంటిదే - లేఖనాలే లేఖనాలకు వివరణ ఇస్తాయి. సాధారణంగా బోధకులు లేఖనాలను సందర్భరహితంగా ఏరికోరి చెబుతూ ఎన్నో విధానాలలో వివరించి బోధిస్తుంటారు. అది కూడా వారి సిద్ధాంతాలను బలపరచుకొనుటకై లేదా వారి సంఘ సంప్రదాయాలు కాపాడుకొనుటకై లేదా వారి వారి మత శాఖలను బలపరచుకొనుటకై చేస్తుంటారు. కాని పౌలు ఇలా హెచ్చరించాడు- ***"ఆయనను అనుసరింపక మనుష్యుల పారంపర్యాచారమును అనగా ఈ లోక సంబంధమైన మూల పాఠములను అనుసరించి మోసకరమైన నిరర్థక తత్వజ్ఞానము చేత మిమ్మును చెఱపట్టుకొని పోవువాడెవడైన ఉండునేమో అని జాగ్రత్తగా ఉండుడి" (కొలొస్సీ 2:8).*** అందుకే ఇక్కడ ప్రస్తావించిన సిద్ధాంతాల్ని అనేక లేఖనభాగాలతో బలపరిచాము. అయినను ఇది సవివరముతో కూడుకున్న అంత లోతైన అధ్యయనము కాదు. ఏలయనగా, క్రీస్తు యొక్క క్రియలు మరియు సేవాపరిచర్యను గూర్చి అపోస్తలుడైన యోహాను సహితం ***"...వాటిలో ప్రతిదానిని వివరించి వ్రాసినయెడల అట్లు వ్రాయబడిన గ్రంథములకు భూలోకమైనను చాలదని నాకు తోచుచున్నది' 'అని అన్నాడు,. (యోహాను 21:25).***

ప్రతి లేఖనభాగములో కూడా దేవుని సార్వభౌమాధికారం మరియు కృప కలిపినేయబడినది. మనము లేఖనములకే ప్రభువైన వానిని ఎరిగినపుడు, లేఖనాల్లో బయలుపరచబడిన ఆయన ప్రభుత్వమును సహజంగా అంగీకరిస్తాము. క్రీస్తులోని రక్షణసత్యమును అన్వేషించు దిశగా మన ఆలోచలను రేకెత్తించుటకు దోహదపడుటలో ఈ పుస్తకము కేవలం ఒక మంచు పర్వతపు కొనవలె వున్నది.

మీరు చదువుచుండగా దేవుడు మిమ్మును దీవించును గాక!

# చరిత్ర

సాధారణంగా కృపాసిద్ధాంతాన్ని కాల్వినిజమ్ అని పిలుస్తారు. దీనికి గొప్ప ఐరోపా చరిత్ర ఉన్నది. అమెరికా అవతరణ సమయములో ఈ సిద్ధాంతం మరింత ప్రాముఖ్యతను సంతరించుకుంది. మార్టిన్ లూథర్ స్థాపించిన సంఘమునకు, దేవుని ఎన్నిక మరియు ముందుగా నిర్ణయించుట వంటి సిద్దాంతాలే పునాదులు.. ప్రెస్బిటేరియన్ సంఘ స్థాపకుడైన జాన్ నాక్స్ ఈ సిద్ధాంతాలను నమ్మాడు. ప్లిమత్ రాక్ దగ్గర దిగిన ప్రయాణికులందరు కాల్విన్ సిద్ధాంతాన్ని నమ్మిన వారేనని ప్రెస్బిటేరియన్ల ఆదిమఅమెరికా చరిత్ర తెలియజేయుచున్నది.

ఆదిమఅమెరికాలోని కాంగ్రిగేషనలిస్ట్ సంఘాలు ఒకప్పుడు ఈ సిద్ధాంతాన్ని నమ్మేవి. మరియు బాప్టిస్టువారు 'దేవుడు ముందే ఏర్పరచుకున్నాడు' అనే సిద్ధాంతాన్ని నమ్మేవారు. అందుకే ఆదిమబాప్టిస్టు విరోధులు ("మేము వారిలో ఒకటి కాదు" అని చెప్ప నిమిత్తము) "స్వేచ్ఛా-చిత్తపు బాప్టిస్టులని" తమ్మును తాము పిలుచుకొనేవారు.

మధ్య అట్లాంటిక్ మరియు దక్షిణ ప్రాంతములలో స్థిరపడిన, న్యూయార్క్ మరియు న్యూజెర్సీ వారైన డచ్ కాల్వినిస్ట్ల ద్వారా, పెన్సిల్వేనియా మరియు మేరిలాండ్ వారైన జర్మన్ రిఫామ్డ్ వారి ద్వారాను మరియు స్కాచ్-ఐరిష్ ప్రెస్బిటేరియన్ల ద్వారాను కాల్వినిజమ్ బలపరచబడింది. అక్కడ స్థిరపడిన వారందరు ప్రొటెస్టెంట్ వారు కారు, ప్రొటెస్టెంట్‌లందరు కాల్వినిస్ట్లు కాదు. అయినాసరే, ప్రారంభము నుండి కూడాను, అమెరికా వారి ఆలోచనా ధోరణిపై మరియు సంస్థలపై కాల్వినిస్ట్ల బలమైన ప్రభావముండేది. కాల్వినిస్ట్లు విశ్వ విద్యాలయాలను స్థాపించుట, న్యూ ఇంగ్లాండ్ సభలకు నాంది పలుకుట, ప్రభుత్వంలో అధికార వేర్పాటుకై పోరాడుట, బానిస నిర్మూలనకై నడుము కట్టుట తదితరమైనవి ఎన్నో చేపట్టారు. క్లుప్తంగా చెప్పాలంటే, అమెరికాయొక్క ఆధ్యాత్మిక, మత చరిత్రలో నేరుగా దోహద పడినది కాల్వినిజం ఒక్కటే కాకపోయినప్పటికి, ఇది ఎంత ప్రాముఖ్యమైనదంటే, అమెరికా చరిత్రను, సంస్కృతిని క్షుణ్ణంగా ఎరిగిన వారేవరును, అందుకు తోడ్పడిన కాల్వినిస్టుల పారంపర్యాన్ని అభినందించకుండా ఉండలేరు.

మేము ఇక్కడ పరిగణించే విషయాలు ఇటీవలె త్రవ్వి వెలికి తీసిన క్రొత్త సత్యాలు కావు. ఇవి పురాతన, పునాది సత్యాలు. కాబట్టి వీటి ఆవిర్భావము తెలుసుకోవాలంటే తప్పనిసరిగా సంస్కారణ జరిగినప్పటి సమయ సంగతులు కొన్ని క్లుప్తంగా తెలిసికొనవలసియున్నది. ఐతే ఈ పుస్తకము సంఘ చరిత్రకై ఉద్దేశించబడినది కాదు, కనుక సంస్కరణఉద్యమమునకు సంబంధించిన అనేక విషయములు మరియు వ్యక్తుల ప్రస్తావనను దాటి వేస్తు ఇక్కడ చేయబోవు సిద్దాంత విశ్లేషణకు నేరుగా సంబంధించిన పేరులను మరియు చారిత్రాత్మక సంఘటనలను మాత్రమే పరిచయం చేసుకుందాం.

సంఘము ఉనికిలోనికి వచ్చిన మొదటి శతాబ్ధాలలో రచయితలు, వేదాంతులు ప్రాథమికంగా క్రీస్తు స్వభావము, ఆయన దైవత్వము మరియు ఆయన మానవత్వము మున్నగువాటిపై దృష్టి సారించారు. తత్ఫలితంగా 5వ శతాబ్దము వరకు 'కృపా సిద్ధాంతమును' గూర్చిన మాటేలేదు. దానికర్థం బైబిలు గ్రంథములో అది లేదని కాదు. కాని ఒక విషయము మనము జ్ఞాపకముంచుకోవాలి అదేమనగా, కొన్ని వందల యేండ్ల వరకు బైబిలు ప్రామాణికరణ జరుగలేదు.

మొదటినుండి కూడా, అన్యులు, ధర్మశాస్త్ర ఆచరణ ద్వారా కాక కృప ద్వారా నీతిమంతునిగా తీర్చబడుట అను పౌలుయొక్క బోధననుసరించినవారు. అయితే, యూదా మతమునుండి క్రైస్తవ్యములోనికి వచ్చినవారు, వారి పాత సంప్రదాయములను, ఆచారములను పాటించేవారు. ఈ రెండు గుంపుల వారి మధ్యన క్రైస్తవ్యం ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటూ వచ్చింది. ***"మనము పుట్టుకతో యూదులమేగాని, అన్యజనులలో చేరిన పాపులము కాదు. మనుష్యుడు యేసుక్రీస్తునందలి విశ్వాసము వలననే గాని ధర్మశాస్త్రసంబంధమైన క్రియల మూలముగా నీతిమంతుడుగా తీర్చబడడని యెరిగి మనమును ధర్మశాస్త్ర సంబంధమైన క్రియల మూలముగా కాక, క్రీస్తునందలి విశ్వాసము వలననే నీతిమంతులమని తీర్చబడుటకై యేసుక్రీస్తునందు***

***విశ్వాసముంచి యున్నాము. ధర్మశాస్త్ర సంబంధ క్రియలమూలమున ఏ శరీరము నీతిమంతుడని తీర్చబడదు గదా" (గలతీ 2:16).*** సహజముగానే సంఘములో కృప/ధర్మశాస్త్ర విషయమై విభేదాలు నెలకొని వివాదాలకు దారి తీశాయి. ఒకవైపు అన్యులైయుండి క్రైస్తవులైనవారు పౌలుబోధలను సమర్థిస్తే, మరొకవైపు యూదులైవుండి క్రైస్తవులైనవారు మోషే ధర్మశాస్త్రమును ఆచరించుట వలన నీతిని సంపాదించుకొని రక్షణ పొందుకొనవచ్చునను తలంపును కలిగి తమ పితరుల సంప్రదాయాలను సమర్థించేవారు.

హిప్పోవాడైన అగస్టీన్ (354-430 క్రీ.శ.), మానవుని పతనావస్థ, దేవుని భేషరతుఎన్నిక మరియు కృపాధారపు రక్షణ మున్నగు బైబిలుఆధారిత సత్యాలను ప్రజల్లోకి తీసికొనిపోయి వాటిని ప్రాచుర్యం గావించాడు. పెలేజియస్ (360-420) బోధలను కొట్టివేస్తూ అగస్టీన్ బైబిలుఆధారిత దైవశాస్త్రాన్ని క్రమపరిచాడు. పేలేజియస్, రోమా నగరాన్ని క్రీ.శ.411 లో విడిచి వెళ్ళి దాదాపు క్రీ.శ. 418లో చరిత్రకు మరుగయ్యాడు. ఆదాముపాపము కేవలం అతని వ్యక్తిగత పతనమేనని, అది మానవాళిపై ఎటువంటి ప్రభావము చూపలేదని పెలేజియస్ బోధించాడు. క్రీస్తు మరణము కేవలము హతస్సాక్షిలాంటి ఓ మాదిరి అని మరియు మానవుడు తన సహజదశలో తన స్వేచ్ఛా చిత్తం మరియు దృఢసంకల్పం ఆధారంగా తన స్వీయరక్షణను పొందుకొనవచ్చునని అతడు బోధించాడు. కాబట్టి అగస్టిన్, పైబోధలకు విరుద్ధంగా ఇలా బోధించాడు-

1) మానవ జాతి యావత్తూ ఆదాములో పతనమైంది.

2) స్వభావరీత్యా, మానవులందరు పతనావస్థలో ఉన్నారు. ఆత్మీయముగా చచ్చినవారు.

3) మానవులు పాపమును వారంతట వారే చేయుదురు గాని దేవుని కార్యాల విషయమై స్వతఃసిద్ధంగా ఏ మంచి చేయజాలరు.

4) ఎన్నిక చేయబడిన వారి కొరకు, వారి స్థానములో క్రీస్తు మరణించాడు.

5) వ్యక్తుల యోగ్యతకు అతీతంగా, వారిని తన స్వేచ్ఛాచిత్తము చొప్పున దేవుడు ఎన్నిక చేసాడు.

6) ఆ రక్షణార్థమైన కృప, ఎన్నుకొనబడిన వ్యక్తులకు, పరిశుద్ధాత్ముని ద్వారా సార్థకంగా అన్వయించబడుతుంది.

అపోస్తలుడైన పౌలుబోధలను చక్కగా విశ్లేషించిన మొట్ట మొదటి వ్యక్తి అగస్టీన్ కాబట్టి ఆదిమసంఘానికి తన బోధలను ఆమోదితంగా వివరించగలిగాడు. ఆ తరువాత అధికారము, ప్రాధాన్యత విషయమై రోమన్‌కేథొలిక్ సంఘం పైకెదిగింది. కాలము గడిచే కొలది లేఖనాల విషయమైన అవిద్య, మూఢనమ్మకాలు మున్నగువాటిని రోమా నగరం ప్రబలం చేసింది. పోపులు రాజకీయ పరంగా, సంఘ పరంగా బలం పుంజుకున్నారు తత్ఫలితంగా రోమా అధికారం క్రింద ఐరోపా పతనమైంది. సంఘనాయకులయొక్క నైతికత దిగజారింది. మత గురువులు భ్రష్టుపట్టారు, క్షమాపణ పత్రాలను అమ్మడం ప్రారంభించారు. ఆ చీకటి యుగపు రోజుల్లోనే రోమా సంఘము అన్య సంప్రదాయాలు మరియు బబులోను మతాచారాలతో సతమతమైంది. సగటు మానవునికి లేఖనాలు మరుగు చేయబడ్డాయి. అవి అతిపవిత్రమైనవిగాను, కేవలం మతగురువులకు మాత్రమే గోచరమగునవిగాను పరిగణించబడ్డాయి.

## సంస్కరణ

5వ శతాబ్దములోని ఉత్తర ఐరోపా అటవిక జాతులు, రోమాసామ్రాజ్యపు రాజకీయ సంస్థలను, దాని పాండిత్యాన్ని, కళలను మున్నగువాటిని చిన్నాభిన్నం చేశాయి. ఇలా భారీ ఎత్తున రోమాసామ్రాజ్యపు సంస్కృతి నాశనము చేయబడినపుడు, ఐరోపా వెయ్యేండ్ల చీకటియుగాల్లోకి కూరుకుపోయింది. విద్యాజ్యోతి చాలా మట్టుకు ఆరిపోయింది, కాబట్టి దీనిని చీకటియుగమని పిలిచారు. అంతటా కూడా అజ్ఞానం ప్రబలింది.

చాలామంది ఐరోపీయులకు ఆత్మీయత అంటే రెండే విషయాలు ప్రధానంగా ఉండేవి. అవేమనగా : మూఢాచారాలు మరియు ఆధారపడుట. విద్యకు గ్రహణం పట్టినంతపనైంది. కాబట్టి, లేఖనాధార దైవశాస్త్రముపై

ఆధారపడకుండా ప్రజలు విస్తారమైన మూఢాచారలలో మునిగిపోయారు.

రోమన్ కెథోలిక్ సంఘము, ఐరోపా రాజకీయాలను మరియు సంస్కృతిను శాసించుట ప్రారంభించింది. తత్ఫలితంగా ప్రతిఒక్కొరు కూడా వారివారి నిత్యరక్షణ కొరకు సంఘముపై ఆధారపడ్డారు. ఒకవైపు, సంఘము ఏడు మతాచారాలను ఆత్మీయతతో ముడి పెట్టి ప్రవేశపెట్టింది. అట్టి మతాచారాలే రక్షణార్థమైన కృపకు రహదారులని బోధించింది. మరొకవైపు వెలివేసే హక్కును సంఘం చేజిక్కించుకుంది. పోప్ తన అధికారాన్ని ఉపయోగించి, దుర్బోధకులను, పాపులను కొన్ని సార్లు దేశం యావత్తును, ఈ రక్షణార్థపు కృపనందించే మతాచారాలలో పాలు పొందకుండా బహిష్కరించేవాడు. ఐరోపావారందరూ కూడా ఉగ్రుడైన దేవుడు తన దివ్యచిత్తాన్ని కేవలము రోమన్‌సంఘం ద్వారా మాత్రమే కనుబరచాడని నమ్మే విధంగా మతాచారాలను ప్రవేశపెట్టారు.

ఇట్టి అంధకారపు ఊబి నుండి అగస్టీనియన్ సన్యాసి అయిన మార్టిన్ లూథర్ (1483-1546) జర్మనీలో సంఘసంస్కరణ ప్రారంభిచాడు. 'దేవుడు ముందుగా ఏర్పరచుకొనుటను' లూథర్ బలంగా నమ్మాడు (ప్రిడెస్టినేరియన్). ఈ సిద్ధాంతాన్ని తన గ్రంథమైన 'బాండేజ్ ఆఫ్ ద విల్' లో విస్పష్టముగా ప్రస్తావించి వ్రాశాడు. దురదృష్టవశాత్తు, కాలక్రమములో లూథరన్ సంఘము వారు ఈ సిద్ధాంతాన్నే ప్రక్కన పెట్టేశారు. తత్ఫలితంగా వారు రోమన్‌కెథలిక్ వారి భావాలైన "సార్వత్రిక కృప" మరియు "సార్వత్రిక ప్రాయశ్చిత్తము" మున్నగు వాటిని తిరిగి అవలంభిస్తున్నారు.

మార్టిన్ లూథర్ వేసిన పునాధులపై జాన్ కాల్విన్ తన సిద్ధాంతాలను కట్టాడు (1509-1564). జాన్ కాల్విన్, హుల్‌డ్రిక్ జ్వింగ్లి (1484-1531) జాన్ నాక్స్ వారి అనుచరులు (1513-1572) సంస్కరణకర్తలుగా పేరొందారు. ఎందుకంటే వారి లక్ష్యమంతా కూడా బైబిలు ఆధారిత సిద్ధాంతాన్ని సమకూరుస్తూ రోమా సంఘపు సిద్ధాంతాన్ని మరియు మూఢాచారాలను రూపుమాపుటయే అయివుండినది. రోమాసంఘము దానికి విరోధముగా రూపుదిద్దుకున్న దైవశాస్త్రాన్ని అరికట్టు నిమిత్తము "విశ్వాసపు ప్రకరణలను" ఏర్పరచింది. ఎవరైతే వాటిని ధిక్కరిస్తారో వారిని ఉరితీయుటకు లేదా దహించి వేయుటకు ఆదేశాలిచ్చింది. కాబట్టి సంస్కరణ సంఘము అనగా కెథలిక్ సంఘాన్ని ఎదిరించిన ప్రోటేస్టంట్‌లు తరుచుగా, కేవలం వారు నమ్మిన దానిని ఒప్పకున్నందుకు ప్రాణాల్ని పరిత్యజించారు లేదా కాళ్ళుచేతులు పోగొట్టుకున్నారు. .

## ఆర్మీనియనిజమ్

జేకబ్ (జాన్) ఆర్మీనియస్ (1560-1609) జాన్ కాల్విన్ యొక్క అనుచరుడైన తియోడర్ బేజ్ యొక్క విద్యార్థి. ఈయన స్విట్జర్లాండ్‌లోని యూనివర్సిటి ఆఫ్ జెనీవాలో బోధించాడు. 1588 లో ఆర్మీనియస్, పెలేజియన్ వేదాంతియైన డార్చ్ కూర్న్‌హర్ట్ (1522-1591) యొక్క రచనలు చదివాడు. ఆ విధంగా వాటిని చదివి తన సొంత నమ్మకాలకంటే ఆ గ్రంథాల్లోని వాదనలు బలమైనవని తలంచాడు. తదుపరి "సార్వత్రిక కృప", "స్వేచ్ఛా చిత్తము" అను సిద్ధాంతాల వైపు తిరిగాడు.

సంఘసిద్ధాంత విషయమై ఒక అధికారిక సమదృక్పథం కలుగునిమిత్తము ఒక సంఘాలసమావేశాన్ని ఏర్పరచాలని అలనాటి హాలెండ్ ప్రభుత్వాన్ని ఆర్మీనియస్ కోరాడు. జనరంజకమైన అగస్టీనియన్/కాల్వినిస్ట్ సిద్ధాంతాల్లో ప్రాథమికంగా రెండింటి విషయమై ఆర్మీనియస్ విబేధించాడు.

1) దేవుడిచ్చే రక్షణ, షరతుతో కూడినదా లేదా భేషరతుగా ఇవ్వబడినదా ? మరో మాటలో చెప్పాలంటే దేవుడు కేవలం తన సర్వాధికారపు సంతృప్తి కొరకు మనుష్యులను ఏర్పరచుకుంటాడా లేక వారివారి ఒప్పకోలు, విశ్వాస్యత తదితర కారణాలను బట్టి ఎన్నుకుంటాడా?

2) కృప భేద్యమైనదా లేక అభేద్యమైనదా? అనగా రక్షించు ఉద్దేశముతో దేవుడు ఒక వ్యక్తిని ఏర్పరచుకుంటే, ఆ

వ్యక్తి దేవుణ్ణి ఎదిరించగలడా? లేదా అతని వ్యక్తిగత చిత్తము, అభీష్టమునకు అతీతంగా రక్షింపబడతాడా?

నవంబరు 13, 1618 లో హాలెండ్‌నందలి డార్ట్ అనే స్థలంలో ఓ జాతీయ సమావేశం ఏర్పరచబడింది. ఆ సమావేశంలో చర్చ్ ఆఫ్ ఇంగ్లండ్‌తో పాటు రిఫార్మ్‌డ్ సంఘాలన్నీ పాల్గొని ప్రాతినిధ్యం వహించాయి. ఆ సమావేశం మే 9, 1619 వరకు కొనసాగింది. ఆ సమావేశంలో ఆర్మీనియన్లు దిగువ ప్రతిపాదనలు చేశారు.

1) దేవుడు అనంతజ్ఞాని కాబట్టి విశ్వసించు వారెవరో, విశ్వసించని వారెవరో ముమ్ముందే చూసి విశ్వాసులను ఎన్నుకుంటాడు. అవిశ్వాసులను తిరస్కరిస్తాడు. దేవుని ఈ భవిష్యత్తు జ్ఞానమే ఈ ఎన్నికకు ఆధారము.

2) విశ్వసించినవారే రక్షించబడినప్పటికీ, అందరికీ, ప్రతీఒక్కరికొరకు క్రీస్తు మరణించాడు.

3) మానవుడు పతనావస్థలో ఉన్నాడు గనుక విశ్వాసములోనికి నడిపించబడుటకు దేవుని కృప అవసరమే.

4) అయినను ఇట్టి కృపను ఒక వ్యక్తి ఎదిరించగలడు.

5) నిజముగా తిరిగి జన్మించిన వ్యక్తి కూడా తన విశ్వాసమును కోల్పోయి, తన రక్షణను పోగొట్టుకొనవచ్చును.

డార్ట్ సమావేశం ఆర్మీనియన్ సిద్ధాంతాలను లేఖనాలతో పోల్చి సంధి కుదిర్చే ప్రయత్నం చేసింది కాని వీలు పడలేదు. దాని ఫలితంగా, వాటిని పూర్తిగా త్రోసి పుచ్చింది. అయినను మనిషి అహానికి పట్టం కట్టి, మానవ స్వేచ్ఛా చిత్తానికి పీఠం వేసి, దేవుని నాయకత్వాన్ని ధిక్కరిస్తాడు కాబట్టి, ప్రపంచవ్యాప్తంగా అనేక సంఘాల్లోను ఈ సిద్ధాంతాలు నేటికి బోధించబడుతున్నాయి. ఏళ్ల తరబడి ఆర్మీనియన్ సిత్ధాంతానికి, చారిత్రాత్మక పౌలు విశ్వాసానికి మధ్య ఎన్నో విభేదాలు నెలకొన్నాయి. అట్టివాటిలో ప్రాచుర్యము పొందిన కొన్ని ఆర్మీనియన్ సిద్ధాంతాలను ఈ దిగువన చూద్దాము.

1. పాపము మానవ స్వభావములో అంతర్లీనమైనదికాక చిత్త సంబంధ కార్యాల్లో ఉంటుంది.
2. కలుషము ఆదాము పతనము నుండి సక్రమించినప్పటికి అతని అపరాధిత్వము తన సంతతిలో ఎవరిపైనా మోపబడదు.
3. మనిషియొక్క పతనఫలితమైన నిస్సహాయతను సంపూర్ణమైనదిగా పరిగణించకూడదు.
4. మంచి చేయుటకొరకైన సామర్థ్యత, స్వయం దృఢసంకల్పశక్తి, మానవుడు కోల్పోలేదు.
5. క్రీస్తు యొక్క ప్రాయశ్చిత్తబలి సమానంగా అందరికిని, ప్రతి ఒక్కరికిని ఉద్దేశించబడినది.

అది రక్షణను కేవలం సుసాధ్యము చేసింది. పశ్చాత్తాపపడిన విశ్వాసి దానిని స్వీకరించినప్పుడు మాత్రమే క్రీస్తు రక్తము ప్రభావవంతముగా మారుతుంది.

6. తిరిగి జన్మించుటకు ముందే పశ్చాత్తాపము, విశ్వాసము కలుగుతాయి.
7. తిరిగి జన్మించుటకు మానవ చిత్తము ఒకానొక కారణం.
8. విశ్వాసము అనునది మానవునియొక్క సత్క్రియ, అదే దేవునిచే అంగీకరించబడుటకు ఆధారము లేక కారణము.
9. క్రీస్తు యొక్క నీతి విశ్వాసికి ఆపాదించబడలేదు.
10. విశ్వాసి “పరిపూర్ణుడు” అని పిలువబడే విధముగా ఈ జీవిత కాలంలోనే దైవచిత్తముతో మమేకం కాగలడు.
11. ప్రేమ అనేది దేవుని అతి శ్రేష్ఠ గుణము. దేవుడంటే ప్రేమే.
12. ఒక వ్యక్తికి సువార్త అందించబడినప్పుడు, అతడు దానిని స్వీకరించలేనంత అశక్తుడు కాడు. అలాగే దానిని ధిక్కరించలేనంతటి విధంగా దేవుని నిర్బంధములో లేడు.
13. తన విశ్వాసము కాపాడుకొని కృపాదశలో తనను తాను పదిలపరచుకోవటమనేది విశ్వాసిపై ఆధారపడియుంటుంది. తమ విశ్వాసము కాపాడుకొనుటలో విఫలమైనవారు తమ రక్షణను కోల్పోతారు.

## కృపా సిద్ధాంతాలు

ఆర్మీనియనిజమ్ యొక్క ఐదు విషయాలు ఖచ్చితంగా లేఖనేతరమైనవని తీర్మానిస్తు ఈ సమావేశం, “కాల్వినిజం యొక్క ఐదు పాయింట్లుగా” పిలువబడుతున్న ఈ క్రింది వాటిని ఓ క్రమబద్ధమైన దేవశాస్త్రముగా పొందుపరిచింది. అన్నిటిలోను దేవుడు సర్వాధికారి అను సత్యముపై ఈ వ్యవస్థ ఏర్పరచబడింది. పౌలు చేత బోధించబడి మనకు అందించబడ్డ ప్రాథమిక ప్రధాన రక్షణ సిద్ధాంతాలు ఇవే.

ఇక్కడ మనము కొన్ని విషయములను నిర్వచించుట అవసరమైయున్నది. ఈ కృపా సిద్ధాంతాలకు ‘కాల్వినిజమ్’ అనే వెక్కిరింపు పేరు పెట్టబడింది. నేను ఖచ్చితముగా కాల్వినిస్టును కాను, కాల్విన్ ఆరాధికుడను అసలే కాను. వాస్తవానికి నేను ఒప్పుకోనని విషయాలను కాల్విన్ ఎన్నో నమ్మాడు. ఉదాహరణ : మనము చాలినంత నీతియుతముగా జీవించినప్పుడు వెయ్యేండ్ల పరిపాలన ప్రారంభమౌతుందని ఆయన నమ్మాడు. నేను దీనిని ఒప్పుకోను. దేవుడు భూమికి పునాదులు వేయబడక మునుపే మానవ చరిత్ర విషయమై ఓ దిశ నిర్దేశించాడని, అన్నియు ఆయన నిర్ధిష్టసమమున  నెరవేరుతాయని నేను నమ్ముతాను.

జాన్ కాల్విన్ సబ్బాతు దినమును ఖచ్చితముగా ఆచరించేవాడు. కాని సంపూర్ణము చేయబడ్డ క్రీస్తు కార్యమందు విశ్రమిస్తే పాతనిబంధన సబ్బాతును ఆచరించినట్లేనని నేను నమ్ముతాను. ఎందుకంటే ఇవి రాబోవు వాటి ఛాయయే గాని నిజస్వరూపము క్రీస్తులోనున్నదని పౌలు స్పష్టముగా చెప్పాడు. (కొలొస్సీ 2:16,17).

రిఫార్మ్డ్ సంఘముకు వ్యతిరేకంగా తిరుగబడుతున్న అనబాప్టిస్టులను రాష్ట్రఅధికారము ఉపయోగించి అణచజూసినవాడు కాల్విన్. ఈయనను ‘సాక్రిలిస్ట్’ అంటారు. ఈయన, దుర్బోధకులను దహించివేశాడు.

ఏండ్ల తరబడి కొన్ని తప్పలను సవరిస్తూ, మరిగొప్పగా కాల్వినిజమ్ ఎదిగిందని, రిఫార్మేషన్ వేదాంత వేత్తలు కూడా ఒప్పకుంటారు.

మనుషుల్లో అత్యంతజ్ఞానులు సహితం పతన స్వభావము గలవారు. అందుకే మనం మనుష్యుల్ని కాక క్రీస్తునే అనుసరిస్తాం. అయినను లేఖనాలను చదివి గొప్పతలంపులను గంభీరమైనఆలోచనలను వ్యక్తపరచగలిగే వరాన్ని దేవుడు కొందరు వ్యక్తులకు ఇచ్చాడు. వారు ఆ విధముగా క్రమపరిచే దైవశాస్త్రము, బైబిల్‌ను మరింత సరళముగా అర్థం చేసుకొనుటలో దోహదపడుతుంది కూడా.జాన్ కాల్విన్ మరియు  నేను  కొన్ని విషయాలలో విభేదించినప్పటికి ‘డార్ట్’ సమావేశం ఆమోదించిన సిద్ధాంతాలు మాత్రము లేఖనానుసారమైనవే, యదార్థమైనవే.

కొన్ని యేండ్ల తరువాత ఈ సిద్ధాంతాలు కాల్వినిజం అనే పేరుతో కాక ‘కృపా సిద్ధాంతాలు’ అనే పేరుతో పిలువబడ్డాయి. తద్వారా ఈ సిద్ధాంతలను కాల్విన్ పేరు నుండి వేరు చేసి అవి సబబుగా ఎవరికి అపాదించబడాలో ఆ దేవుని గుణలక్షణమైన కృపతో జతచేయబడినది. కొంతమంది ఈ ఐదు సిద్ధాంతాలను క్లుప్తంగా **‘TULIP’** (టులిప్) అని పిలుస్తారు.

**T - Total depravity** - సంపూర్ణ అశక్తత

**U - Unconditional Election** - భేషరతు ఎన్నిక

**L - Limited atonement** - పరిమిత ప్రాయశ్చిత్తము

**I - Irresistable Grace** - అభేద్యమైన/ధిక్కరించలేని దేవుని కృప

**P - Perseverance of the Saints.** - పరిశుద్ధుల పదిలత

ఈ సిద్ధాంతాల్ని **GRACE** (గ్రేస్) అను మాటలోని అక్షరాలను కూడా ఉపయోగించి తెలుసుకొనవచ్చును.

**G - Gracious Election** - కృపాయుతమైన ఎన్నిక

**R - Ruined Sinners** - పతనమైన పాపులు

**A - Accomplished Redemption -** నెరవేర్చబడిన విమోచన

**C - Compelling Love -** బలమైన ప్రేమ

**E - Everlasting Life -** నిత్యజీవము

కృప మరియు రక్షణలోని ఐదు దశలను నొక్కివక్కాణించే సిద్ధాంతాలను తెలుసుకొనే మరొక విధానము ఈ దిగువన చూద్దాం.

1. మానవుడు సంపూర్ణపతనము అనగా సంపూర్ణనిస్సహాయతకు లోనైనందున రక్షణ నిమిత్తము దేవుని కృప ఆవశ్యమైనది.
2. కృపాయుతమైన తన రక్షణప్రణాళికను దేవుడు భేషరతు ఎన్నిక ద్వారా కనుపరిచాడు.
3. ఎన్నిక చేయబడినవారికై ఉద్దేశింపబడిన ఈ రక్షణ యేసుక్రీస్తు ప్రాయశ్చిత్తము ద్వారా కొనబడినది.
4. ఈ రక్షణ పరిశుద్ధాత్ముని ప్రభావవంతమైన పిలుపు ద్వారా ఎన్నిక చేయబడినవారికి అన్వయించబడుతుంది.
5. ఇలా రక్షించబడినవారిని శాశ్వతముగా పదిలపరచడమే ఈ రక్షణార్థ కృప యొక్క విజయము మరియు రక్షణ సంపూర్ణత.

## వ్యత్యాసాలు

క్రైస్తవ సంఘాలన్నియు మానవులు పాపులని ఒప్పకుంటాయి. అయితే మానవులు ఎంతమేరకు పాపులు? ఆదాము పాపము, పతనము తక్కిన మానవాళిని ఎంతమేరకు ప్రభావితము చేసింది? అన్నదే వివాదాంశము. కాబట్టి ఇక్కడ మొదటి ప్రశ్న ఏమిటంటే, మొదటికంటే ఇప్పడు మానవులు కొంచెము తక్కువ మంచివారుగా ఉన్నారా? లేక ఆదాము పాపమును బట్టి మానవులందరూ సంపూర్ణముగా పతనమయ్యారా?

ఆయాకార్యాలు చేయుట ఆయా గమ్యాలు చేరుట కొరకు, కొందరిని దేవుడు ఎన్నుకుంటాడని బైబిలు సెలవిస్తుంది. కాబట్టి రెండొప్రశ్న ఏమిటంటే, దేవుడు సత్క్రియలవలన సంపాదించుకున్న మంచితనాన్ని బట్టి మనుష్యుల్ని ఎన్నుకుంటాడా? లేక మానవ పరిస్థితులకు, ప్రమాణాలకు అతీతంగా, పతనమైన పాపులను కేవలం తన చిత్తానుసారముగా రక్షింపబడుటకు ఎన్నుకుంటాడా? యేసుకీస్తు సిలువలో మరణించాడని క్రైస్తవులందరు ఒప్పకొంటారు, అయితే ఆయన వ్యక్తిగతంగా నిర్దోషి గనుక తన కొరకు కాక మరియొకరి స్థానములో మరణించి వుండాలి. అయితే ఈ ప్రాయశ్చిత్తకార్యము నుండి ప్రయోజనం పొందునది ఏవరు అనునదే ఇక్కడ వివాదాంశము కాబట్టి మూడో ప్రశ్న ఏమిటంటే, భూమి మీద జీవించిన ప్రతియొక్కరికొరకు యేసు మరణించాడా? లేక కేవలము తన అభీష్టము చొప్పన, నిత్యజీవముకై ఎన్నుకొనబడిన వారికొరకు మాత్రమే యేసు ప్రాయశ్చిత్తపు వెల చెల్లించాడా?

ఒక వ్యక్తి రక్షింపబడుటకై పరిశుద్ధాత్ముని ఆవశ్యకతను గూర్చి పరిశుద్ధ గ్రంథములో ఎన్నో వాక్యాలు ఉన్నాయి. గనుక నాలుగవ ప్రశ్న ఏమిటంటే : ఒక వ్యక్తి పరిశుద్ధాత్ముని పిలుపును ఎదురించగలడా? లేక దేవుడు ఒక పాపిని ఎన్నుకొనిన తరువాత, క్రీస్తు అతని కొరకు మరణించిన పిమ్మట, ఆ వ్యక్తి తప్పనిసరిగా దేవుని పిలుపుకు లోబడి రక్షింపబడతాడా?

చివరిగా, ఒక వ్యక్తి తన జీవిత దశలో ఎప్పడైన రక్షింపబడి పిమ్మట కొంతకాలం భూమి మీద నివసిస్తాడు. కాబట్టి ఐదవ ప్రశ్న ఏమిటంటే : ఒక వ్యక్తి ఎన్నుకొనబడ్డాక, విమోచింపబడ్డాక, దేవుని పిలుపును స్వీకరించాక తెలిసీతెలియక తన నిర్లక్ష్యమువలన లేదా రక్షణను త్యజించుట వలన తన రక్షణ కోల్పోతాడా? లేదా దేవుని మార్పులేని ఎన్నిక ప్రణాళిక, క్రీస్తు చెల్లించిన క్రయధనము యొక్క సంపూర్ణత, రక్షణ పిలుపు యొక్క నిశ్చయత మరియు ఈ రక్షణను అన్వయించుటలో పరిశుద్ధాత్ముని యొక్క సాఫల్యత, ఆ వ్యక్తిని మరెన్నడును రక్షణలోనుండి వైదొలగకుండా పరలోక గమ్యానికి చేరవేస్తాయా?

ఈ కృపాసిద్ధాంతముల అధ్యయనములో  ఇట్టి ప్రశ్నలను మనము పరిశీలించబోవుచున్నాము. ఈ సిద్ధాంతములను మీరు అర్థం చేసుకొననంత కాలము, అవి లేఖనములయందతయు వ్యాపించియున్నవనియు, అవి ఏవో కొన్ని అప్రస్తుతమైన వచనములను సందర్భరహితముగా వివరించుట వలన నిరూపించబడు సిద్ధాంతల వంటివి కావనియు తెలుసుకోలేరు . ఈ సిద్ధాంతములే లేఖనాల మూలమును, కేంద్రమునైయున్నవి.

## ఒకటవ అధ్యాయము

# సంపూర్ణ పతనము

ఇతర అంశాలవలె ఈ అంశాన్ని కూడా ప్రారంభమునుండే ఆరంభించాలి. "సంపూర్ణ పతనం" అనగా ప్రకృతి సంబంధియైన మానవుని ప్రతిఅణువు పాడైపోయింది. అతడు సంపూర్ణముగా చెడియున్నాడు. దేవుని ప్రీతిపరచే ఏ మంచిపనియు చేయజాలని అశక్తుడు. సరళంగా చెప్పాలంటే, "మానవుడు పాపి" యని ఈ మొదటి సిద్ధాంతాము బోధిస్తుంది.

వేదాంతులు, మానవుడు ఏ మంచి చేయజాలనివాడని, తనకు తాను సహాయము చేసుకోలేని అశక్తుడని బోధించే ఈ సిద్ధాంతాన్ని "సంపూర్ణ అశక్తత" అని కూడా పిలుస్తారు. ఇది కేవలం పదజాలములో మార్పేగాని మరేం కాదు. బైబిలుపరమైన వివరణ ఏమిటంటే, మానవుడు దుర్బలుడు, దౌర్భాగ్యుడు.

ఇదంతయు ఏదేనువనములో ప్రారంభమైనది. ఆదాము, హవ్వల అవిధేయత ఫలితముగా "దేవుని పోలిక" లో చేయబడిన మానవులు, పతనమైన ఆదాము పోలికలోనికి దిగజారారు. ఈ విధంగా మానవుని స్వభావము మారింది. ఆ స్వభావము నాశనాత్మకం, పాపాత్మకము. ఆ మారిన స్వభావము ఆదాము సంతతిలో, ప్రతియొక్కరికి సంక్రమించింది.

***"ఇట్లుండగా ఒక మనుష్యుని ద్వారా పాపమును పాపము ద్వారా మరణమును లోకములో ఏలాగు ప్రవేశించెనో, ఆలాగుననే మనుష్యులందరు పాపము చేసినందున మరణము అందరికిని సంప్రాప్తమాయెను"(రోమా 5:12).*** ఈ పాపపు దుస్థితివలన మానవులు అడపాదడపా దుష్క్రియలు చేస్తారని కాదు కాని, పాపమే వారి అంతరంగిక స్వభావముగా మారిపోయింది. **ఆదికాండము 6:5** లో నరుల చెడుతనము భూమిమీద గొప్పదనియు, వారి హృదయముయొక్క తలంపులలలోని ఊహా అంతయు ఎల్లప్పుడు కేవలము చెడ్డదనియు యెహూవా చూచినట్లుగా మనము చదువుతాము. ఇక్కడ మనము గమనించినట్లయితే ఆదాము ఆదిమసంతానము యొక్క ఊహ, తలంపు, కోరికలు సహితం అన్నియు చెడినవని, అవి ఎల్లప్పుడు చెడ్డవైనవిగానే వున్నాయని, వారిచెడుతనము ఎడతెగనిదని, మంచి తనము కొద్దిగా కూడా లేదని చూడగలము. దేవుడు ప్రతివ్యక్తిని వారి పాపస్వభావము చొప్పన ఈ విధముగానే చూస్తాడు.

పౌలుబోధ ప్రకారము మానవ జాతిలోనికి ఈ పాపపుస్వభావము ప్రవేశించినప్పటి నుండి, ప్రతియొక్క నరుడు కూడా ఆ స్థితిలోనే పుడుతున్నాడు. మనమందరము పతనజీవులము. అయితే ఈనాటకీ ఈ అభిప్రాయమును త్రోసిపుచ్చువారు వున్నారు, గనుకనే ప్రశ్నలు పుట్టుకొస్తాయి. ఏ దశలో ఒక వ్యక్తి పాపిగా మారుతాడు? తాను ఇలానే పుట్టాడా? లేక ఆ తరువాత నేర్చుకున్నాడా? శిశువులు దోషులుగా పుడుతారా? లేక తెలివొచ్చాక పాపము జోలికి వెళతారా?

చాలామందిని అచ్చెరువొందించే విధంగా బైబిలు సెలవిచ్చేదేమిటంటే, మనుష్యులు ఈ పాప స్వభావముతోనే పుట్టారు. అంతేగాని ఇది వారిలో సంస్కృతి ద్వారా సంక్రమించింది కానీ ఆ తరువాత వారు నేర్చుకొన్నదికానీ కాదు. చెడ్డ ఊహాలు, తలంపులు, పుట్టుకతోనే సంతరించుకుంటాయి. ***"అప్పుడు యెహోవా ఇంపయిన సువాసన నా ఘ్రాణించి - ఇక మీదట నరులను బట్టి భూమిని శపింపను; ఎందుకనగా నరుల హృదయాలోచన వారి బాల్యమునుండి చెడ్డది. నేనిప్పుడు చేసిన ప్రకారముగా ఇకను సమస్త జీవులను సంహరించను" (ఆది 8:21). "నేను పాపములోనే పుట్టినవాడను పాపములోనే నా తల్లి నన్ను గర్భము ధరించెను". కీర్తన 51:5 "తల్లి కడుపున పుట్టినది మొదలుకొని భక్తి హీనులు విపరీత బుద్ధి కలిగియుందురు. పుట్టిన తోడనే అబద్ధములాడుచు తప్పిపోవుదురు" (కీర్తన 58:3).*** దేవునినుండి ఇట్టి ఎడబాటు గర్భమునందే ప్రారంభమవుతుంది. తండ్రుల యొక్క పాపము కుమారుల మీదికి, కుమార్తెల మీదికి వారి రక్తము ద్వారా

అందించబడుతుంది. పిల్లలు వారి పాప స్వభావమును నిరూపిస్తూ, గర్భములోనుండే అబద్ధాలు పలుకుతూ వస్తారు. ***"అందరికిని ఒక్కటే గతి సంభవించును, సూర్యుని క్రింద జరుగు వాటన్నిటిలో ఇది బహు దుఃఖకరము. మరియు నరుల హృదయము చెడుతనముతో నిండియున్నది. వారు బ్రదుకు కాలమంతయు వారి హృదయమందు వెఱ్ఱితనముండును, తరువాత వారు మృతులయొద్దకు పోవుదురు ఇదియును దుఃఖకరము". (ప్రసంగి 9:3) "హృదయము అన్నిటికంటె మోసకరమైనది, అది ఘోరమైన వ్యాధికలది, దాని గ్రహించువాడెవడు?"(యిర్మీయా 17: 9).***

పాపము మన నడవడి మరియు వ్యక్తిత్వము యొక్క మూలాన్ని ప్రభావితము చేస్తుంది. పాపము బాహ్య క్రియలైన త్రాగుబోతుతనము, లైంగిక విశృంఖలత్వము, నరహత్య మున్నగు వాటితో మొదలవదు. మనలో అంతరంగికముగా దాగివున్న తిరుగుబాటు స్వభావము వలన హృదయములోనే పాపము ప్రారంభమై బాహ్య క్రియల రూపంలో వ్యక్తపరచపడుతుంది.

ఈ పతన స్వభావము ఒక వ్యక్తిని కేవలం మంచి చేయుటకు అయిష్టునిగా చేయడమే కాక, దేవునికి ప్రీతికరమైనదేదియు చేయలేని అశక్తునిగా చేస్తుంది. ఇదే "సంపూర్ణ పతనము". తన తిరుగుబాటులో సంతసించుట తప్ప, దేవునికి ప్రీతిపాత్రంగా మారుటకు గాని, తనను తాను దేవునికి ఆకర్షితునిగా చేసుకొనుటకు గాని సమర్థతలేని నిర్బలుడు మానవుడు.

ఇందులో ఓ ప్రాముఖ్యమైన దైవశాస్త్ర సంబంధమైన సత్యము దాగిఉంది. స్త్రీపురుషులు స్వభావరిత్యా మంచి చేయుటకుగాని దేవుణ్ణి సంతోషపరచుటకుగాని శక్తిలేని నిర్బలులైతే అటువంటి వారికి "నమ్ము మరియు విశ్వసించు" లేదా "క్రీస్తు కొరకై తీర్మానించు" అన్న విషయాలు, వ్యర్థంగాను, అతార్కికంగాను ఉంటాయి. శరీరులకు ఇసుమంతైనా మంచి చేయుటకుగాని విశ్వాసమును కూడగటుకొనుటకుగాని శక్తి ఉండదు. వారి ఊహాలు, తలంపులు ఎల్లప్పుడు కేవలము చెడ్డవి. అట్టి మనుష్యులు నిత్యజీవమును పొందుటకై దేవునియందు ఎలా విశ్వాసముంచగలరు?

***"కూషు దేశస్థుడు తన చర్మమును మార్చుకొనగలడా? చిరుతపులి తన మచ్చలను మార్చుకొనగలదా? మార్చుకొనగలిగినయెడల కీడు చేయుటకు అలువాటు పడిన మీరును మేలు చేయుట వల్లపడను" (యిర్మీయా 13:23).*** దానికి స్పష్టమైన ప్రత్యుత్తరము - "మార్చుకోలేరు". కూషు దేశస్థుడు మరియు చిరుత పులి తమను తాము మార్చుకోలేని అశక్త జీవులు. అవి వాటి స్వభావ ఉత్పాదకాలు. మరో ప్రత్యామ్నయం లేకుండా అవి ఆ విధంగా పుట్టాయి. అదే విధంగా దుష్టత్వము మరియు నాశనములోనికి పుట్టిన పాపియైన మానవుడు, తన స్వంత స్వభావానికి ఎదురొడ్డలేని నిర్బలుడు; ఏ మంచియు చేయలేని దుర్బలుడు. ***"వివేకము కలిగి దేవుని వెదకువారు కలరేమో అని యెహోవా ఆకాశమునుండి చూచి నరులను పరిశీలించెను వారందరు దారి తొలగి బొత్తిగా చెడియున్నారు. మేలు చేయువారును లేరు, ఒక్కడైనను లేడు". (కీర్తన 14:2,3) "ఇందును గూర్చి వ్రాయబడినదేమనగా - నీతిమంతుడు లేడు, ఒక్కడును లేడు గ్రహించువాడెవడును లేడు, దేవుని వెదకు వాడెవడును లేడు అందరు త్రోవ తప్పి యేకముగా పనికి మాలిన వారైరి మేలు చేయువాడులేడు, ఒక్కడైనను లేడు" (రోమా 3:10-12). "మనమందరము గొఱ్ఱెలవలె త్రోవ తప్పిపోతిమి మనలో ప్రతివాడును తనకిష్టమైన త్రోవకు తొలిగెను" (యెషయా 53:6). "ఒకనియెదుట సరియైనదిగా కనబడు మార్గము కలదు అయితే తుదకు అది మరణమునకు త్రోవ తీయును" (సామెతలు 14:12).***

మనుష్యులందరు దుష్టులని, నశించినవారని స్పష్టముగా దేవుడు చెబుతున్నాడు. ఏ ఒక్క వ్యక్తి కూడా దేవునిని అన్వేషించుట లేదు. ఆయనను అనుసరించుటయు లేదు. ఎన్నుకొనటయు లేదు. ఆత్మీయ విషయాలను గ్రహించగలవారు కాని, ఆత్మ ప్రయోజకులుగాని ఎవరూలేరు. లేడు, ఒక్కడైననూ లేడు అని క్రొత్త నిబంధనలోనూ, పాత నిబంధనలోనూ మనము చూడగలము.

# సంపూర్ణ అశక్తత

మనుష్యులు ఆయనను అనుసరించుటకు అసమర్థులని యేసు చెప్పెను. వారు తిరుగుబాటు చేయుటకై మరియు అపార్థము చేసికొనుటకై వారి శరీరాస్వభావాన్ని అనుసరించుట మాత్రమేగాక, ఇందుకు భిన్నంగా వేరే దియు చేయలేని అశక్తులు అని చెప్పెను. కన్నులుండియు చూడలేని వారనియు, చెవులుండియు వినలేని వారనియు వారిని గూర్చి యేసు చెప్పెను. వారు నాయొద్దకు రాలేని అబలులు అనే అర్థంతో ఈ క్రింది మాటలు యేసు పలికెను. ***"మీరేల నా మాటలు గ్రహింపకున్నారు! మీరు నా బోధ విననేరకుండుట వలననే కదా! (యోహాను 8:43 ) "నన్ను పంపిన తండ్రి వానిని ఆకర్షించితేనేగాని యెవడును నా యొద్దకు రాలేడు; అంత్య దినమున నేను వానిని లేపుదును' ('యోహాను 6:44). "మంచి చెట్టు కాని ఫలములు ఫలింప నేరదు, పనికిమాలిన చెట్టు మంచి ఫలములు ఫలింపనేరదు" (మత్తయి 7:18). "మీరు నన్ను వెదకుదురు గాని నన్ను కనుగొనరు నేనెక్కడ ఉందునో అక్కడికి మీరు రాలేరనెను" (యోహాను 7:34). "అందుకు యేసు అతనితో ఒకడు క్రొత్తగా జన్మించితేనేగాని అతడు దేవుని రాజ్యమును చూడలేడని నీతో నిశ్చయముగా చెప్పుచున్నాననెను" (యోహాను 3:3).*** యేసు యొక్క వ్యాఖ్యలు ఎంత సూటిగా ఉన్నాయో గమనించండి. ఆయనను దృష్టించి చూచుటకు, ఆ తరువాత తమకొరకు తాము నిర్ణయించుకొనుటకు మనుష్యులు సమర్థులని ఆయన చెప్పలేదు. వారి అశక్తతకు అనుగుణంగా మనుష్యులు స్పందిస్తారని ఆయన చెప్పెను. అలాగే పాతనిబంధనను వివరించి అర్థము చెప్పే అపోస్తలుడైన పౌలు ఈ విషయాలనే తన పత్రికలలో కూడా ప్రస్తావించాడు. ***"ఏలయనగా శరీరానుసారమైన మనస్సు దేవునికి విరోధమైయున్నది. అది దేవుని ధర్మశాస్త్రమునకు లోబడదు. ఏ మాత్రమును లోబడనేరదు" (రోమా 8:7). "కాగా శరీర స్వభావము గలవారు దేవుని సంతోషపరచనేరరు"(రోమా 8:8).***

మన చర్చయొక్క సారాంశమంతయు ఇదే. ఆదాము పతనము ద్వారా మానవులు కేవలము నలుగగొట్ట బడ్డారని, లేదా వారికి మానగలిగే ఏదో గాయం తగిలందని కాని బైబిలు సెలవిచ్చుట లేదు. మంచి చెడుల తెలివినిచ్చు వృక్ష ఫలములను తింటే నిశ్చయముగా చచ్చెదవు అని ఆదాముతో దేవుడు చెప్పెను. ***"మరియు దేవుడైన యెహోవా - ఆ తోటలోనున్న ప్రతి వృక్ష ఫలములను నీవు నిరభ్యంతరముగా తినవచ్చును. అయితే మంచి చెడ్డల తెలివినిచ్చు వృక్ష ఫలములను తినకూడదు; నీవు వాటిని తిను దినమున నిశ్చయముగా చచ్చెదవని నరుని కాజ్ఞాపించెను"ఆదికాండము (2:16,17).***

తినవద్దన్న ఫలము తినిన తరువాత కూడా ఆదాము కొన్ని వందల యేండ్లు జీవించాడు. అయితే దేవుడు పొరబడ్డాడా? కాదు ఆదాము ఆ మరుక్షణమే ఆత్మీయముగా చనిపోయాడు. కేవలం ఆత్మీయముగా గాయపరచబడలేదు గాని; పాపములో చనిపోయాడు. ఆత్మీయ మరణమునకు ఫలితముగా భౌతికముగానూ మరణించడము ప్రారంభించాడు.

మన ప్రస్తుతపు సంపూర్ణ పతనానికి దారి తీసిన విషయాలను మరింత క్షుణ్ణముగా చూద్దాం. ఆ మహిమాన్విత వనమును కాయవలసిన ఏకైక హక్కుదారులు ఆదాము మరియు అతని భార్య హవ్వ. పతనముకంటే ముందు దేవుడు వారికి అన్నిటిపై సంపూర్ణ స్వేచ్ఛననుగ్రహించి, ఆ స్వేచ్ఛపై కేవలం ఒకే ఒక్క ఆంక్షను విధించాడు. ఆ ఒక నిషేధము తప్ప, తక్కిన అన్ని విషయాలలో మరియెవరికి లేనంత స్వేచ్ఛ వారు కలిగివున్నారు. అయితే (సాతాను) సర్పము తోటలో ప్రవేశించి, హవ్వను సమీపించి దేవుని నియమాన్ని ఉల్లంఘించే విధముగా ఆమెను ప్రలోభపెట్టింది. ***"దేవుడైన యెహోవా చేసిన సమస్త భూ జంతువులలో సర్పము యుక్తిగలదైయుండెను. అది ఆ స్త్రీతో ఇది నిజమా! ఈ తోట చెట్లలో దేని ఫలములనైనను మీరు తినకూడదని దేవుడు చెప్పెనా? అని అడిగెను. అందుకు స్త్రీ - ఈ తోట చెట్ల ఫలములను మేము తినవచ్చును; అయితే తోట మధ్యనున్న చెట్ల ఫలములను గూర్చి దేవుడు - మీరు చావకుండునట్లు వాటిని తినకూడదనియు, వాటిని ముట్ట కూడదనియు***

***చెప్పెనని సర్పముతో అనెను. అందకు సర్పము - మీరు చావనే చావరు ఏలయనగా, మీరు వాటిని తిను దినమున మీ కన్నులు తెరువబడుననియు మీరు మంచి చెడ్డలను ఎరిగినవారై దేవతలవలె ఉందురనియు దేవునికి తెలియునని స్త్రీతో చెప్పగా". (ఆది 3:1-5)***

ఆ పండును ముట్టవద్దని, తినవద్దని చెప్పిన దేవుని ఆజ్ఞను ఎరిగియున్ననూ, మీరు దేవతలవలె ఉంటారని మంచి చెడులను ఎరిగినవారవుతారని మున్నగు విషయాలను చెప్పి సాతాను హవ్వను పండు తినేలా ప్రోత్సహించాడు. క్లుప్తంగా చెప్పాలంటే, హవ్వ తన మనస్సును దిట్టము చేసుకొని తన జీవితమును గూర్చి, నిత్యత్వపు దశను గూర్చి తన కొరకు తానే నియమాలను మార్చుకొంది. దేవుని మాటకు అతీతంగా తన స్వేచ్ఛాచిత్తమును ఉపయోగించిన మొదటి వ్యక్తి హవ్వే అవుతుంది.

ఆర్మీనియన్ బోధలలో ఎన్నిక మరియు స్వేచ్ఛాచిత్తము ప్రధానముగా ఉంటాయి. మంచిచెడులు తెలుసు గనుక మంచినే సాధారణముగా ఎన్నుకొంటారు; చెడును త్రోసిపుచ్చుతారని ఆర్మీనియన్ల వాదన. అయితే హవ్వయొక్క నిర్ణయ ఫలితాలేమిటి? వాస్తవానికి ఆమె దేవునివలె మారిందా? ఆమె క్రొత్తగా కనుగొనిన జ్ఞానము ఆమె ఆత్మీయ పరిస్థితిని మెరుగుపరిచిందా?

***"స్త్రీ ఆ వృక్షము ఆహారమునకు మంచిదనియు, కన్నులకు అందమైనదనియు వివేకమిచ్చు రమ్యమైనదనియునై యుండుట చూచినప్పుడు ఆమె దాని ఫలములలో కొన్ని తీసికొని తిని తనతో పాటు తన భర్తకును ఇచ్చెను. అతడు కూడా తినెను. అప్పుడు వారిద్దరి కన్నులు తెరువబడెను. వారు దిగంబరులని తెలుసుకొని అంజూరపు ఆకులు కుట్టి తమకు కచ్చడములను చేసికొనిరి. చల్లపూటను ఆదామును అతని భార్యయు తోటలో సంచరించుచున్న దేవుడైన యెహోవా స్వరము విని, దేవుడైన యెహోవ ఎదుటికి రాకుండ తోట మధ్యను దాగు కొనగా, దేవుడైన యెహోవా ఆదామును పిలిచి నీవు ఎక్కడ ఉన్నావనెను. అందకతడు నేను తోటలో నీ స్వరము వినినప్పుడు దిగంబరినిగా ఉంటిని గనుక భయపడి దాగుకొంటిని" (ఆది 3:6-10;).***

ఆదాము హవ్వల అవిధేయత సిగ్గు మరియు భయముగా ప్రతిఫలించింది. వారి స్వేచ్ఛా ఆలోచన మరియు స్వయం నిర్ణయం, తదనుగుణముగా చేసిన క్రియలు, ఇవన్నీ కలిసి వారిని దేవునికి దగ్గర చేయటానికి బదులుగా దూరం చేశాయి. అయితే అపోస్తలుడైన యోహాను ప్రకారము పాపము మూడు ప్రాపంచిక విషయాలచేత ప్రభావితము చేయబడుతుంది. శరీరాశ, నేత్రాశ, జీవపుడంబము. ***"లోకములో ఉన్నదంతయు అనగా శరీరాశయు, నేత్రాశయు, జీవపుడంబమును తండ్రివలన పుట్టినవి కావు; అవి లోక సంబంధమైనవే" (1 యోహాను 2:16).***

హవ్వ ఆ వృక్షము ఆహారమునకు మంచిదియు (శరీరాశ), కన్నులకు అందమైనదియు (నేత్రాశ), వివేకమిచ్చు రమ్యమైనదియునై వున్నట్లుగా(జీవపుడంబము) చూసింది. అయితే తత్ఫలితంగా వారిరువురు ఏ విధంగా కూడాను దేవునివలె మారలేదు. కాని దానికి విరుద్ధమైందే జరిగింది. మొదట వారు దిగంబరులమని గ్రహించి సిగ్గునొందారు. వారు పాపులని, దేవుని ఆజ్ఞపై తిరుగబడ్డవారని వారికి బహిర్గతం చేయబడింది. వారు తమ దోషమును కప్పి పుచ్చుకునే ప్రయత్నం చేశారు.

వారు దైవసమానులు కాకపోగా దేవుని మంచి ఈవులను కోల్పోయారు మరియు సర్వశక్తిమంతుని చేత శిక్షింపబడ్డారు. ఆయన తీర్పు ముందు వారు తలవంచారు. ఒక్కొక్కరిని (సర్పముతో సహా) దేవుడు శపించాడు. సర్వోన్నతుడైన దేవుని శాసనము యెదుట వారు నిలువలేకపోయారు. దేవునివలె మారుటకు బదులుగా (తమ స్వచిత్త ఆధారముగా చేసిన నిర్ణయఫలితంగా) వారు శపించబడిన పాపులుగానూ, సిగ్గుకు, తిరుగుబాటుతనముకు బానిసలుగానూ మారారు. వారు ఏదేను నుండి వెలివేయబడ్డారు, సమస్త మానవాళి జీవవృక్షమునకు సుదూరముగా వెలివేయబడ్డారు.

దైవశాస్త్ర పరిధుల్లో ఆదామును మానవాళికి ప్రతినిధిగా పరిగణిస్తారు. దాని భావమేమనగా దేవుడు ఆదాము యొక్క నేరము విషయమై మనుజులందరిని దోషులుగా లెక్కించును. మనమందరము ఆదాము రక్త సంబంధికులము, ఆయన సంతతికి చెందిన వారము. ఆ కారణముచేత మనమందరము ప్రథమ తిరుగుబాటు దారులయొక్క పతన సంతానమైయున్నాము. వారి పతనము మరియు దిగజారిన వారి ఆత్మీయ స్వభావం మనందరికి సంక్రమిస్తుంది. మనము ఆత్మీయ-తటస్థులముగా పుట్టలేదు. మనము పుట్టుకతోనే దైవ తిరుగుబాటు దారులము, మన పితురులవలె సర్వశక్తుడిని తాళలేని వారము, అశక్తులము, నిస్సహాయులము.

## మన స్వభావము

మన నిస్సహాయ స్థితిని, పతనావస్థను తెలియజేస్తూ, పౌలు ఎఫెసు సంఘమునకు ఇలా వ్రాశాడు. ***" మీ అపరాధముల చేతను పాపముల చేతను మీరు చచ్చిన వారైయుండగా, ఆయన మిమ్మును క్రీస్తుతో కూడా బ్రదికించెను. మీరువాటిని చేయుచు, వాయు మండల సంబంధ అధిపతిని, అనగా అవిధేయులైన వారిని ఇప్పడు ప్రేరేపించు శక్తికి అధిపతిని అనుసరించి, యీ ప్రపంచ ధర్మము చొప్పన మునుపు నడుచుకొంటిరి. వారితో కలిసి మనమందరమును శరీరము యొక్కయు, మనస్సు యొక్కయు కోరికలను నెరవేర్చుకొనుచు మన శరీరాశలననుసరించి మునుపు ప్రవర్తించుచు, కడమ వారివలె స్వభావ సిద్ధముగా దైవోగ్రతకు పాత్రులమైయుంటిమి" (ఎఫెస్సీ 2:1-3).***

పై వచనములో పౌలు, వారు మరణమునుండి జీవములోనికి దాటారు అను వాస్తవముతో విశ్వాసులను ప్రోత్సహిస్తున్నాడు. అయితే ఇక్కడ మన సహజ స్వభావమునందు మనమెలా ఉంటామో వివరించబడిన వర్ణనను గమనించండి.

1. పాపములయందు అతిక్రమములయందు మనము చచ్చిన వారము.
2. సాతాను కనుగుణంగా నడచుకొనుచు, వాయు మండల సంబంధమైన అధిపతిని అనగా అవిధేయులైన వారిని ఇప్పడు ప్రేరేపించు శక్తికి అధిపతిని అనుసరించినవారము.
3. మనమందరమును శరీరము యొక్కయు మనస్సు యొక్కయు కోరికలను నెరవేర్చుకొనుచు స్వభావ సిద్ధముగా దైవోగ్రతకు పాత్రులమైయుంటిమి.

మనుష్యులు పాపములు మరియు అతిక్రమముల చేత చచ్చినవారు. గాయపడిన వారు కాదు సోలిపోయిన వారు అసలే కాదు. వారి చేయగలిగిన మంచి చేస్తున్నారనియు కాదు. రాయిలాగ మృతతుల్యమైన వారు. మృతుడు తనకు తానుగా సహాయము చేసికోలేని నిస్సహాయుడైన లాజరును గూర్చి ఆలోచించండి. అతను తనకు తానుగా సమాధినుండి బయటికి రాగలడా? లేదా యెహెజ్కేలు యొక్క ఎండిన ఎముకలు లోయలోనుండి, తమంతట తాము ప్రాణం పోసుకొని రాగలవా?

మన స్థితిని మార్చుకోలేని నిస్సహాయ స్థితిలో మనము పుట్టటమే గాక, మనము పాపాన్ని ఎదిరించలేని నిర్బలులం. మనము పాపానికి బానిసలమని లేఖనాలు చెబుతున్నాయి. దానికి మనం అమ్మబడ్డాము. మనము దాని సొంతము. మనము పాపానికి బానిసలము కాబట్టి, పాపమనే యజమాని ఏది ఆదేశిస్తే అది జరిగించి తీరుతాము. ***"అందుకు యేసు పాపము చేయు ప్రతివాడును పాపమునకు దాసుడని మీతో నిశ్చయముగా చెప్పచున్నాను" (యోహాను 8:34) "వేరొక నియమము నా అవయవములలో ఉన్నట్టు నాకు కనబడుచున్నది. అది నా మనస్సునందున్న ధర్మశాస్త్రముతో పోరాడుచు నా అవయవములలోనున్న పాప నియమమునకు నన్ను చెరబట్టి లోబరచుకొనుచున్నది". (రోమా 7:23)*** .

పౌలు తన శరీరములోని అవయవములలోగల సహజ నియమమునుండి తనను తాను విడిపించుకోలేని నిస్సహాయ స్థితిలోనున్నాడని గ్రహించి, తన సహజ నియమానికి బందీగా ఉన్నట్లు ప్రకటించాడు. తన

మనస్సునందున్న ధర్మశాస్త్రాన్ని పౌలు ఎరిగియున్ననూ, అతని శరీరమందు వ్యాపించియుండిన పాప నియమము అతనిని వెంటాడి చెఱపట్టింది. పాపముతో నశిస్తున్న శరీరము కాబట్టి, మరణమునకు లోనగు ఈ శరీరమునుండి నన్నెవడు విడిపించగలడని అతడు విలపించాడు, నిస్సహాయుడిగా ఎలుగెత్తి ఏడ్చాడు.

ఎలాగైతే ఒక వ్యక్తి గురుత్వాకర్షణ నియమమునుండి తనను తాను విడిపించుకోలేడో అలాగే, తన శరీరములోని పాపనియమము నుండి తన్ను విడిపించుకోలేని స్థితిలో నున్నాడు.

**"అయినా మనము మంచి పనులు చేస్తాము కదా"**

సంపూర్ణ పతనము అనే సిద్ధాంతము మంచి పనులు చేయగలుగు మానవుని సమర్థతను కొట్టి వేయదు. వేదాంతులు చెప్పే విధంగా మనము బొత్తిగా దుర్మార్గులము కాము. ఇతర దుష్క్రియలతో పోల్చినప్పుడు, మనము సత్క్రియలు చేయ సామర్థ్యత కలిగియున్నాము. మనము ఎటువంటి కొలబద్ధను ఉపయోగిస్తాము అనేది ప్రాముఖ్యమైనది. హిట్లర్ పనులతో పోలిస్తే మదర్ థెరిస్సా పనులు చాలా చక్కగా అగుపిస్తాయి. అయితే క్రీస్తు క్రియలు, ఆయన పరిపూర్ణ విధేయత మరియు మన:పూర్వకమైన అర్పణతో పోల్చినప్పుడు మనమందరము ఘోరంగా విఫలమైనవారమే. దేవుని నీతి మరియు పరిపూర్ణతతో మనల్ని మనము పోల్చుకొన్నపుడు - యోబు వలె మనము కూడా స్పందిస్తాము. ***"నరుడు దేవుని దృష్టికి నీతిమంతుడు ఎట్లు కాగలడు? స్త్రీకి పుట్టినవాడు ఆయన దృష్టికి ఎట్లు శుద్ధి కాగలడు? ఆయన దృష్టికి చంద్రుడు కాంతి గలవాడు కాడు నక్షత్రములు పవిత్రమైనవి కావు. మరి నిశ్చయముగా పురుగువంటి మనుష్యుడు పురుగువంటి నరుడు, ఆయన దృష్టికి పవిత్రుడు కానేరడు గదా. అయితే వాస్తవానికి అమితమైన మూర్ఖత్వముతో మానవాళి ప్రవర్తించుట లేదు. ఎందుకంటే, దేవుడు అన్నిటిమీద రాజ్య పరిపాలన చేస్తూ, మనుష్యుడు తన అమితమైన దౌష్ట్యముచేత సంకులము సృష్టించకుండునట్లు వారిని అదుపు చేస్తున్నాడు" (యోబు 25:4-6).***

***"నరుల ఆగ్రహము నిన్ను స్తుతించును ఆగ్రహ శేషమును నీవు ధరించుకొందువు" (కీర్తన 76:10).***

మరో మాటలో చెప్పాలంటే, మానవులు ఉండదగినంత చెడ్డవారు కారు. తన రాజ్యమంతటిపై అధికారము కలిగి, అన్ని విషయములను నియత్రించుచు దేవుడు- దుష్టులను అమితమైన దుష్టముగా ప్రవర్తింపకుండునట్లు అదుపు చేస్తాడు. మనము ధార్మిక లేక దయగల క్రియలు చేయగల సమర్థులము. హత్య తప్పని గుర్తించి చంపుటకు మనము దూరంగా ఉండవచ్చు. మనము నమ్మకమైన భర్తలుగాను, భార్యలుగాను, ఉంటూ కుటుంబాన్ని చక్కగా పోషించి సంరక్షించవచ్చును. మంచి ఉద్యోగిగా, పౌరునిగా మెలగుతూ ఉండవచ్చును. అయిననూ పైన చెప్పిన ధార్మిక/దయగల క్రియలు మన సహజ స్వభావాన్ని మార్చ జాలవు. అయితే నీతి పరిశుద్ధతగల దేవుడు అత్యున్నత ప్రమాణాలు గలవాడు గనుక, ఈ శరీర క్రియలు ఆయనను సంతోషపెట్టజాలవు; దానికి ఆత్మీయ సుగుణాలైన విశ్వాసము, ప్రేమ తదితరములు కావాలి. ***"విశ్వాసము లేకుండ దేవునికి ఇష్టుడైయుండుట అసాధ్యము, దేవుని యొద్దకు వచ్చువాడు, ఆయన ఉన్నాడనియు, తన్ను వెదకు వారికి ఫలము ఇయ్యువాడనియు నమ్మవలెను గదా" (హెబ్రీ 11:6).***

ప్రకృతి సంబంధియైన మానవునిలో దేవునియందు ఎటువంటి విశ్వాసము ఉండదు. ఎంత సదుద్దేశముతో అతడు సత్క్రియలను చేసినా ఆ విశ్వాస హీనతను అధిగమించలేడు. తత్ఫలితంగా ప్రకృతి సంబంధియైన మానవుడు చేయు ప్రతీ శరీరకార్యము ఎంత మంచిదైనా, దేవుడు మాత్రము దానిని పాపముగానే పరిగణిస్తాడు. ***"అహంకార దృష్టియు గర్వ హృదయమును భక్తిహీనుల క్షేమమును పాప యుక్తములు" (సామెతలు 21:4)*** (క్షేమము అను మాట మూలభాషను అనుసరించి పొలము దున్నుటను సూచిస్తుంది) అహంకారదృష్టియు గర్వమును పాపయుక్తమని ఈ వాక్యము బోధిస్తున్నది. ఇది గ్రహించుట సులభమే. అయితే పొలము దున్నుట వంటి దైనందిన చర్యలు కూడా దేవుని దృష్టిలో పాపయుక్తములని ఈ వాక్యము తెలియజేయుచున్నది. కాబట్టి ఒక వ్యక్తి క్రియలు పాపయుక్తమా కాదా అని నిర్ణయించుట, ఆయా క్రియల యొక్క మంచిచెడులపై

ఆధారపడియుండదు. దుష్క్రియలు చేస్తేనే పాపము కాదు. పాప స్వభావము కలిగియుండుటయే పాపము. మనము పాపము చేస్తాము కాబట్టి పాపాత్ములము కాదు గాని మనము పాపులము కాబట్టి పాపము చేస్తాము.

బైబిలు గ్రంథములో 'పాపము' అను పదమునకు వాడబడిన గ్రీకు పదము 'హమర్టియా' దానికర్థము దేవుని పరిపూర్ణతను పొందలేక పోవుట; గురి తప్పుట; దేవుని కంటే తక్కువగానుండి, పరిపూర్ణత విషయమై, పరిశుద్ధత మరియు నీతి విషయమై గురి తప్పుట. దీనిని పాపముగా నిర్వచించవచ్చు. అయితే కేవలం గురి తప్పుట కాదు, వాస్తవానికి మనము అదోగతిలో ఉన్నామని బైబిలు సెలవిచ్చుచున్నది. ***"ఎంత స్థిరుడైనను ప్రతివాడును కేవలము వట్టి ఊపిరివలెనున్నాడు" (కీర్తన 39:5). మన శ్రేష్ట దశలో కూడాను, పరిపూర్ణత పొందలేని వారముగానున్నాము". "నాశనమును కష్టమును వారి మార్గములో ఉన్నవి. శాంతి మార్గము వారెరుగరు. వారి కన్నుల యెదుట దేవుని భయము లేదు" (రోమా 3:16-18).*** మానవుని సహజ స్థితి ఆ విధముగానున్నది. వారి కన్నుల యెదుట దేవుని భయము లేదు. అయితే ***"యెహోవా యందలి భయము జ్ఞానమునకు మూలము". ఘోరమైన విషయమేమిటంటే, మన శ్రేష్ట క్రియలు, నీతియుక్తమైన నడవడి అంతయూ వ్యర్థమే. (కీర్తన 111:10) "మేమందరము అపవిత్రులువంటి వారమైతిమి. మా నీతి క్రియలన్నియు మురికి గుడ్డలవలె నాయెను. మేమందరము ఆకువలె వాడిపోతిమి. గాలి వానకు కొట్టుకొని పోవునట్లుగా మా దోషములు మమ్మును కొట్టుకొని పోయెను. నీ నామమును బట్టి మొఱ్ఱపెట్టు వాడొకడును లేకపోయెను. నిన్ను ఆధారము చేసికొనుటకై తన్నుతాను ప్రోత్సాహ పరచుకొను వాడొకడును లేడు. నీవు మాకు ముఖము చాటు చేసుకొంటివి. మా దోషముల చేత నీవు మమ్మును కరిగించియున్నావు" (యెషయా 64:6,7) .***

## పాపము యొక్క శక్తి

పాపము యొక్క అంతర్గుణమేమిటంటే, అది ఒకసారి ప్రారంభమైతే, దేవుడు మాత్రమే నిర్మూలము చేయగలిగే ఓ శక్తిగా మారుతుంది. ఒకసారి సాతానుడు తిరగబడ్డాక పరలోకము నుండి త్రోయబడ్డాడు ***(లూకా 10:18)***, వాడు వాని దుష్టమార్గమునుండి తననుతాను త్రిప్పకోలేని అశక్తుడు. అంతిమంగా, వాని ఆగడాలను అరికట్టుటకుగాను దేవుడు వానిని బంధించి అగ్నిగుండంలో పడవేస్తాడు. **(మత్తయి 25:41; ప్రకటన 19:20).** అలాగే, దుష్టుని పిల్లలు వారి తండ్రివలె తిరుగుబాటునుండి మరలక, శిక్షకు పాత్రులవుతారు. ***"మీరు మీ తండ్రియగు అపవాది సంబంధులు. మీ తండ్రి దురాశలు నెరవేర్చగోరుచున్నారు. ఆదినుండి వాడు నరహంతకుడైయుండి సత్యమందు నిలిచినవాడు కాడు. వానియందు సత్యమే లేదు. వాడు అబద్ధమాడునప్పుడు తన స్వభావమునననుసరించియే మాటలాడును; వాడు అబద్ధికుడును అబద్ధమునకు జనకుడునైయున్నాడు. నేను సత్యమునే చెప్పచున్నాను గనుక మీరు నన్ను నమ్మరు" (యోహాను 8:44,45).***

అంత్యకాలమందు సహితము, దేవుడు ఈ లోకాన్ని తీర్పు తీర్చునపుడు, భూ నివాసులు కృపకొరకు గాని, విశ్వాసయుక్తంగా రక్షింపబడుటకు గాని ఎన్నుకొనరు. ఆ ఘోరశ్రమలు, కష్టాల మధ్యలో వారు తమ దుష్టత్వమునుండి తిరగలేని అశక్తతను ప్రదర్శించుట మాత్రమేగాక దేవునినుండి తప్పించుకొనిపోయే ప్రయత్నము చేస్తారు. ***"భూ రాజులును, ఘనులును, సహస్రాధిపతులును, ధనికులును, బలిష్టులును, ప్రతి దాసుడును, ప్రతి స్వతంత్రుడును, కొండగుహలలోను, బండ సందులలోను దాగుకొని సింహాసనాసీనుడైయున్న వానియొక్కయు, గొఱ్ఱెపిల్లయొక్కయు ఉగ్రత మహా దినము వచ్చెను; దానికి తాళజాలిన వాడెవడు? మీరు మా మీద పడి ఆయన సన్నిధికిని గొఱ్ఱెపిల్ల ఉగ్రతకును మమ్మును మరుగు చేయుడి అని***

***పర్వతములతోను బండలతోను చెప్పుచున్నారు" (ప్రకటన 6:15-17).***

ఒకవేళ, ఒక మనిషి 'నమ్ముటకు', 'పశ్చాత్తాపడి విశ్వాసముంచుట'కు కావలసినదల్లా చాలినంత ప్రోద్బలం, ప్రోత్సాహమే అయితే ప్రస్తుతం అది చాలా అందుబాటులో ఉంది. కాని వారు అసలు పశ్చాత్తాపపడలేని నిర్బలులై "గొఱ్ఱెపిల్ల ఉగ్రతనుండి తప్పించుడి" అని పారిపోయే ప్రయత్నం చేస్తారు.

ఒక వ్యక్తి దోషపూరిత పాపస్వభావమునుండి తప్పించుకుని బయటపడాలంటే దేవుడు తప్పనిసరిగా 'మార్పు' అనే అద్భుతక్రియను జరిగించాలి. పతనస్వభావము, నిత్యత్వపు ఆత్మీయస్వభావముగా మార్చబడాలి. ఒకవేళ వారున్న పరిస్థితిలోనే వారిని వదిలేస్తే, మానవులు తమను తాము మార్చుకోలేని అశక్తులుగానే మిగిలిపోతారు.

గనుక మొదటి అడుగు దేవుడే వేయాలి, దేవుడే ఆ ప్రక్రియను ప్రారంభించాలి. మానవుడు అశక్తుడు, ఈ విధముగా మార్పు మరియు రక్షణకార్యము రెండునూ దైవాధీనములే.

## ముగింపు

సంపూర్ణ పతనము అనే సిద్ధాంతము పునఃపరిశీలన చేద్దాము.

1. ఆదాము పతనములో మానవాళి అంతయు పతనమయ్యింది కాబట్టి ఆదాము తిరుగుబాటు ఫలితముగా వచ్చిన శాపమును మనమందరము పంచుకుంటాము ***"పాపము యొక్క జీతము మరణము" (రోమా. 6:23).*** మానవులు క్రమేపీ మరణిస్తున్న కారణాన మనుష్యులందరూ పాపాత్ములని మనకు తెలియును.
2. మానవులు మంచి పనులు చేయగలిగే సామర్థ్యము కలిగియునప్పటకీ అవి మురికి గుడ్డలవలె ఘోరముగా ఉన్నవి. పరలోకపు దృష్టిలో అవన్నీ వ్యర్థమే.
3. మానవుడు తనకు తాను సహాయము చేసుకోలేని నిస్సహాయుడు. అతడు పాపములయందును అతి క్రమములయందును మరణించినవాడు. అతడు పాపమునకు బానిసయై, దుష్టమైన మోసకరమైన

హృదయము కలిగి, ప్రతిక్షణము కూడా తన శరీరసంబంధమైన హృదయవాంఛలను అనుసరిస్తుంటాడు. విశ్వాస విషయములో అతడు సరైన ఎన్నిక చేయునట్లు గాని, ధృఢనిర్ణయం తీసుకొనునట్లుగాని, మేధాసంబంధముగా ఉత్తేజపరుచబడునట్లుగాని, ఒప్పింపబడలేడు; బలవంతపెట్టబడలేడు.

మనము ఈ విషయమును అర్థము చేసికుంటేనే తప్ప, బైబిలు గాని రక్షణ ప్రణాళికను కార్యసాధకము చేసిన దేవుని ప్రేమగాని సరిగా బోధపడదు. ఈ సిద్ధాంతాన్ని సరిగా అర్థం చేసుకుంటే ఇతర కృపా సిద్ధాంతాలను అర్థము చేసుకోవటం సులభతరమౌతుంది. **( యెషయా 51:1).** మనము ఏ బండనుండి చెక్క బడితిమో ఏ గుంట నుండి త్రవ్వబడితిమో ఆలోచించనిదే, మనలను రక్షించుటకు క్రీస్తు ఎంత తగ్గించుకొనెనో, మనను అందుకొనుటకు ఎంత క్రిందికి తన హస్తమును చాచెనో గుర్తించలేము, ప్రశంసించనూ లేము.

***"యేసు ఆ మాట విని రోగులకే గాని ఆరోగ్యము గల వారికి వైద్యుడక్కరలేదు. నేను పాపులనే పిలువ వచ్చితిని గాని నీతిమంతులను పిలువరాలేదని వారితో చెప్పెను" (మార్కు. 2:17).*** ఇక్కడే ఈ సిద్ధాంతము యొక్క ఓటమి - గెలుపు తెలుస్తుంది. ***"ఆరోగ్యవంతునికి వైద్యుడవసరము లేదు"(లూకా.5:31)***. సజీవునికి పునరుత్థానము అవసరము లేదు. బ్రతికిన వ్యక్తి "తిరిగి జన్మించనవసరము లేదు". నశించిన దానిని వెదకి రక్షించుటకు యేసు వచ్చాడు. రోగులను బాగు చేసి మృతులను లేపుటకే గాని మంచివారికి మేలు చేయుటకు, సమర్థులను ప్రోత్సహించుటకు రాలేదు. నీలో నీవు ఈ పతన స్వభావమును చూడగలిగితే, నిన్ను రక్షించుటకే క్రీస్తు వచ్చాడనుటకు ఆస్కారం కలదు. కేవలము దేవుని కృప చేత మాత్రమే తప్ప మానవుడు తనను తాను రక్షించుకోలేని అశక్తుడను వాస్తవమును గ్రహించలేడు, తనకు రక్షకుడు తప్పక అవసరమని ఒప్పకోలేడు..

'సరేనండి జిమ్ గారు నేను ఖచ్చితంగా ఒప్పింపబడ్డాను; కాని మానవులందరూ దేవుని దృష్టిలో దుష్టులైతే, సంపూర్ణంగా పతనమై తమకు తాము సహయము చేసుకోలేని అశక్తులైతే, అట్టి మానవులు ఎలా రక్షింపబడగలరు?

ఎందుకంటే కొందరు రక్షింపబడతారని బైబిలు సెలవిస్తుంది. అవును ఖచ్చితముగా ! అందుకే ఈ సిద్ధాంతాలను కృపాసిద్ధాంతాలని పిలుస్తున్నాము. దేవుణ్ణి ఆకర్షించే ఏ మంచియూ మానవునిలో లేకపోయిననూ, కొందరు రక్షింపబడుతున్నారంటే, అది తప్పనిసరిగా దేవుని సార్వభౌమ చిత్తము వలననే గాని మానవుల క్రియల వలన కాదు, వారి విలువ వలన అసలే కాదు.

మనము దేవునిని ఎన్నుకోలేని అశక్తులము కాబట్టి దేవుడే ఆయన కృపను బట్టి మనలను ఎన్నుకుంటాడు. ఇట్టి అవగాహన 'భేషరతు ఎన్నిక' అనే కృపా సిద్ధాంతాలలోని రెండవ సిద్ధాంతమునకు మనలను నడిపిస్తుంది.

# రెండవ అధ్యాయము

# భేషరతు ఎన్నిక

'ఎన్నిక' 'ఎన్నుకొనబడినవారు' అను మాటలు పాత, క్రొత్త నిబంధనలలో 27 సార్లు కనబడుతాయి. 'దేవుడు ఎన్నుకొనుట', 'దేవుని చేత ఎన్నుకొనబడుట' అను విషయమై సుమారు 100 కు పైబడి వచనములు ఉన్నాయి. అయిననూ క్రైస్తవ లోకములో ఎక్కువగా అపార్థము చేసికొనబడిన సిద్ధాంతలలో ఈ సిద్ధాంతము ఒకటి. 'ఎవరిని ఎవరు ఎన్నుకొంటారు అనేది ప్రాథమికముగా మనము తెలుసుకొవలసిన విషయం'. కొన్ని ప్రశ్నలు-జవాబులు ద్వారా 'ఎన్నిక' అనే అంశమును గూర్చి కొంతమేరకు మనము అర్థము చేసికొనవచ్చును. ఈ సిద్ధాంతమును ఎవరితోనైనా ప్రస్తావించేటప్పుడు నా సంభాషణను ఈ విధముగా ఆరంభిస్తాను.

"నీవు రక్షింపబడ్డావని నమ్ముచున్నావా"? "అవును". "సరే, నిన్ను ఎవరు రక్షించారు"? "దేవుడు" "చాలామంచిది దేవుడు నిన్ను ఉద్దేశపూర్వకంగా రక్షించాడా లేక యాదృచ్ఛికముగా రక్షించాడా"? "ఉద్దేశపూర్వకంగానే రక్షించాడు". దేవుడు కొందరిని రక్షిస్తాడు. ఉద్ధేశపూర్వకంగానే రక్షిస్తాడు. అదే దేవుని ఎన్నికంటే.

వేదాంతపరమైన వివరణ కొరకు పాస్టర్: డేవిడ్ మోరిస్ 'ఎన్నుకొనుట'ను ఈ విధముగా నిర్వచించాడు.

'మానవుని యొక్క పతనము మరియు అశక్తతతను బట్టి చూస్తే, పాపము మరియు శిక్షనుండి కలిగే రక్షణ, సంపూర్ణముగా దేవుని నుండే, త్రియేక దేవుని నుండే కలుగుతుంది. గత నిత్యత్వము నందు లోకమును సృష్టింపక మునుపే మనుష్యుడు లెక్కింపజాలని ఒక జన సమూహమును క్రీస్తునందు దేవుడు ఏర్పరచుకున్నాడు. ముందే వారిలో కనుగొనబడిన సుగుణములను బట్టికాక, ఆదాములోనుండి శిక్షకు నాశనమునకు పాత్రులైన వారిని కేవలము తన కృప చేతనే దేవుడు ఎన్నుకున్నాడు'. ఈ ఎన్నికను దేవుడు కేవలము తన మహిమార్థమై ఏర్పరిచాడు. మానవులు పతనమైన దుష్టులని, చనిపోయిన పురుగులని, సంపూర్ణముగా అశక్తులని, నశించిపోయే పాపులని లేఖనాలు సెలవిస్తున్నప్పటికీ నీతిమంతుడును, పరిశుద్ధుడైన దేవుని నుండి కొందరు నిత్యరక్షణ పొందుకుంటారని మనకు తెలియును. కాబట్టి ఇదేలా సాధ్యమని అడగుటకు మనము బలవంతపెట్టబడుచున్నాము..

ముందుగానే పేర్కొన్న విధముగా దేవుడు కొందరిని ఎన్నుకుంటాడని లేఖనము సెలవిస్తున్నాయని దాదాపు క్రైస్తవ సంఘాలన్నీ ఒప్పకుంటాయి. అయితే వివాదం ఏమిటంటే, ఎటువంటి షరతుల ఆధారంగా దేవుడు ఎన్నుకుంటాడు? ఎంతమేరకు సృష్టిపై తన అధికారమును ఉపయోగించి ఎన్నుకుంటాడు?

కృపాసిద్ధాంతాలు, దేవుని ఎన్నిక షరతులు లేనిదని సెలవిస్తున్నాయి; అసలు, నశిస్తున్న పాపులు, దేవుడు వారిని రక్షింపబద్ధునిగా చేసే ప్రీతిపాత్రకార్యాలు ఎలా చేయగలరు? ఈ కారణాలు గమనించండి.

1) పాస్టర్: మోరిస్ గారు తన నిర్వచనములో పేర్కొనిన విధముగా ఏ మనుష్యుడు కూడా ఏ క్రియలును చేయక మునుపు, 'భూమికి పునాదులు వేయబడక మునుపే' దేవుడు ఎన్నుకున్నాడు **(ఎఫెసీ.1:4).** కాబట్టి, దేవుడు మానవునిని ఎన్నుకొనుటలో అతని క్రియలు పరిగణలోనికి రాజాలవు.

2) దేవుని సార్వభౌమ్య కృపయే ఈ ఎన్నికయొక్క లక్షణము-స్వభావము. ఒకవేళ ఈ ఎన్నిక ఒకని సుగుణాల ఆధారముగా జరిగితే కృప ఇకను కృపయే కాదు. "అపాత్రమైన దయ, కరుణ" ఇదే కృప యొక్క నిర్వచనం. ఒక వేళ మానవుల రక్షణ వారి వారి క్రియలపై ఆధారితమైతే అది జీతము అవుతుందేగాని అయోగ్యునికి అందిన దయగా ఎంచబడదు. ***"అలాగుననే అప్పటి కాలమందు సహితము కృపయొక్క యేర్పాటు చొప్పన శేషము మిగిలియున్నది. అది కృప చేతనైన యెడల ఇకను క్రియల మూలమైనది కాదు; కానియెడల కృప ఇకను కృప కాక పోవును". (రోమా 11:5,6)***

**ఎన్నుకొనుటయను పదజాలము**

అనేకమైన ఇతర పదజాలములను అనగా 'ముందుగా నిర్ణయించుట', 'ముందుగా ఎరుగుట', 'ముందుగా ఏర్పరచుకొనుట' తదితర పదజాలములను తెలుసుకోకుండా మనము బైబిలుఆధారిత 'ఎన్నిక సిద్ధాంతము'ను తెలుసుకోలేము. ఎన్నుకొనుట అనునది కేవలము క్రొత్తనిబంధన సిద్ధాంతమని, పౌలు దీనిని లేఖనములలో ప్రవేశపెట్టాడని కొందరి వాదన. అయితే ఇది వాస్తవము కాదు.

తన సృష్టి యొక్క గమ్యమును ఎన్నుకొనుటలో దేవుని హక్కు మరియు సామర్థ్యతను గూర్చిన ఈ సత్యము లేఖనాలంతటిలోను అంతర్లీనమైయున్నది. దేవుని సర్వాధికారిక ఎన్నిక విషయమై బైబిలులో ఈ ఉదాహరణలు చూడవచ్చును.

1) దేశాలు, ఉదా: ఇశ్రాయేలు

2) వ్యక్తులు, ఉదా: మోషే, దావీదు మరియు దానియేలు

3) శేషిత జనాంగము, ఉదా: బయలు దేవతకు మ్రొక్కని 7,000 మంది

4) కాలాలు, ఉదా: పండుగలు, సబ్బాతులు

5) స్థలాలు, ఉదా: యెరూషలేము పట్టణము, ఇశ్రాయేలు దేశము, ఆయా గోత్రములు నివసించుటకు ఏర్పాటు చేసిన స్థలాలు

తన రాజ్యముపై ఏలుబడి చేయు రాజు యొక్క గుణము ఇది. దేవుడు తన సృష్టిపై ప్రభువు కనుక తన రాజ్య వ్యవహారాలన్నీ చురుకుగా చూసుకుంటూ ఉంటాడు. కాబట్టి తన అనంతమైన వికల్పముల నుండి ఆయన వీటిని ఎన్నుకుంటాడు.

1) ఏమి జరుగవలెను?

2) అది ఇతర సంఘటనలను ఎలా ప్రభావితము చేస్తుంది?

3) ఒక్కొక్క సంఘటనలో ఎవరు పాల్గొంటారు?

దీనిని 'ముందుగా నిర్ణయించుట', 'సంఘటనలు వాస్తవముగా సంభవింపక మునుపు వాటిని నిర్దేశించుట', 'ఆదేశించుట' అని వేదాంతులు పిలిచారు. అలాగే దేవుని గుణలక్షణములను వర్ణిస్తూ క్రైస్తవసంఘము తరాల తరబడి ఈ పదాలను ఉపయోగిస్తుంది.

1) సర్వ శక్తిమంతుడు (అత్యున్నత శక్తిగలవాడు)

2) సర్వ వ్యాపి (ఒకే సమయములో అన్ని స్థలములలో ఉండువాడు)

3) సర్వ జ్ఞాని (అంతయూ క్షుణ్ణముగా ఎరిగినవాడు)

మొదటగా, దేవుడు సర్వ శక్తిమంతుడైతే, ఆయన రాజ్యములో ఆయన అనుమతి లేకుండా ఏదియును జరుగదు. ఆయనకు వేరుగా మరో శక్తి లేదు. ఒకవేళ ఆయన అనుమతి లేకుండా ఏదైనా ఆయన రాజ్యములో ప్రవేశించగలిగితే వాస్తవముగా ఆయన సర్వశక్తిమంతుడు ఎలా కాగలడు? రెండవదిగా, దేవుడు సర్వ వ్యాపి కనుక ఆయన ఒకే సమయములో ఆయన రాజ్య సంబంధమైన ప్రతి చిన్న విషయములో కూడాను చురుగ్గా పాల్గొనాలి. లేనట్లయితే ఆయన అంతటా వ్యాపించినవాడు కాడు.

మూడవదిగా, ఆయన సర్వ జ్ఞానియైతే ఏ సంఘటన కూడా ఆయనకు మరుగైయుండదు. ఆయనకు వేరుగా ఏదియునూ జరుగదు. ఏదియును ఆయనను ఆశ్చర్యపరచజాలదు. ఆయన ప్రతియొక్క చర్యను వాటి వాటి పర్యవసానాలను క్షుణ్ణముగా ఎరిగినవాడైయున్నాడు.

దేవునికి ఇట్టి గుణ లక్షణములు కలవని ఒప్పుకుంటే ఇవి దాని ఫలితార్థములు:

1) విశ్వములో సంభవించే ప్రతి సంఘటననూ ఆయన ఎరుగును.

2) ప్రతి సంఘటనలోనూ ఆయన ఉంటాడు.

3) ప్రతి కార్యాన్ని ఆయనే జరిగిస్తాడు.

అయితే బైబిలు మరొక అడుగు ముందుకు వేస్తూ తన రాజ్యములో జరుగు ప్రతి సంఘటనయు ఆయన నిర్ణయం చొప్పన సంభవించునని, ఆయన ముందుగా నిర్ణయించనిదేదదియు సంభవింపదని సెలవిస్తున్నది. అతి పెద్ద విషయము నుండి

"ప్రతివాడును పై అధికారులకు లోబడియుండవలెను; ఏలయనగా దేవుని వలన కలిగినది తప్ప మరి ఏ అధికారమును లేదు; ఉన్న అధికారములు దేవుని వలననే నియమింపబడియున్నవి" (రోమా.13:1) . అతి చిన్న విషయము వరకు, ("చీట్లు ఒడిలో వేయబడును వాటివలన తీర్పు యెహోవా వశము" (సామెతలు16:33)) పట్టింపుకు రాని విషయముల నుండి ("రెండు పిచ్చుకలు కాసుకు అమ్మబడును గదా; అయినను మీ తండ్రి సెలవు లేక వాటిలో ఒకటైనను నేలను పడదు" (మత్తయి 10:29))

అతి సాన్నిహిత్య విషయాలు వరకు,

("నేను కూర్చుడుట, నేను లేచుట నీకు తెలియును, నాకు తలంపు పుట్టక మునుపే నీవు నా మనస్సు గ్రహించుచున్నావు" (కీర్తన 139:2)) అన్నియు దేవుని నిర్ణయములే.

యోబునకు దేవుడు 38-41 అధ్యాయాలలో ఇచ్చిన ప్రత్యుత్తరములో తన సృష్టిపై ఆయనకు ఉన్న అదుపు, నియంత్రణ, సృష్టి నిర్మాణము, కొలత, ప్రతి చిన్న జంతువు పోషణ, సాతానును బంధించి అదుపులో వుంచుట మొదలగునవి తెలియజేయబడ్డాయి.

మనము భేషరతు ఎన్నికను గూర్చి ఆలోచించినప్పడు, దేవునికి తాను సృష్టించిన దానితో తనకు ఇష్టమున్నట్లు వ్యవహరించుటకు ప్రభువుగాను, రాజుగాను హక్కు మరియు సర్వశక్తిమంతునిగా సామర్థ్యము కలదని గుర్తించాలి.

> "భూనివాసులందరు ఆయన దృష్టికి ఎన్నికకు రానివారు; ఆయన పరలోకసేన యెడలను భూ నివాసుల యెడలను తన చిత్తము చొప్పన జరిగించువాడు, ఆయన చేయి పట్టుకొని నీవేమి చేయుచున్నావని ఆయనతో చెప్పటకు ఎవడును సమర్థుడుకాడు" (దానియేలు 4:35).
>
> "ఏలయనగా ఆకాశమందున్నవియు భూమియందున్నవియు దృశ్యమైనవిగాని, అదృశ్యమైనవిగాని అవి సింహాసనములైనను, ప్రభుత్వములైనను, ప్రధానులైనను, అధికారులైనను సర్వమును ఆయనయందు సృజింపబడెను. సర్వమును ఆయన ద్వారాను ఆయనను బట్టియు సృజింపబడెను. ఆయన అన్నిటికంటె ముందుగా ఉన్నవాడు; ఆయనే సమస్తమునకు ఆధారభూతుడు" (కొలస్సీ, 1:16,17).

దేవుడేది చేసినను, ఆయన తన అతి శ్రేష్ఠమైన మహిమకొరకే చేస్తాడు. కాబట్టి సృష్టి యావత్తు ఏ విధముగా ఉండాలని ఆయన అభిలషించాడో ఆ విధముగానే నిర్మించుకున్నాడు. ఆయన సర్వాధికారపు పాలనకు వెలుపల ఏదియు ఉనికిలో ఉండదు. సృష్టి అంతయు తమ సృష్టికర్త చిత్తమునకు తలయొగ్గను. ఆయన చిత్తానుసారముగా ఆయన సమస్తాన్ని జరిగిస్తాడు. అలాగే మానవుల రక్షణ కూడా ఇందులో భాగము. ఇది కూడా ఆయన సార్వభౌమ చిత్తానుసారముగానే జరుగుతుంది.

## ముందుగా నిర్ణయించుట

ఇప్పడు ఈ అవగాహనతో మనము 'ముందు నిర్ణయించుట' అను విషయమును చక్కగా అర్థము చేసికొనవచ్చును. ఈ మాటకు అర్థమేమిటంటే, దేవుడు మనుష్యుల గమ్యమును ముందుగానే నిర్ణయిస్తాడు. ఆ గమ్యమునకు వారిని చేరవేయుటకు ఆయన దృఢసంకల్పము మరియు శక్తిగలవాడు. ఈ విధంగా మాత్రమే ఎవరైన పరలోకము చేరుకుంటారు. ఎలాగైతే మొదటి తిరుగుబాటుదారులను తోటనుండి వెలివేసే శక్తిని దేవుడు కలిగియున్నాడో అలాగే వారి సంతానమంతటిని కాని, వారిలో కొందరిని గాని తిరిగి తన సన్నిధికి చేర్చుకొనే

అధికారము, శక్తి కలిగియున్నాడు.

ఆదాము తిరుగుబాటు ద్వారా పతనమైన మానవులు, కొండచరియల పైనుండి క్రిందికి దూకు (ఆత్మహత్యాసదృశ్యంగా) 'లెమ్మింగ్' అనే అంటార్కిటికా సంచారజీవిని పోలి నరకమునకే దిగజారుచున్నారు. వారి స్వంత మార్గములో వెళ్లుట వారి స్వభావము, వారి కోరిక. అదే వారిని నాశనమునకు నడుపించు మార్గము. "ఇరుకు ద్వారమున ప్రవేశించుడి, నాశనమునకు పోవు ద్వారము వెడల్పును, ఆ దారి విశాలమునైయున్నది, దాని ద్వారా ప్రవేశించువారు అనేకులు" (మత్తయి. 7:13). కాని దేవుడు, ఆయన కరుణను మరియు కృపను ప్రదర్శింప ఉద్దేశముగలవాడై దోషులైన పాపులలో కొందరిని ఎన్నుకొని, వారిని ఇతర మార్గములో గాక రక్షణ మార్గములో నడిపిస్తాడు. "జీవమునకు పోవు ద్వారము ఇరుకును ఆ దారి సంకుచితమునైయున్నది. దాని కనుగొనువారు కొందరే" (మత్తయి 7 :14).

'ఎన్నుకొనుట'యను పదజాలమును వాడుటలో పౌలు ఎంతో నిపుణతగలవాడు. 'బంగారు విమోచన గొలుసు'గా పేర్కొనబడిన ఈ తలంపును ఈ దిగువ వాక్యభాగములో పొందుపర్చాడు. "ఎందుకనగా తన కుమారుడు అనేక సహోదరులలో జేష్ఠుడగునట్లు, దేవుడెవరిని ముందు ఎరిగెనో, వారు తన కుమారునితో సారూప్యముగలవారవుటకు వారిని ముందుగా నిర్ణయించెను మరియు ఎవరిని ముందుగా నిర్ణయించెనో వారిని పిలిచెను. ఎవరిని పిలిచెనో వారిని నీతిమంతులుగా తీర్చెను, ఎవరిని నీతిమంతులుగా తీర్చెనో వారిని మహిమపరచెను" (రోమా 8: 29,30).

ఇక్కడ మనము ఐదు కృపాసిద్ధాంతాలను చర్చించుకొనుచుండగా ఈ ఐదు సిద్ధాంతాలు కూడా చక్కగా పై వచనములలో పొందు పరచబడినట్లుగా గ్రహించగలము.

1) "....ఎవరిని ముందుగా నిర్ణయించెనో" (ఎన్నుకొనుట)

2) "...వారిని పిలిచెను" (అభేద్యమైన కృప)

3) "ఎవరిని పిలిచెనో వారిని నీతిమంతులుగా తీర్చెను" (పరిమిత ప్రాయశ్చిత్తము)

4) "మరియు ఎవరిని నీతిమంతులనుగా తీర్చెనో వారిని ఆయన మహిమ పరిచెను"
(పరిశుద్ధుల పదిలత)

ఈ వాక్యభాగమును మరొమారు పరిశీలన చేసినప్పడు, ఒక్కొక్క విషయము ఇందులో ఎలా పొందుపరచబడియున్నదో మనము విశ్లేషించుదాము. అయితే ప్రస్తుతము పౌలు యొక్క నిర్ధిష్టమైన భాషా ప్రయోగమును మాత్రమే గమనించుదాము - 'ఎవరిని ఎరిగెనో, వారినే నిర్ణయించాడు, ఎవరిని నిర్ణయించాడో వారినే పిలిచాడు, ఎవరిని పిలచాడో వారినే నీతిమంతులనుగా తీర్చాడు, ఎవరిని నీతిమంతులనుగా తీర్చాడో వారినే మహిమపరిచాడు.' ఈ విధానమంతటిలో కూడా ఒక ఫలానా గుంపువారు మాత్రమే మనకు అగుపిస్తారు ఎవరైతే ముందుగా ఎరుగబడ్డారో వారే చివర మహిమపరచబడ్డారు. పైగా, ఈ విధానమంతటిలో లేదా ఈ ప్రక్రియ అంతటలో లేశమాత్రమైనా వారి ప్రమేయం ఉన్నట్లు కనీసం సూచనప్రాయముగానైన చెప్పబడలేదన్నది గమనించండి. వారు కార్యసాధకులు కాదు కాని కేవలము దేవుని కృపకు ప్రాప్తులుగా చేయబడినవారు.

## దేవుడు దేనినెరుగును?

ఆర్మీనియన్ వేదాంతులకు కూడా రోమా 8:29 చాలా ప్రీతికరమైన వాక్యము 'ముందుగా ఎరిగెను' అను మాటను చూడగానే, ఆ ఎరుగుబడ్డ ప్రజలలో, దేవుడు ఏదో మంచిదియు ప్రీతిపాత్రమైనదియు ఉన్నట్లు ముందుగా ఎరిగెనని, ఈ విషయాలే ఆయన వారిని ఎన్నుకొని పిలిచి, నీతిమంతులుగా తీర్చి మహిమ పర్చే విధంగా తోడ్పడ్డాయని వారంటారు. కాని మనము మానవుని సంపూర్ణ పతనమును బట్టి చూస్తే, దేవుడు వారిలో చెడును తప్ప మరొకటి ఏదియు చూసియుండడు. కావున వారి యోగ్యతను బట్టి ఆయన వారిని ఏర్పరచుకోలేదు. వారు

చేయబోవు సత్క్రియలను దేవుడు ముందుగా ఎరిగి తదనుగుణముగా వారిని రక్షణకై ఎన్నిక చేసాడనుటకు ఏ ఆస్కారము లేదు. ఎందుకనగా, ఈ సత్క్రియలు దేవుడు ముందుగా నిర్ణయించుటకు ఫలితాలే తప్ప, హేతువులు కావని లేఖనాలు ధృవీకరిస్తున్నాయి.

"మరియు వాటియందు మనము నడుచుకొనవలెనని దేవుడు ముందుగా సిద్ధపరచిన సత్క్రియలు చేయుటకై మనము క్రీస్తు యేసునందు సృష్టించబడినవారమై ఆయన చేతి పనియైయున్నాము" (ఎఫెసి.2:10)

అదే విధముగా రక్షణార్థమైన 'దేవుని ఎన్నిక', ఎవరు విశ్వసిస్తారు అనే ఆయన భవిష్యత్ జ్ఞానాధారముగా చేయబడిందని అనుటకు కూడా ఏ ఆస్కారము లేదు. ఎందుకంటే ఎన్నిక చేయబడినవారికి దేవుడే విశ్వాసాన్ని వరంగా ప్రసాదిస్తాడని బైబిల్ సెలవిస్తున్నది.

"మరియు నిత్యజీవమునకు నిర్ణయింపబడిన వారందరు విశ్వసించిరి" (అపొ.కా.13:48). ఈ వచనమును మనము గమనించినట్లయితే,నమ్మినవారందరూ నిత్యజీవమునకు నిర్ణయించబడ్డారని వాక్యము సెలవివ్వటములేదు. మొదట, వారు నిత్య జీవమునకై నిర్ణయింపబడ్డారు. ఆ తరువాత నమ్మే సామర్థ్యాన్ని సహితము దేవుడే ఇచ్చాడు.

"మీరు విశ్వాసము ద్వారా కృపచేతనే రక్షింపబడియున్నారు, ఇది మీ వలన కలిగినది కాదు, దేవుని వరమే, అది క్రియలవలన కలిగినది కాదు గనుక ఎవడును అతిశయపడ వీలులేదు." (ఎఫెసి 2:8,9)

ఈ విశ్వాసపువరము, కృపాకార్యమని ఈ వచనము స్పష్టముగా తెలియజేస్తుంది. ఆ కృపావరము ద్వారా మనము రక్షింపబడ్డాము. అది కృపావరము కాబట్టి, మన క్రియల ద్వారా మనము రక్షింపబడలేదు. ఎందుకంటే మన క్రియల ద్వారా రక్షింపబడితే పాపాత్ములైన మానవులు విఱ్ఱవీగి అతిశయ పడుతారు. ఈ విమోచన నా స్వార్జితమంటారు.

కాని, 'కృప' అంటే దేవుని నుండి పొందే 'అనర్హమైన దయ'. మానవునిలోని ఏదో ఒక అంతర్గత సద్గుణమును బట్టి, దేవుడు ఒక వ్యక్తికి విశ్వాసమును అనుగ్రహిస్తే, అది ఒకని స్వార్జితమవుతుందే గాని, అది కృప కాదు. దేవుని రక్షణార్థమైన ఎన్నిక, సంఘములో ఎవరు చేరతారు అనే ఆయన భవిష్యత్ జ్ఞానముపై కూడా ఆధారపడిలేదు. దానికి ప్రతిగా రక్షణ కొరకు నిర్ణయించిన వారిని దేవుడు తన సంఘములో చేర్చుచుండెను అని వాక్యము సెలవిచ్చుచున్నది. "మరియు ప్రభువు రక్షణ పొందుచున్న వారిని (మూలభాషలో- 'పొందవలసినవారిని') అనుదినము వారితో చేర్చుచుండెను." (అపొ.కా. 2:47,)

అపొ.కా. 2:47, కొందరు వ్యక్తులు సంఘములో చేరాలని నిర్ణయించుకున్నారు; తద్వారా దేవుడు వారిని రక్షించాడు అని సెలవివ్వడము లేదు. దీనికి విరుద్ధముగా, తాను రక్షింపనుద్దేశించినవారిని క్రీస్తు తన సంఘములో జతచేర్చుతూ వచ్చాడు అని సెలవిస్తుంది.

పాపముచేత మృతులై సంపూర్ణముగా అశక్తులైన మనుష్యలలో కొందరు ఆయనను ఎన్నుకుంటారని దేవుడు ముందుగానే చూసి, వారిని ఎన్నుకొన్నాడని బైబిలు బోధించుటలేదు.

"మీరు నన్ను ఏర్పరచుకొనలేదు; .....నేను మిమ్మును ఏర్పరచుకొని నియమించితిని" (యోహాను 15:16,) "మరియు ఆయన-తండ్రిచేత వానికి కృప అనుగ్రహింపబడకుంటే ఎవడును నా యొద్దకు రాలేడని....." (యోహాను. 6:65,) అనెను.

మరొక మాటలో చెప్పాలంటే, ఎన్నిక అంటే ఆమోదము కాదు. ఆయన కొరకైన ఆపేక్ష లేదా ఆయనయందలి విశ్వాసమును ఆమోదిస్తూ దానికి ఫలితముగా ఆయన మనలను ఏర్పరచుకోలేదు మీరు నన్ను కోరుకున్నారు కాబట్టి, దానిని ఆమోదించి మిమ్మును ఎన్నుకుంటున్నానని ఆయన చెప్పలేదు. అలాగే ఎన్నిక అంటే ఏరుకొనుట కాదు. ఎందుకంటే ఎంపిక చేసుకునేవి చాలా వుంటే వాటిలో శ్రేష్ఠమైనవి ఎన్నుకున్నప్పడు దానిని ఏరుకొనుట

అంటాము. ఉదా: మనము చక్కగా పండిన టమోటాలు ఏరుకుంటాము లేదా మనకు మంచి బేరము కుదిరిన మంచి కారునే ఎంపిక చేసుకుంటాము. దేవుడు మనలను ఏరుకోలేడు. మన ఎన్నిక విషయములో మనలోని ఏ మంచియు ప్రస్తావన లోనికి రాదు, దేవుడు కేవలము కృప చేతనే ఎన్నుకుంటాడు.

ఆర్మీనియన్లు, రోమా.8:29-30 కి సందర్భరహితంగా పెడార్థము చెబుతుంటారు. వారి వాదమే నిజమైతే పౌలు తనలో తానే విభేదించినట్లవుతుంది. ఇప్పడు మనము పౌలు వాదనను సందర్భసహితముగా అనుసరించి చూద్దాము.

1) రోమా.1:29-32 లో దేవునియందు ఎటువంటి ఆసక్తి లేకుండా మానవులు సంపూర్ణముగా పతనమైనవారని పౌలు సెలవిస్తున్నాడు. ఇదిలా వుండగా దేవుడు తన భవిష్యత్ జ్ఞానముతో వారికి ఆయనయందు ఎలాటి ఆసక్తియు లేదని చూస్తూనే, వారిలో కొందరు ఆయనపై ఆసక్తిని కనపరచి ఆయనను ఎన్నుకుంటారని ఎలా చూస్తాడు?

2) రోమా.2:11 లో దేవుడు మనుష్యుల విషయమై పక్షపాతి కాడని పౌలు సెలవిస్తున్నాడు. ఐతే అట్టి నిష్పక్షపాతియైన దేవుడు వారి వారి క్రియల ఆధారముగా మనుషులను ఎలా ఎన్నుకుంటాడు? అదే వాస్తవమైతే దేవుడు, క్రియల ఆధారముగా కొందరి పట్ల పక్షపాతము చూపుచూ తన మాటతో తానే విభేదిస్తున్నట్లు కాదా?

3) రోమా.3:9-18 లో 'నీతిమంతుడు ఒక్కడునూ లేడు. దేవుణ్ణి వెదకువారు ఒక్కరునూ లేరు' అని చెప్పబడింది. పౌలు ఇక్కడ వర్ణనాత్మకమైన పదజాలములను ఉపయోగించి మానవుల దుస్థితిని తెలియజేశాడు. 'వారందరు దారి వైదొలిగారు, బొత్తిగా చెడియున్నారు, మంచి చేయువాడొక్కడునూ లేడు. వారి గొంతుక తెరిచిన సమాధి వారి నాలుక మోసయుక్తమైనది. వారి పెదవులు విషయుక్తము. వారి నోటినిండా శాపము మరియు పగ ఉన్నాయి. రక్తము చిందించుటకై వారి పాదములు పరుగెడుతున్నాయి. వారి మార్గములో నాశనము దరిద్రత ఉన్నాయి. వారికి సమాధానమంటేనే తెలియదు. వారి కన్నుల యెదుట దేవుని భయము లేదు.'

ఇప్పడు, పౌలు ఇంతగా శ్రమ తీసుకొని మానవాళి యొక్క సహజస్థితిని వివరించాక, రోమా 8:29,30 ప్రకారము కొందరు విశ్వాసముంచుతారని, దేవుణ్ణి ఎన్నుకుంటారని లేదా దేవుడు వారిని రక్షించు విధంగా నీతిక్రియలు చేస్తారని ఎలా వాదిస్తాడు? అలాగే అయితే తనతో తాను పౌలు విబేధిస్తూ, తన వాదననే విస్మరించి, త్రోసిపుచ్చుతున్నాడు గదా, ఇలాంటి పరస్పర విరుద్ధ వ్యాఖ్యలు చేసినట్లయితే, పౌలు, సంఘము పరిగణించేంత గొప్ప వేదాంతి కాకపోవును. పరిశుద్ధాత్ముడు అలా వ్రాయిస్తే, గొప్ప తప్ప చేయించినవాడవుతాడు. ఆర్మీనియన్ వాదన ప్రకారము చూస్తే పౌలు గొప్ప గలిబిలి మరియు కలవరమును సృష్టించినవాడవుతాడు. ఇక్కడ 'ముందుగా ఎరుగు' అని అనువదించబడిన 'ప్రోగినెస్కో' అనే గ్రీకు పదము యొక్క అర్థము తెలియకపోవటమే ఆర్మీనియన్ల గలిబిలి వాదనకు కారణం. ప్రొగినెస్కో (గ్రీకు) = ముందుగా ఎరుగుట (తెలుగు). ఈ మాటలో రెండు ధాతువులున్నాయి.

ప్రొ (గ్రీకు) = ముందు

గినెస్కో (గ్రీకు)= ఎరుగుట

ఐతే ఇక్కడ గినెస్కో అను మాటనే మనము క్షుణ్ణముగా తెలిసికోవాలి లేఖనాలలో చూస్తే ఈ పదానికి అర్థము 'లోతైన అంతరంగిక అనుబంధమ'ని తెలుస్తుంది. ఈ 'అనుబంధపూర్వక ఎరుగుట' అనేది లోతైన వ్యక్తిగత ప్రేమనుండే పుడుతుంది. ఇట్టి సంబంధము లేఖనమందంతటా నిర్వచించబడింది. ఉదా: "ఆదాము తన భార్యయైన హవ్వను "కూడినప్పడు" ఆమె గర్భవతియై కయీనును కని........ (ఆది.4:1,) "కూడినప్పడు" అనే మాటకు ఇక్కడ "గినెస్కో" అనే పదమే వాడబడినది. ఐతే ఆదాము తన భార్యను కేవలము కూడుకుని వ్యక్తిగతముగా తెలుసుకున్నాడని కాదు ఇక్కడ అర్థము. వారు లోతైన వ్యక్తిగత అనుభవపూర్వక అనుబంధము కలిగియున్నారని దాని భావము.

ఆది. 19:8 (లోతు చెప్పెను), ఇదిగో పురుషులు "కూడని" (ఇక్కడ మరలా గినెస్కో అనే పదమే వాడబడింది)

ఇద్దరు కుమార్తెలు నాకున్నారు.

ఆ అమ్మాయిలు లోతను ఎరుగుదురు. పురుషులు అంటే కూడా ఎరుగుదురు. వారికి వారి సహోదరులు కూడా ఉండేవారు వారి జాతి ప్రజలతో వారి పరిచితులుగా ఉండేవారు. కాని లైంగిక సంబంధము విషయములో మాత్రము ఎవరిని ఎరుగని కన్యకలు వారు. ఆమోసు.3:2 లో భూమి మీద సకల వంశములలోను మిమ్మును మాత్రమే నేను "ఎరిగియున్నాను" అని దేవుడు సెలవిచ్చెను. ఇక్కడ కూడా 'ఎరిగియున్నాను' అనే మాటకు గినెస్కో అను పదము వాడబడినది.

ఐతే, దేవుడు, సర్వజ్ఞుడైయుండి, భూగ్రహము మీద ఉన్నవారందరిని క్షుణ్ణముగా ఎరిగినవాడైయున్నాడు. కాని వివాహబంధమును పోలిన సన్నిహిత సంబంధమును కేవలము ఇశ్రాయేలు ప్రజలతో మాత్రమే కలిగియుండేవాడు. "మరియు (యోసేపు) ఆమె కుమారుని కనువరకు ఆమెను 'ఎరుగకుండెను' (గినెస్కో), అతడు ఆ కుమారునికి యేసు అను పేరు పెట్టెను" (మత్తయి.1:25,).

యోసేపు మరియతో ఎంతో చనువుగా ఉండేవాడు. వారు వివాహము కొరకు ప్రధానము చేయబడ్డారు. అయితే ఆమె కుమారుని కనేంతవరకు వారు లైంగిక సంపర్కమునకు దూరముగా ఉండేవారు. , "ప్రభువా, ప్రభువా, అని నన్ను పిలుచు ప్రతివాడును పరలోక రాజ్యములో ప్రవేశింపడుగాని పరలోకమందున్న నా తండ్రి చిత్త ప్రకారము చేయువాడే ప్రవేశించును ఆ దినమందు అనేకులు నన్ను చూచి ప్రభువా, ప్రభువా, మేము నీ నామమున ప్రవచింప లేదా? నీ నామమున దయ్యములను వెళ్లగొట్ట లేదా? నీ నామమున అనేకమైన అద్భుతములు చేయలేదా? అని చెప్పదురు. అప్పుడు, నేను మిమ్మును ఎన్నడును 'ఎరుగను' (గినెస్కో). అక్రమము చేయువారులారా, నా యొద్దనుండి పొండని వారితో చెప్పుదును" (మత్తయి.7:21-23).

రక్షణ పొందుటకు ఎన్నో గొప్ప కార్యాలు చేయాలని భావించే వారితో యేసు ఈ మాటలు చెబుతున్నాడు. వారిని ఎన్నడుకూడా సాన్నిహిత్యంగా ఎరుగనని ఆయన వెళ్లగొట్టాడు. అనుభవపూర్వక ప్రేమబాంధవ్యము అసలే లేదని వెళ్లిపొమ్మన్నాడు. గమనించండి, ఒకవేళ వారి క్రియలు/చర్యల ఆధారముగా దేవుడు ప్రజలను రక్షింపదలిస్తే, పైన పేర్కొనబడిన ప్రజలు తప్పకుండ దేవుని రక్షణకు, ఎన్నికకు అర్హులు అవుతారు.

అయితే ఏవరితో ఆయన ప్రేమపూర్వక అనుబంధమును కలిగివుండెనో వారినే తన కుమారుని యొక్క స్వారూప్యము గలవారగుటకు ముందుగా నిర్ణయించెను.

## ఎన్నిక ఎప్పుడు జరిగింది?

వారు మారుమనస్సు పొందే సమయములో దేవుడు వారిని ఎన్నుకుంటాడా? పాపులు దేవుని వెంబడించతీర్మానించి ఆ తీర్మాన ఫలితముగా 'ఎన్నిక'ను సంపాదించుకుంటారా? అసలు ఈ ప్రక్రియలో మనము పాలు కలిగియున్నామా? "ఎట్లనగా తన ప్రియునియందు తాను ఉచితముగా మనకు అనుగ్రహించిన తన కృపా మహిమకు కీర్తికలుగునట్లు తన చిత్త ప్రకారమైన దయా సంకల్పము చొప్పున యేసుక్రీస్తు ద్వారా తనకు కుమారులనుగా స్వీకరించుటకై మనలను ముందుగా తనకోసము నిర్ణయించుకొని మనము తనయెదుట పరిశుద్ధులమును నిర్దోషులమునైయుండవలెనని జగత్తు పునాది వేయబడు మునుపే, ప్రేమచేత ఆయన క్రీస్తులో మనలను ఏర్పరచుకొనెను" (ఎఫెసి. 1:4,).

"మరియు క్రీస్తునందు ముందుగా నిరీక్షించిన మనము తన మహిమకు కీర్తి కలుగజేయవలెనని దేవుడు తన చిత్త ప్రకారమైన సంకల్పమును బట్టి మనలను ముందుగా నిర్ణయించి...." (ఎఫెసి.1:11,).

విశ్వములోని మొదటి కణమును కూడా సృష్టించక మునుపే, ఆయన ప్రేమచేత రక్షించబడవలసిన వారిని నిర్ణయించియున్నాడు. ఇదంతా మరింత పటిష్ఠము చేయుటకు గాను గొఱ్ఱెపిల్ల జీవగ్రంథములో వీరి పేర్లన్నియు ఆయన లిఖించాడు. ఎన్నుకోబడ్డ వారి పేర్లన్నియు గ్రంథస్థం చేయబడ్డాయి.

నిత్యజీవ గ్రంథము యొక్క విషయము లేఖనాలలో అనేక మార్లు ప్రస్తావించబడింది. ఉదా: లూకా.10:20,లో

"అయినను దయ్యములు మీకు లోబడుచున్నవని సంతోషింపక మీ పేరులు పరలోకమందు వ్రాయబడియున్నవని సంతోషించుడని యేసు శిష్యులతో చెప్పెను".

"ఆ కాలమందు నీ జనుల పక్షమున నిలుచునట్టి మహాధిపతియగు మిఖాయేలు వచ్చును. అప్పుడు నీ జనులు రాజ్యముగా కూడిన కాలము మొదలుకొని యీ కాలము వరకు ఎన్నటికిని కలుగనంత ఆపద కలుగును; అయితే నీ జనులలో గ్రంథమునందు దాఖలైన వారెవరో వారు తప్పించుకొందురు"(దాని.12:1).

"ఎవని పేరైనను జీవ గ్రంథమందు వ్రాయబడినట్టు కనబడనియెడల వాడు అగ్నిగుండములో పడవేయబడును" (ప్రక.20:15,). గనుక ఇక్కడ అడగవలసిన చక్కటి ప్రశ్న : ఇంత ప్రాముఖ్యతగల ఈ గ్రంథము ఎప్పుడు వ్రాయబడింది?

"నీవు చూచిన ఆ మృగము ఉండెను. గాని యిప్పుడు లేదు; అయితే అది అగాధ జలములలో నుండి పైకి వచ్చుటకును నాశనమునకును పోవుటకును సిద్ధముగా ఉన్నది. భూ నివాసులలో జగదుత్పత్తి మొదలుకొని జీవగ్రంథమందు ఎవరి పేరు వ్రాయబడలేదో వారు ఆ మృగముండెను గాని యిప్పుడు లేదు. అయితే ముందుకు వచ్చుచున్న సంగతి తెలిసికొని ఆశ్చర్య పడుదురు" (ప్రకటన.17:8,).

దేవుడు భూమిని సృష్టింపక మునుపే ఈ 'భేషరతు ఎన్నిక' చేసాడు. మనుష్యుని సృష్టింప దేవుడు నిర్ణయించినప్పుడే ఎవరెవరిని ఆయన కుమారునికి స్వాస్థ్యముగా ఇస్తానని వాగ్దానము చేసాడో వారి పేర్లు గ్రంథస్తము చేసాడు. అప్పటినుండి ఆయన తన మాటను నిలబెట్టుకునే ప్రక్రియకు నాంది పలికాడు.

**ఆది నుండి.................**

ముందుగా తెలిపిన ప్రకారము, కోరి ఎన్నుకోవడము దేవుని గుణలక్షణము కాబట్టి, ప్రారంభము నుండి దేవుని ఎన్నికకు నిదర్శనములు మనము లేఖనాలలో కనుగొన గలుగాలి; అలాగే కనుగోటం కూడా.

ఆదాము హవ్వలు తిరుగబడిన తర్వాత వారు దిగంబరులని తెలిసి సిగ్గుపడ్డారు. ప్రభువైన దేవుడు ఏదేను తోటలోనికి చల్లపూట వచ్చినప్పుడు ఆయన స్వరము విని వారు దాగుకున్నారు. దేవుడు వారి అవిధేయతను క్షుణ్ణముగా ఎరిగినవాడు. దేవుడు వారిని వెదక్కుంటూ రావడానికి బద్దుడేమి కాదు. దేవుడు వారిని దాటి వెళ్లియుండవచ్చును. కాని ఆయన వారిని ఎదుర్కొన సంకల్పించాడు. రాబోయే గొఱ్ఱెపిల్లబలి, పాపాలను కప్పతుందను దానికి ఛాయగా ఆయన ఎంతో కరుణతో వారికి చర్మపు చొక్కాయిలు తయారుచేశాడు.

"నీ సంతానమునకును, స్త్రీ సంతానమునకును వైరము కలుగజేసెదను" అని సర్పమును ఎదుర్కొని దేవుడు చెప్పాడు (ఆది.3:15). దేవుడు మానవాళినంతటిని రెండు గుంపులుగా విభజించాడు. ఒకటి స్త్రీ సంతానము. మరొకటి సర్పసంతానము. వారిరువురి మధ్య వైరమును పెట్టాడు. స్త్రీ సంతానమైన క్రీస్తును, ఆయన వారసులను దేవుడు దీవించాడు. దుష్టుడిని, దుష్టుని సంతానమును ఆయన శపించాడు. అయితే, ప్రాముఖ్యముగా గమనించాల్సిన విషయమేమిటంటే కయీను మరియు హేబేలు వారి ప్రథమ సంతానములను కనక మునుపే ఓ విభజన రేఖను దేవుడు గీశాడు.

కయీను, హేబెలు ఇరువురును ఒకే వాతావరణములో పెంచబడినా వారు, వేరు వేరు బలులను దేవుని కర్పించారు. కయీను తన కష్టార్జితమైన భూఫలములను తీసికొని వచ్చాడు. హేబెలు తన మందలోని ప్రథమ గొఱ్ఱెపిల్లను రక్తబలిగా అర్పించాడు.

"హేబెలు కూడా తన మందలో తొలిచూలున పుట్టిన వాటిలో క్రొవ్విన వాటిని కొన్ని తెచ్చెను. యెహోవా హేబెలును అతని యర్పణను లక్ష్యపెట్టెను. కయీనును అతని యర్పణను ఆయన లక్ష్య పెట్టలేదు. కాబట్టి, కయీనుకు మిక్కిలి కోపము వచ్చి అతడు తన ముఖము చిన్నబుచ్చుకొనగా" (ఆది.4:4-5,).

కాబట్టి, కయీను హేబెలును సంహరించాడు. ఈ రెండు అర్పణలను దేవుడు ఒకేలా ఎందుకు స్వీకరించలేదు?

దేవుడు అతనిని ఎన్నుకొనెను. ఈ ఎన్నిక వీరిరువురి క్రియల ఆధారమే అని వాదించుటకు తావు లేకుండునట్లు " క్రియల మూలముగా కాక పిలుచు వాని మూలము గానే"అని పౌలు స్పష్టము చేయుచున్నాడు. అదే విధంగా దేవుడు తన ప్రేమను, ద్వేషమును గురించిన ప్రస్తావన భూత కాలములో వ్యక్తపరుచటను గమనించండి. ఇవన్నియు దేవుడు ముందుగా నియమించి నిర్ణయించిన విషయములే.

యాకోబు యొక్క పేరు ఇశ్రాయేలుగా మార్చబడ్డాక, పండ్రెండు మంది కుమారులను  కన్నాడు. యోసేపు కనిష్ఠ కుమారులలో ఒకడు  యోసేపు సహోదరులు అతని విషయమై అసూయ పడ్డారు. తన సహోదరులు అతనికి సాగిలపడతారనే విషయాన్ని తెలిపే కలను దేవుడు యోసేపు కిచ్చాడు. అతని సహోదరులు అతనిని  చంపనుద్దేశించి బానిసగా అమ్మివేసారు. ఐగుప్తులో యోసేపు ఓ గొప్ప అధికారి అయ్యేంతవరకూ దేవుడు వారి జీవిత సంఘటనలన్నిటిని అదుపు చేసి నిర్దేశించాడు.  దేవుడు రప్పించిన కరువులో యోసేపు సహోదరులు అలమటించారు. తప్పనిసరిగా యోసేపు సహోదరులు అతనికి సాగిలపడి అతని దయను పొందారు. ఈ కనిష్ఠ కుమారుడు ఇంతగా ఎందుకు హెచ్చింపబడ్డాడు?  దేవుని 'సార్వభౌమ్య ఎన్నిక'కు ఇది మరొక చక్కని తార్కాణం.

ఈ యాకోబుయొక్క పన్నెండు మంది కుమారులు, ఇశ్రాయేలీయుల పండ్రెండు గోత్రములుగా నామకారులయ్యారు. దేవుడు అన్ని దేశాలలోకెల్లా, జాతులలోకెల్లా, వారిపై దయను కురిపించాడు. " నీవు నీ దేవుడైన యెహోవాకు ప్రతిష్ఠిత జనము, నీ దేవుడైన యెహోవా భూమి మీదనున్న సమస్త జనములకంటే నిన్ను ఎక్కువగా ఎంచి, నిన్ను తనకు స్వకీయ జనముగా ఏర్పరచుకొనెను ". (ద్వితి 7:6 ). " అయినను నా సేవకుడగు యాకోబు నేను ఏర్పరచుకొనిన ఇశ్రాయేలూ, వినుము నిన్ను  సృష్టించి గర్భములో నిన్ను నిర్మించి నీకు సహాయము చేయువాడైన యెహోవా ఈలాగు  సెలవిచ్చుచున్నాడు. నా సేవకుడగు యాకోబు, నేను ఏర్పరచుకొనిన యెషూరూనూ, భయపడకుము." ఇశ్రాయేలీయుల మధ్యన పరిచారకులుగా ఉండు నిమిత్తము లేవియుల వంశమును దేవుడు ఎన్నుకొన్నాడు." (యెష 44:1,2)  "నిత్యము యెహోవా నామమున నిలిచి సేవ చేయుటకు నీ గోత్రము లన్నిటిలోను అతనిని అతని సంతతి వారిని నీ దేవుడైన యెహోవా ఏర్పరచుకొనియున్నాడు." (ద్వితియో 18:5)

ఇశ్రాయేలీయుల నిమిత్తము దేవుడు దావీదును రాజుగా ఎన్నుకొన్నాడు.  " గర్భమునుండి నన్ను తీసిన వాడవు నీవేగదా నేను నా తల్లి యొద్ద స్తన్య పానము చేయుచుండగా నీవే గదా నాకు నమ్మిక పుట్టించితివి. గర్భవాసినైనది మొదలుకొని నాకు ఆధారము నీవే నా తల్లి నన్ను కన్నది మొదలుకొని నా దేవుడవు నీవే".(కీర్తన 22:9-10)"తన దాసుడైన దావీదును కోరుకొని గొఱ్ఱెల దొడ్లలోనుండి అతనిని పిలిచెను." (కీర్తన 78:70) దావీదు సేవకుడు కాబట్టి, దేవుడు ఆయనను ఏర్పరచుకొనలేదు . కానీ ఆయన తన తల్లి గర్భములో ఉన్నప్పుడే దేవుని సేవకునిగా ఉండు నిమిత్తము ఎన్నుకోబడ్డాడని ఈ రెండు వచనాలు తెలియజేస్తున్నాయి.

దేవుడు ప్రవక్తలను ఎన్నుకొనియున్నాడు. దేవుడు రాజులను ఎన్నుకున్నాడు. యుద్ధమందు విజయులను దేవుడు ఎన్నుకొన్నాడు. ప్రతి హెబ్రీ శిశువును చంపమని ఫరో ఆజ్ఞాపించాడు కానీ - మోషే ఫరో రాజమందిరమునకు తరలింప బడ్డాడు. అది దేవుని 'సార్వభౌమ కృప' కాదని ఎవరైనా చెప్పగలరా?

భూమి మీద పరిచర్య చేస్తున్న రోజులలో క్రీస్తు కూడా తన 'సార్వభౌమ అధికారం' చొప్పన కొందరిని ఎన్నుకొనినట్లుగా మనము చూడగలము. ఉదాహరణకు, ఆయనను అప్పగించువానితో కలిపి యేసు పండ్రెండుగురిని ఎన్నుకున్నాడు. "అందుకు యేసు - నేను మిమ్మును పండ్రెండుగురిని ఏర్పరచుకొనలేదా? మీలో ఒకడు సాతాను అని వారితో చెప్పెను. సీమోను ఇస్కరియోతు కుమారుడైన యూదా పండ్రెండు మందిలో ఒకడైయుండి ఆయన నప్పగింపబోవు చుండెను గనుక వాని గూర్చియే ఆయన ఈ మాట చెప్పెను" (యోహాను 6:70,71).

యేసు బేతెస్థ కోనేరు దగ్గరకు వచ్చినప్పుడు, అక్కడ వందల కొలదీ రోగగ్రస్తులు, గుడ్డి మరియు

కుంటివారున్నారు. దేవదూత చేత నీళ్ళ కదల్చబడినప్పుడు కోనేటిలో మొదట దిగిన వాని వ్యాధి నయమవుననే నమ్మకముతో వారందరూ ఎదురు చూస్తున్నారు (యోహాను 5వ అధ్యాయము). కానీ 38 సంవత్సరాలుగా రోగగ్రస్తుడైన ఆ ఒక్క ఫలానా రోగి దగ్గరకు మాత్రమే యేసు వెళ్లాడు, అతనిని బాగు పరిచాడు. అక్కడ ఎంతో మంది అదే దుస్థితిలో ఉన్నా బాగు చేయుటకు ఒక్కడిని మాత్రమే ఎన్నుకున్నాడు. మరొక సందర్భములో యేసు శిష్యులు, ఆయన ఉపమానరీతిగా ఎందుకు బోధించుచున్నాడని అడిగారు "అందుకాయన - దేవుని రాజ్యమర్మము (తెలిసికొనుట) మీకు అనుగ్రహింపబడియున్నది గాని వెలుపలనుండువారు ఒకవేళ దేవుని వైపు తిరిగి పాప క్షమాపణ పొందుదురని, వారు చూచుటకైతే చూచియు కనుగొనకను, వినుటకైతే వినియు గ్రహింపకయు నుండుటకును అన్నియు ఉపమానరీతిగా వారికి బోధింపబడుచున్నవని వారితో చెప్పెను (మార్కు4:11,12) . యేసు ప్రతిఒక్కవ్యక్తికి తనను తాను ప్రత్యక్షపరచనుద్దేశించలేదని తప్ప మరే విధముగానైనను ఈ వ్యాక్య భాగమును అర్థము చేసుకొనుట సాధ్యం కాదు. దేవుడు తాను ఎన్నుకొనిన వారికి సత్యమును గ్రహించు శక్తి కూడా అనుగ్రహించాడు. అయితే ఎన్నుకొనబడని వారికి పరలోక సత్యములు మరుగు చేయబడులాగున అనగా వారు తమ బుద్ధికుశలతను ఉపయోగించి వాటిని గ్రహించి పశ్చాత్తాపపడి ఆయనను వారిని క్షమించబద్ధునిగా చేయకుండునట్లు వారికి ఉపమానరీతిగా బోధించెను. అనేక మంది చనిపోయి సమాధులలో వున్నప్పటికీ కేవలం లాజరును మాత్రమే బ్రతికించడానికి యేసు ఎందుకు ఎన్నుకొన్నాడు? అది ఆయన 'సార్వభౌమ్య అభీష్టం' కనుక. కుష్ఠరోగముతో బాధపడుచున్నవారు అనేకమంది వున్నప్పటికీ, స్వస్థపరచుటకు కేవలం పది మందిని మాత్రమే ఎందుకు ఎన్నుకొనినట్టు? అది ఆయన సార్వభౌమ అభీష్టం కనుక. యేసు గెరాసేనుల ప్రాంతమునకు వచ్చినప్పుడు, పందులలోనికి వెళ్లుటకు అనుమతి నిమ్మని సేన దయ్యము వేడుకొనగా యేసు ఆ విన్నపాన్ని మన్నించాడు (మార్కు 5:13), ఎందుకని? అది కూడా ఆయన అభీష్టం కాబట్టి.

క్రీస్తును అనుసరించుటకైన పిలుపు ప్రపంచమంతటికి అందించబడినను, ప్రత్యేకంగా ఎన్నుకొనబడినవారు మాత్రమే ఆ పిలుపుకు స్పందిస్తారు. మత్తయి 20:16 " ఈ ప్రకారమే కడపటివారు మొదటి వారగుదురు, మొదటివారు కడపటి వారగుదురు." ఎందుకనగా ఏర్పరచబడినవారు కొందరే.

## క్రీస్తు కేంద్రితము

అతిగొప్పదైన గంభీరమైన 'దేవుని ఎన్నిక' ఆయన దయగల కుమారునియందు కనపరచబడినది. ఈ సిద్ధాంతపు సౌందర్యత ఇందులోనే దాగియున్నది. ఈ సిద్ధాంతము పూర్తిగా క్రీస్తు కేంద్రితము. క్రీస్తునే కేంద్రముగా చేసుకొని, ఇది ఆయన చుట్టే పరిభ్రమిస్తుంది. క్రీస్తు దేవునిచేత ఎన్నుకొనబడ్డాడు. "ఏలయనగా, ఇదిగో నేను ముఖ్యమును ఏర్పరచుకొనబడినదియు అమూల్యమునగు మూల రాతిని సీయోనులో స్థాపించుచున్నాను. ఆయనయందు విశ్వాసముంచు వాడు ఏ మాత్రమును సిగ్గుపడడు" (1 పేతురు 2:6 ). యెషయా 42వ అధ్యాయము పాత నిబంధనలోనే మెస్సీయాను గూర్చిన చాలా చక్కటి అధ్యాయము. ఇది ఇలా ప్రారంభమవుతుంది, "ఇదిగో నేను ఆదుకొను నా సేవకుడు నేను ఏర్పరచుకొనినవాడు నా ప్రాణమునకు ప్రియుడు. అతనియందు నా ఆత్మను ఉంచియున్నాను. అతడు అన్యజనులకు న్యాయము కనుపరచును". ప్రకటన 13:8లో భూమి పునాదులు వేయబడక మునుపే వధింపబడిన దేవుని గొఱ్ఱెపిల్లయని క్రీస్తుకు బిరుదు ఇవ్వబడినది. ఆయన ప్రథమ పునరుత్థాన ఫలము (1కొరింథీ 15: 20,21). మెస్సీయాగాను క్రీస్తు (అభిషిక్తుని) గాను దేవుని చేత ఎన్నుకోబడినవాడు. దేవునిచేత ఎన్నుకోబడిన విశ్వాసులమైన మనకు, మన ఎన్నికకు ఆధారము క్రీస్తు లోనే ఉన్నది. పేతురు సంఘానికి వ్రాస్తు వారిని ఇలా సంబోధించాడు, "దేవుని భవిష్యత్ జ్ఞానమును బట్టి, ఆత్మవలని పరిశుద్ధత పొందినవారై విధేయులగుటకును, యేసుక్రీస్తు రక్తము వలన ప్రోక్షింపబడుటకును ఏర్పరచబడిన వారికి...... కృపయు సమాధానమును విస్తరిల్లును గాక" ఏర్పరచబడ్డ దేవుని సేవకుని రక్తము ద్వారా రక్షణ ప్రణాళిక ముగించబడి విమోచన, పరిశుద్ధ పరచబడుట మనకు అనుగ్రహింపబడ్డాయి (1 పేతురు 1:2.).

### ఎన్నిక యొక్క గుణలక్షణములు

పైన ప్రతిపాదించినదంతయు వాస్తవమైనదైతే, దేవునిచే ఎన్నుకోబడినవారికి తగిన ప్రయోజనాలు, నిదర్శనాలు తప్పకుండా వుండాలి కదా. ఖచ్చితముగా లేఖనాలలో ఇట్టి ప్రయోజనాలు, నిదర్శనాలు ఎన్నో ఉన్నాయి.

### ఉదాహరణకు:

1) ఒకసారి దేవుని ఎన్నికార్థమైన కృపాసిద్ధాంతాన్ని మనం గ్రహించగలిగితే మన రక్షణసంపాదనాసంబంధ క్రియల భారముతో మనము క్రుంగిపోము. ఎందుకంటే మన ఎన్నికకు క్రియలు ఆధారము కావు. ఇది మనము తెలుసుకోదగిన ప్రాముఖ్య విషయము. మన క్రియలు మరియు ప్రయత్నముల ద్వారా మన రక్షణను మనము సాధించలేము. అయినను దేవుని ఎన్నిక సత్క్రియలను కొట్టి వేయదు. దేవుడు మనలను ఏర్పరచుకున్నాడు అను వాస్తవానికి ప్రతిస్పందనగా సత్క్రియలు మనం చేస్తాము. మన ఎన్నికకు అంతిమకారకము మన మంచిక్రియలు కానేకావు. మన మంచిక్రియలకు కూడా దేవుడే ఆధారం కాబట్టి రక్షణ ఏ విధంగా చూసినా సరే దేవుని కార్యమే. ఆయనను మహిమపరచి ప్రతిబింబించే విధంగా సత్ క్రియలు జరిగించుటకు దేవుడు తన ప్రజలను ఎన్నుకున్నాడు. ఇది ఆయనకు మహిమకరం; మనకు శ్రేయస్కరము. " మీరు నన్ను ఏర్పరచుకొనలేదు మీరు నా పేరట తండ్రిని ఏమి అడుగుదురో అది ఆయన మీ కనుగ్రహించు నట్లు మీరు వెళ్లి ఫలించుటకును మీ ఫలము నిలిచియుండుటకును నేను మిమ్మును ఏర్పరచుకుని నియమించితిని" (యోహాను 15:16 ). "మరియు వాటియందు మనము నడచుకొనవలెనని దేవుడు ముందుగా సిద్ధపరచిన సత్క్రియలు చేయుటకై, మనము క్రీస్తు యేసునందు సృష్టింపబడిన వారమై ఆయన చేసిన పనియైయున్నాము (ఎఫెసీ 2:10) .

2) దేవుడు చరిత్రను నియంత్రిస్తాడు మరియు ఆయన లోకమునకు ఉగ్రత తీర్పు తీర్చినపుడు ఆయన ఎన్నుకున్న

వారి నిమిత్తమై ఉగ్రత వ్యవధిని పరిమితము చేస్తానని వాగ్దానం చేసాడు. "ఆ దినములు తక్కువచేయబడక పోయినయెడల ఏ శరీరియు తప్పించుకొనడు. ఏర్పరచబడిన వారి నిమిత్తము ఆ దినములు తక్కువ చేయబడును" (మత్తయి 24:22)

3) అబద్ధ ప్రవక్తలు వారిని పెడత్రోవ పట్టించకుండునట్లు ఎన్నుకోబడిన వారిని ఆయన భద్రపరుస్తాడు. "అబద్ధపు క్రీస్తులును అబద్ధపు ప్రవక్తలును వచ్చి, సాధ్యమైతే ఏర్పరచబడిన వారిని సహితము మోసపరచుటకై గొప్ప సూచక క్రియలు మహత్కార్యములను కనబరచెదరు." (మత్తయి 24:24)

4) ఎన్నుకొనబడినవారు పరలోకములోనుందురు. క్రీస్తు భూమి మీద తీర్పు తీర్చుటకు వచ్చినప్పుడు ఎన్నుకొనబడినవారు ఆయనతో వచ్చెదరు.

"మరియు ఆయన గొప్ప బూరతో తన దూతలను పంపును. వారు ఆకాశము యొక్క ఈ చివరినుండి ఆ చివర వరకూ నలు దిక్కుల నుండి ఆయన ఏర్పరచుకొనినవారిని పోగు చేయుదురు" (మత్తయి.24:31,).

"వీరు గొఱ్ఱెపిల్లతో యుద్ధము చేతురు గానీ, గొఱ్ఱెపిల్ల ప్రభువులకు ప్రభువును రాజులకు రాజునై యున్నందున, తనతో కూడా ఉండినవారు పిలువబడినవారై, యేర్పరచబడినవారై నమ్మకమైన వారై యున్నందునను, ఆయన ఆ రాజులను జయించును"(ప్రకటన.17:14),.

5) దేవుడు, తాను ఎన్నుకొనిన వారి పక్షమున పోరాడి వారికి న్యాయమిచ్చును.

"దేవుడు తాను ఏర్పరచుకొనిన వారు దివారాత్రులు తన్నుగూర్చి మొఱ్ఱపెట్టుకొనుచుండగా వారికి న్యాయము తీర్చడా?" (లూకా.18:7)

"వారు కట్టుకొన్న యిండ్లలో వేరొకరు కాపురముండరు వారు నాటుకున్న వాటిని వేరొకరు అనుభవింపరు. నా జనుల ఆయుష్యము వృక్షాయుష్యమంతగును. నేను ఏర్పరచుకొనిన వారు తాము చేసికొనినదాని ఫలమును పూర్తిగా అనుభవింతురు. వారు వృథాగా ప్రయాసపడరు ఆకస్మికముగా కలుగు అపాయము నొందుటకై పిల్లలను కనరు. వారు యెహోవా చేత ఆశీర్వదించబడిన వారగుదురు. వారి సంతానపు వారు వారి యొద్దనే యుందురు. వారికీలాగున జరుగును వారు వేడుకొనకమునుపు నేను ఉత్తరమిచ్చెదను. వారు మనవి చేయుచుండగా నేను ఆలకించెదను"(యెషయా.65:22,24,) .

6) దేవుడు, తాను ఎన్నుకోబడినవారిని నీతిమంతులుగా తీర్చగా వేరెవరునూ వారిని ఖండింపలేరు".

"దేవుని చేత ఏర్పరచబడినవారి మీద నేరము మోపువాడెవడు? నీతిమంతులనుగా తీర్చువాడు దేవుడే' ('రోమా.8:33,).

7) పాపయుక్తమైన లోకమువలెకాక, దేవుని గుణగణాలను ప్రతిబింబింపజేసే విధంగా ఎన్నుకొనబడినవారి నడవడి, ప్రవర్తన మారుతుంది. "కాగా దేవుని చేత ఏర్పరచబడినవారును పరిశుద్ధులును ప్రియులైనవారికి తగినట్లు, మీరు జాలిగల మనస్సును, దయాళుత్వమును, వినయమును, సాత్వికమును, దీర్ఘశాంతమును ధరించుకొనుడి. ఎవడైననూ తనకు హాని చేసెనని ఒకడు అనుకొనినయెడల ఒకనికొకడు సహించుచు, ఒకనినొకడు క్షమించుడి. ప్రభువు మిమ్మును క్షమించియున్నలాగున మీరును క్షమించుడి" (కొలొస్సీ.3:12,13).

8) ఎన్నుకొనబడినవారు రక్షింపబడే విధముగా, బోధించుటకు దేవుడు పరిచారకులను పంపుతాడు.

"అందుచేత ఏర్పరచబడినవారు నిత్యమైన మహిమతో కూడా క్రీస్తు యేసునందలి రక్షణ పొందవలెనని నేను వారి కొరకు సమస్తమును ఓర్చుకొనుచున్నాను" (2 తిమోతి 2:10,).

9) పరలోకములో లూసిఫరు దేవునిపై తిరుగబడినప్పుడు, తిరుగుబాటులో చేరని దూతలను దేవుడు తన దయగల ఎన్నిక ద్వారా భద్రపరిచాడు.

"విరోధ బుద్ధితోనైన పక్షపాతముతోనైన ఏమియు చేయక నేను చెప్పిన ఈ సంగతులను గైకొనవలెనని దేవుని యెదుటను, క్రీస్తు యెదుటను, ఏర్పరచబడిన దూతల యెదుటను నీకు ఆనబెట్టుచున్నాను" (1 తిమోతి.5:21,).

10) ఎన్నుకొనబడినవారికి, యేసుక్రీస్తునందలి విశ్వాసము, సువార్త సత్యముల యొక్క గ్రహింపు, నిత్యజీవపు నిరీక్షణ మున్నగునవి అనుగ్రహించబడ్డాయి.

"దేవుడు ఏర్పరచుకొనినవారి విశ్వాసము నిమిత్తమును, నిత్యజీవమును గూర్చిన నిరీక్షణతో కూడిన భక్తికి ఆధారమగు సత్యవిషయమైన అనుభవ జ్ఞానము నిమిత్తమును, దేవుని దాసుడును యేసుక్రీస్తు అపొస్తలుడైన పౌలు, మనయందలి విశ్వాస విషయములో నా నిజమైన కుమారుడైన తీతునకు శుభమని చెప్పి వ్రాయునది. ఆ నిత్యజీవమును అబద్ధమాడనేరని దేవుడు అనాది కాలమందే వాగ్ధానము చేసెను" (తీతు.1:1).

నిత్యజీవపు నిరీక్షణ దేవుడు ఎవరికి వాగ్ధానము చేశాడు? ఏర్పరచుకొనబడినవారికి మాత్రమే!

## దాటిపోవుట / తృణీకరించుట

ఇది నేరుగా మన అంశము కాకపోయినా, 'భేషరతు ఎన్నిక' సిద్ధాంతములో వివక్షితమై అతిగా అపార్థము చేయబడు 'దాటిపోవుట/తృణీకరించబడుట' అనే ఈ విషయాన్ని ఇక్కడ ప్రస్తావించబడటము ఎంతో అవసరము. మానవాళి బుద్ధిపూర్వకముగా నరకమువైపు పరిగెడుతుండగా 'అగ్నిమంటల్లోని నుండి తప్పించుటకు కొందరిని మాత్రమే' ఆయన  ఎన్నుకుంటే, తక్కినవారిని నాశనమునకు విడిచిపెట్టినట్లే గదా?

ఈ సిద్ధాంత విమర్శకులు తరచుగా ఇట్లు వాదన చేస్తుంటారు. వారి వాదనాంశమేమనగా, 'ఒకవేళ పాపులను రక్షించే శక్తి దేవునికి వుంటే, ఆయన అందరినెందుకు రక్షింపడు? కొందరినే ఎన్నుకుంటే అది న్యాయము కాదు'. క్రూరమైన విధానములో దేవుడు కొందరిని నరకానికి విధించి పంపడమేమిటని చారిత్రాత్మక కాల్విన్ వాద విమర్శకులు అంటుంటారు. ఈ విధముగా ఈ కాల్విన్ వేదాంతము దేవునిని క్రూరునిగా చిత్రికరించుచున్నదని వారంటారు.

కాబట్టి దీనిని తిరస్కరించవలెనని వారు వాదిస్తారు. అటువంటి ఉద్వేగభరిత వాదనలకు జవాబు: అవును, రక్షణ ఎన్నుకొనబడినవారికే. మిగిలిన వారిని దేవుడు దాటిపోవును/తృణీకరించును. కానీ ఇందులో దేవునిని నిందించకుండా మనము జాగ్రత్త పడాలి. ఈ విషయమై అపొస్తలుడైన పౌలు ఒప్పించే విధంగా ఇలా వాదించాడు.

"కావున ఆయన ఎవరిని కనికరింపగోరునో వానిని కరుణించును. ఎవనిని కఠినపరచగోరునో వానిని కఠిన పరచును. అట్లయితే ఆయన చిత్తమును ఎదిరించిన వాడెవడు? ఆయన ఇకను నేరము మోపనేల అని నీవు నాతో చెప్పదువు. అవును గాని ఓ మనుషుడా, దేవునికి ఎదురు చెప్పటకు నీవెవడవు? నన్నెందుకు ఈలాగు చేసితివని రూపింపబడినది రూపించిన వానితో చెప్పనా? ఒక ముద్దలోనుండియే ఒక ఘటము ఘనతకును ఒకటి ఘనహీనతకును చేయుటకు మంటి మీద కుమ్మరి వానికి అధికారము లేదా? అలాగు దేవుడు తన ఉగ్రతను అగుపరచుటకును తన ప్రభావమును చూపుటకును ఇచ్ఛయించిన వాడై నాశనమునకు సిద్ధపడి ఉగ్రత పాత్రమైన ఘటములను ఆయన బహు దీర్ఘశాంతముతో సహించిననేమి? మరియు మహిమ పొందుటకు

ఆయన ముందుగా సిద్ధపరచిన కరుణా పాత్ర ఘటముల యెడల, అనగా యూదులలో నుండియు మాత్రమే గాక అన్యజనులలోనుండియు, ఆయన పిలిచిన మన యెడల, తన మహిమైశ్వర్యము కనపరచవలెననియున్న నేమి?" (రోమా. 9:18-24,).

పౌలు యొక్క వాదనను క్షుణ్ణముగా అనుసరించినట్లయితే రోమా పత్రికలోని మొదటి మూడు అధ్యాయాలలో అన్యులు దేవునియెదుట దోషులని, తరువాత యూదులు కూడా దోషులని, చివరికి మానవాళి అంతా పాపాత్ములని తీర్పుకు మరియు శిక్షకు అర్హులని ముగించాడు. అయినా సరే, వారికి రావలసిన శిక్ష నుండి కొందరిని తప్పించి దేవుడు కరుణ చూపుతాడు. కొందరిని దేవుడు కరుణిస్తాడు. అయితే దానిని ఎలా నిర్ణయిస్తాడో దేవుడు మనకు చెప్పలేదు. దేవుడు ఎవరిని కరుణించగోరుతాడో వారిని కరుణిస్తాడు. మనకు అంతమాత్రమే తెలుసు. త్రక్కిన వారిని వారి వారి పాపాలలోనే ఉండనిస్తాడు. 'కాని దేవుడు నిర్ణయించిన విధంగానే వారు చేస్తుంటే దేవుడు అటువంటి వారిని ఎలా నిందించి తప్పు పట్టగలడు' అని విమర్శకులు ప్రశ్నిస్తుంటారు.

పౌలు వెంటనే దేవుని సార్వభౌమ్యత్వమును ప్రకటించి, మనము కేవలము సృష్టికర్త చేతుల్లో ధూళిలాంటి వారమని అట్టి విమర్శకులకు తెలియజేశాడు. నీవు అలా ఎందుకు చేస్తున్నావని దుమ్ము లేచి సర్వశక్తిమంతుడగు దేవునిని ప్రశ్నించగలదా? ప్రశ్నించలేదనే ఇందులో దాగివున్న ఖచ్చితమైన జవాబు. ఆయన ఈ సృష్టికే యజమానుడు. ఆయన నిర్ణయాలను ఎవరు ప్రశ్నింపగలరు?

ఆ తరువాత యిర్మియా 18వ అధ్యాయములోని ఒక పాఠాన్ని పౌలు మనకు జ్ఞాపకము చేశాడు. కుమ్మరి తన చేతుల్లో ఉన్న మట్టి ముద్దను ఏమైనా చేయుటకు అధికారము కలిగియున్నాడు. అదే ముద్దలోనుండి కళాత్మకమైన, సుందరమైన, అభినందనకు యోగ్యమైన వస్తువులను తీర్చదిద్దగలడు. లేదా అనుదిన సామాన్య అవసరతలకు ఉపయోగపడే విధముగా చేసి వాటిని నాశనము చేయగలడు. అవియు కేవలము ఆయన అభీష్టము బట్టియే. కుమ్మరి మంటిపై కలిగియున్న ఇటువంటి అధికారమును దేవుడు తన సృష్టిపై కలిగియున్నాడు. పిమ్మట రోమా.9:18-20 వచనములలోని లేఖనభాగములో ఎన్నిక చేయబడినవారిని గూర్చియు తీర్పుకై విధించబడిన వారినిగూర్చియు ప్రస్తావించబడినది. ఉగ్రతాపాత్రలపై ఉగ్రతను,తీర్పును కుమ్మరించుటకు ఆయన అభీష్టుడైయున్నాడని, రక్షణ నిమిత్తము ఎన్నుకొనిన వారిపై తన మహిమాన్విత కృపను, కరుణను చూపు ఆ సమయము కొరకు సహనము, దీర్ఘశాంతముతో ఎదురు చూస్తున్నాడని మనము అక్కడ చదువగలము.

'దాటిపోవుట/తృణీకరించుట' అన్యాయము అని విమర్శించువారు 'అసలు విషయాన్ని' గమనించుట లేదు. న్యాయాన్యాయాలు బట్టి చూస్తే వాస్తవానికి దుష్టులును, తిరుగుబాటు దారులునైన మానవులు తప్పని సరిగా నరకానికే వెళ్ళాలని న్యాయము కోరుతుంది. అందుకే ఏ మానవుని నాశనమునకు దేవుడు మూల కారణము కాదు. మానవులు వారి దుష్ట హృదయపు ఆశలకు గురై వారే తమ నాశన మార్గములలో నడుస్తున్నారు. కావునా వారి క్రియలకు వారే బాధ్యులు. తన నిర్ణయము చొప్పన ఏర్పరచుకొన్నవారిపై కరుణను ప్రదర్శించుటయందును అలాగే ఇతరుల విషయమై తన నీతిని పవిత్ర న్యాయాన్ని ప్రదర్శించుటయందును దేవునికి మహిమ కలుగుతుంది.

అయితే ఇక్కడ మనము గమనించవలసిన ఓ ప్రాముఖ్య విషయమున్నది. దేవుడేమి చేసినా తన మహిమ కొరకే చేస్తాడు. రక్షణ దేవుని కృపకే చెందుతుంది. తీర్పు ఆయన మహిమాన్విత నీతి మరియు పవిత్రతకే చెందుతుంది. ఇదంతయు ఆయనకు, ఆయన మహిమకు చెందుతుంది. ప్రతి మానవునికి సమాన అవకాశమివ్వాలని మానవతా దృక్పథముతో కొందరు వాదిస్తుంటారు. కానీ అది లేఖనాలకు సుదూరమైన విషయము. నిజముగా ఆ నిత్యత్వపు నియమాలను గ్రహించుట ఈ పరిమిత మానవులకు అసాధ్యమే. దేవుని మారని అపరిమిత నిర్ణయాలను మన మనసులు చుట్టి రావడము సాధ్యము కాని పని. అయినను బైబిలులో ఇట్టి దేవుని మాత్రమే మనము చూడగలము. కాబట్టి దేవుడు లేఖనాలలో బయలుపరచిన ఈ సత్యమును కాలదన్నటము కంటే ఆయన సర్వాధికార నిర్ణయములకు తలవంచి వినయముతో ఆరాధించడమే జ్ఞానయుక్తము. కానీ ప్రకృతి సంబంధ మానవులు

వివేకశూన్యములగు మృగములవలె దేవుని అధికారాన్ని ససేమిరా ఒప్పకోరు.

ఇస్సాకు యొక్క కవలపిల్లలను సూచిస్తూ పౌలు దేవుని ఎన్నికార్థపు కృపను గూర్చి తన ప్రసంగప్రవాహాన్ని ఈ విధంగా కొనసాగించాడు.

"ఇందును గూర్చి నేను యాకోబును ప్రేమించితిని, ఏశావును ద్వేషించితిని అని వ్రాయబడియున్నది (.రోమా.9:13-16,) కాబట్టి యేమందుము? దేవుని యందు అన్యాయము కలదా? అట్లనరాదు. అందుకు మోషేతో ఈలాగు చెప్పచున్నాడు.

ఎవనిని కరుణింతునో వానిని కరుణింతును, ఎవని యెడల జాలి చూపుదునో వాని యెడల జాలి చూపుదును. కాగా పొందగోరు వానివలనైననూ, ప్రయాసపడువానివలనైననూ కాదు కాని, కరుణించు దేవుని వలననే అగును". "నేను ఏశావును ద్వేషించితిని" అని దేవుడు అంటే అది నాకు ఆశ్చర్యము కానేకాదు. పాపము ఏ రూపములోనున్నా దేవుడు దానిని తిరస్కరిస్తాడు. అయితే, "యాకోబును ప్రేమించానని" దేవుని కృప ప్రకటించుట అత్యంత ఆశ్చర్యకరము. మడిమెను పట్టుకున్న యాకోబు ఓ మోసగాడు. కానీ, "అనర్హమైన కృపను" అతను పొందుకున్నాడు. ఈ అధ్యాయ ప్రారంభములో మేము సెలవిచ్చిన విషయమును ఈ వచనము ధృడపరుచుచున్నది. దేవుడు ప్రేమతో ముందుగా ఎరుగుటయే ఆయన 'భేషరతుఎన్నిక'కు ఆధారం. తమ చిత్తాన్ని అనుసరిస్తూ ధర్మకార్యాలనే సుదీర్ఘ పరుగు పందెములో ఒకరితోనొకరు పోటిపడువారి చేత ఆయన ఇంచుకంతైనా కదల్చబడడు. ఎన్నిక అనేది దేవుని కార్యము. కేవలము ఆయన అభీష్టము చొప్పనే దేవుడు కరుణ చూపుతాడు. దేవుడు దయతో కొందరిని ఎన్నుకుంటాడని, అట్టివారిని విశ్వాసమునకు చేరుస్తాడని, ఇతరులపై ఉగ్రత నిలుస్తుందని యేసు చెప్పాడు.

"కుమారునియందు విశ్వాసముంచువాడే నిత్యజీవముగలవాడు. కుమారునికి విధేయుడు కానివాడు జీవమును చూడడు కాని దేవుని ఉగ్రత వాని మీద నిలిచియుండును" (యోహాను. 3:36,).

ఇది దేవునిని అన్యాయస్థునిగా చేస్తుందా? లేదు! అది ఆయనను దయగల వానిగా చేస్తుంది. ఆయన చేయుదాని ద్వారా న్యాయము నిర్వచింపబడుతుంది. దేవునిని మించి, ఆయనను జవాబుదారిగా చేయగల నైతికప్రమాణాలేవీ లేవు. ఆయన ఎవరిని కరుణిస్తాడు, ఎవరు ఆయన కనికరమును పొందుతారనునవి కేవలం ఆయన అభీష్టమే.

"యెహోవా ప్రతి వస్తువును దాని దాని పని నిమిత్తము కలుగజేసెను. నాశనదినమునకు ఆయన భక్తిహీనులను కలుగజేసెను" (సామెతలు. 16:4,).

"నేను వెలుగును సృజించువాడను అంధకారమును కలుగజేయువాడను సమాధానకర్తను కీడును కలుగజేయువాడను నేనే యెహోవా అను నేనే వీటన్నిటిని కలుగజేయువాడను." (యెషయా. 45:7-9). ఆకాశమండలము సృజించిన వానితో వాదించువానికి శ్రమ.

దయ్యాల లేదా మనుష్యుల దుష్ట క్రియల ద్వారా దేవుడు పడద్రోయబడ లేదు; ఇసుమంతైనను పరిమితము చేయబడలేదు; దేవుడు సమస్తాన్ని ఒకే ఉద్దేశ్యంతో సృష్టించాడు. అదే ఆయన స్వకీయ మహిమ. నమ్ముటకు విఫలులైన వారి ద్వారా దేవుని నిత్యరక్షణ ప్రణాళికయైన విమోచన కార్యక్రమము ఏ మాత్రమును భంగపరచబడదు, ఆగిపోదు. ఆయన సార్వభౌమ్య చిత్తాన్ని బట్టి వారు తమ అవిశ్వాసంలో విడిచిపెట్టబడతారు. క్రీస్తును చేరకుండునట్లు వారినుండి సత్యము మరుగుచేయబడియున్నది; వారి కన్నులు మూయబడ్డాయి, వారి చెవులునూ బంధించబడ్డాయి. యేసుక్రీస్తు మానవ చరిత్రలో విభజనా రేఖలా వున్నాడు. ఈ విభజన రేఖ ద్వారానే నిర్ణయించబడ్డ వారు, వారి వారి గమ్యానికి వెళ్తారు.

"కట్టువారు వాక్యమునకవిధేయులై తొట్రిల్లుచున్నారు దానికే వారు నియమింపబడిరి." (1 పేతురు. 2:8)

"కొందరు రహస్యముగా జొరబడియున్నారు. వారు భక్తిహీనులై మన దేవుని కృపను కామాతురత్వమునకు దుర్వినియోగపరచుచు, మన అద్వితీయ నాధుడును ప్రభువైన యేసుక్రీస్తును విసర్జించుచున్నారు. ఈ తీర్పు

పొందుటకు వారు పూర్వమందే సూచించబడినవారు (యూదా. 4,).

"ఇందుచేత సత్యమును నమ్మక దుర్నీతియందు అభిలాషగలవారందరును శిక్షావిధి పొందుటకై, అబద్ధము నమ్మునట్లు మోసము చేయు శక్తిని దేవుడు వారికి పంపుచున్నాడు.." (1 థెస్స. 2:11,12,)

"..........ఇదిగో తిరస్కరించువారలారా, ఆశ్చర్యపడి నశించుడి మీ దినములలో నేనొక కార్యము చేసెదను. ఆ కార్యము ఒకడు మీకు వివరించినను మీరెంత మాత్రమును నమ్మరనెను." (అపొ.కా. 13:41,)

## ముగింపు

'భేషరతు ఎన్నిక' అనే సిద్ధాంతమునకు సంబంధించి సమృద్ధియైన లేఖనాధారములు ఒకవేళ లేకున్ననూ ఈ కాస్త తార్కికత సరిపోతుంది.

మానవుడు సంపూర్ణముగా నశించి పాపముల మరియు అతిక్రమములయందు మరణించినప్పటికీ,

దేవునితో బాంధవ్యము కొరకు ఎట్టి ఆకాంక్ష లేనివాడై దేవునిపై తిరగబడినవాడైనప్పటికీ,

మానవుడు దేవునికి సంబంధించి ఏవియు చేయలేని అశక్తుడైనప్పటికీ, దేవుని దృష్టికి ప్రీతికరమైన మంచి క్రియలుచేసి దేవునిని బద్ధునిగా చేయలేనివాడైనప్పటికీ, అట్టి అవగాహన కూడా కరువైనవాడైనప్పటికీ,

కొందరు దేవునిని తెలుసుకొని, ఆయనను ఆరాధించుచున్నారంటే, దేవుని సన్నిధిలో నిత్యజీవపు వరాన్ని పొందుకొనుచున్నారంటే, అది కేవలం దేవుని స్వచిత్తము మరియు దయాసంకల్పము చొప్పున రక్షణ ప్రక్రియను ఆయనే ప్రారంభించుట వలన మాత్రమే సాధ్యపడుతుంది.. ఇది మర్మయుక్తముగా ఉన్నదా? అవును ఖచ్చితముగా మర్మయుక్తమే. మర్మయుక్తము కాబట్టి ప్రక్కన పెట్టేద్దామని దాని అర్థమా? కాదు. పరిపూర్ణులైన వారి మధ్య జ్ఞానమును బోధించుచున్నాము. అది ఈ లోకజ్ఞానము కాదు గానీ దేవుని జ్ఞానము మర్మమైయున్నట్టుగా బోధించుచున్నాము; ఈ జ్ఞానము మరుగైయుండెను. జగదుత్పత్తికి ముందుగానే దీనిని దేవుడు తన మహిమ నిమిత్తము నియమించెను (1 కొరింథి.2:6,7) కాబట్టి, పతనమైన మానవాళి నుండి, దేవుడు కొందరిని రక్షించు నిమిత్తము ఎన్నుకుని వారిపై తన ప్రేమను కనపరిచాడు. ఆ రక్షణ యొక్క విధానము ఏమైయుండెను, దానిని ఉద్భవింపజేసినది ఏమిటి? అది కేవలం దేవుడు తాను ఎన్నుకొనిన వారిపై కనబరచకోరిన ప్రేమలో నుండి ఉద్భవించింది.

''మనము దేవుని ప్రేమించితిమని కాదు తానే మనలను ప్రేమించి, మన పాపములకు ప్రాయశ్చిత్తమైయుండుటకు తన కుమారుని పంపెను. ఇందులో ప్రేమయున్నది." (1 యోహాను.4:10,)

అయితే ఆ రక్షణ విధానము ఏమైయుండెను? ఆయన కుమారుని ప్రాయశ్చిత్తకార్యమే; అదే 'పరిమిత ప్రాయశ్చిత్తము' అనే కృపాసిద్ధాంతములలోని మూడవ అంశము.

మూడవ అధ్యాయము

# పరిమిత ప్రాయశ్చిత్తము

క్రీస్తు ఎవరికొరకు మరణించాడు అనే ప్రశ్నకు 'పరిమిత ప్రాయశ్చిత్తము' అను సిద్ధాంతములో జవాబు కనుగొనగలము. ఎట్టి మినహాయింపు లేకుండా సమస్త మానవాళి కొరకు ఆయన సిలువపై వ్రేలాడాడా? లేదా, కేవలము ఎన్నుకొనబడినవారి కొరకు మాత్రమే ఆయన మరణించడా?

ఇదే మన ప్రస్తుత వివాదాంశం. అందరూ రక్షింపబడరని బైబిల్ స్పష్టముగా తెలియజేయుచున్నది. కాబట్టి, క్రీస్తు ఏ భేదము లేకుండా అందరికొరకు మరణించినట్లయితే ఆయన రక్షణను కేవలము సుసాధ్యము చేసినట్లు. అనగా ఎవరైనా ఆ అవకాశాన్ని సద్వినియోగము చేసికొనగోరితే, వారికై ఆయన రక్షణ కొరకైన ఒక విధానమును ఏర్పాటు చేసినట్లు. అయితే, దోషులైన పాపులను రక్షించుటకు ఆయన మరణము చాలినదియు ప్రభావవంతమైనదియునైతే తత్ఫలితముగా రక్షణ కార్యము సంపూర్ణము చేయబడినట్లయితే అందరూ రక్షణ పొందుట లేదు అనే వాస్తవము, క్రీస్తు కేవలము ఎన్నుకొనబడిన వారి కొరకే మరణించాడు అని నిస్సందేహముగా నమ్మేలా ప్రోద్బలము చేస్తుంది.

ఈ విషయమై మన దైవశాస్త్రమును స్థిరపరచుటకు గాను, కలువరిలో ఏమి జరిగిందో మొదట తెలుసుకోవాలి. క్రైస్తవ్యమంతయు "యేసు సిలువ" అనే ఈ కీలాకాంశము చుట్టు పరిభ్రమిస్తుంది. యేసుక్రీస్తు దైవకుమారుడని, త్రిత్వములో ఒక సభ్యుడని (ఉన్నాడు, ఉండేవాడు, ఉండబోవువాడని) సంప్రదాయ క్రైస్తవ్యము ఎల్లప్పడు విశ్వసిస్తూ ఉన్నది.

"ఆయనను అనుసరింపక మనుష్యుల పారంపర్యాచారమును, అనగా ఈ లోక సంబంధమైన మూల పాఠములను అనుసరించి మోసకరమైన నిరర్థక తత్త్వజ్ఞానము చేత మిమ్మును చెరపట్టుకొని పోవువాడెవడైనా ఉండునేమో అని జాగ్రత్తగా వుండుడి. ఏలయనగా దేవత్వము యొక్క సర్వపరిపూర్ణత శరీరముగా క్రీస్తునందు నివసించుచున్నది; మరియు ఆయనయందు మీరును సంపూర్ణులైయున్నారు. ఆయన సమస్త ప్రధానులకును అధికారులకును శిరస్సైయున్నాడు."(కొలొస్సీ. 2:8-10,)

యేసుక్రీస్తు తన దైవత్వ నిరూపణకై బలవంతము చేయబడినప్పడు, "యోనా మూడు రాత్రింబగళ్ళు తిమింగలము కడుపులో ఎలాగుండెనో అలాగే మనుష్యకుమారుడు మూడు రాత్రింబగళ్లు భూగర్భములో ఉ ఒడును." (మత్తయి.12:40) అని వెల్లడించాడు.

"లేఖనముల ప్రకారము" నిజముగానే క్రీస్తు సిలువలో మరణించాడని, మూడు రాత్రింబవళ్లు సమాధియందుండి తిరిగి లేచాడని మొట్టమొదట కళ్లారా చూచినవారు సాక్ష్యమిచ్చారు. చరిత్రలో ఇట్టి వింతయైన వాస్తవము లేనట్లయితే, అబద్ధికుల ద్వారా తేబడి "అబద్ధపు సాక్ష్యుల" ద్వారా భద్రపరచబడి కొనసాగుతున్న మరొక వెట్టి మతమువలె క్రైస్తవ్యము కూడా ఉండేది. (1 కొరింథి.15:5) ఈ సంఘటనలు క్రైస్తవ్యమునకు మూలమైనవి.

'యేసు సిలువ వేయబడుట' అను విషయము తరచి చూడతగ్గ ఓ చారిత్రాత్మక వాస్తవము. రోమా చరిత్రకారుడైన టాసిటస్, నజరేయుడైన యేసు అను ఓ వ్యక్తి నిజముగా జీవించాడని మరియు సిలువ వేయబడ్డాడని గ్రంథస్థం చేస్తూ ఇలా వ్రాశాడు :

"మానవ ప్రయత్నాలెన్ని జేసినా, చక్రవర్తి యొక్క ఉదార ఈవులు ఎన్ని వచ్చినా మరియు దేవుళ్లను శాంతింపజేసినా ఇవన్నియూ రోమా నగరపు నీరో చక్రవర్తి ఆజ్ఞ చొప్పననే తగులబెట్టబడిందనే దురభిప్రాయాన్ని పారద్రోలలేకపోయాయి. ఆ కారణాన, ఆ నిందను వదలించుకొనుటకై, నీరో క్రైస్తవులని పిలువబడుచున్న వారిపై ఆ నేరము మోపుతూ చేయదగని హేయ క్రియలు చేస్తున్నారని నిందిస్తూ వారిని ఘోర హింసలకు గురి చేశాడు. 'క్రైస్తవులు' అను పదము (క్రిస్టస్) యేసుక్రీస్తు అను వ్యక్తి నుండి ప్రారంభమైనది. ఆయన టైబేరియస్ పరిపాలనలో

పొంతి పిలాతు అధికారము క్రింద విపరీతమైన నేరశిక్షను అనుభవించాడు. తద్వారా ఆనాడు అదుపు చేయబడిన ఈ మూఢాచారం (క్రైస్తవ్యం), దానికి కేంద్రబిందువైన యూదయాలో మాత్రమే కాక సమస్త అసహ్య, అవమానకరమైన విషయాల ప్రాచుర్యానికి కేంద్ర స్థానమైన రోమ్‌లో కూడా పున: ఆవిర్భవించింది. కాగా దోషులుగా నిర్ధారించబడిన కొందరిని నిర్బంధములోనికి తీసుకొని వారిచ్చిన సమాచారం మేరకు ఒక గొప్పజనసమూహాన్ని దోషులుగా నిర్ణయించారు. రోమును తగులబెట్టిన నేరానికి కాదు, మానవ జాతిని ద్వేషించువారనే నెపమును మోపుతూ పలు విధములగు అపహాస్యములకు గురిచేస్తూ వారిని హతమార్చారు. కొందరు జంతువుల చర్మముతో చుట్టబడి, కుక్కలచేత చీల్చబడి చంపబడ్డారు. మరికొందరు సిలువలపై దిగగొట్టబడ్డారు. ఇంకొందరు పగటి వెలుగు అవతరించినప్పడు దీపస్థంబములపైన వ్రేలాడదీసి దీపములుగా వెలిగించి వాడుకోబడ్డారు. ఈ విధముగా వారి వేదన అధికము చేయబడినది. నీరో తన ఉద్యానవనములను ఇట్టి ప్రదర్శనలకై ఇచ్చాడు. అవి జరుగుతున్న సమయములో ఓ మామూలు రథసారథి వస్త్రములతో ప్రజల్లోకి దూరి నీరో వారితో కలిసి ఆనందించేవాడు లేదా సుదూరంగా ఒంటరిగా తన శకటములో వుండి ఆనందించేవాడు. వారు అలా శిక్షలకు గురవుతున్నప్పడు ప్రజల్లో కనికర, దయా భావాలు పెల్లుబుకుతూ ఉండేవి. ఎందుకంటే ప్రజాక్షేమం కొరకు కాదు గాని కేవలము ఒకని (నీరో) క్రూరత్వపు తనివి తీర్చుటకే వారు (క్రైస్తవులను) ఈ హింసలకు గురి చేయబడ్డారు."

క్రీస్తు అను వ్యక్తి పిలాతు అనువాని ద్వారా తీర్పు తీర్చబడి సిలువ వేయబడ్డాడని, ఆయన అనుచరులు సైతం యేసు మరణించి తిరిగి లేచాడనే నమ్మకాన్ని చేపట్టినందుకు ఎంతో కఠినహింసను,శ్రమలను అనుభవించారని అటు బైబిలు ఇటు చరిత్ర ఆధారాలు సెలవిస్తున్నాయి.

అయితే విమోచన మరియు సత్యము కొరకు అన్వేషించే వ్యక్తికి ఇట్టి చారిత్రాత్మక వాస్తవములు కంటే మిన్నయైన విషయాలు తెలియాలి. ఆ భయంకర క్షణము యొక్క శాశ్వత, ఆత్మీయ పరిణామాలు తప్పనిసరిగా మనము తెలుసుకోవాలి.

## కీస్తు ఆ సిలువపై ఏమి సాధించాడు?

ఆదాము హవ్వ ఏదేను తోటనుండి బహిష్కరించబడిన పిమ్మట మనము కయీను మరియు హేబేలు సహోదరులను గూర్చి చదువుతాము. హేబేలు "తన మందలోని తొలిచూలు మరియు దాని క్రొవ్వును" దేవునికి అర్పణగా ఇచ్చాడు. "దాని కొవ్వును" అను పదము హేబెలు గొర్రెపిల్లను బలిగా వధించాడని సూచించుచున్నది. అది ఎందుకు ఆవశ్యకమైనది? హేబెలు పాపమునకై దేవుని క్షమాపణను కోరుకొన్నాడు. దానిని పొందుకున్నాడు. యెహోవా హేబెలు అర్పణను లక్ష్యపెట్టెను (ఆది.4:4).

'పాపపరిహారమునకై బలిపూరిత రక్తము ఒలికించుట' అను విధానము నోవహు కాలము వరకు కొనసాగింది. బలి అర్పించుటకు అనువుగానుండులాగున అతడు పవిత్ర జంతువులలో ప్రతి జాతి పోతులు ఏడును, పెంటులు ఏడును పవిత్రములు కాని జంతువులలో ప్రతి జాతి పోతును పెంటియు రెండును తీసికొనెను (ఆది.7:2). అతని కుటుంబము ఆరిన నేలపై దిగిన వెంటనే యెహోవాకు బలిపీఠము కట్టి, పవిత్ర పశువులలోనుండి కొన్నిటిని తీసుకొని బలిగా అర్పించారు. (ఆది.కా.8:20).

దేవునికి బలి ఇచ్చుట అనునది హెబ్రీయుల పితరుడైన అబ్రహాము దినములయందంతటను కొనసాగింది. తన ఏకైక కుమారుడిని బలిగా ఇవ్వమని కోరబడినప్పడు "నా కుమారుడా, దేవుడే దహనబలికి గొర్రెపిల్లను చూచుకొనునని." (ఆది.22:8) అబ్రాహాము చెప్పాడు. అబ్రాహాము వధించుటకై తన ఖడ్గమునెత్తగా దూతచేత ఆపబడెను. అంతట పొదలో కొమ్ములకు తగులుకొనియున్న ఒక పొట్టేలు వెనుక తట్టున కనబడెను. ఇస్సాకుకు బదులుగా వధించబడుటకై కొమ్ములుగల పొట్టేలును దేవుడు దయజేసెను. (ఆది.22:9,13). పాప పరిహారార్థ బలి లేవియుల చట్టమందునూ కొనసాగించబడినది. తాత్కాలికముగా దేవుడు తన ఉగ్రతను మరియు శిక్షను

తొలిగించునట్లుగా ప్రధాన యాజకుల నుండి జనులనుండి రక్తమును కోరాడు.

"మరియు ధర్మశాస్త్రము ప్రకారము సమస్త వస్తువులును రక్తము చేత శుద్ధి చేయబడుననియు, రక్తము చిందింపకుండా పాపక్షమాపణ కలుగదనియు సామాన్యముగా చెప్పవచ్చును." (హెబ్రి.9:22).

కానీ ఎడతెగని ఈ జంతుబలి, అర్పించు వారియొక్క దోషముల పరిహరమునకై వాస్తవానికి ఎన్నటికి చాలినదిగా లేకుండెను.

ధర్మశాస్త్రము రాబోవుచున్న మేలుల ఛాయగలదియే గానీ ఆ వస్తువుల నిజస్వరూపము గలది కాదు గనుక ఆ యాజకులు ఏటేటా ఎడతెగకుండా అర్పించు ఒక్కటే విధమైన బలులు వాటిని తెచ్చువారికి ఎన్నడునూ సంపూర్ణ సిద్ధి కలుగజేయనేరవు. అలాగు చేయగలిగిన యెడల సేవించువారొక్కసారే శుద్ధి చేయబడిన తరువాత వారి మనసాక్షికి పాపజ్ఞప్తి ఇకను ఉండదు గనుక వాటిని అర్పించుట మానుదురుగదా. అయితే బలులు అర్పించుట చేత ఏటేట పాపములు జ్ఞాపకమునకు వచ్చుచున్నవి. ఏలయనగా ఎడ్లయొక్కయు మేకలయొక్కయు రక్తము పాపములను తీసివేయుట అసాధ్యము. (హెబ్రీ.10:1-4,)

మనుష్యులకు వారి పాపస్థితి జ్ఞాపకము చేయుటకై జంతుబలిని దేవుడు ఆజ్ఞాపించాడు. . ఇలా చిందింపబడిన రక్తము, పాపము మరణమును కోరుననుటకు సాక్ష్యరూపముగావుండెను. అయితే యేసుక్రీస్తు తన్నుతాను అర్పించుకొన్నప్పుడు ఒక్కసారే తన ప్రత్యామ్నాయ మరణం ద్వారా పాపశిక్షను శాశ్వతంగా తొలగించేనని హెబ్రి పత్రిక గ్రంథకర్త ప్రకటించాడు. చారిత్రాత్మకంగా దేవుడెప్పుడును రక్తబలిని కోరాడు. కానీ స్వయానా దేవుని రక్తమునే చిందింపజేసిన ఆ కడమ బలియాగము తన రక్తార్పణమునకు చరమ గీతము పాడింది.

యేసు ఇష్టపూర్వకముగా సిలువవేయబడుటకై తనను తాను అర్పించుకున్నప్పుడు ఆయా విషయాలను నెరవేర్చాడని లేఖనాలు తెలుపుచున్నవి. అవన్నియు 'క్రీస్తు ఎవరికై మరణించాడు' అను మన ప్రశ్నకు మరింత విపులతను చూపును.

### 1) పాపము విషయమై క్రీస్తు అంతిమ మరియు ప్రత్యామ్నాయ బలిగా మారాడు.

"అందువలన నిజమైన పరిశుద్ధ స్థలమును పోలి హస్తకృతమైన పరిశుద్ధ స్థలములో క్రీస్తు ప్రవేశింపలేదు గాని, యిప్పుడు మనకొరకు దేవుని సముఖమందు కనబడుటకు పరలోకమందే ప్రవేశించెను. అంతేకాదు ప్రధాన యాజకుడు ప్రతి సంవత్సరము తనది కాని రక్తము తీసుకొని పరిశుద్ధ స్థలములోనికి ప్రవేశించునట్లు ఆయన అనేక పర్యాయములు తన్ను తాను అర్పించుకొనుటకు ప్రవేశింపలేదు. అట్లయిన యెడల జగత్తు పునాది వేయబడినది మొదలుకొని ఆయన అనేక పర్యాయములు శ్రమపడవలసివచ్చును. అయితే అయన యుగముల సమాప్తియందు తన్నుతానే బలిగా అర్పించుకొనుటవలన పాప నివారణ చేయుటకై ఒక్కసారే ప్రత్యక్షపరచబడెను." (హెబ్రీ. 9:24-26).

పాప ఋణము తీసివేయలేని జంతుబలులన్నిటి వెనుకవున్న ఛాయను నెరవేరుస్తూ, ఒక్కసారే పాపమును తొలగించు నిమిత్తమై, క్రీస్తు తనను తాను బలిగా అర్పించుకొనెను.

"మరియు ప్రతి యాజకుడు దిన దినము సేవ చేయుచు, పాపములను ఎన్నటికిని తీసివేయలేని ఆ బలులనే మాటి మాటికి అర్పించుచు ఉండును. ఈయనయైతే పాపముల నిమిత్తమై సదాకాలము నిలుచు ఒక్క బలిని అర్పించి.... దేవుని కుడి పార్శ్వమున ఆసీనుడాయెను" (హెబ్రీ.10:11,12,) .

తనను తాను బలిగా సమర్పించి క్రీస్తు ఎందుకు ఆసీనుడయ్యాడు? ఎందుకనగా, శాశ్వతముగా పాపమును తొలగించు నిమిత్తమై ఆ కార్యమును నెరవేర్చుటకై ఆయన వచ్చాడు. దేవుడు తన బలిని సంపూర్తిగా స్వీకరించాడనుటకు సూచనగా అధికారము, శక్తికి సూచనగా దేవుని కుడి పార్శ్వమున ఆసీనుడయ్యాడు".

**2) పాపము విషయమై క్రీస్తు ప్రాయశ్చిత్తము గావించాడు:**

క్రీస్తు మరణమును వర్ణించుటకై, పౌలు అన్యులుపయోగించు 'ప్రాయశ్చిత్తము' అను పదము వాడాడు. వారి జీవితాల్లో కలిగే కష్టాలు దేవుళ్లు ఆగ్రహించినందున వచ్చునవని ప్రాచీన అన్యులు విశ్వసించి వారికి బలులు అర్పించేవారు. మెలేకు దేవతకు తమ బిడ్డలను అగ్నిగుండమును దాటింపజేయుట ఉదాహరణగా మనము చూడవచ్చు (లేవి. 18:21) ఆ శిశువుల అరుపులు మరియు మరణము దేవుళ్లను శాంతింపజేయునని వారు విశ్వసించేవారు.

సర్వశక్తిగల దేవుని ఉగ్రతను శాంతింపజేయుటకై యేసుక్రీస్తు ప్రాయశ్చిత్త బలిగా తనను తాను అర్పించుకొనెను.

"పూర్వము చేయబడిన పాపములను దేవుడు తన ఓరిమివలన ఉపేక్షించినందున, ఆయన తన నీతిని కనుపరచవలెనని." (రోమా.3:25,)

"మనము దేవునిని ప్రేమించితిమని కాదు, తానే మనలను ప్రేమించి, మన పాపములకు ప్రాయశ్చిత్తమైయుండుటకు తన కుమారుని పంపెను; ఇందులో ప్రేమయున్నది." (1 యోహాను 4:10).

**3) పతనమైన పాపులను క్రీస్తు తన మరణము ద్వారా విమోచించాడు.** "విమోచించుట" అను పదము "వెలపెట్టికొని విడిపించుట" అనే భావమునిచ్చు "ఎక్సాగోరాడ్జో" అనే గ్రీకు పదము నుండి అనువదించబడింది.. ఒక బానిసను విడిపించుటకు అతనిని వెలపెట్టి కొనుట విడిపించుట అనే భావాన్ని ఇది వ్యక్తపరుస్తుంది.. "లుట్రో" అను గ్రీకు పదమును విడిపించుట అని అనువాదము చేసారు. "వెలచేత విడిపించబడుట" వెల చెల్లింపబడిన కారణాన బానిసను వాస్తవానికి "విడుదల చేయుట" అని దీని భావము.

'క్రీస్తు, పాపులను పాపమునకు బానిసలని సూచించాడు' (యోహాను. 8:34) మరియు పాపమువలన వచ్చు జీతము మరణమని పౌలు వెల్లడించాడు (రోమా.6:23). పైగా దేవుని పవిత్ర న్యాయము పాపి యొక్క పాప ఫలితముగా మరణము కోరింది. మన పాపమునకు వెల చెల్లింపబడాలి. కానీ "రక్తము చిందింపబడకుండా పాపక్షమాపణ కలుగదు" (హెబ్రీ. 9:22).

ఈ వర్ణన దృశ్యము స్పష్టముగానున్నది. పాపమను సంతలో పాపులు బానిసలుగా ఉన్నారు. తగిన వెలగల వాని రక్తము ద్వారా మాత్రమే వారు విముక్తులుగా చేయబడుదురు. గనుక క్రీస్తు తన హస్తములో తన స్వరక్తమును చేగొని దేవుని నీతి మరియు న్యాయము యెదుట నిలువబడి దోషులైన పాపులను కొని వారిని విడిపించాడు.

"ఏ భేదమును లేదు; అందరును పాపము చేసి దేవుడనుగ్రహించు మహిమను పొందలేక పోవుచున్నారు. కాబట్టి నమ్మువారు ఆయన కృపచేతనే క్రీస్తు యేసునందలి విమోచనము ద్వారా ఉచితముగా నీతిమంతులని తీర్చబడుదురు" (రోమా. 3:23,24,).

"మేకలయొక్కయు కోడెలయొక్కయు రక్తముతో కాక తన స్వరక్తముతో ఒక్కసారే పరిశుద్ధ స్థలములో ప్రవేశించెను"(హెబ్రీ. 9:12,).

విమోచన కార్యమును సంపూర్తి చేయుటకై ఒక్కసారే క్రీస్తు దేవుని సన్నిధిని ప్రవేశింపవలసివచ్చెను, ఆయన కొనిన విమోచనము శాశ్వతమైనది: గనుక, విమోచింపబడిన వాని వెల పూర్తిగా చెల్లింపబడినది మరియు అతను తిరిగి మరి ఎన్నటికిని బానిస కాజాలడు.

**4) అదే విధముగా, దోషులైన పాపులకు క్రీస్తు క్రయధనమైయుండెను.** ఒకనిని ఋణమునుండి విడిపించుటకై

చెల్లింపబడిన వెలయే క్రయధనము. మృతులైన పాపులు వారు చెల్లింపలేని ఋణమును అచ్చియున్నారు కాని వెల చెల్లించి ఋణగ్రస్త ఆస్తిని తిరిగి సంపాదించుటకు క్రీస్తు చాలినవాడాయెను.

“అలాగే మనుష్య కుమారుడు పరిచారము చేయించుకొనుటకు రాలేదు గానీ పరిచారము చేయుటకును అనేకులకు ప్రతిగా విమోచన క్రయధనముగా తన ప్రాణమునిచ్చుటకును వచ్చెనని చెప్పెను” (మత్తయి.20:28,)
.

“దేవుడొక్కడే, దేవునికిని నరులకును మధ్యవర్తియు ఒక్కడే. ఆయన యేసుక్రీస్తను నరుడు. ఈయన అందరి కొరకు విమోచన క్రయధనముగా తన్ను తానే సమర్పించుకొనెను. దీనిని గూర్చిన సాక్ష్యము యుక్తకాలములయందు ఇయ్యబడును” (1 తిమోతి. 2:5,6).

**5) క్రీస్తు సిలువలో దేవునికిని,నరునికిని మధ్య సంధిచేయుచుండెను.** ఇదివరకు వైరము కలిగియున్న ఈ ఇరువురిని కలుపుచుండెను. మనుష్యునితో సమాధానపడుట దేవునికి అవసరమని కాదు కాని, మనుష్యులు దేవునితో సమాధానపడకపోతే నశించుదురు కాబట్టి ఈ ఇరువరి మధ్యనున్న వైరాన్ని తొలగించాడు.

“కావున ప్రజల పాపములకు పరిహారము కలుగజేయుటకై దేవుని సంబంధమైన కార్యములలో కనికరమును నమ్మకముగల ప్రధాన యాజకుడగు నిమిత్తము అన్ని విషయములలో ఆయన సహోదరుల వంటివాడు కావలసివచ్చెను’ (హెబ్రి.2:17),.

“సమస్తమును దేవుని వలననైనవి, ఆయన మనలను క్రీస్తు ద్వారా సమాధాన పరచుకొని, ఆ సమాధాన పరిచర్యను మాకు అనుగ్రహించెను. అదేమనగా దేవుడు వారి అపరాధములను వారి మీద మోపక, క్రీస్తునందు లోకమును తనతో సమాధాన పరచుకొనుచు, ఆ సమాధాన వాక్యమును మాకు అప్పగించెను.” (2 కొరింథి.5:18,19,)

“ఏలయనగా శత్రువులమైయుండగా ఆయన కుమారుని మరణము ద్వారా మనము దేవునితో సమాధాన పరచబడినయెడల సమాధాన పరచబడినవారమై ఆయన జీవించుట చేత మరి నిశ్చయముగా రక్షింపబడుదము” (రోమా. 5:10,).

మనము దేవునిపై తిరగబడి ఆయనను ద్వేషించువారమైయుండగా ఆ సిలువలో ఆయన మరణము ద్వారా యేసు మనలను తిరిగి సమకూర్చెను. మనము సమాధానపరచబడ్డాము గనుక ఆయన పునరుత్థానము ద్వారా మనము నిశ్చయముగా రక్షించబడుదుమని పౌలు చెప్పచున్నాడు. క్రీస్తు మన పాపములకై ఋణమును చెల్లించి మన అతిక్రమములను తొలగించినప్పుడు దేవునితో మనకు సమాధానము సంపాదింపబడినది. ఈ విధముగా నిత్యన్యాయాధిపతి యెదుట మన రక్షణ, క్రీస్తు చిందించిన రక్తము ద్వారా సంపూర్ణము చేయబడి భద్రము చేయబడినది.

**6. ఆయన మరణము దోషులైన పాపులను నీతిమంతులనుగా చేసెను.** నీతిమంతునిగా తీర్చబడ్డాడనునది చట్టబద్ద లేదా న్యాయబద్దమైనపదజాలము. అనగా ఎన్నిక చేయబడినవారు తమంతట తాము వెలుపట మరియు బయట పరిపూర్ణము చేయబడ్డారని కాదు.

మరొక మాటలో చెబితే, దేవుని యెదుట స్వీకరింపబడునట్లుగా పాపులు వ్యక్తిగతముగా పరిశుద్ధులు గానూ మరియు నీతిమంతులు గాను తీర్చబడలేదు. వారి దోషములు మరియు జీవితాలకు అతీతముగా పాపరహితులని ప్రకటింపబడ్డారు. క్రీస్తు వారి పాపములు భరించిన కారణమున దేవుడు వారెన్నడూ పాపము చేయలేదన్నట్లుగా వారిని చూచును. అప్పడు వారు క్రీస్తు యొక్క సొంత పరిపూర్ణ మరియు సంపూర్ణము చేయబడిన కార్యమునుండి వచ్చిన నీతిని న్యాయబద్ధముగా ఆపాదితముగా పొందుదురు.

మూడు ప్రాముఖ్య ఆపాదితములను బైబిలు బోధిస్తున్నది.

1. ఆదాము యొక్క పాపము ప్రతి మానవునికి ఆపాదింపబడినది, అందరు మరణించుటయందు అది ఋజువగుచున్నది.

2. ఏర్పరచబడిన వారి దోషము క్రీస్తునకు ఆపాదింపబడుతూ, వారి పాపములు కలువరిచెంత ఆయనపై మోపబడినవి.

3. విశ్వాసులకు క్రీస్తుయొక్క స్వంత నీతి ఆపాదింపబడినది.

ఐతే ప్రస్తుతం గమనించవలసిన విషయమేమిటంటే క్రీస్తు ఎవరినిమిత్తమైతే సంపూర్ణముగా మరణించాడో వారిని సంపూర్ణముగాను వాస్తవముగాను నీతిమంతులుగా తీర్చాడు..

అతడు (దేవుడు) తనకు (క్రీస్తుయొక్క) కలిగిన వేదనను చూచి తృప్తినొందును. నీతిమంతుడైన నా సేవకుడు జనుల దోషమును భరించి తనకున్న అనుభవ జ్ఞానము చేత అనేకులను నిర్దోషులనుగా చేయును (యెషయ. 53:11).

“కాబట్టి సహోదరులారా, మీకు ఈయన ద్వారానే పాపక్షమాపణ ప్రచురమగుచున్నదనియు, మీరు మోషే ధర్మశాస్త్రమువలన ఏ విషయములలో నీతిమంతులుగా తీర్చబడలేకపోతిరో ఆ విషయములన్నిటిలో విశ్వసించు ప్రతివాడును ఈయన వలననే నీతిమంతుడుగా తీర్చబడుననియు మీకు తెలియును గాక.” (అపొ.కా. 13:38-39)

“అందరును పాపము చేసి దేవుడనుగ్రహించు మహిమను పొందలేక పోవుచున్నారు. ఆయన కృప చేతనే క్రీస్తు యేసునందలి విమోచనము ద్వారా ఉచితముగా నీతిమంతులని తీర్చబడుచున్నారు.” (రోమా.3:23,24)

“అవిశ్వాసమువలన దేవుని వాగ్దానములను గూర్చి సందేహింపక దేవుని మహిమ పరచి, ఆయన వాగ్దానము చేసిన వానిని నెరవేర్చుటకు సమర్థుడని రూఢిగా విశ్వసించి విశ్వాసమువలన బలమునొందెను. అందుచేత అది అతనికి నీతిగా ఎంచబడెను. అది అతనికి నీతిగా ఎంచబడెనని మాత్రమే కాదు గాని మన ప్రభువైన యేసు మృతులలోనుండి లేపిన వానియందు విశ్వాసముంచిన మనకును ఎంచబడునని మన నిమిత్తము కూడా వ్రాయబడెను. ఆయన మన అపరాధముల నిమిత్తము అప్పగించబడి మనము నీతిమంతులనుగా తీర్చబడుటకై లేపబడెను.” (రోమా.4:20-25,)

**7) నీతిమంతులుగా తీర్చబడినవారిని క్రీస్తు పరిశుద్ధపరచెను;** దేవుడు వారిని తన వ్యక్తిగత ఉపయోగము కొరకు “ప్రత్యేకపరచి ప్రతిష్టించెను” అని దానికర్థము “హగియాజ్జో” అనే గ్రీకుపదము పరిశుద్ధపరచబడుటగా అనువదించబడినది. ఇది “హగియోస్” అను మూలపదమునుండి వచ్చినది. ఈ పదమును సాధారణముగా “పవిత్ర”అని అనువదింతురు. ఈ రెండు గ్రీకు పదములు “ప్రత్యేకింపబడుట” లేదా దేవునికై “వేరుచేయబడుట” అను అర్థమిచ్చుచున్నవి. తన ప్రత్యేకఉద్దేశము కొరకై ప్రత్యేకింపబడుట అని మనము గమనించగలము.

“యేసుక్రీస్తు యొక్క శరీరము ఒక్కసారియే అర్పించబడుటచేత ఆ చిత్తమును బట్టి మనము పరిశుద్ధ పరచబడియున్నాము” (హెబ్రీ. 10:10).

“పరిశుద్ధ పరచువారికిని పరిశుద్ధపరచబడువారికిని అందరికి ఒక్కటే మూలము. ఈ హేతువు చేతను వారిని సహోదరులని పిలుచుటకు ఆయన సిగ్గుపడక....’ (హెబ్రీ.2:11,)

“మీలో కొందరు అట్టివారైయుంటిరి గాని ప్రభువైన యేసుక్రీస్తు నామమునను మన దేవుని ఆత్మయందును

మీరు కడుగబడి పరిశుద్ధపరచబడినవారై నీతిమంతులుగా తీర్చబడిరి" (1 కొరింథీ.6:11),

**8) తన ప్రజలను పరిశుద్ధపరచుట వలన క్రీస్తు వారిని "పరిపూర్ణులను"గా లేదా "సంపూర్ణులను"గా చేసి నీతిమంతుడును పరిశుద్ధుడునునైన దేవుని యెదుట నిలువబడే యోగ్యత వారికి కలుగజేసాడు.**

"ఒక్క అర్పణచేత ఈయన పరిశుద్ధపరచబడువారిని సదాకాలమునకు సంపూర్ణులనుగా చేసియున్నాడు' (హెబ్రీ. 10:14,). వారు సదాకాలమునకు సంపూర్ణులుగా చేయబడినట్లయితే, ఇక ఆయన వారిని ఎన్నడును దోషులనుగా ఎంచడు.

ఈ పరిపూర్ణత, 'ఆపాదించబడిన పరిపూర్ణత' అని మరలా జ్ఞాపకము చేయుచున్నాము. తన ప్రజల పాపాల కొరకు క్రీస్తును దేవుడు అపరాధిగా ఎంచాడు. పాపులు ఆయన ఉగ్రతకు అర్హులు. కాని ఆ ఉగ్రతను దేవుడు వారికి బదులుగా తన కుమారునిపై కుమ్మరించాడు. అప్పుడు, విమోచించబడిన పాపులను వ్యక్తిగతముగా, న్యాయబద్ధముగా, నిర్దోషులనుగా దేవుడు ఎత్తిపట్టుకొన్నాడు. క్రీస్తు ప్రాయశ్చితకార్యము ఫలితముగా ఆయన వారిని పరిశుద్ధపరచబడిన, పరిపూర్ణులైన ప్రజలుగా చూస్తాడు.

క్లుప్తముగా చెప్పాలంటే సిలువపై క్రీస్తు :

1) పాపము విషయమై అంతిమ మరియు ప్రత్యామ్నాయ బలిగా మారెను.
2) దేవుని ఉగ్రతను శాంతింపజేసెను.
3) దోషులైన పాపులను కొనుటకై వెల చెల్లించెను.
4) ప్రాయశ్చిత్త క్రయధనముగా మారెను.
5) దేవునికి మానవునికి మధ్య సంధిచేసెను.
6) దేవుని పవిత్ర న్యాయమును తృప్తిపరుస్తూ, దోషులైన పాపులను నీతిమంతులుగా తీర్చెను.
7) ఆ ప్రజలను పరిశుద్ధపరిచెను లేదా పవిత్రులనుగా ప్రత్యేకపరిచెను.
8) ఆయన కొని నీతిమంతులుగా తీర్చి, పరిశుద్ధతపరిచిన వారిని సదాకాలమునకు పరిపూర్ణులుగా చేసెను.

"సమాప్తమైనది" అనే క్రీస్తు స్వీయ ప్రకటన ద్వారా, వాస్తవానికి ఆయన మరణ, పునరుత్థానముల ద్వారా ఇవన్నియు నెరవేర్చబడినవని మనకు తెలియును. ఇదంతయు మనస్సులో ఉంచుకొని ఈ ప్రశ్నను మరలా అడుగుదాం.

**క్రీస్తు ఎవరి కొరకు మరణించాడు?**

ఏ భేదము లేక, జీవిస్తున్న ప్రతివ్యక్తి కొరకు, యావత్ ప్రపంచము కొరకు క్రీస్తు మరణించినట్లయితే, పైన ఉదహరించబడిన ఆయన మరణములో గల ఉద్దేశములన్నియు వారందరి యెడల నెరవేర్చనట్లవుతుంది. కాని క్రీస్తు ప్రాయశ్చిత్తకార్యము యొక్క ఫలితాలు ఒక్కో వ్యక్తికి ఒక్కో విధంగా వర్తిస్తాయని లేఖనాలలో ఎక్కడను ప్రస్తావించబడలేదు. కాబట్టి అవి ఒక వ్యక్తికి వర్తిస్తే సంపూర్ణముగా వర్తిస్తాయి లేదా అసలే వర్తించవు. అంత మాత్రమే కాక క్రీస్తు ఇవన్నియు చేసి ఎవరో ఒకరు అవకాశము తీసుకుని మేలు పొందుతారని దానిని ఎవరికిని వర్తింపజేయకుండా వుంచాడని లేఖనాలు సూచించడము లేదు. ఆయన సమాప్తమైనదని చెప్పినప్పుడు నిజంగానే అంతయు సమాప్తమైనది. ఆయన సాధించతలచినది సాధించాడు.

("చేయుటకు నీవు నాకిచ్చిన పని నేను సంపూర్ణముగా నెరవేర్చి భూమిమీద నిన్ను మహిమ పరచితిని. తండ్రీ, లోకము పుట్టక మునుపు నీ యొద్ద నాకు ఏ మహిమ వుండెనో ఆ మహిమతో నన్ను ఇప్పుడు నీ యొద్ద

మహిమ పరచుము” (యోహాను.17:4,5).

అంతేకాక క్రీస్తు కార్యము ఒక వ్యక్తి జీవితములో ప్రభావవంతమగుటకు దానికి ఇంకేదో జతచేయాలని లేఖనాలలో ఇసుమంతైనా చెప్పబడలేదు. క్రీస్తు ప్రాయశ్చిత్తకార్యమును కార్యసాధకము చేయుటకుగాను మనము మన విశ్వాసము, మన ఎన్నిక, మన నిర్ణయము మున్నగునవేవియు దానికి జతచేయనక్కరలేదు. ఆయనే స్వయంగా ఈ ప్రాయశ్చిత్త కార్యాన్ని సాధకము చేసి తండ్రి కుడిపార్శ్వమున ఆసీనుడయ్యాడు.

ఇవన్నియు పరిగణలోనికి తీసుకున్నప్పుడు ఒకవేళ అందరికొరకు క్రీస్తు మరణించినట్లయితే, తత్ఫలితంగా అందరు రక్షింపబడుదురని మనము నమ్మబద్ధులమైయున్నాము. కాని ఇది వాస్తవము కాదని లేఖనాలనుండి మనము ఎరుగుదుము. ప్రతిఒక్కరు రక్షింపబడరు. కొంతమంది శాశ్వతముగా దేవుని నుండి వేర్పరచబడుదురు.

“సముద్రము తనలో వున్న మృతులను అప్పగించెను. మరణమును పాతాళలోకమును వాటి వశముననున్న మృతులనప్పగించెను. వారిలో ప్రతివాడు తన క్రియల చొప్పున తీర్పుపొందెను. మరణమును మృతుల లోకమును అగ్నిగుండములో పడవేయబడెను. ఈ అగ్ని గుండము రెండవ మరణము. ఎవని పేరయినను జీవగ్రంథమునందు వ్రాయబడినట్లు కనబడనియెడల వాడు ఈ అగ్ని గుండములో పడవేయబడును” (ప్రకటన.20:13-15).

అయితే ఒకసారి సమాధానపరచబడి, నీతి మంతులుగా తీర్చబడి, విమోచింపబడి, పరిశుద్ధపరచబడి మరియు సంపూర్ణులుగా చేయబడిన మనుషులు, న్యాయవంతుడైన దేవునిచే అగ్నిగుండములో వేయబడి శాశ్వతముగా ఎలా శిక్షించబడగలరు? ఒకవేళ క్రీస్తు వారి ప్రాయశ్చిత్త వెల చెల్లించినట్లయితే, తిరిగి వారి పాపముల విషయమై వారినెలా తీర్పు తీర్చగలడు?

జవాబు : క్రీస్తు ఆ అగ్నిగుండములో పడబోవువారి స్థానములో మరణించలేదు. క్రీస్తు పాపభారము భరించినప్పుడు వారి పాపాలు ఆయన భుజాలపై లేవు. కాబట్టి మేము దీనిని తేటగా ప్రకటించుచున్నాము.

## ఎన్నుకొనబడిన వారికై మాత్రమే క్రీస్తు మరణించెను

తత్ఫలితంగా, ఎన్నుకొనబడినవారు దేవునిచే కొనబడినవారుగా, సంధిచేయబడినవారుగా, వ్యక్తిగతముగా నిర్దోషులుగా క్రీస్తునందు పరిశుద్ధులుగాను మరియు పరిపూర్ణులుగాను ఎంచబడ్డారు. దేవుడు వారి పాపములను తూర్పునకు పడమర ఎంత దూరమో అంత ఎడమగా చేసియున్నాడు. కనుక పాపాలను బట్టి వారు మరెన్నడునూ తీర్పు తీర్చబడరు (కీర్తనలు.103:12). దేవుడు వారికి బదులుగా తన కుమారునిపై ఉగ్రత కుమ్మరించాడు గనుక ఎన్నుకొనబడినవారిపై వారి పాపాన్ని బట్టి ఆయన తన ఉగ్రతను ఇక ఎన్నడును కుమ్మరించడు.

“మేకలయొక్కయు, కోడెలయొక్కయు రక్తముతో కాక తన స్వరక్తముతో ఒక్కసారే పరిశుద్ధ స్థలములో ప్రవేశించెను.' (హెబ్రీ. 9:12,)

పైగా ఈ సిద్ధాంతాల తార్కిక కొనసాగింపు మానవాళియంతటికొరకు క్రీస్తు మరణించలేదను ముగింపునకు నడిపించును. ఇప్పటిదాకా విషయ పరిసమాప్తి చేసినంతవరకు చూస్తే, ఒకవేళ భూమి పునాదులు వేయబడక మునుపే కొందరిని దేవుడు ఎన్నుకుని శేషితాన్ని తృణీకరించినట్లయితే, నశించుదురని ముందుగా ఎరిగినవారి నిమిత్తము వారి రక్షణ నిమిత్తము, దేవుడు తన కుమారుని ఎలా పంపుతాడు?

తాను చేయనుద్దేశించని వాటిని చేయుటకు ప్రయాసపడువానిగా దేవునిని చిత్రీకరిస్తే ఆయనను అవివేకిగా

చిత్రీకరించినట్లవుతుంది.

ఎన్నుకొనబడినవారు మాత్రమే విమోచింపబడతారని క్రీస్తే తన ప్రార్థనలో స్వయాన ప్రకటించాడు. "తండ్రీ, లోకము పుట్టక మునుపు నీయొద్ద నాకు ఏ మహిమ యుండెనో ఆ మహిమతో నన్ను ఇప్పడు నీ యొద్ద మహిమ పరచుము. లోకమునుండి నీవు నాకు అనుగ్రహించిన మనుష్యులకు నీ నామమును ప్రత్యక్షపరచితివి, వారు నీ వారైయుండిరి, నీవు వారిని నాకనుగ్రహించితివి; వారు నీ వాక్యము గైకొనియున్నారు. నీవు నాకనుగ్రహించిన మాటలు నేను వారికిచ్చియున్నాను. వారామాటలను అంగీకరించి నేను నీ యొద్ద నుండి బయలుదేరి వచ్చితినని నిజముగా ఎరిగి, నీవు నన్ను పంపించితివని నమ్మిరి గనుక నీవు నాకు అనుగ్రహించినవన్నియు నీ వలననే కలిగినవని వారిప్పడు ఎరిగియున్నారు. వారి కొరకు ప్రార్థన చేయుచున్నాను; లోకము కొరకు ప్రార్థన చేయుటలేదు, నీవు నాకనుగ్రహించియున్నవారు. నీ వారైనందున వారి కొరకే ప్రార్థన చేయుచున్నాను నావన్నియు నీవే, నీవన్నియు నావి. వారియందు నేను మహిమపరచబడియున్నాను" (యోహాను.17:5-10).

క్రీస్తు మరణానికి సిద్ధపడుచుండగా చేసిన ఈ ప్రార్థనలో దేవుడు తనకనుగ్రహించిన ప్రజలను ఈ క్రింది విధముగా వర్ణించాడు.

1. వారు దేవునికి చెందినవారు, వారు క్రీస్తునకు అనుగ్రహించబడ్డారు.
2. వారు ఆయన వాక్యమును గైకొనినవారు
3. క్రీస్తు కలిగియున్నవన్నియు దేవుని నుండి వచ్చినవేనని వారెరుగుదురు.
4. దేవుడు తనకు అనుగ్రహించిన మాటలను క్రీస్తు వారికిచ్చెను.
5. వారు ఆ మాటలు స్వీకరించారు.
6. క్రీస్తు దేవుని నుండి వచ్చాడని వారు ఖచ్చితముగా ఎరుగుదురు.
7. క్రీస్తును దేవుడు పంపాడను విశ్వాసము వారికుండును.
8. వారు దేవునికి చెందినవారు గనుక ప్రత్యేకముగా వారి నిమిత్తమై క్రీస్తు దేవుని వేడుకున్నాడు. ఈ ఖచ్చితమైన మాటలు గమనించండి. "నేను లోకము కొరకు ప్రార్థన చేయటలేదు కానీ వారికొరకే...."
10. వారియందు క్రీస్తు మహిమపరచబడును.

క్రీస్తు ఇలా ప్రార్థనలో కొనసాగుతూ దేవుడు ఎన్నిక చేసి తనకనుగ్రహించిన వారినే దీవించి, భద్రపరచమని వేడుకున్నాడు. అయితే ఇక్కడ క్రీస్తు తన ప్రార్థనలో సహితము కలుపుకొనని లోక సంబంధులను రక్షించుటకు, తన ప్రశస్తమైన రక్తాన్ని చిందించి ప్రాణాలనర్పించాడనటం ఎంతవరకు సమంజసం! అలాగైతే ఆయన కలవరంలో మూర్ఖముగా ప్రవర్తించాడని చెప్పినట్లవుతుంది. ఆయనకు చెందిన వారికి మరియు ఆయన ప్రార్థించని వారికి మధ్య క్రీస్తు చూపిన వ్యత్యాసము ప్రత్యేకముగా గమనించండి. 'క్రీస్తు కేవలం ఎన్నుకొనబడిన వారి కొరకు మాత్రమే మరణించాడను' మా వాదన, ఆయనే స్వయంగా చూపించిన ఈ వ్యత్యాసమును బట్టి నిర్ధారింపబడుచున్నది.

**గొఱ్ఱెలు**

'యేసు ఎన్నుకొనిన వారిని మాత్రమే రక్షించుటకు మరణించాడు' అను ఈ వాదమును మరింత బలపరచుటకు, ఎన్నుకొనిన తన విశిష్టప్రజలతో తనకున్న సంబంధమును సూచించులాగున ఆయన వాడిన పదజాలమును మాత్రమే మనము గమనించి చూస్తే సరిపోతుంది. మొదటి శతాబ్ది శ్రోతలు సులభముగా గ్రహించులాగున, వారి పరిస్థితులకు అనుగుణమైన అలంకార భాషను క్రీస్తు తరచుగా ఉపయోగించాడు. ఆ రోజులలో ఎక్కడ చూసినా

వ్యవసాయం, పశు సంపద మరియు గొఱ్ఱెలు సాధారణ దృశ్యములుగా కనిపించేవి. గనుక క్రీస్తు ఇలా అన్నాడు.

"నేను గొఱ్ఱెలకు మంచి కాపరిని, మంచి కాపరి గొఱ్ఱెలకొరకు తన ప్రాణముపెట్టును" (యోహాను. 10:11,).
"నేను గొఱ్ఱెల మంచి కాపరిని. తండ్రి నన్ను ఏలాగున ఎరుగునో నేను తండ్రిని ఏలాగు ఎరుగుదునో ఆలాగే నేను నా గొఱ్ఱెలను ఎరుగుదును. నా గొఱ్ఱెలు నన్ను ఎరుగును. మరియు గొఱ్ఱెల కొరకు నాప్రాణము పెట్టుచున్నాను." (యోహాను. 10:14,15,) గనుక క్రీస్తు, తన గొఱ్ఱెలు అని సూచించినప్పుడు ఏ మినహాయింపు లేకుండా ప్రతీ మానవునిని సూచించాడా అని విచారణ చేయుట యుక్తము. ఆ ప్రశ్నకు ఆయన చెప్పిన మాటలే సమాధానమిస్తాయి.

"అయితే మీరు నా గొఱ్ఱెలలో చేరినవారు కాదు గనుక మీరు నమ్మరు" (యోహాను. 10:26,)

"తన మహిమతో మనుష్య కుమారుడును ఆయనతో కూడా సమస్త దూతలును వచ్చునప్పుడు ఆయన తన మహిమగల సింహాసనము మీద ఆసీనుడైయుండును. అప్పుడు సమస్త జనములు ఆయన ఎదుట పోగు చేయబడుదురు; గొల్లవాడు మేకలలోనుండి గొఱ్ఱెలను వేరుపరచునట్లు ఆయన వారిని వేరు పరచి తన కుడివైపున గొఱ్ఱెలను ఎడమవైపున మేకలను నిలువబెట్టును. అప్పుడాయన ఎడమవైపున వుండు వారిని చూచి - శపింపబడినవారలారా, నన్ను విడిచి అపవాదికిని వాని దూతలకును సిద్ధపరచబడిన నిత్యాగ్నిలోనికి పోవుడి." (మత్తయి. 25:31-33, 41)

యేసు "నా గొఱ్ఱెలు" అని పలికినప్పుడు ఒక ప్రత్యేకగుంపును ఆయన సూచించెను. వాస్తవానికి యేసు పరిసయ్యులనుద్దేశించి నన్ను మీరు గ్రహింపలేదు అనుటలో సరళ కారణము వారు ఆయన గొఱ్ఱెలు కారు. ఈ ప్రపంచమంతయు "గొఱ్ఱెలు" మరియు "మేకలని" రెండు గుంపులుగా క్రీస్తు విభజించాడు. తన మరణము మేకల కొరకు అని యేసు ఎక్కడా కూడా ప్రస్తావించలేదు. తత్ఫలితముగా మేకలు తీర్పు తీర్చబడి శిక్షింపబడును.

"గొఱ్ఱెలు" అను ఈ పదజాలమునే ఉపయోగిస్తూ క్రీస్తు తన సంఘము కొరకే ప్రత్యేకముగా మరణించాడని పౌలు కూడా ఉద్బోధించాడు. "దేవుడు తన స్వరక్తమిచ్చి సంపాదించిన తన సంఘమును కాయుటకు పరిశుద్ధాత్మ మిమ్మును దేనియందు అధ్యక్షులనుగా ఉంచెనో ఆ యావత్తు మందను గూర్చియు, మీ మట్టుకు మిమ్మును గూర్చియు జాగ్రత్తగా ఉండుడి." (అపొ.కా.20:28,) పౌలు వివాహ సంబంధమును గూర్చి మాట్లాడినప్పుడు కూడా క్రీస్తు విమోచనాక్రియాపరిమితిని ప్రకటించాడు.

"పురుషులారా, మీరునూ మీ భార్యలను ప్రేమించుడి అటువలెనె క్రీస్తు కూడా "సంఘమును ప్రేమించి, దాని కొరకు" తన్ను తాను అప్పగించుకొనెను." (ఎఫెసీ. 5:25,)

మరియ గర్భధారణను గూర్చి దూత యోసేపుతో :
"ఆమె యొక కుమారుని కనును. '*తన ప్రజలను*' వారి పాపములనుండి ఆయనే రక్షించును గనుక ఆయనకు యేసు అను పేరు పెట్టుదువనెను." (మత్తయి. 1:21)
అంతేకాక యేసు విశదముగా ఇలా ప్రకటించెను - "తన స్నేహితుల కొరకు తన ప్రాణము పెట్టువానికంటె ఎక్కువైన ప్రేమగలవాడెవడును లేడు. నేను మీకాజ్ఞాపించిన వాటిని చేసినయెడల మీరు నా స్నేహితులై యుందురు. దాసుడు తన యజమానుడు చేయు దానిని ఎరుగడు గనుక ఇక మిమ్మును దాసులని పిలువక స్నేహితులని

పిలుచుచున్నాను. ఎందుకనగా నేను నా తండ్రి వలన వినిన సంగతులన్నిటిని మీకు తెలియజేసితిని" (యోహాను.15:13-15).

ఆయన ఎన్నుకొనిన అపొస్తులులతో క్రీస్తు మాటలాడుచుండెను. ఆయన ఏర్పరచుకొనిన గొఱ్ఱెలను గూర్చి మాటలాడెను. ఆయన సంఘమును గూర్చి మాట్లాడెను. ఆయన స్నేహితులను గూర్చి మాట్లాడెను. మరియు వారికొరకు ఆయన ప్రాణమును అర్పించెను. ఈ పదజాలములలో మినహాయింపు భావాలను స్పష్టముగా చూడగలము.

క్రీస్తు ప్రభుత్వమును స్వీకరించక దానిననుసరింపని వారు ఖచ్ఛితముగా ఆయన స్నేహితులు కాదు, ఆయన ప్రజలు కారు, ఆయన ప్రజలు కారు లేదా ఆయన గొఱ్ఱెలసలే కారు. తత్ఫలితముగా క్రీస్తు వారికొరకు ఆయన ప్రాణమును పెట్టలేదు.

**"పాత నిబంధన పోలికలు"**

ఆదాము పతనము తర్వాత దేవుడు స్త్రీ సంతానమునకును, సర్ప సంతానమునకును మధ్య వైరము కలుగునని సర్పమును శపించెను. ఆది నుండి క్రీస్తు వరకు ఈ స్త్రీ సంతానపు వంశావళిని మరియు దేవుడు వారితో వ్యవహరించిన కాలక్రమాన్ని బైబిలు తెలియజేయుచున్నది (గలతీ.3:16).

ఈ స్త్రీ సంతానమే ఇశ్రాయేలు యొక్క 12 గోత్రములుగా వెలిసాయి. ఏర్పరచబడిన ఈ జాతిని చూచుకొనుటలో దేవుడు మూడు వేర్వేరు నాయకత్వపు వ్యవస్థలను ఏర్పరిచాడు. ప్రవక్తలు, యాజకులు మరియు రాజులు. ఇవి ప్రాతినిధ్యము వహించే వ్యవస్థలు.

ఉదాహరణకు ప్రధాన యాజకుడు సంవత్సరమునకు ఒకసారి బలి అర్పించుటకై అతి పరిశుద్ధ స్థలములోనికి వెళ్ళినప్పడు ఆ ఏర్పరచబడిన జాతికి ప్రతినిధిగా దేవుని యెదుట నిలిచేవాడు. ప్రభువు మోషేను ఆజ్ఞాపించినట్లు, ఇశ్రాయేలు ప్రజలకు స్మారకార్థముగా యాజకుడు తన భుజములపై ఒక 'ఏఫోదు' ధరించేవాడు (నిర్గ.39:7). తన రొమ్ముపై మూడు ప్రశస్తమైన రత్నములు పొదగబడిన నాలుగు పంక్తులుగల పతకమును ధరించేవాడు. ఆ రత్నములు ఇశ్రాయేలీయుల పేర్ల చొప్పున పండ్రెండు ముద్రలవలె చెక్కబడిన వారి పేర్ల చొప్పున పండ్రెండు గోత్రముల పేర్లు ఒకొక్కదాని మీద ఒకొక్క పేరు చెక్కబడెను. ఎవరి భారమైతే ఆ ప్రధానయాజకుని భుజములపై ఉంచబడెనో కేవలం ఆ ఫలాన ప్రజల పక్షమున మాత్రమే ఆయన విజ్ఞాపన చేసేవాడు.

అతడు ప్రపంచపు పాపాల నిమిత్తము బలులర్పింపలేదు. అతడు అమాలేకీయులకు గానీ, జెబూసీయులకు గానీ యాజకుడుగా వుండేవాడు కాదు. కేవలము అబ్రహాము సంతతియైన వాగ్ధానసంతానమునకు మాత్రమే యాజకునిగా ఉండేవాడు.

దేవుడు ఏర్పరచిన రెండవ ప్రాతినిధ్యపు వ్యవస్థ - ప్రవక్తలు. ప్రవక్తలు దైవావేశము చొప్పన దేవుని వాక్కులు పలికేవారు. దేవుడు చెప్పదలచినది వారు చెప్పేవారు. అయితే కేవలము ఇశ్రాయేలు ప్రజల కొరకు మాత్రమే (అనగా ఏర్పరచబడిన ప్రజలకొరకు మాత్రమే) ప్రవక్తలు పంపబడ్డారు (హెబ్రి 1:1). మోయాబీయులకై లేదా ఫిలిష్తీయులకై ప్రవక్తలు పంపబడలేదు. ప్రవక్తలు ఇతర దేశాలనుద్దేశించి ప్రవచించినా, ఇశ్రాయేలు మరియు యూదా ప్రజలను హెచ్చరించి వారికి బోధించు నిమిత్తమే లేపబడ్డారు.

ఉదాహరణగా - మోషేను గమనిద్దాము. మోషే దేవుని ప్రవక్తగానుండేవాడు, ఆయన ద్వారా ఇశ్రాయేలు ప్రజలు సీనాయి కొండ దగ్గర ధర్మశాస్త్రమును పొందుకున్నారు. ఆ ధర్మశాస్త్రము అన్యులకనుగ్రహింబడలేదు. ఏర్పరచబడిన ఆ ప్రజలకు మాత్రమే దేవుడు తన నీతి ప్రమాణాలను తెలియజేశాడు. క్రీస్తు నొద్దకు మనలను నడిపించుటకు, ఈ ధర్మశాస్త్రమే మనకు బాలశిక్షకుడాయెను. (గలతీ 3:24). గనుక రక్షణ మార్గము ప్రపంచమంతటికినీ ప్రత్యక్షపరచబడలేదు. ఎన్నుకొనబడిన ఆ ప్రజలకు మాత్రమే ప్రవక్తలు ద్వారా అది ప్రత్యక్షపరచబడినది.

మూడవదిగా ఆయన ఎన్నుకొనిన ప్రజలపై రాజుల ఏలుబడిని దేవుడు నియమించాడు. భూమిని ఏలిన ప్రతీ ఏలిక తన అధికారమును దేవునియొద్ద నుండి పొందునన్నది వాస్తవమైనప్పటికీ భూసంబంధ రాజులలో ఏ రాజు కూడా దావీదుయంతటి ఘనత పొందుకోలేదు. ఆయన దేవుని హృదయానుసారుడుగా పిలువబడ్డాడు. మరియు ప్రతీరాజు ఒక ప్రత్యేకమైన రాజ్యముపై పరిపాలన చేయును. చరిత్రలో ఏ రాజు కూడా సార్వత్రిక ఆధిపత్యము కలిగియుండలేదు. అలాగే ఇశ్రాయేలు రాజులు కూడా దేవునిచే ఎన్నుకొనబడి, ప్రవక్తలచే అభిషేకించబడి, కేవలము ఇశ్రాయేలుపై మాత్రమే పరిపాలన చేసారు. ఏ వ్యక్తియు కూడా ఒకేసారి ఈ మూడు వ్యవస్థల కార్యాలను చేపట్టలేదు. దావీదు రాజుగాను, ప్రవక్తగాను ఉండేవాడు కానీ ఎన్నడునూ యాజకుడుగానుండలేదు. అహరోను ప్రధానయాజకుడుగాను, ప్రవక్తగాను ఉండేవాడు కానీ ఎన్నడునూ రాజుగానుండలేదు. ఉజ్జియా రాజు ఆ అవధులను దాటి ధూపము వేయ ప్రయత్నించాడు. అవి యాజకునిధర్మం, కావున ఆయన మరణించువరకు దేవుడాయనను కుష్ఠుతో మొత్తెను (2దిన. 26:16,21).

సౌలు రాజుగా నుండి ప్రవచించాడు కాని ఎన్నడును యాజకుడుగా వుండలేదు. ఈ మూడు కార్యాములన్నియు పోలికలుగాను ఛాయలుగా వుంటూ క్రీస్తు యేసునందు నెరవేర్చబడ్డాయి.

రాబోవు 'మెస్సీయ'ను గూర్చి ప్రవక్తలందరూ ప్రవచించారు.
"మీ పితరులు ప్రవక్తలలో ఎవనిని హింసింపకయుండిరి? ఆ నీతిమంతుని రాకను గూర్చి ముందు తెలిపిన వారిని చంపిరి. ఆయనను మీరు ఇప్పడు అప్పగించి హత్య చేసినవారైతిరి" (అపొ.కా. 7:52).

యాజకులు, నిజ విమోచకుడు వచ్చి తన స్వంత రక్తమును బలిగా అర్పించేవరకూ, తాత్కాలికముగా విజ్ఞాపన కర్త కార్యమును నిర్వహించారు.

"అంతేకాదు, ప్రధాన యాజకుడు ప్రతి సంవత్సరము తనది కాని రక్తము తీసుకొని పరిశుద్ధ స్థలములోనికి ప్రవేశించునట్లు ఆయన అనేక పర్యాయములు తన్ను తాను అర్పించుకొనుటకు ప్రవేశించలేదు. అట్లయినయెడల జగత్తు పునాది వేయబడినది మొదలుకొని ఆయన అనేక పర్యాయములు శ్రమపడవలసివచ్చును. అయితే ఆయన యుగముల సమాప్తియందు. తన్నుతానే బలిగా అర్పించుకొనుట వలన పాపనివారణ చేయుటకై యొక్కసారే ప్రత్యక్షపరచబడెను." (హెబ్రీ. 9:25,26)

చరిత్ర వేదికపై దావీదు కుమారుడు అవతరించేవరకూ రాజులు ఇశ్రాయేలీయులపై పరిపాలన చేశారు. అలాగే జయశాలి వచ్చి తన రాజ్యమును లోబరచుకునేంతవరకూ భూసంబంధ రాజులను ఏలుదురు.

“నమ్మకమైన సాక్షియు, మృతులలోనుండి ఆదిసంభూతుడుగా లేచినవాడును, భూపతులకు అధిపతియునైన యేసుక్రీస్తు నుండియు కృపాసమాధానములు కలుగునుగాక. మనలను ప్రేమించుచు తన రక్తమువలన మన పాపములనుండి మనలను విడిపించిన వానికి మహిమయు ప్రభావమును యుగయుగములకు కలుగును గాక.” (ప్రకటన. 1:5,6)

ప్రవక్తగా, యాజకునిగా మరియు రాజుగా చెప్పబడిన ఏకైక మానవుడు యేసుక్రీస్తు.

“నావంటి యొక ప్రవక్తను దేవుడు మీ సహోదరులలోనుండి మీకు పుట్టించును అని ఇశ్రాయేలీయులతో చెప్పిన మోషే ఇతడే.” (అపొ.కా.7:37)

“పూర్వకాలమందు నానా సమయములలోను నానా విధములగాను ప్రవక్తల ద్వారా మన పితరులతో మాట్లాడిన దేవుడు ఈ దినముల అంతమందు కుమారుని ద్వారా మనతో మాట్లాడెను.” (హెబ్రీ. 1:1,2)

“ఎందుకనగా ప్రవక్త స్వదేశములో ఘనత పొందడని యేసు సాక్ష్యమిచ్చెను.” (యోహాను. 4:44)

“కావున ప్రజల పాపములకు పరిహారము కలుగజేయుటకై దేవుని సంబంధమైన కార్యములలో కనికరమందు నమ్మకముగల ప్రధాన యాజకుడగు నిమిత్తము అన్ని విషయములలో ఆయన సహోదరులవంటివాడు కావలసివచ్చెను.” (హెబ్రీ.2:17)

“ఇందువలన పరలోకసంబంధమైన పిలుపులో పాలు పొందిన పరిశుద్ధ సహోదరులలో, మనము ఒప్పుకొనిన దానికి అపొస్తలుడును ప్రధానయాజకుడునైన యేసు మీద లక్ష్యముంచుడి.” (హెబ్రి. 3:1)

“మన ప్రభువైన యేసు ప్రత్యక్షమగు వరకు నీవు నిష్కళంకముగాను అనింద్యముగాను ఈ ఆజ్ఞను గైకొనవలెనని నీకు ఆజ్ఞాపించుచున్నాను. శ్రీమంతుడును అద్వితీయుడునగు సర్వాధిపతి యుక్త కాలములయందు ఆ ప్రత్యక్షతను కనుపరచును. ఆ సర్వాధిపతి రాజులకు రాజును ప్రభువులకు ప్రభువునైయున్నాడు.” (1 తిమోతి. 6:14,15)

“రాజులకు రాజును ప్రభువులకు ప్రభువును అను నామము ఆయన వస్త్రము మీదను తొడ మీదను వ్రాయబడియున్నది.” (ప్రకటన. 19:16)

యేసుక్రీస్తు దేవునికై మాటలాడిన కడమ ప్రవక్త; దేవుని కరుణాపీఠము చెంత తన స్వరక్తమును ఒలికించిన మిక్కిలి హెచ్చయిన ప్రధాన యాజకుడు; యేసు రాజులందరికీ రాజు.

అయితే, ఈ వ్యవస్థల విధినిర్వహణలో వాటి ఉద్దేశమును, స్వభావమును ఆయన మార్చలేదు. విశ్వాసమందు అబ్రహాము సంతానమునకు అనగా, ఏర్పరచబడిన వారికి ఆయన ప్రధానయాజకుడు; ఈ లోకమునుండి ఆయనకు అనుగ్రహింపబడిన వారికి దేవునివాక్యము అందించిన ప్రవక్త. తిరుగుబాటుదారులను శిక్షించి ఆయనకు నమ్మకమైన వారికి ప్రతిఫలములనిచ్చే న్యాయనిబద్ధతగల రాజు. క్లుప్తంగా చెప్పాలంటే ఏర్పరచబడిన వారికి, ఈ వ్యవస్థల నెరవేర్పు ఆయనే.

**ఆర్మీనియనుల పరిమితి**

క్రీస్తుకార్యముపై పరిమితులు పెట్టుట సరైనది కాదనియు అలా చేయుట మూర్ఖప్రవర్తన అనియు ఈ సిద్ధాంత వ్యతిరేకులు వాదిస్తారు. అయితే సత్యము తెలియును గాక, ఆర్మీనియన్‌ల 'సార్వత్రిక ప్రాయశ్చిత సిద్ధాంతం' వాస్తవానికి క్రీస్తుకార్యముపై మేము సూచించినదాని కంటె మరింత కఠినపరిమితిని విధించును.

ఒకవేళ క్రీస్తు మరణము రక్షణను కేవలం సుసాధ్యపరచి, ఎవరైనా దానిని వినియోగించగోరితే, వారికి తద్వారా రక్షణ ఏర్పాటు చేసినట్లయితే, క్రీస్తు వాస్తవానికి ఎవరిని కూడా రక్షింపలేదు. ఎవరైనా ఒకవేళ క్రీస్తు ప్రాయశ్చిత్తమును ఉపయోగింప నిశ్చయించుకున్నట్లయితే వారి రక్షణకు కేవలం వినియోగపడునట్లు క్రీస్తు పవిత్ర పరిచే తన రక్తమును ఒలికించియున్నాడని సార్వత్రికప్రాయశ్చిత్త వాదకులు మనము విశ్వసించాలని కోరుదురు. ఒక వ్యక్తి తన చిత్తానుసారంగా ఈ ప్రాయశ్చిత్తమును తన జీవితానికి అన్వయించుకొనగోరు తీర్మానమే రక్షణకు వాస్తవమైన ప్రేరకమని వారి వాదన.

కృపాసిద్ధాంతములు ప్రాయశ్చిత్తపుపరిధిని పరిమితి చేస్తే ఆర్మీనియనులు దాని శక్తిని పరిమితి చేస్తున్నారు. నిస్సందేహంగా క్రీస్తు యొక్క శ్రమ మరియు మరణము, జీవించిన ప్రతియొక్కరిని రక్షించుటకు చాలినది; కాని ఎన్నుకొనబడిన వారికి మాత్రమే అది ప్రభావవంతమైనది.

ఆర్మీనియను భావకుడు క్రీస్తు ప్రాయశ్చితకార్యమును, మానవునికి దేవునికి మధ్యనున్న మహా అగాధము నందలి సగదూరమును మాత్రమే పూర్చివేయువంతెనగా వీక్షించును; మానవుడు తక్కిన సగదూరమును పూరించుకుని పరలోక గమ్యము చేరుకోవాలి; అయితే కాల్వినిస్ట్ భావకుడు క్రీస్తు ప్రాయశ్చిత్తకార్యమును, పతనానికి రక్షణకు మధ్యగల అగాధాన్ని సంపూర్ణముగా పూడ్చివేయు సంకుచితమైన, బలీయమైన వారధిగా వీక్షించును; కాని ఈ మార్గము ప్రసిద్ధియైనది కాదు మరియు దానిని కనుగొనుట కష్టము.

"ఇరుకు ద్వారమున ప్రవేశించుడి నాశనమునకు పోవు ద్వారము వెడల్పును, ఆ దారి విశాలమునైయున్నది. దాని ద్వారా ప్రవేశించువారు అనేకులు. జీవమునకు పోవు ద్వారము ఇరుకును ఆ దారి సంకుచితమునైయున్నది. దాని కనుగొనువారు కొందరే." (మత్తయి.7:13-14,)

గనుక మనము ఆర్మీనియన్ భావననుసరించి ప్రాయశ్చిత్త ప్రభావాన్ని, లేదా కాల్వినిస్టు భావాన్ననుసరించి ప్రాయశ్చిత్త పరిధిని పరిమితం చేయబద్ధులమైయున్నాము. మరో ప్రత్యామ్నాయం లేదు. బైబిలు ఒకవైపు క్రీస్తు మరణముయొక్క నిరంకుశమైన పరిపూర్ణతను మరియు సంపూర్ణ సాఫల్యతను స్థిరపరుస్తూ, ఈ ప్రాయశ్చిత్తపు అన్వయింపు కేవలం దేవుని చేత ఎన్నిక చేయబడిన వారికి మాత్రమే పరిమితమని కూడా దృఢపరుస్తున్నది. కాబట్టి ఆర్మీనియనుల పరిమితికి లేఖనాధారాలు లేవు.

**'ఇతర వాదనలు'**

సందర్భరహితముగా చూసినపుడు పరిమితప్రాయశ్చిత సిద్ధాంతములోని సత్యమును కూలద్రోయునట్లుగా అగుపించు ఆయా లేఖనభాగాలను చూపించి ఈ సిద్ధాంతమును సవాలు చేయుట దీనిని వ్యతిరేకించు వారి సాధారణ విధానం. కాని సందర్భసహితముగా చూసినప్పడు ఆ వాక్యభాగములు ఈ సిద్ధాంతమును కూలద్రోయునవి కాక బలపరుచునవిగా నిర్ధారితం అవుతాయి.

1). అందరు రక్షింపబడతారనే భావనను బలపరచుటకు " ఎవడును నశింపవలెనని యిచ్ఛయింపక, అందరు మారుమనస్సు పొందవలెనని కోరుచు" అనే మాట అత్యధికముగా ఉపయోగించబడే లేఖనభాగము. ఈ మాట 2 పేతురు 3:9 నుండి ఉదహరింపబడినది. దీనిని సందర్భసహితముగా చూస్తే సువార్తను అపహసించి, "ఆయన రాకను గూర్చిన వాగ్దానయేమాయెను? పితరులు నిద్రించినది మొదలుకొని సమస్తమును సృష్టి

ఆరంభమునన్నున్నట్టే నిలిచియున్నదే" అనే చెప్ప అంత్యదినపు అపహాసకులు విషయాన్ని పేతురు ఇక్కడ ప్రస్తావించుచున్నాడు. (2పేతురు 3:4) అయితే పేతురు "కొందరు ఆలస్యమని యెంచుకొనునట్లు ప్రభువు తన వాగ్ధానమును గూర్చి ఆలస్యము చేయువాడు కాదు కాని ఎవడును నశింపవలెనని యిచ్ఛయింపక, అందరు మారుమనస్సు పొందవలెనని కోరుచు "మీ యెడల దీర్ఘశాంతము గలవాడై యున్నాడు" (2పేతురు 3:9) అని జ్ఞాపకము చేస్తున్నాడు.

"ఎవడును నశింపవలెనని యిచ్ఛయింపక" అను మాటను వివరించుటలో "మీ యెడల" అని ఈ వచనములో ప్రయోగించబడిన పదము ఎంతో కీలకమైనది. పేతురు ఈ పత్రికను ఎవరికి వ్రాసాడో మనము స్థిరపరచగలిగితే "మీయెడల" అని ఆయన ఎవరిని ఉద్దేశించి చెప్పాడో తెలుసుకొనవచ్చును. 1పేతురు1:2 లో తండ్రి దేవుని భవిష్యత్ జ్ఞానమును బట్టి, ఆత్మ వలన పరిశుద్ధత పోందిన వారై విధేయులగుటకును, యేసు క్రీస్తు రక్తము వలన ప్రోక్షింపబడుటకును ఏర్పరచబడినవారని ఆయన వారిని గుర్తించాడు.

2 పేతురు. 1:1 లో '....దేవుని యొక్కయు రక్షకుడునైన యేసుక్రీస్తుయొక్కయు నీతిని బట్టి, మావలనే అమూల్యమైన విశ్వాసము పొందిన వారని ఆయన వారిని గుర్తించాడు.'

పేతురు చూపిన వ్యత్యాసమును మనము గమనించుట చాలా ప్రాముఖ్యము. క్రీస్తు తిరిగి వచ్చుట అను భావమును కొందరు అపహాస్యము చేయుదురు. ఆయన వారిని అపహాసకులని శరీర దురాశలను బట్టి నడుచుకొను వారని పిలుచుచున్నాడు. అపహాసముతో మరియు అవిశ్వాసంలో వున్న వారికి భిన్నముగా దేవుని కృపను స్వీకరించిన వారిపట్ల దేవుడు దీర్ఘశాంతముగలవాడైయున్నాడని ఇక్కడ యిరువురి వ్యత్యాసమును తెలుపుచున్నాడు. కాబట్టి పేతురు విశ్వాసులనుద్దేశించి "మీ యెడల" అని చెప్పచున్నాడు..

ఇప్పటి సందర్భములో చూచినట్లయితే, ఏర్పరచబడిన మనలో ఎవరునూ నశింపవలెనని దేవుడు ఇచ్ఛయింప లేదు గనుక మనలో యెవడును నశింపడు. మనమందరమును మారుమనస్సు పొందవలెనని ఆయన యిచ్ఛయించుచున్నాడు గనుక మనమందరమును తప్పక మారుమనస్సు పొందుదుము. ఎన్నుకొనబడిన వారందరు మారుమనస్సు పొందువరకూ ఆయన తన మహిమాన్విత ప్రత్యక్షతను మరియు ఆయన తీర్పుయొక్క ఉగ్రతను ఆలస్యము చేయుచున్నాడు. అదే విధముగా పేతురు వ్రాసిన ఈ అధ్యాయం యొక్క సందర్భము నిత్యరక్షణ గురించి కాదు. పేతురు ఇక్కడ రాబోవు ప్రపంచ అంతమును గూర్చి మాట్లాడుచున్నాడు. రక్షణ విషయమై దేవుని దృక్పథం తెలుసుకొనుటకుతగాను ఆ అంశమును ప్రస్తావించే వాక్యభాగములను మనము పరిశీలించాలి. ఇది అటువంటి వాక్యభాగం కాదు. లేదా మరొక విధంగా ఆలోచించినట్లయితే ఈ వచనానికి పెడార్థము చెప్పవారు మనలను విశ్వసించవలెనని కోరునట్లు అందరూ రక్షించపడుట దేవుని చిత్తమయితే తమ స్వచిత్తము చేత ఆయనను తిరస్కరించి నరకపాత్రులైన వారియెడల ఆయన చిత్తము భగ్నపరచబడెననియూ, క్రీస్తు తన రక్తాన్ని చిందించి వారికై భద్రపరచిన రక్షణకతీతంగా వారు నశించారనియూ చెప్పినట్లవుతుంది. ఎవరునూ నశింపకూడదను దేవుని చిత్తమునకు అతీతంగా వారు నశించారు గనుక మానవ మాత్రుల స్వచిత్తమే దేవుని చిత్తము కంటే బలిష్టమని చెప్పినట్లవుతుంది. అట్టి దేవశాస్త్రము దేవునిని శక్తిహీనునిగాను మరియు దయనీయమైన వానిగాను కనపరచి తన ప్రియులు నిరంతరము నశిస్తూవుంటే, చూస్తూ దాని గూర్చి ఏమి చేయలేని నిస్సహాయునిగా చిత్రీకరిస్తుంది. కాని బైబిల్లోని అటువంటి దేవుడు కాదు.

2) "దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టినవానియందు విశ్వాముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవమును పొందునట్లు ఆయనను అనుగ్రహించెను." (యోహాను.3:16) క్రీస్తు పరిచర్య సార్వత్రికమని వాదించు ఆర్మీనియన్లకు ఈ వచనము అతి ప్రియమైనది. పై వచనమును ఇష్టమైన

వచనముగా ఆర్మీనియనువేదాంతులు వాడెదరు. వారి వాదనకు మూలపదము "లోకము". లోకమంటే వారి భావమేమిటంటే ఎటువంటి మినహాయింపు భేదమూ లేకుండ, జీవించుచున్న ప్రతివ్యక్తికి దేవుని యొక్క విమోచనాత్మక ప్రేమ వర్తించునని. కాబట్టి ప్రతి భూనివాసికిని నిత్యజీవమను ప్రతిఫలమును పొందు అవకాశము అనుగ్రహింపబడియున్నది; అందరికిని సిలువ కార్యము వర్తించునని వారివాదన. కాని నిజముగా ఈ వచనము సెలవిచ్చుచున్నదేమి? లోకము "అంటే" గ్రీకులో "కాస్మోస్" అని ఉన్నది. ఈ పదమునుండియే "కాస్మోపొలిటన్" అను మాట వచ్చెను.

ఆయా సందర్భములలో అది విశ్వాములోనున్నదంతయూ లేదా గ్రహముపైనున్నదంతయూ అని అర్థమిచ్చును. అయినప్పటికీ తరచుగా ఈ పదము ఇశ్రాయేలీయుల ప్రత్యేకతకు భిన్నముగా ప్రతి జాతి భాష మరియు దేశానికి చెందిన మానవులను సూచించుటకు కూడా ప్రయోగించబడినది. కాస్మోస్ (లోకము) అనగా గ్రీకు భాషలో రెండు అర్థములున్నవి వాటిని విడివిడిగా అర్థము చేసుకోవాలి లేనిచో మనము చాలా గలిబిలికి గురౌతాము.

మొదటిగా క్రైస్తవులుగా మారినవారు యూదులు, "ఇశ్రాయేలులో తప్పిపోయిన గొఱ్ఱెలయొద్దకు తొలుత వెళ్లమని క్రీస్తు తన శిష్యులకు ఆదేశమిచ్చాడు" (మత్తయి.10:6). కాబట్టి క్రైస్తవ్యము అన్యప్రపంచమునకు కూడా వ్యాపించుననుట వారి సహజ భావనకు వ్యతిరేకమైనది. దీనికి ప్రత్యుత్తరముగా యోహాను యేసుక్రీస్తు సెలవిచ్చిన మాటను గ్రంథస్థం చేస్తూ - దేవుడు ప్రతిజాతి, వంశములోనుండి ఆయా వ్యక్తులను ప్రేమించి వారికై తన కుమారుని ఇచ్చాడనే భావంతో దేవుడు లోకమును ఎంతో ప్రేమించెనని వ్రాశాడు. లేదా దీనిని మరొకవిధముగా ఆలోచించినట్లయితే 'లోకమంటే లోకములో పుట్టిన ప్రతీ మానవుడు' అనే ఆర్మేనియన్ల అర్థము పరిగణలోనికి తీసుకున్నట్లయితే, యోహాను సొంత మాటలనే విభేదించినవారమౌతాము. మరో సందర్భములో యోహాను ఇలా వ్రాసాడు :

"ఈ లోకమునైననూ (కాస్మోస్) లోకములో వున్నవాటినైననూ ప్రేమింపకుడి, ఎవడైననూ లోకమును ప్రేమించినయెడల తండ్రి ప్రేమ వానిలో ఉండదు." (1 యోహాను.2:15)

దేవుడు తానే ప్రేమించి ఆయన కుమారుని అనుగ్రహించిన ఈ లోకమును ప్రేమించవద్దని యోహాను భావమా? కాదు, ఈ రెండు వ్యతిరేక భావాలను మేళవించుటలో "కాస్మోస్" అను పదముయొక్క సరైన అన్వయింపును గుర్తెరుగుట ఎంతో అవసరము. దేవుడు ఇశ్రాయేలీయులను మాత్రమే గాక ప్రపంచ ప్రతి భాగమునుండి ఆయా వ్యక్తులను ప్రేమించెను. అయితే మనము లోకములో ప్రతిదానిని లేదా దాని బాహ్య స్వరూపాన్ని, ఆకర్షణలను, ప్రతి వ్యక్తిని ప్రేమించకూడదు. (కీర్త.139:21,22).

దీనినే మరో విధంగా చూద్దాం :-

ఏశావు లోకములో వుండెనా? అవును

దేవుడు ఆయనను ప్రేమించాడా? లేదు. దేవుడు ఆయనను ద్వేషించాడు.

"నేను మీ యెడల ప్రేమ చూపించుచున్నాను, అయితే మీరు - ఏ విషయమందు నీవు మా యెడల ప్రేమ చూపితివందురు. ఏశావు యాకోబునకు అన్న కాడా? అయితే యాకోబును ప్రేమించితిని; ఇదే యెహోవా వాక్కు. ఏశావును ద్వేషించి అతని పర్వతములను పాడుచేసి అతని స్వాస్థ్యమును అరణ్యమందున్న నక్కలపాలు చేసితివి." (మలాకి. 1:2,3)

"ఇందును గూర్చి నేను యాకోబును ప్రేమించితిని ఏశావును ద్వేషించితిని" ( రోమా.9:13 ) అని వ్రాయబడియున్నది.

లేదా పరిసయ్యుల మాటేమిటి? వారు లోకములో నుండిరా? అవును. క్రీస్తు వారిని ప్రేమించి వారికై తనను తాను అప్పగించుకొనెనా? ఖచ్చితముగా కాదు.

“సర్పములారా, సర్ప సంతానమా నరకశిక్షను మీరెలాగు తప్పించుకొందురు?” (మత్తయి. 23:33)

“మీరు మీ తండ్రియగు అపవాది సంబంధులు; మీ తండ్రి దురాశలు నెరవేర్చగోరుచున్నారు. ఆదినుండి వాడు నరహంతకుడైయుండి సత్యమందు నిలిచినవాడు కాడు; వానియందు సత్యమే లేదు. వాడు అబద్ధమాడునప్పుడు తన స్వభావమునననుసరించియే మాటలాడును. వాడు అబద్ధికుడును అబద్ధమునకు జనకుడైయున్నాడు. నేను సత్యము చెప్పుచున్నాను గనుకనే మీరు నన్ను నమ్మరు. నాయందు పాపమున్నదని మీలో ఎవడు స్థాపించును? నేను సత్యము చెప్పుచున్నయెడల మీరెందుకు నన్ను నమ్మరు? దేవుని సంబంధియైన వాడు దేవుని మాటలు వినును. మీరు దేవుని సంబంధులు కారు గనుకనే మీరు వినరని చెప్పెను.” (యోహాను. 8:44-47 )

ఆర్మీనియన్ భావనలోగల “లోకము”, ఏ మినహాయింపు లేకుండా ప్రతీ వ్యక్తిని ఇముడ్చుకొనును గనుక ఈ శాస్త్రులు పరిసయ్యులు కూడా ఖచ్చితముగా అందులో భాగస్థులే కదా! అయితే నరక శిక్షను తప్పించుకోలేని, అపవాది సంబంధులను దేవుడు ప్రేమించాడని, వారు నశిస్తారని ఎరిగియు వారికొరకై ఆయన తన కుమారుని పంపాడని మనం నమ్మాలా? లేఖనబద్ధంగా మనం వుండగోరితే అట్టి నమ్మిక వీలుపడదు.
ఈ విషయము మనకింకా అర్థము కావాలంటే, దేవుడు సర్వ లోకమును ప్రేమించినట్లయితే, క్రీస్తు వారికై ప్రార్థించుటకు ఎందుకు నిరాకరించాడు?
3) “ఇది మంచిదియు మన రక్షకుడగు దేవుని దృష్టికి అనుకూలమునైయున్నది. అయన మనుష్యులందరూ రక్షణపొంది సత్యమును గూర్చిన అనుభవజ్ఞానముగలవారై యుండువలెనని యిచ్ఛయించుచున్నాడు. దేవుడొక్కడే; దేవునికి నరులకిని మధ్యవర్తియు ఒక్కడే; ఆయనే క్రీస్తు యేసను నరుడు. ఈయన అందరికొరకు విమోచన క్రయధనముగా తన్నుతానే సమర్పించుకొనెను. దీనిని గూర్చిన సాక్ష్యము యుక్తకాలములయందు ఇయ్యబడును.” (1 తిమోతి. 2:3-6)

రెండు కారణములను బట్టి ఆర్మీనియన్ వేదాంతులు ఈ వచనముపై దూకెదరు. మొదట, “మనుష్యులందరు రక్షణపొంది” అనుమాట. రెండవది, “ఆయన అందరికొరకు విమోచనా క్రయధనముగా తన్నుతానే అర్పించుకొనెను” అనుమాట. కానీ దాని సుదీర్ఘసందర్భమును ఆధారము చేసుకుని ఈ రెండు వచనములను అర్థము చేసుకోవాలి.

ఈ వాక్యభాగము అపోస్తలుడైన పౌలునుండి వచ్చినది. పౌలు ప్రతేకముగా అన్యులకు పరిచర్య చేసేవాడు. వాస్తవానికి ఈ వాక్యభాగానికి తరువాయి వచనము దీనిని ధృఢపరచుచున్నది.

“ఈ సాక్ష్యమిచ్చుటకై నేను ప్రకటించువాడనుగాను, అపొస్తలుడనుగాను, అన్యజనులకు బోధకుడనుగాను నియమించబడితిని. నేను సత్యమే చెప్పుచున్నాను, అబద్ధమాడుటలేదు.”

పౌలు తన అపొస్తలత్వమును పునరుద్ఘాటించుచున్నాడు. “క్రీస్తునందు సత్యము చెప్పుచున్నానని” నొక్కి చెప్పుచున్నాడు. ఆయన పరిచర్య యావత్తు, సువార్త అన్యులకు చేరుట విషయమై అభ్యంతరపడిన యూదుల మధ్య జరిగింది. పేతురు సహితము ఈ భావముతో ఇబ్బందిపడ్డాడు (అపొ.కా.10) కాని తన బోధ, ఉపదేశము మరియు పరిచర్య ప్రత్యేకముగా అన్యులకే అని పౌలు ప్రకటించాడు. ఎందుకని? ఎందుకంటే యేసు యూదులకు మాత్రమే గాక అందరి నిమిత్తము క్రయధనముగా తన్ను తాను అర్పించుకొనెను మరియు దేవుడు యూదులను మాత్రమే రక్షింపనుద్దేశింపక, అందరిని రక్షింపదలచెను. అందరూ అనగా లోకములో పుట్టిన ప్రతీ వ్యక్తి అని

కాదు గానీ, అన్ని వర్గముల ప్రజలు అని అర్థము. ఇక్కడ ప్రయోగించబడిన "పాస్" అనే గ్రీకు పదము అనేక రకముల అనే భావాన్ని కలిగియున్నది.
దేవుడు కొందరిని శాశ్వతముగా ఖండించాడని ఇదివరకే కొన్ని వచనాల వెలుగులో తెలుసుకున్నాము. కాబట్టి 1 తిమోతి 2వ అధ్యాయ వాక్యభాగము నుండి, దేవుడు ఏ మినహాయింపు లేకుండా ప్రతీ వ్యక్తిని విమోచనా క్రయధనము చెల్లించి రక్షింప నిశ్చయించాడని గ్రహించుట అసాధ్యము. కానీ మొదటి శతాబ్దపు యూదా సంఘపు భావన గమనిస్తే పౌలు చెప్పదలచినది మనకు అర్థమగును.

4) "ఎవరైతే విశ్వసిస్తారో"
శ్రద్ధగా ఆలకించిన ప్రతీ వారికి సువార్త ఉచితముగా ప్రకటింపబడినట్లు మనము లేఖనములలో కనుగొందుము. "చెవిగలవాడు వినునుగాక" (మత్తయి.11:15). ఎవరైతే విశ్వసిస్తారో అను పదములో ఒక వ్యక్తి యొక్క తీర్మాన సామర్థ్యమే వాక్యాన్ని ప్రభావితము చేయు నిర్ణయాత్మకాంశమను బలమైన భావన ఇమిడియున్నదని వాదిస్తూ ఆర్మీనియన్ వేదాంతులు క్రొత్త నిబంధనలో రెండు ప్రత్యేకవచనములు చూపిస్తారు.

"అంతట ఆయన తన శిష్యులను జనసమూహమును తన యొద్దకు పిలిచి - నన్ను వెంబడింపగోరువాడు తన్నుతాను ఉపేక్షించుకొని తన సిలువనెత్తుకొని నన్ను వెంబడింపవలెను." (మార్కు. 8:34)

"ఆత్మయు పెండ్లి కుమార్తెయు రమ్ము అని చెప్పుచున్నారు; వినువాడును రమ్ము అని చెప్పవలెను; దప్పిగొనినవానిని రానిమ్ము; ఇచ్ఛయించు వానిని జీవజలమును ఉచితముగా పుచ్చుకోనిమ్ము." (ప్రకటన. 22:17)

అయితే కాల్వినిస్టు వేదాంతులు సువార్త సందేశపు స్వేచ్ఛాయుత పురోగమనాన్ని ఎన్నడూ పరిమితం చేయలేదని మనం మొదట గమనించాలి.

ఎవరైతే క్రీస్తుపై భారము మోపి సంపూర్ణము చేయబడిన క్రీస్తు కార్యముపై యథార్థముగా విశ్వసింతురో వారు తప్పక రక్షింపబడుదురని మేము హృదయపూర్వకముగా సమ్మతించుచున్నాము. అయితే ఈ ఉచిత వరమును ప్రతి ఒక్క మానవుడు సద్వినియోగము చేసికొనడనునది కూడా విధితమే. గనుక ఎవరైననూ దేవుని కృపలో పాలుపుచ్చుకొనవచ్చునని ఒకవైపు చెప్పబడినా అందరునూ పాలుపుచ్చుకొనరు. కేవలం ఎన్నుకొనబడినవారు మాత్రమే పాలుపుచ్చుకుంటారు.

కాని ఇక్కడ కాస్త వివరణ సహాయపడును. "ఎందరైతే" "ఎవరైనా" ఈ పదములకు గ్రీకులో సమాన పదములు లేవు. పై పదములకు గ్రీకులో రెండు మాటలు కలవు. "పాస్‌హో" ఈ గ్రీకు పదములను అనువదిస్తే "ఆ ఫలానా వారందరు" అను అర్థము వచ్చును. అది ప్రత్యేక ప్రజలను అనగా "విశ్వసించువారందరిని" సూచించును. కాబట్టి సమకాలిన భాషానువాదములో వాడబడిన పదముల అర్థము చూస్తే, తమ స్వేచ్ఛాచిత్తమును అభ్యాసించువారందరికి దేవుడు రక్షణ ద్వారమును తెరచి వుంచినట్లు అగుపడును, కానీ ఆదిమ భాషయైన గ్రీకులో ఆ భావనే లేదు.

అయితే ఇట్టి గ్రహింపు ఏ విధముగా కూడాను కృపాసువార్తను అందరికి ప్రకటించుటలో కాల్వినిస్ట్‌ల ఆతురతను అడ్డుకోదు, ఆపదు. ఒకానొక బోధకుడు ఇలా చెప్పట నేను విన్నాను, 'దేవుడు తాను ఏర్పరచిన వారిపై ఒక

నియాన్ ముద్రవేసి లేదా వారి తల వెంట్రుకలు నిలుచునేలా చేసి లేదా ఇంకేదయినా బాహ్యమైన గుర్తును వారిపైవుంచి తద్వారా వారి ఎన్నికను దృష్టీకరించి వుంటే సువార్త బోధించుట ఎంతో సులువైయుండేది.' కాని మేకల మధ్యన గొఱ్ఱెలు చెదరియున్నవి. గనుక వినువారందరికిని ఉచిత సువార్తను మరియు సార్వభౌమ కృపను బోధించుట ప్రతి సువార్త పరిచారకుని బాధ్యత. వారి ఎన్నికను స్పష్టము చేస్తూ, దేవుడిచ్చిన చెవులుగలవారు విని స్పందించెదరు.

సువార్త ధ్వని ప్రపంచమంతటా మారుమ్రోగును గాని ఎన్నుకోబడిన వారు మాత్రమే నిజముగా దాని గ్రహింతురు. మనందరికి అద్భుతమైన ప్రసంగమును వినిన అనుభవమున్నది. దానికి కొందరు హృదయమందు రేపబడితే మరికొందరు అదే వర్తమానము విని నిర్లిప్తముగానుందురు, మనకు వారికి వ్యత్యాసమేమి? మనము వారికంటే అధిక తెలివి, అధిక ఆత్మీయత, ఎక్కువ సుముఖతగల వారమని అర్థమా? అలాకాదు. దేవుని ఎన్నికాయుతమైన కృప మన హృదయాలకు ఆ వాక్యమును ఉజ్జీవపరిచి మనలను బ్రదికింపజేసెను. ఆయన కృపావరము ద్వారా మనము రక్షింపబడ్డాము. మనము కేవలము దాని నోచుకోదగని అపాత్రులము. "నీకు ఆధిక్యము కలుగజేయువాడెవడు? నీకు కలిగిన వాటిలో పరునివలన నీవు పొందనిది ఏది? పొందియుండియు పొందనట్లు నీవు అతిశయింపనేల?" (1 కొరింథి.4:7) అని వ్రాయబడియున్నది.

ప్రకటన.22:17వ వచనము విషయానికొస్తే, దాని సందర్భము చూచుట చాలా ప్రాముఖ్యము. లేఖనములకు భిన్నమైన విధానములో ఈ వచనము సువార్త ఆహ్వానమునకై ఎక్కువగా వాడుచున్నది. ఈ వచనము బైబిలు గ్రంథము చివర అగుపించును - ఈ యుగ సంబంధ విషయాలు ముగిసి నూతనతరము ఉదయించుట దీని సందర్భము. శత్రువులు ఓడింపబడ్డారు. గొప్పతీర్పు సంబవించినది. దుష్టుడు వాని అనుచరులు, అవిశ్వాసులు అగ్నిగుండమందు పడద్రోయబడ్డారు. పరలోకము నుండి నూతన యెరూషలేము దిగివచ్చినది. ఇక "శాపగ్రస్తమైనదేదియు దానిలో ఉండదు." (ప్రకటన.22:3). "రాత్రి యికనెన్నడు వుండదు........... దేవుడైన ప్రభువే వారి మీద ప్రకాశించును. వారు యుగయుగములు రాజ్యము చేయుదురు." (ప్రకటన 22:5).

గనుక, 'ఆత్మయు మరియు పెండ్లి కుమార్తెయు రమ్ము, జీవజలములనిత్తుననని' చెప్పినప్పడు, వీటిని వారు ఎవరికిచ్చుచున్నారు? యావత్ ప్రపంచానికా? అవిశ్వాసులకా? కాదు. ఇదివరకే రక్షింపబడి, నిత్యమహిమను పొందుకున్న వారికి ఇచ్చుచున్నారు. వారినే, కేవలము వారినే జీవజలము మరియు జీవవృక్షము నుండి త్రాగి భుజించుమని ఆహ్వానించుచున్నారు.

ఆర్మీనియన్‌బోధకులు సందర్భరహితంగా వచనాలు తీసుకుని బైబిలుఅనాధారిత భావములను బలపరచుకొందురని ఈ నాలుగు ఉదాహారణలు స్పష్టము చేస్తున్నాయి.
వారు సొంత అభిప్రాయాలతో ప్రారంభించి వారు తలంచినది వాస్తవాలని చెప్పటకు, వాటిని బలపరచుటకు ఆయా వచనములను వెదికెదరు. కాని బైబిలు సొంత అర్థము చెప్పవారి భావానికి లొంగదు. మనము ప్రత్యక్షపరచబడిన వాక్యము ఎదుట సాగిలపడి అది వాస్తవానికి ఏమి సెలవివ్వదలచినదో దానిని గ్రహించి అంగీకరించినట్లయితే సత్యము బయలుపడును.

కడకు మన దైవశాస్త్రము, స్పష్టమైన లేఖనాల ప్రకటనతో విభేదించినట్లయితే మనము పొరబడినట్లే. దీనిని గుర్తెరిగినప్పడు మనము తప్పక మారాలి. పవిత్రలేఖనము యొక్క ప్రతి మాట దానిదాని స్థానములో సరిగా

కూర్చునేంత వరకూ మనము మన దైవశాస్త్రమును రూపుదిద్దుకోవాలి మరియు సవరించుకోవాలి. మారని దేవుని వాక్యము మనకై మారదు గనుక మనమే మారాలి.

## ముగింపు

మనము తార్కికముగా మరియు లేఖనాధారముగా ఒక మూలకు నెట్టబడ్డాము. ఈ దిగువ వ్యాఖ్యలు పరస్పరవిరుద్ధములు గనుక రెంటిలో ఏదో ఒకటి సరియైనది కావాలి.
1) క్రీస్తు ఎవరికొరకైతే మరణించెనో వారి పాప రుణమును సంపూర్ణముగా చెల్లించి వారిని వాస్తవానికి విమోచించి, నీతిమంతులుగా చేసి పరిపూర్ణులుగా మార్చెను.
2) రక్షణను సుసాధ్యము చేస్తూ క్రీస్తు పాపభారమును తొలగించెను. గానీ ఆయన వాస్తవానికి ఎవరి రక్షణను కూడా సంపూర్ణముగా సిద్ధింపజేయలేదు తమ వ్యక్తిగత విశ్వాసం, తీర్మానం మరియు చిత్తము యొక్క క్రియల ద్వారా ఎవరి విమోచనము వారే కార్యసాధకము చేసుకోవలెను.

మొదట వ్యాఖ్య సరియైనదైతే, ఏ బేధము లేకుండా క్రీస్తు ప్రతి వ్యక్తికొరకై మరణించలేదు. ఆయన ఎన్నుకోబడిన వారికొరకు మాత్రమే మరణించాడు.

రెండవ వ్యాఖ్య సరియైనదైతే, ప్రతి వ్యక్తియొక్క వ్యక్తిగత నిర్ణయం క్రీస్తు ప్రాయశ్చిత్త కార్యమును సఫలం చేయుటలో లేదా కార్యసాధకము చేయుటలో నిర్ణయాత్మకమైన అంశము.

మొదటి వ్యాఖ్య సత్యమని బైబిలు ప్రకటించుచున్నది. ఇది బైబిలులోని వివరముల ద్వారా స్పష్టపరచబడటము మాత్రమే గాక, అతి గంభీరమైన క్రైస్తవసత్యాలతో అది పొందిక కలిగియున్నది. ఉదాహరణకు, సమస్తము దేవుని మహిమ మరియు ఘనత కొరకే జరుగునని మనమెరుగుదుము. సమస్త విషయములలో ఆయన కుమారునికి ప్రాధాన్యత ఇవ్వబడుటయే దేవుని అంతిమ ధ్యేయం.
"ఆయన కుమారుని యందు మనకు విమోచనము అనగా పాపక్షమాపణ కలుగుచున్నది. ఆయన అదృశ్య దేవుని స్వరూపియై సర్వసృష్టికి ఆది సంభూతుడైయున్నాడు. ఏలయనగా ఆకాశమందున్నవియు, భూమియందున్నవియు, దృశ్యమైనవిగాని అదృశ్యమైనవిగాని అవి సింహాసనములైననూ ప్రధానులైననూ అధికారములైననూ సర్వమును ఆయనయందు సృజింపబడెను. ఆయన అన్నిటికంటె ముందుగా ఉన్నవాడు. ఆయనే సమస్తమునకు ఆధారభూతుడు సంఘమను శరీరమునకు ఆయనే శిరస్సు; ఆయనకు అన్నిటిలో ప్రాధాన్యత కలుగు నిమిత్తము ఆయన ఆదియైయుండి మృతులలోనుండి లేచుటలో ఆది సంభూతుడాయెను. ఆయనయందు సర్వసంపూర్ణత నివసింపవలెననియు, ఆయన సిలువరక్తము చేత సంధిచేసి, ఆయన ద్వారా సమస్తమును అవి భూలోకమందున్నవియైనను పరలోకమందున్నవియైననూ, వాటినన్నిటిని ఆయన ద్వారా తనతో సమాధాన పరచుకొనవలెననియు తండ్రి అభీష్టమాయెను." (కొలొస్సీ.1:14-20)

మన విమోచనాక్రయధనమును చెల్లించి పాపబానిసత్వపు సంతనుండి మనలను కొని దేవుని నీతి ప్రమాణాల ఎదుట మనలను నీతిమంతులనుగా తీర్చి, సదాకాలము పరిపూర్ణులనుగా చేసిన దేవుని అద్వితీయ కుమారుని మరణము, ఖచ్చితముగా సువార్తకు లోబడక మెడవంచక తిరుగుబాటు చేసిన వారిని, దేవుని ద్వేషించి, ఆత్మీయముగా మరణించిన పాపులను అతిశయింపజేయుటకు ఉద్దేశింపబడినదని ఎన్నడును భావింపరాదు. అన్నియు ఆయన కుమారుని మహిమపరచుటకై వున్నవి. ఆ ఖచ్చిత ప్రాధాన్యతను మరెవరితోనైనా ఆయన

పంచుకుంటాడని లేఖనాలలో ఎక్కడను చెప్పబడలేదు.

ఇప్పడు, 'విమోచన ఎన్నుకోనబడినవారకే' అను లేఖనాధార రక్షణశాస్త్రమును ముగించుకున్నాక తరువాయి ప్రశ్న ఏమనగా, ఒకవ్యక్తి ఈ రక్షణను ఎదురించగలడా/ధిక్కరించగలడా?
అభేద్యమైన కృపాసిద్ధాంతములో ఈ కీలకమైన ప్రశ్నను పరిగణించెదము.

## నాల్గవ అధ్యాయము

# అభేద్యమైన కృప

భూమికి పునాదులు వేయబడక మునుపే పతనమై నశిస్తున్న మానవాళినుండి రక్షణ కొరకు దేవుడు కొందరు వ్యక్తులను ఎన్నుకున్నాడు. యేసు దేవుని ఉగ్రతను భరించి ఆయన ప్రాణాధార రక్తమును చిందించి ఆ ఎన్నుకోబడినవారిని విమోచించి మరియు వారిని కొని వారి పక్షముగా దేవుని న్యాయమును సంతృప్తిపరిచాడు. అయిననూ దేవుని నిర్మలమైన పరిశుద్ధ సన్నిధిలో అపవిత్రమైనదేదియు నిలువజాలదు. గనుక ఈ విమోచింపబడిన పాపులు పరలోక మహిమను చూడకమునుపు వారి ప్రవర్తన, స్వభావం మార్పునొందాలి. కానీ అట్టి పరివర్తనకు ఖచ్ఛితమైన ఓ అద్భుతము జరగాలి.

పాపాత్ములైన మనుష్యులను పునరుజ్జీవింపజేయుట, వారిని నూతనముగా సృష్టించుట, వారికి నూతన హృదయమిచ్చుట, వారి చిత్తములను, కోరికలను మార్చి, వారిని పశ్చాత్తాపములోనికి తీసుకునివచ్చుట మున్నగునవి ఈ సిద్ధాంతమునందు ప్రాముఖ్యమైయున్నవి. ఇట్టి పునర్జన్మను నిరాకరించు సామర్థ్యము మానవుడు కలిగియున్నాడా? అన్న ప్రశ్నయే మన ప్రస్తుత వివాదాంశము. కొంతమంది వేదాంతులు 'అజేయమైన కృప' అనే పదాన్ని ప్రయోగిస్తుంటారు. కృప కేవలం వశపరచుకొనునుగాని, ఎన్నడును వశపరచుకొనబడదు. అని ఇది సూచిస్తుంది. అభేద్యమైన కృప అను పదమునకు 'మనుష్యుడు నిరాకరించలేని దేవుని కృప' అని అర్థము. అయిననూ ఈ రెండు పదములు ఒకే భావమును తెలుపును. దేవుడు సర్వశక్తిమంతుడు, మనుష్యుడు బొత్తిగా శక్తిహీనుడు.

ఒకటవ అధ్యాయములో మనము చూసిన విధముగా మానవులు పాపులు. ఈ పాప స్థితిని మన పితరుడైన ఆదాము నుండి మనము స్వతంత్రించుకొన్నాము. ప్రారంభములో ఆదాము దేవుని పోలిక మరియు రూపమున సృష్టించబడ్డాడు. ఆయన భౌతిక జీవనము క్రమేపీ కొనసాగుతూ, రోగము లేదా కృశింపు అనేది లేకయుండేది. దేవునితో సంభాషణ, సహవాసం అతని ఆత్మీయ జీవితముగానుండేది. అయితే అతను తిరుగబడిన తరువాత, పాపములో పడ్డాక, వెంటనే అతని ఆత్మీయజీవితము తిరుగబడిపోయింది. అతను ఆత్మీయముగా మృతుడని దేవుడు సెలవిచ్చాడు. అతడు దేవునినుండి వేరు చేయబడ్డాడు, సిగ్గునొంది భయపడ్డాడు. అదే సమయములో అతని భౌతిక దేహము, అంతిమ భౌతిక మరణమునొందు వరకు పాపములో క్రమేపీ కృశించుట ప్రారంభించింది. ఆదాము అతిక్రమము మానవ జాతియంతటికి అనగా పారంపర్యరిత్యా, తరము వెంబడి తరమునకు సంక్రమించినది. కాని, మరియ గర్భము ధరించునని ప్రభువు దూత ప్రకటించినప్పడు తన కన్యత్వమును బట్టి అటువంటిది అసంభవమని ఆమె ఆశ్చర్యముతో స్పందించినది.

"అందుకు మరియ - నేను పురుషుని ఎరుగని దానినే; యిదేలాగు జరుగునని దూతతో అనగా దూత, పరిశుద్ధాత్మ నీ మీదికి వచ్చును; సర్వోన్నతుని శక్తి నిన్ను కమ్ముకొనును గనుక పుట్టబోవు శిశువు పరిశుద్ధుడై దేవుని కుమారుడనబడును." (లూకా. 1:34,35)

మానవ జాతి యొక్క పాపాత్మపు పారంపర్యములో యేసు పాల్గొనలేదు. ఆయన రక్తపు ప్రవృత్తిని ఆయన తండ్రి నిర్ణయించాడు. అది నిర్మలమును, ప్రశస్తమునైన దేవుని స్వరక్తమైయుండి నిష్కళంకమైనదిగాను, పవిత్రమైనదిగాను ఉండెను. క్రీస్తు ఆ ప్రశస్త రక్తమును చిందించినప్పడు అది తగిన వెలగానూ, దేవునికి అంగీకార యోగ్యముగానూ

వుండెను గనుక ఎన్నుకొనబడిన పరిశుద్ధులు పాపబుణము నుండి విడిపింపబడి నిత్యదండన నుండి విడుదల వేయబడి, క్రీస్తుతో సహవారసత్వమును పరలోకవాగ్దానము పొందుకున్నారు (రోమా.8:17).

అయితే, క్రీస్తు పాపపరిణామాలన్నిటిని భరించి, తన ప్రజలకొరకు పాపమును ఓడించినప్పటికి మనమింకనూ భూసంబంధ జీవితము జీవిస్తూ, మానవదేహములయందు పుడుతూ మన పాపపుభావనల చేత హరించివేయబడుతున్నాము. కాబట్టి మనము దేవునిరాజ్యములో ప్రవేశించుటకు మన అంతరంగస్వభావములో మార్పు రావడం అత్యావశ్యకమైనది. కానీ మానవులకు ఓ తీవ్ర సమస్య వున్నది. చెడువృక్షాలు మంచి ఫలములు కాయుట అసాధ్యమని క్రీస్తు బోధించెను. (మత్తయి.7:16-20). చెడు వృక్షాలు మంచి ఫలములు కాయుటకు గాను ఆ వృక్షాలు మంచివిగా చేయబడాలి. దీనికి ఓ అద్భుతము అవసరమైయున్నది. అభేద్యమైన కృప అను సిద్ధాంతము నిర్ధిష్టముగా దేవుడు తన జనులలో జరిగించు ఈ అద్భుత రూపాంతరముతో వ్యవహరిస్తుంది . ఈ మార్పు ప్రపంచములో వున్నవారందరిలో జరగదు. ప్రతిగా గొఱ్ఱెపిల్ల జీవగ్రంథములో మన పేర్లను నమోదు చేసిన ఆ ఎన్నిక నియమమే మనము పరిశుద్ధాత్మను పొందుకుని తద్వారా మన సృష్టికర్తను చేరుకొను పయనాన్ని ప్రారంభిస్తామని హామీ ఇచ్చినది.

## త్రిత్వము

మానవుల రక్షణ విషయములో పరిశుద్ధ త్రిత్వములోని ముగ్గురు వ్యక్తుల పాత్ర ఉంటుంది.

1) జగత్తు పునాది వేయబడక మునుపు తండ్రి కొంతమందిని ఎన్నుకొనెను.
2) కుమారుడు వారి విమోచనను కొని, వారు పొందవలసిన శిక్షను తానే అనుభవించెను.
3) పరిశుద్ధాత్ముడు, ఇలా ఎన్నిక చేయబడి, విమోచింపబడిన ప్రజలను దేవుని చెంతకు ఆకర్షించి వారి హృదయములను, మనస్సులను మార్చి, నాశనమునకు నడిపించు పాపపుదాస్యానికి ప్రతిగా వారిని నిత్యజీవమునకు నడిపించును. క్రీస్తునందలి స్వాతంత్ర్యము అంగీకరించుటకు వారిని సుముఖులుగాచేయును.

క్రీస్తు ప్రాయశ్చిత్తకార్యములో క్షమ, విమోచన, పాపులు నీతిమంతులుగా తీర్చబడుట మున్నగునవి వున్నవని విశ్వసించుట మిక్కిలి వాస్తవమును అత్యావశ్యకమునైయున్నప్పటికీ ఇది ఆయన నిర్వహించిన కార్యములో సగ భాగమే. ఇందుకు అదనంగా ఆయన వారికి స్వాస్థ్యమును కలుగజేసి పరిశుద్ధాత్ముడు వారిలో నివసించుటకు మార్గము సుగమము చేసాడు.

"అయితే నేను మీతో సత్యము చెప్పచున్నాను; నేను వెళ్ళి పోవుటవలన మీకు ప్రయోజనము, నేను వెళ్ళనియెడల ఆదరణ కర్త మీ యొద్దకు రాడు, నేను వెళ్ళినయెడల ఆయనను మీ యొద్దకు పంపుదును." (యోహాను. 16:7)
"నేను తండ్రిని వేడుకొందును, మీ యొద్ద ఎల్లప్పడు మీ యొద్దనుండుటకై ఆయన వేరొక ఆదరణ కర్తను అనగా సత్య స్వరూపియగు ఆత్మను మీకనుగ్రహించును. లోకము ఆయనను చూడదు. ఆయనను ఎరుగదు గనుక ఆయనను పొందనేరదు; మీరు ఆయనను ఎరుగుదురు. ఆయన మీతో కూడా నివసించును, మీలో ఉండును. మిమ్ములను అనాథలనుగా విడువను మీయొద్దకు వత్తును. కొంతకాలమైన తరువాత లోకము నన్ను మరి ఎన్నడును చూడదు." (యోహాను. 14:16-18)

ఇక్కడ యేసు ఎన్నో ముఖ్యమైన సంగతులను ప్రస్తావించాడు. దైవత్వమునందలి త్రిత్వమందు ఉద్దేశ్యసంబంధమైన ఐక్యతను ఎలా ప్రదర్శించాడో మొదట గమనించుము.

1) పరిశుద్ధాత్మని పంపులాగును యేసు తండ్రిని వేడుకొనెను.

2) పరిశుద్ధాత్మని గుణము క్రీస్తు స్వీయగుణమువలె ఉండును - "వేరొక ఆదరణకర్త"

3) ఆదరణ కర్త ఎన్నుకొనబడిన వారితో శాశ్వతముగా నివసించును కానీ దేవుడు ఎవరిని ఎన్నుకొనలేదో క్రీస్తు ఎవరికొరకైతే మరణించలేదో వారు సత్య స్వరూపియగు ఆత్మను పొందుకొనరు.

4) కాని "మీరు" ఆయనను ఎరుగుదురు. ఎందుకు? ఎందుకనగా పరిశుద్ధాత్ముడు విమోచింపబడినవారిలో శాశ్వతముగా నివసించును.

5) పిమ్మట "మిమ్మును అనాధలుగా విడువను నేను మీయొద్దకు వత్తును", అని యేసు మరోమారు చెప్పెను. ఎలాగైతే తండ్రి కుమారులు ఏకమైయున్నారో అలాగే పరిశుద్ధాత్ముడు మరియు క్రీస్తు ఒకటైయున్నారు. అయిననూ ఎవరికి వారు విలక్షణమైన వ్యక్తులు, ఎవరికి వారు ప్రత్యేక పాత్రలు, గుణలక్షణములు కూడా కలిగియున్నారు.

పరిశుద్ధాత్మను ఎవరు పొందుకుంటారు, ఎవరు పొందుకొనరు అను విషయమును నిర్ణయించేది క్రీస్తే అని గమనించుట చాలా ప్రాముఖ్యము. ఎలాగైతే లోకము పొందుకోలేదని క్రీస్తు నిర్ణయించునో, అదే విధముగా ఎవరు పొందుకుంటారు అనేది కూడా ఆయనే నిర్ణయించును. ఎలాగైతే మనకెన్నడూ ఇవ్వబడని జన్మదిన కానుకను మనము పొందుకోలేమో, అలాగే, దేవుడు ప్రత్యేకముగా దయగల వరముగా పరిశుద్ధాత్మను అనుగ్రహించినట్లయితేనే తప్ప ఆయనను పొందుకోలేము.

ఆదరణ కర్త అంటే గ్రీకులో 'పారక్లిటోస్', దీనికి 'సహాయకుడ'ని అర్థం. సహాయము చేసే సామర్థ్యముగా ఈ పదము క్రియావిశేషముగా గ్రీకులో ప్రాథమికముగా వాడబడినది. దానిని న్యాయస్థానములో చట్టసంబంధ సహాయకుడు, ఉత్తరవాది లేదా దోషి తరుపున వాదించే న్యాయవాదిగా అర్థం చేసుకొనవచ్చు. గనుక ఎన్నుకొనబడిన పాపులకు పరిశుద్ధాత్ముడు అనుగ్రహింపబడి, పరలోక న్యాయస్థానములో వారి పక్షముగా వేడుకొనును, వారి భూ సంబంధ యాత్రలో వారితో నడుచును.

దైవిక త్రిత్వమునందలి ఒక వ్యక్తి మనలో నివసించుట, 'రూపాంతరము' అనే అద్భుత ప్రక్రియకు నాంది. ఏ శక్తియైతే క్రీస్తును మృతులలోనుండి లేపినదో అదే శక్తి, గతములో మృతులైయుండిన పాపులలో ఇప్పుడు నివసించును మరియు ఆయన నూతన జీవముకై ఎలా లేపబడ్డాడో, అలాగే పరిశుద్ధాత్మ తనలో నివసించుచున్న వ్యక్తి కూడా ఆత్మీయమరణమునుండి నిత్యజీవమునకు లేపబడతాడు. ఇది మన భౌతిక మరియు ఆత్మీయ విమోచనను పరిపూర్ణము చేయును.

ఆదాము సృష్టించబడినప్పడు 'ఆత్మీయ జీవుని'గా ఉన్నాడు గాని అతను తిరుగుబాటు చేసిన తక్షణమే మృతుడయ్యాడు. దానికి సరిగ్గా వ్యతిరేకమైన విధానములో ఎన్నుకొబడిన పాపులు, 'ఆత్మీయముగా మృతులై పుట్టి' పరిశుద్ధాత్ముని సమ్మేళనము సమయములో వెంటనే ఆత్మీయజీవమును పొందుకుంటారు.

అదే విధముగా, ఆదాము భౌతిక పరిపూర్ణుడుగా సృష్టించబడ్డాడు, కానీ అతని పాపము అతని భౌతిక కృశింపును, చివరికి మరణమును తెచ్చిపెట్టింది. దానికి సరిగ్గా వ్యతిరేకమైన విధానములో, పాపులు కృశించు శరీరములోనికి

జన్మిస్తున్నారు. మన కడమ మరణము వరకూ ఆనారోగ్యము మరియు వ్యాధులు మన జీవితాన్ని కబళించివేస్తాయి. కానీ, ఏ దేవుని ఆత్మ అయితే మనలను మన ఆత్మీయ మృతతుల్యత నుండి లేపాడో అదే దేవుని ఆత్మ మన మర్త్య శరీరమునకు పునరుత్థానమందు అమర్త్యతను ధరింపజేయును. మరియు ఈ ప్రక్రియను సంపూర్ణము చేయునట్లు, ప్రారంభములో ఎలాగైతే ఆదామునకు ఆ జీవవృక్షము అందుబాటులో వుండెనో అలాగే, విమోచింపబడినవారు కూడా ఆ జీవవృక్షమునకు హక్కుదారులుగా చేయబడతారు. (ప్రకటన. 2:7; 22:3,4)

## సార్థకమైన పిలుపు

దేవునికి ప్రతినిధిగా పనిచేస్తూ, మన ప్రభువుతో సమాధానపడునట్లుగా పరిశుద్ధాత్ముడు మనలను ఆహ్వానిస్తాడు. కాని అది ఓ నిస్సహాయ బిక్షకుని అర్థన వంటిది కాదు. అది అధికారికమైన ప్రభావవంతమగు, సార్థకమైన పిలుపు. అది నిత్యత్వపుప్రణాళిక ఆధారముగా శాశ్వతమైన ప్రేమతో పిలిచే పిలుపు. దేవుడు  పిలిచినప్పడు, ఆయన ప్రజలు తప్పక ఇష్టపూర్వకముగా ఆయన అనంతశక్తి మరియు మార్పు చేయలేని నిర్ణయములను బట్టి స్పందింతురు.

"శాశ్వతమైన ప్రేమతో నేను నిన్ను ప్రేమించుచున్నాను. గనుక విడువక నీ యెడల కృప చూపుచున్నాను" (యిర్మియా.31:3)

"నన్ను పంపిన తండ్రి వానిని ఆకర్షించితేనేగాని ఎవడును నా యొద్దకు రాలేడు; అంత్య దినమున నేను వానిని లేపుదును." (యోహాను.6:44)

"అతనికి ద్వారా పాలకుడు తలుపుదీయును; గొఱ్ఱెలు అతని స్వరము వినును, అతడు తన సొంత గొఱ్ఱెలనన్నిటినీ వెలుపలికీ నడిపించుచున్నప్పడెల్ల వాటికి ముందుగా నడుచును; గొఱ్ఱెలు అతని స్వర మెరుగును గనుక అవి అతనిని వెంబడించును." (యోహాను.40:3-4)

దేవుడు వ్యక్తిగత దేవుడు. ఆయన తన ప్రజలను పేరు పెట్టి పిలుస్తాడు. ఆయన వారి పేర్లు జీవగ్రంథములో వ్రాసాడు. వారు ఆయన స్వరమును ఎప్పడు విని గుర్తించి స్పందించాలో వారి జీవితాల్లో ఆయన ముందుగానే నిర్ణయించాడు.
వాస్తవానికి ఏ పేరుతోనైతే విశ్వాసుల సమాజము పిలువబడుతున్నదో ఆ పేరు కూడా ఇదే సత్యాన్ని  సూచిస్తోంది "సంఘము" అను పదము "చర్చ్" గ్రీకులో "ఎక్లేషియా"గా పేర్కొనబడినది. ఈ గ్రీకు పదములో రెండు ధాతువులున్నాయి. 'ఎక్' బయటికి మరియు 'క్లిషియా' పిలుపు అని అర్థమిచ్చును. సంఘమంటే పిలువబడిన వారి సమూహము. వారు బయటకు పిలువబడినవారు.

ఆదిమంగా చూస్తే "ఎక్లిషియా" అను పదము ప్రాచీన గ్రీకులో రాజకీయ ఊరేగింపులను మరియు ప్రసంగములను సూచించెడివి. ఒక వ్యక్తికెవరైనా శ్రోతలు కావలసివస్తే, ఆయన పట్టణము గుండా వెళ్లి ఫలానా స్థలములో, సమయములో ఆయన ప్రసంగము వినుటకు రమ్మని ఆయా ప్రజలను ఆహ్వానించేవాడు. అది ఆ సమావేశములో పాల్గొనుటకు ఆహ్వానమునిచ్చు సాధారణ పిలుపు. దీనికి భిన్నముగా యెషయా-మెస్సియ్యాను గూర్చి దేవుని పక్షమున ఈలాగు సెలవిచ్చెను.

"ఇదిగో నేను ఆదుకొను నా సేవకుడు నేను ఏర్పరచుకొనినవాడు నా ప్రాణమునకు ప్రియుడు అతనియందు నా ఆత్మను ఉంచియున్నాను. అతడు అన్యజనులకు న్యాయము కనుపరచును. అతడు కేకలు వేయడు అరువడు

తన కంఠస్వరము వీధిలో వినబడనీయడు." (యెషయా. 42:1,2)

దేవుడు సంఘమును మూకుమ్మడిగా పిలువలేదు. ఆయన ఆయా వ్యక్తులను, వ్యక్తిగతముగా క్రీస్తు శరీరములో భాగముగానుండులాగున పిలిచెను. పరిశుద్ధాత్ముని ద్వారా వచ్చే దేవునిపిలుపు తన గొఱ్ఱెల కొరకైన ప్రధాన కాపరి పిలుపు. ఎవరో ఒకరు స్పందిస్తారేమో అని పిలిచే వీధి పిలుపు లేదా సాధారణ పిలుపు కాదది.
దేవుని యొక్క వ్యక్తిగతమైన ప్రత్యేక పిలుపు లేఖనాలంతటిలో పదే పదే అగుపించును.
1) దేవుడు తోటలో నడుస్తుండగా, ఆదామును పేరుపెట్టి పిలిచెను. పతనమైన మొదటి మానవుడు మొదట పిలువబడెను (ఆది.3:8,9).
2) దేవుడు బాలుడైన సమూయేలును ముమ్మారు పిలిచెను. ఆ పిలుపు ప్రభువుదని ఏలి గ్రహించెను (1 సమూ.3:4-10)
3) మోషే ఐగుప్తునుండి అరణ్యమునకు పారిపోయినప్పుడు అక్కడ దేవుడు మండుచున్న పొదనుండి మోషే మోషే అని అతనిని పిలిచెను (నిర్గ.3:4)
4) యాకోబుతో దేవుని దూత పెనుగులాడిన తరువాత ఇక నీ పేరు యాకోబు కాదు ఇశ్రాయేలు అని పిలువబడుదువు. నీవు దేవునితోనూ మనుష్యునితోను పోరాడి గెలిచితివి అని చెప్పెను (ఆది.32:28)
5) దేవుడు తార్సువాడైన సౌలును ఎదుర్కొనినప్పుడు, "సౌలా సౌలా నన్నెందుకు హింసించుచున్నావని......" పలికెను (అపొ.కా.9:4).
6) మృతుడైన లాజరును సమాధి నుండి లేపినప్పుడు, యేసు "లాజరు బయటకు రమ్మని పిలిచెను" (యోహాను.11:43)

దేవుడు ఆ వ్యక్తులను పిలిచినప్పుడు వారు అజ్ఞానములో, ధిక్కారములో లేదా పూర్తి ఉదాసీన స్థితిలో ఉన్నారు. అయిననూ కాపరి గొఱ్ఱెలను పిలిచినట్లు లేదా తండ్రి తన బిడ్డలను పిలిచినట్లు దేవుడు వారిని పిలిచెను. ఆయన వారిని కనుగొనిన స్థితిలో ఇక వారు ఉండబోరు. ఒక వ్యక్తిని పరిమార్చుటయే దేవుని పిలుపుయొక్క ముఖ్యోద్ధేశము. సర్వశక్తిమంతుడగు దేవుడు తన ఉద్దేశమును నెరవేర్చుకొనుటకు సమర్థుడు.

పరిశుద్ధాత్ముడు ఒకవ్యక్తిలో నివశించినప్పుడు ఆయన ద్వారా ఆ వ్యక్తి ప్రభావితము చేయబడకయుండుట అసాధ్యము. క్రొత్త నిబంధనలో పరిశుద్ధాత్ముని శక్తిని గూర్చి మాట్లాడినప్పుడు, "డునామిస్" (బలమైన పేలుడు పదార్థము) అను పదము ప్రయోగించబడినది. బలమైన ఒక పేలుడు పదార్థమునకు గల 'డైనమైట్' అనే పేరు ఈ పదము నుండే పెట్టబడినది. ఎవరైనా డైనమైట్‌ను వెలిగించి దానిపై కూర్చున్నట్లయితే ఏ చలనము లేకుండా వుండగలరా? అలాగే పరిశుద్ధాత్మ శక్తిని పొందిన వ్యక్తి కూడా ఏ చలనం లేకయుండుట అసాధ్యము.

## పశ్చాత్తాపము

పరిశుద్ధాత్ముడు చేయు రెండవ కార్యము, ఒక వ్యక్తికి తన పాపస్థితిని తెలియజేసి దేవుని యెదుట అతనికి పశ్చాత్తాపము కలుగజేయుట.

"క్రీస్తు శ్రమపడి మూడవ దినమున మృతులలోనుండి లేచుననియు యెరూషలేము మొదలుకొని సమస్త జనములలో ఆయన పేరిట మారు మనస్సు పశ్చాత్తాపము పాపక్షమాపణయు ప్రకటించబడుననియు వ్రాయబడియున్నది (లూకా. 24:46,47).

క్రీస్తు యొక్క మరణము మరియు పునరుత్థానము వలన సార్థకము చేయబడిన ఈ రెండు విషయములను శిష్యులు ప్రకటించవలసియున్నది. :- 1) యేసు నామమున పశ్చాత్తాపం, 2) యేసు నామమున పాప క్షమాపణ. "పాప క్షమాపణ" దేవుని కృపావరమని కేవలము దేవుడే దానిని సాధ్యపరచగలడని మనుషులను ఒప్పింపజేయుట కష్టమైన పనికాదు. కాని పశ్చాత్తాపము కూడా ఆయన మరణపునరుత్థానముల ఫలితమేనని క్రీస్తు పైవాక్యములో సెలవిచ్చాడు. కాబట్టి పశ్చాత్తాప కార్యము కూడా దేవుడే స్వయంగా జరిగించు కృపాకార్యము.

పశ్చాత్తాపము అంటే 180° డిగ్రీలు తిరుగుట (లేదా) 'ఒకదాని నుండి మరొకదానివైపు మరలుట'. మనము మన నుండి మరియు మన సహజస్వభావములనుండి దేవుని వైపు తిరుగుట. మనల్ని మనం ఉపేక్షించుకొని దేవుని వైపు తిరుగుట. దేవుడు న్యాయవంతుడని మరియు ఆయన కృపలేని యెడల మనము దోషులముగా ఖండింపబడియుండెడి వారమని మనము గ్రహించుదుము. అయితే శరీర సంబంధులైన వారికి పశ్చాత్తాపపడి తమ పాపస్థితి నుండి మరలవలసిన అవసరత ఏ మాత్రము కనిపించదు ఎందుకంటే తమ పాపస్థితిని గుర్తెరగని అంధులై అహంతో తమ స్వీయసామర్థ్యంపై ఆశ్రయిస్తూ తమను తాము దుష్టులుగా వారెన్నడు చూడలేదు.

"ఒకని నడతలన్నియు వాని దృష్టికి నిర్దోషముగా కనబడును, యెహోవా ఆత్మలను పరిశోధించును." (సామెతలు. 16:2)
"తమ దృష్టికి తాము శుద్ధులై తమ మాలిన్యము నుండి కడుగబడని వారి తరము కలదు." (సామెతలు. 30:12)
"ప్రకృతి సంబంధియైన మనుష్యుడు దేవుని ఆత్మ విషయములను అంగీకరింపడు, అవి అతనికి వెఱ్ఱితనముగానున్నవి. అవి ఆత్మానుభవము చేతనే వివేచింపదగును గనుక అతడు వాటిని గ్రహింపజాలడు." (1 కొరింథీ.2:14)
అయినను, పాపియైన మానవుడు తన స్వకీయ మార్గములను విడనాడి 'దేవుని నీతిని మరియు ఆయన రాజ్యమును వెదకవలెనని, పరిశుద్ధుడును నీతిమంతుడునునైన దేవుని ప్రమాణములు కోరుచున్నవి' (మత్తయి.6:33). గనుక ఇక్కడ ముఖ్యమైన ప్రశ్న ఏమిటంటే, ప్రకృతి సంబంధియైన మానవుడు, తన స్వీయ చిత్తాన్ని, బుద్ధిని అభ్యసించి పశ్చాత్తాపమునొందవలెనన్న ఈ పరిశుద్ధ ఆజ్ఞను గ్రహించి దాన్ని జరిగించగలడా? జరిగించలేడు. మానవుడు పశ్చాత్తాపపడునట్లుగా చేయువాడు దేవుడే.

"....దేవుడొకవేళ ఎదురాడు వారికి మారుమనస్సు దయచేయును; సత్య విషయమైన అనుభవ జ్ఞానము వారికి కలుగుటకై.....అట్టివారిని సాత్వికముతో శిక్షించును." (1 తిమోతి.2:25)

"లేదా, దేవుని అనుగ్రహము మారుమనస్సు పొందుటకు నిన్ను ప్రేరేపించుచున్నదని యెరుగక ఆయన అనుగ్రహైశ్వర్యమును సహనమును దీర్ఘశాంతమును తృణీకరించుదువా?" (రోమా.2:4)

అయితే, మానవ విచారమే పశ్చాత్తాపమని తరచూ మనము పొరబడుచుంటాము. కాని దుష్క్రియల విషయమై విచారపడుట దుష్టత్వం నుండి యదార్థముగా వెనుదిరుగుట ఒక్కటికావు. సాధారణముగా, ఒక వ్యక్తి పాపములు బట్టబయలు చేయబడినప్పుడు అతడు నిజముగానైనా లేదా పైపైకైనా విచారమును వెలిబుచ్చుతాడు. కానీ, పశ్చాత్తాపమైతే యదార్థ మార్పు విషయమై కట్టుబాటును, ఆశను కలిగియుంటుంది. దేవుడు కొన్ని సార్లు మన పాపముల విషయమై మన హృదయములను బ్రద్దలు చేయును, అయితే అట్టి విచారము పశ్చాత్తాపము కాదు. నిజముగా చూస్తే, విచారము పశ్చాత్తాపమునకు దారి తీయును.

“మీరు దుఃఖ పడితిరని సంతోషించుటలేదు గాని మీరు దుఃఖపడి మారు మనస్సు పొందితిరని యిప్పుడు సంతోషించుచున్నాను. ఏలయనగా ఏ విషయములోనైనను మా వలన మీరు నష్టము పొందకుండుటకై, దైవ చిత్తానుసారముగా దుఃఖపడితిరి. దైవ చిత్తానుసారమైన దుఃఖము రక్షణార్థమైన మారుమనస్సు కలుగజేయును; ఈ మారుమనస్సు దుఃఖమును పుట్టించదు. అయితే లోకసంబంధమైన దుఃఖము మరణమును కలుగజేయును.” (2 కొరింథీ.7:9,10)

ఇట్టి మార్పు ఒక వ్యక్తిలో కలిగించుట దేవుని కార్యము. బలవంతము చేసి, బోధించి ఒత్తిడి చేసి ప్రలోభపెట్టి లేదా భయపెట్టి ఒకనిలో ఈ పశ్చాత్తాపమును పుట్టించలేము. తిరిగి జన్మించని ఒక వ్యక్తిని పరిశుద్ధాత్మను స్వీకరించు అని బలవంతము చేయుట ఎంత మూర్ఖత్వముగా వుంటుందో అలాగే తన పాప స్థితినుండి మరలు సామర్థ్యము లేని (లేదా) కనీసం తాను పాపినని గుర్తెరుగని ఒక ప్రకృతి సంబంధియైన వ్యక్తిని పశ్చాత్తాపపడమని ఒత్తిడి చేయడం కూడా అంతే మూర్ఖముగా ఉంటుంది. అవును, అతడు తప్పక పశ్చాత్తాపపడాలి; కానీ అలా చేయలేడు. ఆ కార్యమును దేవుడు మాత్రమే జరిగించగల సమర్థుడు.

**“నీవు పైనుండి జన్మించాలి”**

యోహాను 3వ అధ్యాయములో యేసు, పరిసయ్యుడును, ఇశ్రాయేలు బోధకుడునైన నికొదేముతో సంభాషించాడు. యేసు అతనిని ఇలా హెచ్చరించాడు...

“... ఒకడు క్రొత్తగా జన్మించితేనేగాని అతడు దేవుని రాజ్యమును చూడలేడని నీతో నిశ్చయముగా చెప్పుచున్నాను.” (యోహాను. 3:30)

అంతట దీనికి నికోదెము స్పందిస్తూ.....

‘ముసలివాడైన మనుష్యుడు ఏలాగు తిరిగి జన్మించగలడు? రెండవ మారు తల్లి గర్భమందు ప్రవేశించి జన్మింపగలడా?’ అని ప్రశ్నించాడు. యేసు అతనిని సరిదిద్దుతూ తానిక్కడ దగ్గరగా పోలివున్న రెండు వేర్వేరు జన్మలను గూర్చి ప్రస్తావిస్తున్నాడని సెలవిచ్చాడు.

“....ఒకడు నీటి మూలముగాను ఆత్మ మూలముగాను జన్మించితేనేగాని దేవుని రాజ్యములో ప్రవేశింపలేడని నీతో నిశ్చయముగా చెప్పుచున్నాను. శరీర మూలముగా జన్మించినది శరీరమును ఆత్మ మూలముగా జన్మించినది ఆత్మయునైయున్నది. మీరు క్రొత్తగా జన్మింపవలెనని నేను నీతో చెప్పినందుకు ఆశ్చర్యపడవద్దు.” (యోహాను.3: 5-7 ) ఎలాగైతే చెడ్డవృక్షము మంచి ఫలములనియ్యదో, అదే విధముగా శరీరము శరీరమును మాత్రమే పుట్టిస్తుంది. స్త్రీ పురుషుల కలయిక ద్వారా శరీర సంతానమే కలుగుతుంది. దీనినే నీటి మూలముగా జన్మించుట అని యేసు పిలిచాడు. కాని శరీర మూలముగా పుట్టిన శిశువు తన తల్లిదండ్రులవలె దోషియైన పాపిగా పుట్టాడు. భౌతిక జన్మ పరలోక ప్రవేశమునకు ఏ హామీయు ఇవ్వదు. ఖచ్ఛితంగా దానికి రెండవ జన్మ అవసరమై యున్నది. అనగా ఆత్మ మూలముగా జన్మించుట.”

వాస్తవానికి ‘తిరిగి జన్మించుట’ అను మాటలోని ‘తిరిగి’ అను పదమునకు గ్రీకు భాషలో “అనాథేన్” అనే పదాన్ని ప్రయోగించారు. దీనికి ‘పైనుండి’ అని అర్థము. గనుక నికోదేమును ‘పైనుండి’ లేదా ‘పరమునుండి’ జన్మించాలని క్రీస్తు హెచ్చరించాడు. శరీరము ఆత్మీయ జన్మనివ్వదు. కేవలము ఆత్మ మాత్రమే ఆత్మీయ జన్మనిచ్చును.

“తన్ను ఎందరంగీకరించిరో వారందరికి, అనగా తన నామమునందు విశ్వసించిన వారికి దేవుని పిల్లలగుటకు ఆయన అధికారము అనుగ్రహించెను. వారు దేవునివలన పుట్టిన వారే గానీ, రక్తము వలననైననూ శరీరేచ్ఛలవలననైననూ మనుషేచ్ఛలవలననైననూ పుట్టినవారు కారు.” (యోహాను.1:12,13)

క్రీస్తును అంగీకరించి ఆయన నామమందు నమ్మకముంచునట్లుగా కొందరికి సామర్థ్యము అనుగ్రహింపబడినది. వారికి మాత్రమే “దేవుని పిల్లలగుటకు” అధికారమివ్వబడినది. “ఆయన నామమందు విశ్వసించినవారికి” లేదా ఆయనను స్వీకరించువారికి దేవుని పిల్లలగు అధికారము తమ నిర్ణయమునకు ప్రతిఫలముగా లేదా ప్రతిస్పందనగా ఇవ్వబడినదని యోహాను.1:12,13 కు పెడార్థం చెప్పే ఓ విధానం వాడుకలో ఉన్నది. అలా వారు నొక్కి చెబుతారు. కాని, అది మనుష్య రక్తమువలనైనది, వంశ పారంపర్యమైనది కాదు అని చెప్పుట ద్వారా యోహాను అట్టి అభిప్రాయాన్ని ఖచ్చితముగా నిర్వీర్యము చేసాడు. అది ఏ శరీరసంబంధమైన గుణములవలనను కలిగినది కాదు. మంచి క్రియలు లేదా ధర్మశాస్త్ర ఆచరణ, ఈ నూతనజన్మను తెచ్చిపెట్టజాలవు. మరెవని చిత్తవత్తిడి వలననూ అది జరగదు. ‘నేను తిరిగి జన్మిస్తాను’ లేదా ‘నూతన జన్మను స్వీకరిస్తానని’ ఎవరునూ ఎప్పుడును నిర్ణయించనూ లేదు.

అయితే ఇక మిగిలినదేమిటి? ఇంతటి మహాకృపాకార్యములో ప్రేరకమైనదేమిటి? దీనికి జవాబుగా అది దేవుని వలననే కలుగునని యోహాను చెప్పుచున్నాడు. రక్షణకార్యమును ప్రారంభించేది దేవుడే. క్రీస్తుసంతతిలో మరియు ఆయన కుటుంబములోనికి కలిగే నూతనజన్మ కేవలము దేవుడు జరిగిస్తేనే సంభవిస్తుంది. దాని పుట్టించుటకు గాని, నిర్ణయించుటకు గాని మానవులకు సమర్థత లేదు. మానవుని కలుషితరక్తము, పాపశరీరము మరియు మోసపూరితమైనచిత్తము ఆత్మీయ మేలుకొలుపును ఎన్నడును వెదకవు, వెదకజాలవు. మానవప్రయత్నాలు దానినుత్పత్తి చేయలేవు. కనుక ఒక వ్యక్తి నూతన జన్మనొందుట దైవనిర్ణయమే. రక్షింపబడిన లేదా రక్షింపబడని ఏ శరీరియు పరిశుద్ధాత్మయొక్క కదలికను నియంత్రించలేదు.

“గాలి తనకిష్టమైన చోటును విసరును. నీవు దాని శబ్దము విందువే గాని అది ఎక్కడనుండి వచ్చునో ఎక్కడికి పోవునో నీకు తెలియదు. ఆత్మ మూలముగా జన్మించిన ప్రతివాడును అలాగేయున్నాడనెను.” (యోహాను. 3:8)

ఎలాగైతే గాలి తనకిష్టమైన చోటకు వీచునో అలాగునే పరిశుద్ధాత్ముడు తన చిత్తానుసారంగా సంచరిస్తూ తాను ఎన్నుకొనినవారికి నూతన జన్మను ప్రసాదిస్తాడు. వారు ఆయన దాటు శబ్దము విందురు; అంతేగాని ఆయన రాకడను కాని పోకడను గాని ఎవరును నియంత్రించలేరు. నిరాక్షేపముగా ఈ నూతన జన్మ మరియు ఆత్మీయ మేలుకొలుపు పరలోక ప్రవేశమునకు అత్యావశ్యకము. అయినను అది సర్వాధికారియగు దేవుని అభీష్టము చొప్పున మాత్రమే జరుగుతుంది.

“తండ్రి మృతులను ఏలాగు లేపి బ్రతికించునో అలాగే కుమారుడును తన కిష్టము వచ్చినవారిని బ్రతికించును.” (యోహాను.5:21)

“మనము నీతిని అనుసరించి చేసిన క్రియల మూలముగా కాక తన కనికరము చొప్పననే పునర్జన్మ సంబంధమైన స్నానము ద్వారాను పరిశుద్ధాత్మ మనకు నూతనస్వభావము కలుగజేయుట ద్వారాను మనలను రక్షించెను.” (తీతు.3:5)

ప్రభువు, పరిశుద్ధాత్మ వలన కలుగు నూతనజన్మను శిశువు జన్మతో సాదృశ్యపరిచింది ఆనాలోచితముగా కాదు. ఒక స్త్రీ బిడ్డకు జన్మనిచ్చినప్పడు తన జన్మ విషయమును ఎన్నుకొనుటకు ఆ బిడ్డకు ఎటువంటి అవకాశము వుండదు. జనన సమయము వచ్చినపుడు బిడ్డను తల్లి సంప్రదించదు. శిశువులు జన్మింప నిర్ణయింపరు; వారి జనన సమయమును గానీ, ఏ తల్లిదండ్రులకు పుట్టాలి అని గాని వారు నిర్ణయించలేరు. ఏకశరీరులుగా చేయబడిన ఓ యిరువురి కలయిక ఫలితముగా వారు జన్మిస్తారు.

పురుషుడు తన బీజమును స్త్రీలో విత్తినప్పడు, అది ఒక సరికొత్త మానవునికి జన్మనిచ్చును. ఇవన్నియు ఆత్మీయ

జన్మకు భూసంబంధమైన పోలికలు. క్రీస్తు తన సంతానమును కలుగజేయుటకై సిలువలో శ్రమపడ్డాడు. (అపొ.కా.17:28) ఒక వ్యక్తి తన నూతనజన్మ విషయమును ఎన్నుకొనుటకు ఎట్టి అవకాశమువుండదు.

నూతన జనన సమయము వచ్చినపుడు దేవుడు ఆ వ్యక్తిని సంప్రదించడు. మనము నూతన జన్మయొక్క సమయము, స్థలము, పరిస్థితులు చివరకు పరలోక తండ్రియైన దేవునిని సహితం ఎన్నుకొనము. కాని పరలోకపు తండ్రి మనలో పరిశుద్ధాత్మ అనే బీజమును వేసినప్పడు, మనము క్రీస్తుతో ఏకశరీరమగుదుము, ఈ కలయికే 'క్రైస్తవుడు' అను ఒక సరికొత్త వ్యక్తికి జన్మనిస్తుంది.

"కాగా ఎవడైననూ క్రీస్తునందున్న యెడల వాడు నూతన సృష్టి, పాతవి గతించెను; ఇవిగో కొత్తవాయెను." (11 కొరింథి. 5:17)

## విశ్వాసము

పరిశుద్ధాత్మని కార్యము వలన తిరిగి జన్మించిన వారిలో అవశ్యకముగా కలుగు చివరి ఫలితము 'విశ్వాసము'. క్రీస్తును విశ్వసించి, తండ్రిని నమ్మి, పరిశుద్ధాత్మ నాయకత్వమును అనుసరించే సామర్థ్యము ఆ వ్యక్తికి ఓ వరముగా అనుగ్రహింపడుతుంది.. ఈ సామర్థ్యము 'విశ్వాసము' అని పిలువబడుచున్నది.
"విశ్వాసమును' గ్రీకులో "పిస్టిస్" అని అంటారు. ఇది నామవాచకము. అయితే ఇంగ్లీషు భాషలో విశ్వాసమునకు క్రియాపదము లేనందున వివరణాత్మక సమస్య తలెత్తును. తత్ఫలితముగా గ్రీకు క్రియాపదము "పిస్టియో" కూడా బైబిలులో 'విశ్వాసం - నమ్మిక' అని అనువదించబడియున్నది. "పిస్టిస్" లేదా విశ్వాసము దేవుడు లేదా క్రీస్తు లేదా ఏదైన  ఆత్మీయసంగతుల విషయమై వినినదాని ద్వారా దృఢమైన ఒప్పింపు కలిగి, విశ్వాసముంచుటను సూచించును. అయితే 'విశ్వసించు' అను ఇంగ్లీషు పదము విస్తార నిర్వచనములనిచ్చును. 'ఉనికిలోనున్న దానిని నమ్ముట' అనునది 'విశ్వాసమునకు' పర్యాయపదముగా వాడబడియున్నది. దేవుని గూర్చిన సిద్ధాంతమును గ్రహింపకుండా, నామకార్థముగా అనేకులు దేవునిని విశ్వసిస్తారు.

విశ్వాసము అనే పదాన్ని వివిధ అర్థాలతో ప్రయోగిస్తుంటాము. నేను ఈ పరీక్షలో ఉత్తీర్ణుడవుతానని విశ్వసిస్తున్నాను (లేదా) ఏదైనా ఒక ఆశ్చర్యకర సందర్భములో 'ఆహా! అది ఎంత అవిశ్వసనీయముగా ఉందని' అంటుంటాము.

ఆధునిక భావనలలో విశ్వాసమనగా చివరికి ఏది తోస్తే దానిని నమ్మే హక్కు వారికిగలదనే అదోరకమైన ధోరణి ఏర్పడియున్నది. అది ఎంత విడ్డూరముగానున్నను - 'ఎవరి నమ్మిక వారిదేనండి' అని అంటుంటారు. కాని అలాటి నాసిరకపు నిర్వచనాలను బైబిలు ఒప్పదు. 'విశ్వాసము', 'నమ్ముట' ఈ రెండును "పిస్టిస్' మరియు "పిస్టియో" అను గ్రీకు పదముల నుండి వచ్చినవి.  'దేవుడున్నాడు' అని మాత్రమే కాక, 'తన కుమారుని గూర్చి లేఖనాలలో ప్రత్యక్ష పరచబడినదంతయు దృఢముగా విశ్వసించుట,' దేవునిలో సత్సంబంధము కలిగియుండుటకు ఖచ్చితముగా అవసరము. ఇట్టి విశ్వాసము లేకుండ దేవునికి ఇష్టుడిగానుండుట అసాధ్యము.

బైబిలు ఆధారిత క్రైస్తవ్యమును విమర్శించేవారెందరో 'అయినను నేను దేవుని విశ్వసించుచున్నాను గదా' అనే ప్రకటనలో తలదాచుకోవాలని ప్రయత్నిస్తారు. కానీ, ఊరకే దేవుడున్నాడని విశ్వసిస్తే నిత్యరక్షణ హామీగా ఇవ్వబడుతుందని నమ్ముట వ్యర్థమని యాకోబు హెచ్చరించాడు.

"దేవుడొక్కడే అని నీవు నమ్ముచున్నావు. అలాగు నమ్ముట మంచిదే; దయ్యములును నమ్మి వణకుచున్నవి."

(యాకోబు.2:19)

యదార్థమైన విశ్వాసము, అక్కడెక్కడో దేవుడు ఉండే ఉండాలని మనస్సులో ఒప్పుకోవడముకంటే ఎంతో అతీతమైనది. నరకమందలి ప్రతి దయ్యమును అదే విషయమును నమ్మి వణకుచున్నవి. "పిస్టిస్" అను పదములో సూచించబడిన విశ్వాసములో ఇంకా ఎంతో ఇమిడియున్నది. తన కుమారుని మన స్థానంలో పంపిన ప్రేమగల కృపగల దేవునిచే మన నిత్యగమ్యమంతయు నిర్ణయించబడినదని విశ్వాసము నమ్ముతుంది. తత్ఫలితముగా విశ్వాసమనునది వ్యక్తిగతగొప్పతనము, ధర్మము లేదా నీతిక్రియలయందు ఆధారపడదు కానీ నీతిగల విమోచకునియందు సంపూర్ణముగా విశ్రమిస్తుంది. దేవుడు మనకు భద్రతను మరియు పరిపూర్ణతను అనుగ్రహించునని విశ్వాసము నమ్ముతుంది.

మరొక విధముగా చెప్పాలంటే, ఒక కుర్చీని చూస్తూ, ఆ కుర్చీ మనకు సురక్షితముగా ఆధారము కలుచేస్తుందో లేదో నిర్ణయించుట చాలా తేలిక. అది మానసిక అంచన. కానీ అది విశ్వాసము కాదు విశ్వాసము అనునది కుర్చీలో కూర్చొనుట. దేని మీదైతే మనము నమ్మికయుంచియున్నామో దానిపై మన భారమును మోపుట మున్నగునవి కోరుతుంది. విశ్వాసము ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొని ఎంత కష్టమైనా లేదా ఎంత అసాధ్యమైనా దేవుని వాక్యముపై నిలుస్తుంది. విశ్వాసము దేవుని యొక్క ప్రతి ప్రకటనను జీవితపు పరిస్థితులకంటె ఎక్కువగా పరిగణిస్తుంది. "యెహోవా ఈ విధముగా సెలవిచ్చుచున్నాడు" అను ప్రకటనలపై మనము ఆధారపడేలా విశ్వాసం చేస్తుంది. కాని, పరిశుద్ధాత్మని ప్రమేయము లేనట్లయితే ఒకడు ఎన్నటికిని ఇట్టి ఒప్పింపునకు, నమ్మకమునకు విశ్వాసమునకు చేరలేడు. విశ్వాసమనునది పూర్తిగా దేవుని కృపావరము; అది మేధాసంబంధమైన తీర్మానము కాదు. దానిని బలవంతముగా రుద్దలేము. దానిని వెంబడించి, ఎన్నుకొని, వాడుకొనులాగున, కార్య సాధకము చేసుకొనులాగున మనుష్యులను బలవంతము చేయలేము. దేవుడు పూర్తిగా మనుష్యులలో నాటితేనే విశ్వాసము కలుగుతుంది.

"నన్ను పంపిన తండ్రి వానిని ఆకర్షించితేనే గాని ఎవడును నా యొద్దకు రాడు; అంత్యదినమున నేను వానిని లేపుదును" (యోహాను. 6:44)

"మీరు విశ్వాసము ద్వారా కృపచేతనే రక్షింపబడియున్నారు. ఇది మీవలన కలిగినది కాదు. దేవుని వరమే. అది క్రియలవలన కలిగినది కాదు. గనుక ఎవడును అతిశయపడ వీలులేదు." (ఎఫెసీ. 2:8,9)

మన రక్షణ కేవలము కృపాకార్యము. అది మనపై దేవుని కారుణ్యము. అది విశ్వాసము ద్వారా కలిగినది. ఆ విశ్వాసము సహితము మనవలన కలిగినది కాదు, అది దేవుని వరమే. క్రియల ద్వారా మనము రక్షింపబడము లేదా విశ్వాసమును పొందలేము. ఎన్నుకొనుట, నిర్ణయించుట, స్వీకరించుట, ఒక తీర్మానము చేయుటతో సహా అన్నియు కృపాకార్యములే లేనిచో మన స్వంతరక్షణ గూర్చి మనము అతిశయింతుము. కానీ దేవుడు ఎవరితోను తన మహిమను పంచుకోడు.

"మనము కూడా ప్రతి భారమును, సులువుగా చిక్కులబెట్టు పాపమును విడిచిపెట్టి విశ్వాసమునకు కర్తయు దానిని కొనసాగించువాడునైన యేసువైపు చూచుచు, మనయెదుట ఉంచబడిన పందెములో ఓపికతో పరుగెత్తెదము. ఆయన యెదుట ఉంచబడిన ఆనందముకొరకు అవమానమును నిర్లక్ష్య పెట్టి సిలువను సహించి, దేవుని సింహాసనముయొక్క కుడిపార్శ్వమున ఆసీనుడయున్నాడు.' (హెబ్రీ. 12:2)

క్రీస్తు మన విశ్వాసమునకు కర్తయైనట్లయితే, ఆయనే దానిని ప్రారంభించాడనునది స్పష్టము. ఆయన మన విశ్వాసమును కొనసాగించువాడైతే ఆయనే దానిని సంపూర్ణము చేస్తాడు. ఇందుకు ఆదనంగా ఏమియు జత చేసేందుకు అవకాశము లేదు. కింగ్ జేమ్స్ అనువాదములో హెబ్రీ 12:2 ను చదివినట్లయితే, "మన" అను

పదము అనువాదకునిచే జతచేయబడినది. దీనిని సూచించుటకు కొన్ని ప్రతులలో ఈ పదానికి ఇటాలిక్సు ఉపయోగించారు. క్రీస్తే విశ్వాసమునకు కర్త దాని కొనసాగించువాడని గ్రీకు ప్రతులు స్పష్టంగా తెలియజేయుచున్నవి. భూజంతువులలోనేమి, పరలోక జీవులలోనేమి, ఎక్కడైతే దేవునియందు విశ్వాసమును కనుగొందుమో దానికి క్రీస్తే కారణభూతుడనియు కనుగొనగలము.

పౌలు పరిశుద్ధాత్మ వరములను గూర్చి ప్రస్తావించినప్పడు ఈ భావమును స్పష్టముగా వ్యక్తపరిచాడు.

"ఇందుచేత దేవుని ఆత్మ వలన మాట్లాడు వాడెవడును యేసు శాపగ్రస్థుడని చెప్పడనియు, పరిశుద్ధాత్మ వలన తప్ప ఎవడును యేసు ప్రభువని చెప్పలేడనియు నేను మీకు తెలియజేయుచున్నాను". (1కోరింథి12:3)

పైగా విశ్వాసమునకు అద్వితీయ మాదిరి క్రీస్తే. ఆయన తండ్రి నుండి యెడబాటు చేయబడి, దేవుని ఉగ్రతకు అర్హుడు కాకపోయినా దానిని భరించాడు.

మత్తయి. 27:46, "ఇంచుమించు మూడు గంటప్పడు యేసు ఏలి ఏలి లామా సబక్తాని అని బిగ్గరగా కేక వేసెను. ఆ మాటకు నా దేవా నా దేవా నన్నెందుకు చెయ్యి విడనాడితివని అర్థము."

అయిననూ, ఆయనను మొత్తిన దేవుడు మృతులలోనుండి తనను లేపునని మరియు అధిక మహిమకు చేర్చునని ఆయన నమ్మి విశ్వసించాడు. "అప్పడు యేసు గొప్ప శబ్దముతో కేకవేసి - తండ్రీ నీ చేతికి నా ఆత్మను అప్పగిచుచున్నాననెను. ఆయన యీలాగు చెప్పి ప్రాణము విడిచెను." (లూకా.23:46)

అది యదార్థమైన విశ్వాసానికి గొప్ప మాదిరి. క్రీస్తు విశ్వాసము తన పరిశుద్ధుల విశ్వాసమునకు మార్గము నిర్ధేశించినది. అంతేకాదు, ఆయన మనలో విశ్వాసమును నాటిన విధముగానే, అంతంవరకూ మన విశ్వాసమును కాపాడగల శక్తీయు సామర్థ్యము ఆయనకున్నది. నిజముగా ఆయన విశ్వాసమునకు కర్తయు దానిని కొనసాగించువాడునైయున్నాడు.

## అబేధ్యమైన కృప

గనుక ఇప్పడు వేదాంత వివాదము తలెత్తును. పాపములలో కూరుకుపోయి, తిరుగుబాటునందు సంతసించుచున్న వ్యక్తి తన ఇష్టము చొప్పన ఈ దయగల కృపనెదిరించి తిరిగి జన్మించుటకు నిరాకరించగలడా? అది అసంభవమని బైబిలు సెలవిస్తున్నది. గనుకనే ఆర్మీనియన్ సిద్ధాంతము అప్రమాణం అని నిరూపించుటలో 'అభేద్యమైన' అను పదమును ప్రయోగిస్తాం.

ఒకవేళ మానవుడు పరిశుద్ధాత్మను ఎదిరించగల సామర్థ్యం కలిగియుంటే, ప్రతి వ్యక్తి కూడా ఆయనను తప్పక ఎదిరించియుండేవాడు, కానీ అలా జరుగుటలేదన్న వాస్తవమే పరిశుద్ధాత్ముని కృప అబేధ్యమని నిరూపిస్తున్నది. ఏలయనగా శరీరానుసారమైన మనస్సు దేవునికి విరోధమైయున్నది. మానవుడు తాను ద్వేషించు దానిని ఎన్నడను ఎన్నుకోడు. గనుక ఒక వ్యక్తిని తన స్వంతనిర్ణయానికి వదిలేస్తే అతనెన్నడును రక్షణ పొందుకోలేడు, పొందుకోగోరడు. నీతి మార్గములను ఎన్నుకొనుట అతని సహజస్వభావమునకు విరుద్ధమైనది. గనుక అతనెన్నడును రక్షింపడడు. అతని మార్గములు అపాయకరములైనవనే మేలుకొలుపు కలుగనిదే అతడెన్నడును పశ్చాత్తాపపడి దేవుని వైపు తిరుగడు. గనుక 'యేసును నీ ప్రభువుగాను మరియు రక్షకునిగాను చేసుకో' అని అర్థించుట ఆధునిక సౌవార్తీకరణలో ఎంత ప్రాచుర్యము సంతరించుకున్న విధానమెనప్పటికీ అది వ్యర్థమే. పైగా, మనము యేసుని ప్రభువుగా చేయుటవలన ఆయన ప్రభువు కాలేదు. ఆయన తానే ప్రభువైయున్నాడు. మనము ఆయనను రక్షకునిగా అంగీకరించుట వలన ఆయన రక్షకుడు కాలేదు. కానీ, ఆయనే మనలను రక్షించును గనుక రక్షకుడయ్యాడు. తిరిగి జన్మించని వ్యక్తులు ఎప్పడైనా మనస్సు మార్చుకుని దేవుని వైపు మరలుటకు సమర్థులని నేడు ప్రాచుర్యములో ఉన్న స్వేచ్ఛా చిత్తపు సిద్ధాంతము మరియు మానవీయ తత్త్వశాస్త్రములనేకులను పెడద్రోవ పట్టిస్తున్నది. కానీ అది

కేవలము దుర్బోధ అని యేసు మాటలలో స్పష్టమగుచున్నది.

> "ఆయనయందు విశ్వాముంచు వానికి తీర్పు తీర్చబడదు; విశ్వసింపని వాడు దేవుని అద్వితీయ కుమారుని నామమందు విశ్వాసముంచలేదు గనుక వానికి ఇంతకు మునుపే తీర్పు తీర్చబడెను. ఆ తీర్పు ఇదే; వెలుగు లోకములోనికి వచ్చెను గాని తమ క్రియలు చెడ్డవైనందున మనుష్యులు వెలుగును ప్రేమింపక చీకటినే ప్రేమించిరి." (యోహాను.3:18,19)

విని విశ్వసించుటకు అవకాశము కలుగక మునుపే యేసు ఇక్కడ విశ్వసించని వారిని తీర్పు తీర్చుట సమంజసమేనని గ్రహించుటకు గాను, మనము ముందుగా దేవుని యొక్క సార్వభౌమ్య భవిష్యత్ జ్ఞానం మరియు ముందుగా నిర్ణయించుటను గ్రహించాలి. వారెన్నడునూ పశ్చాత్తాపపడరని ఆయన ఎరుగును; వారెల్లప్పడు చెడ్డ మార్గములను ప్రేమించి వెలుగును ద్వేషింతురు. ఆయన వారినెన్నడునూ మార్చడు గనుక వారెన్నడును మారరు.

మరొకవైపు, దేవునిచే ఏర్పరచబడి; క్రీస్తు మరణము ద్వారా కొనబడినవారు, దేవుని పిలుపుకు స్పందించి యేసును వెంబడించి, ఆయన పునరుత్థాన శక్తి ద్వారా నూతనజీవమునకై లేపబడుదురని బైబిల్ సెలవిస్తున్నది.

> "తండ్రి నాకు అనుగ్రహించు వారందరును నా యొద్దకు వత్తురు; నా యొద్దకు వచ్చువానిని నేనెంత మాత్రమును బయటికి త్రోసివేయును" (యోహాను. 6:37)

> "ద్వారమున ప్రవేసించువాడు గొఱ్ఱెల కాపరి. అతనికి ద్వారపాలకుడు తలుపు తీయును, గొఱ్ఱెలు అతని స్వరము వినును; అతడు తన సొంత గొఱ్ఱెలను పేరుపెట్టి పిలిచి వాటిని వెలుపలికి నడిపించును. మరియు అతడు తన సొంత గొఱ్ఱెలన్నిటిని వెలుపలికి నడిపించునప్పడెల్లా వాటికి ముందుగా నడుచును; గొఱ్ఱెలు అతని స్వరమెరుగును గనుక అవి అతనిని వెంబడించును. అన్యుల స్వరము అవి యెరుగవు గనుక అన్యుని ఎంతమాత్రమును వెంబడింపక వానియొద్దనుండి పారిపోవునని మీతో నిశ్చయముగా చెప్పచున్నానని వానితో అనెను." (యోహాను.10:2-5,)

## "స్వేచ్ఛా చిత్త వాదన"

ఈ సిద్ధాంతముతో ఏకీభవించని వారు తమ అసమ్మతిని సాధారణముగా ఇలా ప్రకటిస్తారు - "కానీ, మీరు ప్రస్తావించే ఈ సిద్ధాంతము మానవుని స్వేచ్ఛా చిత్తమును వ్యతిరేకంచును కదా!"

అవును, స్వేచ్ఛా చిత్తమను ఈ అపోహను నిరర్థకము చేయడము సమంజసమే. అసలు రక్షణ సందర్భములో స్వేచ్ఛా చిత్తము అను పదము నూతన నిబంధన అంతటిలో మనకు ఎక్కడా అగుపించడు. ఇది కేవలము పాత నిబంధనలో, అదియును కేవలము అర్పణలు ఇచ్చు సందర్భములో మాత్రమే ప్రయోగించబడినది కాని మానవులకు తమ గమ్యాన్ని ఎంచుకునే స్వేచ్ఛ గలదని సూచించులాగున ఈ పదము ఎక్కడను వాడబడలేదు. వాస్తవానికి యేసు పలికిన ఈ క్రింది మాటలలో మానవ స్వేచ్ఛాచిత్తమనే ఈ అపోహ అతి స్పష్టముగా వ్యతికేరించబడినదని కనుగొనగలము.

> "మరియు మీలో ఎవడు చింతించుట వలన తన యెత్తును మూరెడెక్కువ చేసికొనగలడు? కాబట్టి అన్నిటికంటె తక్కువైనవి మీ చేతకాకపోతే తక్కిన వాటిని గూర్చి మీరు చింతింపనేల?" (లూకా. 12:25,26)

ఖచ్ఛితముగా ఒకడు తనను తాను పొడవుగా చేసికోలేకపోతే, చర్మపు రంగు మార్చుకోలేకపోతే, వెంట్రుకల పోడువును పెంచుకోలేకపోతే, వయస్సు పైబడుటను ఆపుకోలేకపోతే, అధికజ్ఞానము కలిగియుండుటకు నిశ్చయించుకోలేకపోతే, అతని చిత్తము స్వేచ్చారహితముగానున్నట్టే కదా! వాస్తవానికి మానవచిత్తము గొప్ప పరిమితిని కలిగియున్నది. ఒకడు తన సొంత శక్తిచే ఎగుర యిచ్ఛయింపవచ్చును కాని అతని అసమర్థత కారణాన అలా చేయలేడు. ఒకడు ఇంగ్లాండునకు రాజుగానుండ ఇచ్ఛయింపవచ్చు గాని అతనికి వారసత్వము లేని కారణాన అలా జరుగదు. ఒకడు చాలా ధనికునిగానుండ ఇచ్చయింపవచ్చును, మూడు నిమిషాలలో ఒక మైలు పరుగెత్త దలచును, లేదా అదృశ్యుడు కాగోరును లేదా వారాంతమున పరలోకము దర్శింపగోరును. కాని చివరికి తన చిత్తానుసారముగా ప్రవర్తించుటకు శక్తిహీనుడు.

దైవ శాస్త్రపరముగా మాట్లాడితే, మానవ చిత్తానికి స్వభావసిద్ధముగా కేవలం ఒకే స్వేచ్ఛ కలదు. అది పాపమును ఎంచుకునే స్వేచ్ఛ. మన చిత్తములు దేవుని ప్రీతిపరచగోరు స్వేచ్ఛ లేకుండునట్లు పాపపు బంధములచేత పరిమితము చేయబడ్డాయి. మన చిత్తము కేవలము శరీర ఆశలను కోర్కెలను నెరవేర్చుటకు ఇష్టపడుతుంది. కాని మంచిగా నుండి, దేవునికి విధేయులైయుండి, తద్వారా ఆయనను ప్రీతి పరచి మనలను రక్షింపబద్ధునిగా చేయ సామర్థ్యము మన చిత్తానికి లేదు. అయితే ఆర్మేనియన్‌ల వాదన ఏమిటంటే, మానవులు స్వేచ్ఛా చిత్తమును అభ్యసించగలిగితే, కొందరు వ్యక్తులు దేవునికి లోబడుటను మరియు రక్షింపబడుటను ఎన్నుకుంటారు. కాని ఉదాహరణ నుండి నేర్చుకొందుము. క్రీస్తు కంటే ముందు జీవించిన వారిలో ఆదాము అతి స్వేచ్ఛాయుతమైన చిత్తమును కలిగియున్నాడు. అతి ప్రాముఖ్యముగా ఆయన పాపరహిత వాతవరణములో జీవించాడు. గనుక ఆయన సహజ తపనలు దేవునికి అనుకూలంగా ఉండెను. ఆదాము సంపూర్ణ స్వేచ్ఛపై దేవుడు పెట్టిన ఏకైక పరిమితి మంచి చెడుల తెలివినిచ్చు వృక్షమును ముట్టవద్దని. అంతటి పరిపూర్ణ వాతావరణములో తన స్వేచ్ఛపై కేవలము ఏకైక పరిమితి కలిగియుండిన ఆ పరిపూర్ణ మానవుడైన ఆదాము తిరుగుబాటు చేయ నిశ్చయించుకున్నాడు. ఇదిలా వుండగా పాపము మరియు తిరుగుబాటునందు నశిస్తూ అనేక శోధనలచే చుట్టు ముట్టబడి, దేవుని పట్ల కోపము మరియు ద్వేషముగల లోకములో జీవిస్తున్న మానవులు, తమ స్వేచ్ఛా చిత్తమును అభ్యసించి తమ నడవడికి మరియు శరీరేచ్ఛలకు భిన్నముగా దేవుని వెంబడింప నిశ్చయింతురని మనమెలా ఊహించగలం?

మనము పాపములలో మరియు అతిక్రమములలో మరణించియున్నామని పరిశుద్ధ గ్రంథము సెలవిచ్చుచున్నది (ఎఫెసీ.2:1). అయితే మృతుడైన మనుష్యుడు తన చిత్తమును ఎలా అభ్యసించగలడు? మృతుడైన లాజరు తాను సమాధి నుండి లేచునట్లు నిశ్చయింప సామర్థ్యము కలిగియుండెనా? బేతెస్ధ కోనేరు చెంతనున్న వ్యాధిగ్రస్తుడు తాను లేచి నడుచునట్లు తీర్మానించు శక్తి కలిగియుండెనా? కుష్టువాడు తనను తాను శుద్ధి చేసుకొనునట్లు తన చిత్తాన్ని అభ్యసించుకోగలిగెనా? లేదు. వారలా చేయుటకు పూర్తిగా అసమర్థులు, వారి చిత్తములు బొత్తిగా పరిమితమైయున్నవి. లేదా ఒక చారిత్రాత్మక ఉదాహరణ నుండి నేర్చుకొందము. తార్సు వాడైన పౌలు క్రైస్తవమునకు మారినప్పడు తన చిత్త శక్తిని, నిర్ణయ స్వేచ్ఛను ఎంత ఉపయోగించాడు? కనీవినీ ఎరుగని రీతిలో ఎంతో ఘోరముగా అతడు ఆదిమ క్రైస్తవలును హింసించాడు. స్తెఫనును రాళ్లతో కొట్టి చంపడమును అతడు సమ్మతించాడు. విశ్వసించిన యూదులు యెరూషలేము నుండి పలాయనము చిత్తగించుటకు అతడే ముఖ్య కారణము, అతడు ఈ నూతన మతమును స్వీకరించిన స్త్రీ పురుషులను బంధించి యెరూషలేముకు తీసుకురావలెనని ప్రధాయాజకుని నుండి సిఫారసు పత్రమును పొందుకొని స్వారీ చేయుచూ వెళ్ళుచుండెను. అకస్మాత్తుగా ఆకాశము నుండి వెలుగు ఆయనను మొత్తగా తన గాడిద నుండి పడిపోయాడు. అతడు నేలనొరగగా

యేసు స్వరము అతనిని పిలిచింది. అంధుని చేసి అటుపిమ్మట శిక్షణకై అరణ్యమునకు తీసుకొని వెళ్లింది.

ఆ మనుష్యుడు మనకు అపోస్తలుడైన పౌలుగా పరిచయమయ్యాడు. క్రొత్త నిబంధనలో మూడవ వంతు గ్రంథములను ఆయనే వ్రాసాడు. అయితే ఆయన పత్రికలలో ఆయన మార్పును తనదైనట్టుగా ఎక్కడా చెప్పలేదు, అతిశయించనూ లేదు. దానికి విరుద్ధముగా, కృప మరియు ముందుగా నిర్ణయించుట విషయములలో పౌలు దిట్టగానున్నట్లు చూస్తాము.

యేసు, సీమోను పేతురు మరియు ఆయన సహోదరుడైన అంద్రెయ సముద్రములో వలవేయుచుండగా, నన్ను వెంబడించుము నేను మిమ్ములను "మనుష్యులను" పట్టు జాలరులనుగా చేతునని ఆయన చెప్పెను. మరియు వారు ఆయనను వెంటనే వెంబడించిరి. (మత్తయి.4:19,20). అది ప్రభావవంతమైన పిలుపు. వారిని నిర్ణయించుకొమ్మన్నట్లు గాని, ఎన్నుకొమ్మనట్లు గాని, లేదా ఆయనను ప్రభువుగా లేదా రక్షకునిగా చేసికొమ్మన్నట్లు గాని ఈ వాక్యభాగము చెప్పటలేదు. ప్రతిగా, విశ్వమునకు ప్రభువైన వాని శక్తివంతమైన ఆజ్ఞకు వారు ప్రతిస్పందించారు. ఆ పిలుపును ఎదిరించుటకు వారు శక్తిహీనులు. ఈ సిద్ధాంతముతో ఏకీభవించని వారి తరువాయి వాదన ఇలా వుంటుంది. దేవుడు ఒక వ్యక్తియొక్క చిత్తానికి వ్యతిరేకంగా బలవంతపెట్టి, అతను సమ్మతింపనొల్లక తన్నుతూ అరుస్తూ వుండగా అతనిని పరలోకమునకు ఈడ్చుకొని పోవునని మీరు చెప్పచున్నారా?

కాదు, దేవుడు తన రక్షణపిలుపును సార్థకం చేసే విధానం అది కాదు. మానవుని యొక్క చిత్తమును, హృదయమును మార్చి, ఆయనను అనుసరించు కోరికను అతనికి కలుగజేస్తాడు. దేవుడు మానవ చిత్తముతో పోటి పడడు, దానిని ఓడించి లోబరచుకొంటాడు.

"యుద్ధ సన్నాహ దినమున (మూలభాషననుసరించి ' నీ శక్తి ప్రదర్శింపబడు దినమున') నీ ప్రజలు ఇష్టపూర్వకముగా వచ్చెదరు." (కీర్తన. 110:3)

"వారు నా కట్టడలను నా విధులను అనుసరించి గైకొనునట్లు నేను వారి శరీరములోనుండి రాతి గుండెను తీసివేసి వారికి మాంసపు గుండెను ఇచ్చి, వారికి ఏక మనస్సు కలుగజేసి వారియందు నూతన ఆత్మను పుట్టింతును. అప్పడు వారు నాకు జనులైయుందురు నేను వారికి దేవుడునైయుందును." (యెహెజ్కేలు.11:19,20)

"ఈ దినములైన తరువాత నేను ఇశ్రాయేలు వారితోను యూదావారితోను చేయబోవు నిబంధన ఇదే. వారి మనస్సులో నా ధర్మ విధి ఉంచెదను, వారి హృదయము మీద వ్రాసెదను; యెహోవా వాక్కు ఇదే నేను వారికి దేవుడునైయుందును వారు నాకు జనులగుదురు, వారు మరి ఎన్నడును - యెహోవాను గూర్చి బోధనొందుదము అని తమ పొరుగువారికి గాని తమ సహోదరులకు గాని ఉ పదేశము చేయరు. నేను వారి దోషములను క్షమించి వారి పాపములు ఇక ఎన్నడును జ్ఞాపకము చేసికొనను గనుక అల్పులేమి ఘనులేమి అందరును నన్నెరుగుదురు, ఇదే యెహోవా వాక్కు." (యిర్మియా.31:33,34)

"ఎందుకనగా మీరు ఇచ్ఛయించుటకును కార్యసిద్ధి కలుగజేసికొనుటకును, తన దయాసంకల్పము నెరవేరుటకై మీలో కార్యసిద్ధి కలుగజేయువాడు దేవుడే." (ఫిలిప్పీ.2:13)

దేవుడు ఓ మానవుని చిత్తమునకు వ్యతిరేకముగా పనిచేయడు. ప్రతిగా ఆయన వారిని తనవైపు ఆకర్షిస్తాడు. వారి హృదయమును మరియు స్వభావమును ఆయన చిత్తానుసారముగా మార్చును. ఎన్నుకొనబడి, రక్తముచే కొనబడి పరిశుద్ధాత్ముని నివాసముగా చేయబడిన ఆ పరిశుద్ధులు అతి ఇష్టపూర్వకముగా యేసును చేరుదురు.

మనకు వ్యతిరేకముగా తీర్మానము చేసి, ఎలాగైతే యేసు తన ఆశలను మరియు చిత్తమును తండ్రికి సమర్పించుకున్నాడో, అదే విధముగా మనలను మన తండ్రి చిత్తమునకు అప్పగించుకొంటాము.

> "తండ్రీ, యీ గిన్నె నా యొద్ద నుండి (తొలగించుటకు) నీ చిత్తమైతే తొలగించుము అయినను నా యిష్టము కాదు, నీ చిత్తమే సిద్ధించును గాక అని ప్రార్థించెను." (లూకా.22:42)

క్రీస్తు బలియాగము మనుష్యులను ధర్మశాస్త్ర బానిసత్వము నుండి విడిపించింది, మరియు "దేవుడు వ్రాత పూర్వకమైన ఆజ్ఞలవలన మన మీద ఋణముగాను మనకు విరోధముగాను నుండిన పత్రమును మేకులతో సిలువకు కొట్టెను" (కొలొస్సీ.2:14). ధర్మశాస్త్ర "శాపము" మనపై ఇకను వుండదు గనుక మనకేది ఇష్టము వస్తే అది చేయుటకు స్వతంత్రులమైయున్నాము. కాని మనలో నివసించు పరిశుద్ధాత్మ మన ఆశలను మార్చును! ఆయన మన కోర్కెలను అనుసరింప స్వేచ్ఛ కలిగిస్తాడు. కాని మన కోర్కెలను పునఃరూపిస్తాడు. మనకిష్టము వచ్చినట్లుగా చేయ స్వతంత్రులనుగా చేయును గాని ఆయనను ఆనందింపజేయుటయే మనకు అతి గొప్ప ఇష్టమవునట్లు మన హృదయములను మార్చును.

> "అన్నిటియందు నాకు స్వాతంత్ర్యము కలదు గాని అన్నియు చేయదగినవి కావు. అన్నిటియందు నాకు స్వాతంత్ర్యము కలదు గాని నేను దేని చేతను లోపరచుకొనబడనొల్లను." (1 కొరింథి.6:12)

క్రైస్తవ్యములోని మహిమాన్వితమైన గొప్ప స్వాతంత్ర్యమునందు మన అపరాధములన్నియు తొలగించబడి ధర్మశాస్త్రము యొక్క శిక్షావిధి తీసి వేయబడినది. అయితే అదే విధముగా మన దేవునిని ప్రీతి పరచు వాటిని మాత్రమే చేయవలెనన్న కొరిక కూడా మనలో ఉత్పన్నం చేయబడినది. మనము కీలుబొమ్మలవలె మన చిత్తముతో పని లేకుండా బలవంతముగా పరలోకమునకు తీసుకొనిపోబడుటలేదు. మన స్వభావములకు వ్యతిరేకంగా మన రక్షకుని వెంబడించి ఆయనకు లోబడు ఆకాంక్షను మనము పొందియున్నాము. అందుకే మన రక్షణకు సంబంధించిన ప్రతిదియు మనకు కాక దేవునికే మహిమ తెచ్చును. స్వేచ్ఛా చిత్తమును సమర్థించు వాదనలు పైపైకి ఎంత ఆకర్షితముగా కనిపించినను, మనలోని అహమును ఎంతగా ఆకట్టుకొనినను మనలో మనమే అతిశయపడుటకు తావిచ్చు ప్రవృత్తిని అది కలిగి వున్నను, వాటిని సమర్థించునదేదియు లేఖనమునందు మనకు లేశమాత్రమును కనిపించదు.

**క్రీస్తు అధికారము** యేసు భూమిపై నరవతారిగా నివసించినప్పడు తన సృష్టియందు ప్రతిదానిపై తన అధికారమును ప్రదర్శించెను.

1, ఆయన జంతువుల స్వభావములను మార్చెను ఉదహరణకు ఎవరును, ఎన్నడును కూర్చుండని గాడిద పిల్లపై తాను ఎక్కినప్పడు అది ఆయనకు లోబడెను (లూకా 19:30-35).

2. ఆయన చేపలను వలలోనికి దూక చేసినప్పడు వాటి స్వభావమును మార్చెను (యెహాను 21:6).

3. ఆయన నీటిని ద్రాక్షరసముగా మార్చినప్పడు నీటి యొక్క స్వభావమును మార్చెను. (యోహాను 2)

4. ఆయన కేవలం ఒక మాట చేత తుఫానును శాంతింపజేసినప్పడు దాని స్వభావమును మార్చెను.

5. ఆయన కేవలం ఒక మాట చేత అంజూరపు చెట్టును ఎండిపోవునట్లు చేసినప్పడు దాని స్వభావమును మార్చెను (మత్తయి 21:8)

6. ఒకవేళ జన సమూహము ఆయనను స్తుతించుటకు మాని యుంటే స్తుతి చెల్లించునట్లు ఆయన రాళ్ల యొక్క స్వభావమును మార్చియుండెడి వాడు. (లూకా 19:40)

ఆయన ఒక వ్యక్తి యొక్క హృదయములో పనిచేయునప్పడు కూడా అలాగే జరుగుతుంది. సర్వశక్తిమంతుడైన సృష్టికర్త మాట పలుకునప్పడు, ఆయన సృష్టము కేవలం దానికి తలయొగ్గును.

ఒక వ్యక్తి మార్పునొందవలెనని ఆయన నిర్ణయిస్తే అందుకు నిరాకరించుటకు ఆ వ్యక్తి అశక్తుడు.

మాటచేత సృష్టిని కలుగజేసి, సింహాసనాసీనుడై, ఆది నుండి కలుగబోవు వాటిని ప్రకటించి, లేని వాటిని వున్నట్టుగా పిలుచు దేవుడు, ఆవిరి వంటి, ధూళియై పోవు, మానవుని చిత్తముచే పరిమితం చేయబడతాడనుట జ్ఞానయుక్తము కాదు. (మానవుడు తన శ్వాసపై అదుపు కలిగినట్టుగా వున్నాడు గానీ దేవుని అనుమతి లేక మానవుడు కనీసము శ్వాస కూడా తీయలేడు).

దేవుడు కొందరు వ్యక్తులను ఎన్నుకుని, క్రీస్తు వారి నిమిత్తము తండ్రి నుండి ఎడబాపబడునంతగా వేదన సహించిన పిమ్మట వారి విధి తమ పాపపు అజ్ఞానపూరిత, ప్రతిఘటిత చిత్తమునకు వదిలి వేయబడినదనుట దేవునిని శక్తిహీనునిగాను, అవివేకిగాను చిత్రీకరించినట్లవుతుంది.

ఒకని రక్షణను దేవుడు నిర్ణయిస్తే అతడు తప్పక రక్షింపబడుతాడు. అతని అవినీతిని ఒప్పకొని, రక్షకుని ఆవశ్యకతను అతడు గుర్తింస్తాడు. యోనావలె "రక్షణ యెహోవాకు చెందునని" అతడు ప్రకటిస్తాడు (యోనా.2:9).

తండ్రి చిత్తమునకు లోబడు కోరికను కలిగివుండునట్లు అతడు దేవునికుమారుని పోలికలో పునః సృష్టింపబడుతాడు. అతడు స్వనీతి అను మురికి బట్టలను విడిచి తిరిగి జన్మించి శుభ్రమైన, స్వచ్ఛమైన క్రీస్తు నీతి వస్త్రములను ధరిస్తాడు. సంపూర్ణము చేయబడిన క్రీస్తుకార్యమునందు అతడు విశ్వసిస్తాడు మరియు తన భద్రతకు, నిత్యరక్షణకు ఆధారమైన ఆయనను పంపిన దేవునియందు నమ్మకముంచుతాడు.

సౌలు ఎఫెసీ సంఘమునకు వ్రాసిన విధముగా మీ అందరికొరకు నా నిరీక్షణ ఈ విధముగానున్నది.

> "మరియు మీ మనోనేత్రములు వెలిగింపబడినందున ఆయన మిమ్మును పిలచిన పిలుపు వల్లనైన నిరీక్షణ యెట్టిదో పరిశుద్ధులలో ఆయన స్వాస్థ్యము యొక్క మహిమైశ్వర్యమెట్టిదో, ఆయన క్రీస్తునందు వినియోగపరచిన బలాతిశయమును బట్టి, విశ్వసించు మనయందు ఆయన చూపుచున్న తన శక్తి యొక్క అపరిమితమైన మహత్యమెట్టిదో మీరు తెలిసికొనవలెనని, మన ప్రభువైన యేసుక్రీస్తు యొక్క దేవుడైన మహిమా స్వరూపియగు తండ్రి, తన్ను తెలిసికొనుటయందు మీకు జ్ఞానమును ప్రత్యక్షయునుగల మనస్సు అనుగ్రహించినట్లు నేను నా ప్రార్థనలయందు మిమ్మును గూర్చి విజ్ఞాపన చేయుచున్నాను. ఆయన బలాతిశయముచేత క్రీస్తును మృతులలోనుండి..........పరలోకము నందు ఆయనను తన కుడి పార్శ్వమున కూర్చుండబెట్టియున్నాడు." (ఎఫెసీ.1:17-20)

మనము జ్ఞానాత్మను స్వీకరించి, ఆయన జ్ఞానప్రత్యక్షత గ్రహించి, మన మనోనేత్రములు వెలిగింపబడి, ఆయన నిరీక్షణవల్లనైన పిలుపు ఎట్టిదో ఎరుగుదుము గాక.

దేవుడు పిలుస్తాడు. మనము ఆయన కృపచే ప్రతిస్పందిస్తాము. ఆయన ముందుగా చేసిన నిర్ణయము ఆయన సర్వాధికారిక ఎన్నిక, క్రీస్తు యొక్క సంపూర్ణ ప్రాయశ్చిత్తము మరియు పరిశుద్ధాత్మ సార్థకమైన పిలుపును బట్టి మనకు పరలోక ప్రవేశము ఖచ్చితము చేయబడినది. రక్షణ సంబంధమైన ఈ ధాతువులు ఎంతో ఖచ్చితమైనవి, ఎంతో బలమైనవి మరియు ఎంతో నమ్మదగినవి గనుక మనకు నిత్యజీవ దశను అనుగ్రహించుచున్నవి. ఇది ఐదు కృపాసిద్ధాంతాలలో చివరిదైన 'పరిశుద్ధులపదిలత' అనే సిద్ధాంతముకు మనలను నడిపిస్తుంది.

## ఐదవ అధ్యాయము

# పరిశుద్ధుల పదిలత

గత నాలుగు సిద్ధాంతములు దైవశాస్త్రపరముగా ఆరోగ్యదాయకమైనదైతే మరియు లేఖనపరముగా వాస్తవమైనట్లయితే, ఈ ఐదవ సిద్ధాంతము కేవలము వాటి వలన తేలిన ఫలితార్థమే.

1) 'సంపూర్ణ పతనము' అను సిద్ధాంతము వాస్తవమైనట్లయితే మానవులంతా సహజముగా పాపాత్ములై, ఆత్మీయముగా మృతులై దేవుని సంతోషపరచు దేదియు చేయుటకు గాని తద్వారా వారిని రక్షింపబద్ధునిగా ఆయనను చేయుటకు గాని అసమర్థులైయుందురు. కాబట్టి ఎవరైనా రక్షింపబడవలసివస్తే పాపుల పక్షముగా దేవుడే కార్యము జరిగించాలి. నిస్సహాయ జీవులు దేవుని వెదకునట్లుగా తామే లేచుట అసాధ్యము.

2) 'భేషరతు ఎన్నిక' అను సిద్ధాంతము వాస్తవమైనట్లయితే, దేవుడు జగత్తు పునాది వేయబడక మునుపే ఒక నిర్ధిష్ట జనసంఖ్య జనసమూహమును కేవలము తన ఉద్దేశము మరియు అభీష్టము చొప్పన తన కృపా కనికరములను కనబరుచుటకు  ఏర్పరచుకున్నాడు. వారి పాపపు నాశన స్థితిని చూచినట్లయితే, ఆ వ్యక్తులలో మేలైనదేదియు ఆయన చూడలేదు. కనుక దేవుని భేషరతు ఎన్నిక ఎలాంటి  షరతులు లేనిది.

3) 'పరిమిత ప్రాయశ్చిత్తము' అనే సిద్ధాంతము వాస్తవమైనదైతే, క్రీస్తు భూమికి వచ్చి దేవునిచే ఎన్నుకొనబడిన ప్రజలకు బదులుగా మరణించాడు. వారికి మారుగా ధర్మశాస్త్రమును నెరవేర్చాడు. క్రయధనము చెల్లించి వారి నిత్య పరిపూర్ణతను పదిలము చేశాడు. కాని, క్రీస్తు బలియాగము మరియు జీవమునకెన్నై పునరుత్థానము, దేవుడు నిత్య జీవమునకై ఎన్నుకొనినవారికి మాత్రమే పరిమితం. పాపాత్మక ప్రపంచము విశ్వాసముతో క్రీస్తును హత్తుకోదు; ఆయన ప్రాయశ్చిత్తకార్యము యొక్క మేలు పొందదు.

4) 'అబేధ్యమైన కృప' అను సిద్ధాంతము వాస్తవమైనదైతే దేవునిచే ఎన్నుకొనబడిన వారందరిలో పరిశుద్ధాత్ముడు నివసిస్తూ వారిని తండ్రి చెంతకు ఆకర్షిస్తూ, కుమారునియందు వారికి విశ్వాసము పుట్టించును. ఏ దేవుని శక్తియైతే మాట పలుకగా విశ్వములో వెలుగు కలిగిందో, అదే శక్తి అంధకారమయమైన ఆత్మలలో వెలుగు కలుగజేసి, వారికి నూతన జన్మ కలుగజేసి, ఆత్మీయ ఇంద్రియములను మేల్కొలిపి నిత్యజీవము దయచేయును. ఇట్టి దేవుని శక్తి ఆయన సృష్టము ద్వారా ఓడింపబడుట, నిర్లక్ష్యము చేయబడుట లేదా ధిక్కరించబడుట అసాధ్యము. దేవుడు ఎన్నుకొనిన కడమ వ్యక్తి వరకు అందరిని తప్పక యేసు రక్షించును.

ఇదంతయు వాస్తవమైనదైతే, దేవుడు నిత్యజీవమునకై ఎవరినైతే భేషరతుగా ఎన్నుకున్నాడో తప్పకవారు తండ్రి సన్నిధికి క్షేమముగా చేరుతారు. సర్వశక్తిమంతుడగు దేవుడు ఖచ్చితముగా ఆయన ఉద్దేశమును ప్రణాళికను నెరవేరుస్తుతాడు. ఎలాగైతే ఒక వ్యక్తిలో వున్నదేదియు వానిని రక్షించుటకు దేవుని బద్దునిగా చేయలేదో అలాగే ఆ వ్యక్తిలో ఉన్నదేదియు అతనిని తృణీకరించి నాశనమునకు అప్పగించులాగున దేవుని పురిగొల్పదు.

ఒక పాపిని తిరిగి జన్మింపజేయుటకు ఎంత గొప్ప అద్భుతకార్యము జరగాలో, ఆ వ్యక్తి మరల తన పూర్వపు పతనావస్థకు దిగజారుటకు కూడా అంతే గొప్ప అద్భుత కార్యము జరగాలి.

అందుకే ఈ ముగింపు సిద్ధాంతము 'పరిశుద్ధుల పదిలత' అని పిలువబడుచున్నది. దేవునిచే ఎన్నుకొనబడిన ప్రతీ ఒక్కరు ఖచ్చితముగా మరియు నిశ్చయముగా, ముందుగా వారికై నిర్ణయింపబడిన బహుమానము పొందుకొనెదరని ఈ సిద్ధాంతము బోధించుచున్నది. పరిస్థితులు, అభ్యంతరాలు, శత్రువులు మరియు సులువుగా చిక్కులబెట్టు పాపములు మున్నగు వీటిని అధిగమించి, వారు తప్పక తమ లక్ష్యాన్ని చేరుకుంటారు.

ఇక్కడ వివాదమంతా రక్షింపబడినవారు, యదార్థముగా తిరిగి జన్మించినవారు తమ విశ్వాసములోనుండి తొలగిపోయి తమ రక్షణను కోల్పోవుటకు ఆస్కారము కలదనే ఆర్మీనియన్ల భావము చుట్టు పరిభ్రమిస్తుంది. ఇట్టి వాదన తన జీవిత కాలములో ఒక వ్యక్తి అనేక మార్లు రక్షింపబడుటకును ఆ రక్షణను కోల్పోవుటకును అవకాశము కలదనే అపోహకు సహజముగా తావునిస్తుంది.

అసమర్థులైన మానవులే తమ అంతిమగమ్యానికి బాధ్యులని ఆర్మీనియన్ల వాదన. రక్షణకు చెందిన ప్రతి విషయములో, ప్రత్యేకముగా విశ్వాసుల భూసంబంధయాత్ర విషయములో వారి ఆత్మయొక్క భద్రత విషయములో దేవుని సార్వభౌమాధికారమే కారణమని అంగీకరించేందుకు బదులు ఆర్మీనియనులు రక్షింపబడుటకే కాక రక్షణలో కొనసాగుటకు కూడా పాపభూయిష్ట మానవచిత్తమే నిర్ణయాత్మకమని నొక్కి వక్కాణిస్తారు.

కానీ ముందుగా చెప్పబడిన విధముగా మానవుల రక్షణ దేవుని పనియైతే, ఆదినుండి సమస్తమును సంకల్పించిన వాని కృప, కరుణ మరియు అభీష్టముపై అది ఆధారపడినట్లయితే, అలా రక్షింపబడిన వ్యక్తి తన స్వంత ఉపాయాలచేత నశించిపోవునట్లు దేవునిచే విడిచిపెట్టబడేందుకు తన నడవడిలో లేదా ప్రవృత్తిలో కలిగే మార్పు సమర్థవంతమైన కారణము కానేరదు. అలా జరిగేందుకు మార్పుచెందని దేవుని చిత్తము, సంకల్పము మరియు శాశ్వత నిర్ణయములోనే మార్పు జరగాలి.

## దేవుని సంకల్పముల నిశ్చయత

దేవుని గుణలక్షణములను వర్ణించుటలో దైవశాస్త్రవాదులు, 'మారనివాడు' అను పదము వాడుదురు. దానికర్థము 'దేవుడు మారజాలనివాడు'. దేవుడు తన మనస్సు, దిశ, సంకల్పము మరియు ఆయన ఉద్దేశములను మార్చడు.

"యెహోవానైన నేను మార్పులేని వాడను గనుక యాకోబు సంతతి వారైన మీరు లయము కాలేదు." (మలాకీ.3:6)

"యేసు క్రీస్తు నిన్న, నేడు, నిరంతరం ఒక్కటే రీతిగా ఉన్నాడు." (హెబ్రీ.13:8)

"దేవుడు అబద్ధమాడుటకు ఆయన మానవుడు కాడు పశ్చాత్తాపడుటకు ఆయన నరపుత్రుడు కాడు. ఆయన చెప్పి చేయకుండునా? ఆయన మాట ఇచ్చి స్థాపించకుండునా?" (సంఖ్యా.23:19)

ఇది దేవుని ప్రధాన గుణలక్షణము మరియు స్వభావముగానున్నది. ఆయనలోని మరొక అంతర్గుణమేమిటంటే ఆదియందు ఆయన చేయనుద్దేశించినది పరిపూర్ణమైనది గనుక ఎప్పటికీ సవరించలేనిదై ఎన్నిటికి మెరుగుపరచలేనిదైయున్నది.

"............ఆయనయందు ఏ చంచలత్వమైనను గమనాగమనములవలన కలుగు ఏ ఛాయయైనను లేదు." (యాకోబు.1:17)

యోహాను తన సువార్త ప్రారంభములోనే యేసు వ్యక్తిత్వమును పరిచయము చేసినప్పుడు ఆయనను "వాక్యము" గా గ్రీకులో "లోగోస్" గా సూచించాడు. అది దైవకుమారునికి అనుగ్రహింపబడిన విశిష్టనామముగా సృష్టింపబడినదంతయు ఉనికిలోనికి తెచ్చిన దైవత్వమునందలి "మాట్లాడు" వ్యక్తిగా ఆయనను ప్రకటించుచున్నది. క్రొత్త నిబంధనలో "లోగోస్" అను ఈ పదము లేఖనములను లిఖితపూర్వక దేవుని వాక్యముగాను మరియు యేసును దేవుని సజీవవాక్యముగాను సూచించుటకు అనేక పర్యాయములు వాడబడియున్నది.

ఎన్నుకొనబడినవారికైన ప్రత్యేక రక్షణ కార్యమును సాధించుటకై దేవుడు తన కుమారుని పంపినప్పుడు, ఆ కార్యసాఫల్య విషయమై దేవుని తలంపులలో ఎటువంటి సంశయము తలెత్తలేదు. అది సర్వశక్తిమంతుడును మార్పుచెందని వాడునైన దేవుని ద్వారా ఆదేశింపబడి బలపరచబడిన కార్యము. ఆయన పంపబడిన కార్యము సఫలీకృతము చేయకుండ యేసు తన తండ్రియొద్దకు తిరిగి చేరడు.

> "..........అలాగే నా నోటనుండి వచ్చు వచనమును ఉండును. నిష్ఫలముగా నా యొద్దకు మరలక అది నాకు అనుకూలమైనదానిని నెరవేర్చును. నేను పంపిన కార్యమును సఫలము చేయును." (యెషయా.55:10,11)

మనము దేవుని మౌఖిక వాక్యమును గూర్చి మాట్లాడినా, లిఖిత పూర్వక వాక్యమును గూర్చి మాట్లాడినా లేదా శరీరధారియైన వాక్యమును గూర్చి మాట్లాడినా, అవి ఒక ఉద్దేశముతో పంపబడినవి. మరియు ఆ ఉద్దేశ నెరవేర్పునందు అవి విఫలత చెందవు. ఇది ఇలా ఉండగా దేవుడు తన కుమారుని సమాధి నుండి లేపడనే సంభావ్యత ఎప్పడైనా ఎట్టిదైనా ఉండెనా? క్రీస్తును పునరుత్థానపరచుటలో తండ్రి వైఫల్యము చెందియుండేవాడా? అట్టి తలంపు ఎంత అసాధ్యమైనదో కీర్తనాకారుడు ప్రవచించాడు.

"ఎందుకనగా నీవు నా ఆత్మను పాతాళములో విడిచి పెట్టవు, నీవు పరిశుద్ధుని కుళ్ళు పట్టనియ్యవు." (కీర్తన.16:10)

దేవుడు తప్పక ఆయన కుమారుని శరీరమును లేపును. అదే విధముగా భూమి మీద "క్రీస్తు సంఘమును" (సంఘము) పునరుత్థానపరచుటలో దేవుడు సఫలుడవుతాడనుటలో లేశమాత్రమైన సందేహము లేదు. ఈ విషయమై యేసు మరియు పౌలు ఖచ్ఛితముగా చెప్పారు. ఎవరికొరకైతే యేసు మరణించాడో వారికి ప్రత్యేకముగా మరియు అజేయముగా నిత్యజీవము ఇయ్యబడినది.

> "యేసు ఈ మాటలు చెప్పి ఆకాశము వైపు కన్నులెత్తి ఇట్లనెను - తండ్రీ, నా గడియవచ్చియున్నది. నీ కుమారుడు నిన్ను మహిమ పరచునట్లు నీ కుమారుని మహిమ పరచును. నీవు నీ కుమారునికిచ్చిన వారందరికిని ఆయన నిత్య జీవము అనుగ్రహించునట్లు సర్వ శరీరుల మీదను ఆయనకు అధికారమిచ్చితివి." (యోహాను. 17:1,2)
>
> "అయితే దేవుడు మనయెడల తన ప్రేమను వెల్లడిపరచుచున్నాడు. ఎట్లనగా మనమింకను పాపులమై యుండగానే క్రీస్తు మనకొరకు చనిపోయెను. కాబట్టి ఆయన రక్తమువలన ఇప్పడు నీతిమంతులముగా తీర్చబడి, మరింత నిశ్చయముగా ఆయన ద్వారా ఉగ్రత నుండి రక్షింపబడుదము. ఏలయనగా శత్రువులమైయుండగా, ఆయన కుమారుని మరణము ద్వారా మనము దేవునితో సమాధనపరచబడినవారమై, ఆయన జీవించుటచేత మరి నిశ్చయముగా రక్షింపబడుదుము." (రోమా5:8-10 )

ఇది దేవుని ప్రతిష్ట మరియు విశ్వాస్యత పై సవాలు. దేవుడు తన కుమారునికి ఒక ప్రజను స్వాస్థ్యముగా ఇస్తానని

వాగ్దానముచేసి, దానిని నెరవేర్చుటలో విఫలమగునా? తన కుమారునికి ఒక కన్యకను ప్రధానముచేసి వివాహము జరిపించుటలో వైఫల్యము చెందునా? అంతేకాక ఇక్కడ క్రీస్తు సొంత వాగ్దానముల స్థిరత్వము కూడా ఇరుకున పడుతుంది. నమ్మినవారికి యేసు నిత్యజీవమును వాగ్దానము చేసి దానిని నేరవేర్చుటలో విఫలుడగునా? ఖచ్ఛితముగా అలా జరగదు.

## రక్షణ వ్యవధి

క్రీస్తు వాస్తవముగా తన ప్రజల రక్షణ సిలువపై సఫలము చేసాడు. అయితే అది ఎట్టి రక్షణ ? అది ఎంతకాలము చెల్లును? అది మనగలుగునా? లేదా అది కొదువబడే అవకాశమేదైనా వుందా? బైబిలు సిద్ధాంతములలో ప్రాథమికమైనది, ఖచ్ఛితమైనది "నిత్యజీవమను" అంశము.

"నిత్యజీవము అనుగ్రహింతుననునది ఆయన తానే మనకు చేసిన వాగ్ధానము."(1యోహాను.2:25)
"ఈ హేతువు చేత మొదటి నిబంధన కాలములో జరిగిన అపరాధముల నుండి విమోచనము కలుగుటకై ఆయన మరణము పొందినందున, పిలువబడిన వారు నిత్యమైన స్వాస్థ్యమును గూర్చిన వాగ్ధానము పొందునిమిత్తము ఆయన క్రొత్త నిబంధనకు మధ్యవర్తియైయున్నాడు." (హెబ్రీ.9:15)
"విశ్వసించినవాడే నిత్యజీవముగలవాడు" (యోహాను.6:47)
"నా మాటవిని నన్ను పంపినవానియందు విశ్వాసముంచువాడు నిత్యజీవముగలవాడు. వాడు తీర్పులోనికి రాక మరణములోనుండి జీవములోనికి దాటియున్నాడని మీతో నిశ్చయముగా చెప్పచున్నాను." (యోహాను.5:24)

యేసు కూడా "నిత్యజీవమును" గూర్చి పదేపదే చెప్పాడు. "అందుకాయన - మిక్కిలి అల్పులైన వీరిలో ఒకనికైనను మీరు ఈలాగు చేయలేదు గనుక నాకు చేయలేదని నిశ్చయముగా చెప్పచున్నానని వారితో అనును. వీరు నిత్యశిక్షకును నీతిమంతులు నిత్యజీవమునకును పోవుదురు." (మత్తయి.25:45-46)

"అరణ్యములో మోషే సర్పమును ఎలాగు ఎత్తెనో, అలాగే విశ్వసించు ప్రతివాడును నశింపక ఆయన ద్వారా నిత్యజీవము పొందునట్లు మనుష్యకుమారుడు ఎత్తబడవలెను. దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను కాగా తన అద్వితీయ కుమారునిగా పుట్టిన వానియందు విశ్వాసముంచువాడు నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను." (యోహాను.3:15,16)
"కాబట్టి యేసు - మీరు కూడా వెళ్ళి పోవలెననియున్నారా? అని పండ్రెండు మందిని అడుగగా సీమోను పేతురు ప్రభువా, యెవని యొద్దకు వెళ్ళుదుము? నీవే నిత్యజీవపు మాటలగలవాడవు." (యోహాను.6:67,68)

"నా గొఱ్ఱెలు నా స్వరమును వినును, నేను వాటినెరుగుదును, అవి నన్ను వెంబడించును నేను వాటికి నిత్యజీవమిచ్చుచున్నాను. గనుక అవి ఎన్నటికిని నశింపవు, ఎవడును వాటిని నా చేతిలోనుండి అపహరింపడు." (యోహాను.10:27,28)

"యేసు ఈ మాటలు చెప్పి ఆకాశము వైపు కన్నులెత్తి ఇట్లనెను - తండ్రీ, నా ఘడియ వచ్చియున్నది. నీ కుమారుడు నిన్ను మహిమపరచునట్లు నీ కుమారుని మహిమపరచుము. నీవు నీ కుమారునికిచ్చిన

వారందరికిని ఆయన నిత్యజీవము అనుగ్రహించునట్లు సర్వశరీరుల మీదను ఆయనకు అధికారమిచ్చితివి. అద్వితీయ సత్యదేవుడవైన నిన్నును, నీవు పంపిన యేసుక్రీస్తును యెరుగుటయే నిత్యజీవము." (యోహాను.17:1-3)

మనము 'శాశ్వత' మరియు 'నిత్యజీవమ'ను పదములను పరిగణించినప్పుడు, వాటిని దేవుని దృక్పథము నుండి చూడాలి. దేవుడు కాలమందు జీవించడు. లేదా దానిచే పరిమితము చేయబడినవాడు కాడు అనగా కాలానికి అతీతుడు. సమయము దేవుని ఆవిష్కరణ, అది సృష్టికర్త ఆధీనములో ఉన్నది. సమయమునకు వెలుపల, దానికతీతముగా పనిచేస్తూ, ఆయన కుమారునిలో - (వధింపబడిన గొఱ్ఱెపిల్లలో) తాను ఏర్పరచుకొనిన వారి రక్షణ సాధింపబడునని ఆ దేవుడు ముందుగా నిర్ణయించాడు. ఆ ప్రాయశ్చిత్త కార్యము భూమికి పునాదులు వేయబడక మునుపే నిర్ణయింపబడినది.

"పితృపారంపర్యమైన మీ వ్యర్థప్రవర్తనను విడిచిపెట్టునట్టుగా వెండి బంగారముల వంటి క్షయవస్తువుల చేత మీరు విమోచింపబడలేదు. గాని అమూల్యమైన రక్తము చేత అనగా నిర్దోషమును, నిష్కళంకమునకు గొఱ్ఱెపిల్లవంటి రక్తము చేత, విమోచింపబడితిరని మీరెరుగుదురు గదా ఆయన జగత్తు పునాది వేయబడక మునుపే నియమింప బడెను గాని తన్ను మృతులలోనుండి లేపి తనకు మహిమనిచ్చిన దేవునియెడల తన ద్వారా విశ్వాసులైన మీ నిమిత్తము, కడవరి కాలములయందు ఆయన ప్రత్యక్షపరచబడెను. కాగా మీ విశ్వాసమును నిరీక్షణయు దేవునియందు ఉంచబడియున్నవి." (1పేతురు.1:18-21)

"భూ నివాసులందరును, అనగా జగతుత్పత్తి మొదలుకొని వధించబడియున్న గొఱ్ఱెపిల్ల యొక్క జీవగ్రంథమందు ఎవరి పేరు వ్రాయబడలేదో, వారు ఆ మృగమునకు నమస్కారము చేయుదురు." (ప్రకటన13:8)

నిత్యుడగు దేవుడు ఎవరినైతే శాశ్వతముగా ప్రేమించాడో, అది వారి నిత్యరక్షణయందు ప్రతిఫలించినట్లుగా శాశ్వతమైన ఆయన ఆదేశము చేసియున్నాడు. వాటి స్వభావరీత్యా దేవుని అనంత ఆదేశాలు నిత్యత్వపు భవిష్యత్ దిశలో పయనించడము మాత్రమే గాక వాటి అవిచ్ఛిన్న రేఖలు గత నిత్యత్వపు పర్యంతమునకు కూడా వ్యాపించియుండును. ఈ విధముగా క్రీస్తు యొక్క ప్రాయశ్చిత్త మరణఫలితాలు అనగా నిత్యజీవము మరియు నిత్యరక్షణ గత నిత్యత్వమందు నిర్ణయింపబడి నిత్యభవిష్యత్తు అంతటికి కూడా చెల్లును.

"దేవుడు చేయుపనులన్నియు శాశ్వతములని నేను తెలుసుకొంటిని; దానికేదియు చేర్చబడదు దాని నుండి ఏదియు తీయబడదు; మనుష్యులు తనయందు భయభక్తులు కలిగియుండునట్లు దేవుడిట్టినియమము చేసియున్నాడు. ముందు జరిగినదే ఇప్పుడును జరుగును. జరగబోవునది పూర్వమందు జరిగినదే; జరిగిపోయిన దానిని దేవుడు మరల రప్పించును." (ప్రసంగి.3:14,15)

ఏర్పరచబడిన విశ్వాసి పరలోకములో ఎంత సుస్థిరముగా ఉంటాడో అంతే భద్రముగా ఈ భూసంబంధ జీవితములో కూడా వుంటాడు. వాస్తవానికి అతను మారుమనస్సు పొందుటకు ఎంతో కాలము మునుపే అతని రక్షణ పదిలము చేయబడినది. అతని మారుమనస్సునుద్దేశించిన దేవుడు అతని జీవితపు పరిస్థితులను నియంత్రించి ప్రతి శ్వాసను, నాడిని తన అదుపులో వుంచుకొనును.

ఆయన నిర్ణయ సమయములో ఆయన కృపా సంకల్పము చొప్పన ఏర్పరచబడిన వ్యక్తికి దేవుడు తన్నుతాను ప్రత్యక్షపరచకొనును. కాని తన తల్లిగర్భములో రూపింపబడక మునుపే ఆ వ్యక్తి యొక్క పరలోక గమ్యము అను దేవుని నిత్య శాసనము జారిచేయబడి భద్రముచేయబడినది.

నిత్యభద్రత అనునది ఒక వ్యక్తి చేయు తీర్మానముతో, విశ్వాసపు ఒప్పకోలుతో బాప్తిస్మముతో లేదా పశ్చాత్తాపముతో ప్రారంభము కాదు. ఆదాము కూడా రూపింపబడక మునుపే అది దేవుని మనస్సులో ప్రారంభమాయెను. విశ్వాసియొక్క జీవిత సంఘటనలు అతనిని ఈ వాస్తవ గ్రహింపునకు తెచ్చును.

"ఆయన సంకల్పము చొప్పన పిలువబడిన వారికి మేలుకలుగుటకై సమస్తమును సమకూడి జరుగునని మనమెరుగుదుము." (రోమా.8:28)

ఆర్మీనియన్ భావకులననుసరించి రక్షణ మారుమనస్సునందు ప్రారంభమై నిత్యత్వములోనికి కొనసాగుతుంది. కాని అట్టి రక్షణ 'పాక్షిక' లేదా 'తాత్కాలిక' మైనదే గాని నిత్య రక్షణ కాదు. కోల్పోయే రక్షణ వాస్తవానికి 'నిత్యరక్షణే' కాదు. మన రక్షణ పదిలత, మన చిత్తము, శరీరము మరియు తీర్మానపు శక్తి మున్నగు వాటిపై ఆధారపడదు. మన భద్రత, మార్పుచెందని దేవుని నిర్ణయలలో స్థిరముగా బలపరచబడియున్నది.

### కడమ వాని వరకూ

గనుక దేవుడు క్రీస్తునందు ముందుగా నిర్ణయించిన రక్షణ, నిత్యమైనదియు శాశ్వతమైనదియునైతే, రక్షింపనుద్దేశించి ఎన్నుకోబడిన వారిలో వాస్తవానికి ఎందరు రక్షింపబడెదరు? వారందరూ. ఏ గొఱ్ఱెల కొరకైతే యేసు తన రక్తమును చిందించాడో వాటిలో ఒక్కదానిని కూడా ఆయన కోల్పోడు.

"మీకేమి తోచును? ఒక మనుష్యునికి నూరు గొఱ్ఱెలుండగా వాటిలో ఒకటి తప్పిపోయిన యెడల తొంబదితొమ్మిదింటిని కొండల మీద విడిచి వెళ్ళి తప్పిపోయిన దానిని వెదకడా? వారు దాని కనుగొనినయెడల తొంబదితొమ్మిది గొఱ్ఱెలను గూర్చి సంతోషించునంతటి కంటె దానిని గూర్చి ఎక్కువగా సంతోషించునని మీతో నిశ్చయముగా చెప్పచున్నాను. అలాగుననే ఈ చిన్నవారిలో ఒక్కడైనను నశించుట పరలోకమందును నీ తండ్రి చిత్తము కాదు." (మత్తయి.18:11-14)

ఆయన ఎన్నుకొనిన వారి విశ్వాసము యేసు కాపాడుననుటకు తన రాజ్యమును ఏలుటకైన దేవుని శక్తియే హామిగానున్నది. విమోచింపబడిన వారిలో కడమవ్యక్తి వరకూ పరిశుద్ధులందరిని క్రీస్తు మహిమలోనికి తీసుకురాడనుట, దేవుడు తన సింహాసనము నుండి పడద్రోయబడుననుటయే అవుతుంది. ఎన్నిక చేయబడిన వారిలో ఏ ఒక్కరైననూ పరలోక వాగ్ధానమును స్వతంత్రించుకొనుటయందు విఫలులైతే, "ఇదిగో నేనును దేవుడు నాకిచ్చిన పిల్లలును" (హెబ్రీ.2:13) అను క్రీస్తు స్వీయప్రకటన తన తండ్రియొద్దకు వ్యర్థముగా చేరును. కానీ, సర్వాధికారియగువాని చిత్తము పటిష్టమైనది మరియు నిశ్చయమైనది. అది తప్పక అమలు చేయబడును, ఎందుకంటే ఎవరునూ ఆయన నిర్ణయమును త్రోసిపుచ్చలేదు.

"నా గొఱ్ఱెలు నా స్వరము వినును, నేను వాటినెరుగుదును, అవి నన్ను వెంబడించును. నేను వాటికి

నిత్యజీవమిచ్చుచున్నాను. గనుక అవి ఎన్నటికిని నశింపవు. ఎవడును వాటిని నా చేతిలో నుండి అపహరింపడు. వాటిని నాకిచ్చిన నా తండ్రి అందరికంటె గొప్పవాడు గనుక నా తండ్రి చేతిలోనుండి యెవడును వాటిని అపహరింపలేడు. నేనును తండ్రియును ఏకమైయున్నామని వారితో చెప్పెను."(యోహాను.10:27-30)

"ఆయన నాకనుగ్రహించిన దానియంతటిలో నేనేమియు పోగొట్టుకొనక, అంత్యదినమున వాని లేపుటయే నన్ను పంపిన వాని చిత్తమైయున్నది." (యోహాను.6:39)

ఆయన ఇహము నుండి పరమునకు వెళ్తూ, ఆయన ఎన్నుకొనిన వారిని భద్రపరచమని గెత్సెమనెలో యేసు తన తండ్రిని వేడుకొనెను.

"నేను వారియొద్దనుండగా నీవు నాకు అనుగ్రహించిన వారిని నీ నామమందు కాపాడితిని; నేను వారిని భద్రపరచితిని గనుక లేఖనము నెరవేర్చునట్లు నాశనపుత్రుడు తప్ప వారిలో మరి ఎవడును నశింపలేదు." (యోహాను.17:12)

తాను (యేసు) ఏర్పరచిన ప్రతివారిని సురక్షితముగా మహిమలోనికి తెచ్చునని నిస్సందేహముగా ఈ వచనములు తెలియజేయుచున్నవి. "దారి తప్పిన" ఒకని వలన తండ్రి చిత్తము మరియు స్పష్టమైన కుమారుని ఉద్దేశము శాశ్వతముగా భగ్నము చేయబడునని మనమూహించవలెనా? అహంభావియైన, మొండివాడైన ఒక వ్యక్తి పరలోకమందలి నిత్య నిర్ణయములను పాడుచేయునంతగా తన అధికారమును అభ్యాసించగలడా? అలా కుదరదు.

## సర్పసంతానము

"అందుకు దేవుడైన యెహోవా సర్పముతో, నీవు దీనిని చేసినందుకు పశువులన్నిటిలోను భూజంతువులన్నిటిలోను నీవు శపించబడిన దానివై నీ కడుపుతో ప్రాకుచు నీవు బ్రతుకు దినములన్నియు మన్ను తిందువు మరియు నీకును స్త్రీకిని నీ సంతానమునకును ఆమె సంతానమునకును వైరము కలుగజేసెదను. అది నిన్ను తల మీద కొట్టును; నీవు దాని మడిమె మీద కొట్టుదువని చెప్పెను." (ఆది.3:45.46)

సాతాను తలను నలుగగొట్టిన దేవుని ఏకైక సంతానము యేసుక్రీస్తు. కాని ఆ ప్రకటన క్షణము నుండి మానవాళియంతటిని దేవుడు రెండు గుంపులుగా విభజించాడు.

1. దీవింపబడినవంశము - స్త్రీ సంతానము
2. శపింపబడినవంశము - సర్పసంతానము

ఎన్నుకొనబడి, పరలోకమునకై నిర్ణయింపబడిన విశ్వాసులు ఆ దివ్య వంశక్రమమునకు చెందినవారు. తక్కిన తిరస్కరించబడిన మానవాళి శపించబడిన వంశక్రమమునకు చెందును. వాటి మధ్యలో అటూ ఇటూ కానిదైన మరో ప్రాంతము లేదు. ఇక్కడొక విషయమున్నది. ఒక వ్యక్తి తన నిత్యస్వాస్థ్యమును కోల్పోవుటకుగాను, ఆ దివ్య వంశములో తనకున్న స్థానాన్ని అమ్మివేసి దుష్టుని సంతతిగా మారాలి. ఇది కేవలము మేధా సంబంధ నిర్ణయము కంటే ఎంతో అతీతమైనది. రక్షింపబడిన వ్యక్తి తప్పిపోవుటకు గాను అతని నిత్యస్వభావము మరియు గమ్యములు పూర్తిగా వ్యతిరిక్తము చేయబడాలి. కాని, అట్టి ఊహ సహితము అసాధ్యమని బైబిలు బోధించుచున్నది.

ఒక్కసారి పరిశుద్ధాత్ముడు ఓ వ్యక్తిలో నివాసము చేసాక దుష్టుని దురాగతాల నుండి, సాతాను నుండి వారు ప్రభావవంతముగా భద్రపరచబడుతారు.

"దేవుని మూలముగా పుట్టిన వాడెవడును పాపము చేయడని ఎరుగుదుము. దేవుని మూలముగా పుట్టినవాడు తన్ను భద్రము చేసుకొనును గనుక దుష్టుడు వాని ముట్టడు."(యోహాను.5:18)

పరిసయ్యులు యేసును ఎదుర్కొని, ఆయన బయెల్జెబూలు శక్తిచే దయ్యములను వెళ్లగొట్టుచున్నాడనినప్పడు ఇద్దరు బలమైన వ్యక్తులు ఒకే ఇంట్లో నివాసముండనేరరని యేసు వారితో చెప్పెను. గనుక మునుపు సాతాను చేత నియత్రించబడిన ఒక వ్యక్తి లోనికి పరిశుద్ధాత్ముడు ప్రవేశించినప్పడు ఆ దురాత్మ పారద్రోలి వేయబడుతుంది. ఒకసారి పరిశుద్ధత్మ దేవుని అత్యున్నత శక్తి ఆ గృహమును ఆవరించినప్పడు అవి ఇంకెన్నడును నాశనమునకు గురికానేరవు.

"ఒకడు బలవంతుని బంధింపని యెడల నిశ్చయముగా దేవుని రాజ్యము మీయొద్దకు వచ్చియున్నది." (మత్తయి.12: 29)

"అయితే నేను దేవుని వ్రేలితో దయ్యములను వెళ్లగొట్టుచున్నయెడల నిశ్చయముగా దేవుని రాజ్యము మీ యొద్దకు వచ్చియున్నది. బలవంతుడు ఆయుధములు ధరించుకొని, తన ఆవరణమును కాచుకొనునప్పడు, అతని సొత్తు భద్రముగానుండును. అయితే అతనికంటే బలవంతుడైన ఒకడు అతనిపైబడి జయించునప్పడు అతడు నమ్ముకొనిన ఆయుధములనన్నిటిని లాగుకొని అతని ఆస్తి పంచిపెట్టును."(లూకా.11:20-22 )

"చిన్న పిల్లలారా, మీరు దేవుని సంబంధలు; మీలో ఉన్నవాడు లోకములో ఉన్నవానికంటె గొప్పవాడు గనుక మీరు వారిని జయించియున్నారు." (1యోహాను.4:4)

మన ప్రభువుయొక్క అత్యున్నత శక్తికి విరోధముగా పోరాడుటకు దుష్టుడు శక్తిహీనుడని ఎరిగి, క్రీస్తుచే వెలపెట్టి కొనబడిన వారిని వాడేమియు చేయలేడని తెలుసుకొని, ఒకడు ఇష్టపూర్వకముగా తన పరలోక స్థితిని నరకము కొరకు మార్చుకొనునట్టు శోధనకు లోనవనని భావించుట ఎలా సాధ్యము? పౌలు ప్రకారము, ఈ జీవిత శోధనలు క్రీస్తునందు మనకున్న ప్రేమబంధమును మరియు రక్షణను పాడుచేయజాలవు.

"సాధారణముగా మనుష్యులకు కలుగు శోధన తప్ప మరి ఏదియు మీకు సంభవింపలేదు. దేవుడు నమ్మదగినవాడు; మీరు సహింపగలిగినంతకంటె ఎక్కువగా ఆయన మిమ్మును శోధింపబడనియ్యడు. అంతేకాదు సహింపగలుగుటకు ఆయన శోధనలో కూడా తప్పించుకొను మార్గమును కలుగజేయును."(1 కొరింథి.10:13)

అబద్ధ ప్రవక్తలు మరియు క్రీస్తు విరోధి సయితము దేవుడు కంచె వేసి ఆవరించి కాపాడుతున్న వారిని ప్రభావితము చేయజాలరు. (యోబు.1:10).

"అబద్ధపు క్రీస్తులును అబద్ధ ప్రవక్తలును వచ్చి, సాధ్యమైతే ఏర్పరచబడిన వారిని సహితము మోసపరచుటకై గొప్ప సూచక క్రియలను మహత్కార్యములను కనబరచెదరు."(మత్తయి.24:24)

కాని, అది సాధ్యము కాదు. ఎన్నిక చేయబడినవారిని, దేవుని హస్తము నుండి సాతాను శక్తులు లాగివేయజాలవు.

వారు శాశ్వతముగా భద్రపరచబడియున్నారు. వాస్తవానికి, మన రక్షణ నుండి మనలను ఎడబాపుటకు పోరాడి విఫలమగు అనేక ప్రభావాలు మరియు శక్తుల పూర్తి జాబితాను పౌలు మనకు తెలియజేశాడు.

> "క్రీస్తు ప్రేమ నుండి మనలను ఎడబాపువాడెవడు? శ్రమయైనను, బాధయైనను, హింసయైనను కరువైనను, వస్త్రహీనతయైనను, ఉపద్రవమైనను, ఖడ్గమైనను మనలను ఎడబాపునా? మరణమైనను జీవమైనను దేవదూతలైనను ప్రధానులైనను ఉన్నవియైనను రాబోవునవియైనను అధికారులైనను ఎత్తైనను లోతైనను సృష్టించబడినది మరి ఏదైనను, మన ప్రభువైన క్రీస్తు యేసునందలి దేవుని ప్రేమ నుండి మనలను ఎడబాపనేరవని రూఢిగా నమ్ముచున్నాను."(రోమా.8:35,38,39)

సృష్టించబడినది మరి ఏదైనను అను పదములో మనుష్యులును ఇమిడియున్నారు. తన సొంతరక్షణ కాపాడుకొనుటకైనను కోల్పోవుటకైనను బాధ్యతవహించవలసిన వ్యక్తి కూడా ఇందులో ఇమిడియున్నాడు. మనము నిర్ధోషులము మరియు నమ్మకమైనవారము గనుక సురక్షితమని కాదు కాని దేవుడు నిర్దోషి మరియు నమ్మదగినవాడు గనుక మనము సురక్షితులము.

> "మనము నమ్మదగని వారమైనను, ఆయన నమ్మదగిన వాడుగానుండును; ఆయన తన స్వభావమునకు విరోధముగా ఏదియూ చేయలేడు."(1తిమోతి.2:13 )

## 'వాదనలు'

ఆయా లేఖనభాగాల అసమగ్ర వ్యాఖ్యానలతో సహా కొన్ని అనుభవాల ఆధారముగా ఈ సిద్ధాంతముపై అసమ్మతి వెలువడుతుంది. సంఘములో నిరంతరము విశ్వాసులుగా అగుపించి బాహ్యంగా కనబడు స్పష్టమైన మార్పు ఫలితములను కనుబరిచి, ఆ తరువాత దేవుని విషయములయందు ఆసక్తిని కోల్పోయి దారితొలగు అనేకులు మనకు కనిపిస్తారు. ఇది రక్షణ కోల్పోవుట అని అనేకులు భావిస్తారు. కానీ క్రీస్తు అట్టివారిని గూర్చి ముందుగానే హెచ్చరించాడు.

విత్తువాని ఉపమానములో, ఆయన వాక్యమనే విత్తనము వేరు వేరు రకముల నేలలో పడునని చెప్పెను " త్రోవప్రక్క నుండువారెవరనగా, వాక్యము వారిలో విత్తబడును గాని వారు వినిన వెంటనే సాతాను వచ్చి వారిలో విత్తబడిన వాక్య మెత్తికొనిపోవును. అటువలె రాతినేలను విత్తబడిన వారెవరనగా, వాక్యము విని సంతోషముగా అంగీకరించువారు; అయితే వారిలో వేరు లేనందున, కొంతకాలము వారు నిలుతురు గాని వాక్యము నిమిత్తము శ్రమయైనను హింసయైనను, కలుగగానే వారు అభ్యంతరపడుదురు. ఇతరులు ముండ్లపొదలలో విత్తబడినవారు; వీరు వాక్యము విందురు గాని ఐహిక విచారములును ధనమోసమును మరి ఇతరమైన అపేక్షలును, లోపల చొచ్చి, వాక్యమును అణచివేయుట వలన అది నిష్ఫలమగును. మంచి నేలను విత్తబడినవారెవరనగా, వాక్యము విని, దానిని అంగీకరించి ముప్పదంతలుగాను అరువదంతలుగాను నూరంతలుగాను ఫలించువారని చెప్పెను" (మార్కు.4:15-20)

ఇక్కడ రాతినేలగా ప్రస్తావించబడినవారు సువార్తను విని సంతోషముగా దానిని అంగీకరించి వెంటనే మొలకెత్తి, ఒక మంచి నేలకుగల ప్రతీసూచనను వారు కనబరుస్తారు. కానీ వారు అభ్యంతరపడి వైదొలగిపోవునప్పుడు వారి నిజస్వభావము వెలుగు చూస్తుంది. అలా వారు వెడలిపోవుట, వారు దేవుని ఎన్నిక చేయబడిన సంఘమునకు

చెందినవారు కాదనుటకు స్పష్టమైన ఋజువు.

" వారు మనలోనుండి బయలువెళ్లిరి గాని వారు మన సంబంధులు కారు; వారు మన సంబంధులైతే మనతో కూడ నిలిచియుందురు; అయితే వారందరు మన సంబంధులు కారని తృఓపరచబడునట్లు వారు బయలు వెళ్లిరి"1 యోహాను.2:19

'అటువంటివారు క్రీస్తునందలి విశ్వాసము నుండి వెడలిపోవుట' అను విషయము 'పొందిన రక్షణ పోతుంద'ను వాదనను ఋజువుపరచదు కానీ, శారీరకమైన అత్యంత యదార్థమైన ప్రయత్నాలు సహితము నిజముగా శాశ్వతముగా మనగలిగే విశ్వాసమును పుట్టింపజాలవనుటకు ఖచ్చితమైన నిర్ధారణ. బాహ్య రూపాలు మోసపూరితమైనవి, సాతాను సహితము తాను విశ్వాసిననుటకు బాహ్య ఋజువులెన్నో కనుపరచగలడు. కానీ చివరికి సత్యము ప్రత్యక్షపరచబడును. మరియు క్రీస్తుశరీరమగు సంఘము శుద్ధీకరించబడులాగున సమస్త మోసమును తొలగించు దేవునికి మనము కృతజ్ఞతగలవారమైయుండవలెను.

" కుక్క తన వాంతికి తిరిగినట్టును, కడుగబడిన పంది బురదలో దొర్లుటకు మళ్లినట్టును అను నిజమైన సామెత చొప్పున వీరికి సంభవించెను." (2 పేతురు. 2:22)

కుక్క తన వాంతికిని తిరిగి తినునట్లు మరియు పంది బురదకు మరలునట్లు ఈ లేఖనాధారముగా, ఒక విశ్వాసి రక్షణ కోల్పోయి తిరిగి తన పూర్వస్థితికి చేరునని ఆర్మీనియన్‌వాదులు వాదింతురు.

కానీ పేతురు ఇక్కడ సహజముగా తమ అలవాట్లకు తిరిగి వెళ్ళు జంతువులను గూర్చి ఉదహరించినప్పడు, గొఱ్ఱెల విషయమై అసలేమియూ ప్రస్తావించలేదని మనము గమనించాలి. క్రీస్తుచే రక్షించబడినవారు తమ కాపరిని అనుసరించెదరు కనుక వారు గొఱ్ఱెలని పిలువబడ్డారు. అయితే ఇక్కడ పేతురు, గొఱ్ఱెలు అకస్మాత్తుగా పందులు లేదా కుక్కలవలె మారునని వాదింపలేదు. కుక్కలు మరియు పందులు వాటి పూర్వ స్థితికి మరలుటకు కారణము అవి వాస్తవముగా కుక్కలు మరియు పందులే. అవి గొఱ్ఱెలు కావు. అవి కాపరిని అనుసరింపవు అవి ఆయన మందకు చెందినవి కావు. ఎంత శుభ్రముగా తోమినా పంది పందే. గొఱ్ఱెల మధ్య నివశించిననూ కుక్కలు కుక్కలే. వాటి నిజస్వరూపము తప్పక బయలుపడును అవి తమ పూర్వ స్థితికి దిగజారును. మరో వైపు, ఒకడు తన రక్షణను కోల్పోవునను భావన దాని సొంత వేదాంత గలిబిలిని అదే సృష్టించుకొనును.

ఉదాహరణకు - దేవుడు సర్వమునెరిగినవాడైతే, ఒకసారి రక్షింపబడినవాడు వెనుదిరిగి తన సొంత భద్రతను పాడుచేసుకొనునంత ధీర్ఘాయువును అతనికి అనుమతించునా? అట్టి వ్యక్తి విశ్వాసపు స్థితిని కలిగియున్నప్పడే అతనిని మరణింపజేసి, తన విశ్వాసము కోల్పోవునంత కాలము అతనికి భూమిపై ఆయుషు అనుమతింపకుండుట దేవునికి న్యాయము కాదా? భూమ్మీదనుంటూ దారితొలగుటకంటె దేవుడతనిని చంపుట న్యాయముగానుండును. సర్వమునెరిగిన దేవుని ముందుచూపు, ఒకని రక్షింప అనుకూల సమయమునందే దానిని సుసాధ్యపరచియుండదా?

లేదా, హెబ్రీ.10:14, క్రీస్తు యొక్క బలి ద్వారా నమ్మువారు సదా సంపూర్ణులుగా చేయబడ్డారని బోధించుచున్నది. ఇలా సదా సంపూర్ణునిగా చేయబడిన వ్యక్తి, తన సొంత చిత్తము లేదా, సొంత శక్తి చేత పరిపూర్ణము చేయబడలేదని ఎరిగి, అతడు మరలా అపరిపూర్ణతలోనికి మరులునని ఎలా భావించగలము? లేదా పరిపూర్ణుడుగా అతడు నరకమునకు వెళ్ళునా?

## 'కృప నుండి వైదొలగుట, దీని మాటేమిటి?'

'కృపలో నుండి వైదొలగుట' అనే మరో ప్రసిద్ధమైన సందర్భరహిత వాదన లేఖనాలకు పెడార్థము చెప్ప కొందరివలన

ఉత్పన్నమైనది. ఒక వ్యక్తి దేవుని భద్రపరచు కృప నుండి తొలగిపోయి తన రక్షణను కోల్పోవుట సాధ్యమని వారి వాదనలోని అంతర్భావము. అయితే సందర్భసహితమైన వివరణ చేత మనము వారి దుర్బోదను అరికట్టవచ్చు. కృప నుండి వైదొలగుట అను ఈ పదము లేఖనములలో కేవలము ఒక్కసారే అగుపించును.

"మీలో ధర్మశాస్త్రము వలన నీతిమంతులని తీర్చబడు వారెవరో వారు క్రీస్తులో నుండి బొత్తిగా వేరు చేయబడియున్నారు; కృపలో నుండి తొలగిపోయియున్నారు."(గలతీ.5:4)

ఇక్కడ సందర్భాన్ని గమనిస్తే పౌలుయొక్క భావాన్ని అపార్థము చేసుకొనుట అసాధ్యము. పౌలు అన్యులకు అపోస్తలుడైయుండెను. క్రైస్తవులు ధర్మశాస్త్రమును ఆచరింపబద్ధులైయున్నారని బోధించు యూదా మత బోధకులకు విరుద్ధముగా 'కృప ద్వారా రక్షణ' అను నూతన నిబంధన సిద్ధాంతమునకై ఆయన పోరాడాడు. అట్టి బోధను ఖండిస్తూ ఎవడైనను తనను తాను రక్షించుకొనుటలో తన సొంత సామర్థ్యముపై ఆధారపడితే, అతడు కేవలము దేవుని కృపచేత కలుగు రక్షణ నుండి వైదొలగినట్లే అని ఇక్కడ పౌలు వాదించాడు. ధర్మశాస్త్రపు క్రియలచేత దేవుని యెదుట నీతిమంతులుగా తీర్చబడగలరని భావించు వారికి నిశ్చయమును విశ్వాసనీయమునైన క్రీస్తు కార్యము నిర్వీర్యమైనట్లె. క్రొత్త మరియు పాత నిబంధనల మధ్య వ్యత్యాసమును ఈ వచనము ఎంతో స్పష్టముగా తెలియజేయుచున్నది. అయితే ఒక వ్యక్తి తన రక్షణను కోల్పోవునని బోధించుటకు ఈ వచనము ఆధారము కాదు.

## 'మీ సొంత రక్షణను కొనసాగించుడి'

మరొక సమ్మతి ఈ విధముగా వెలువడుచున్నది. మన సొంత రక్షణను భయముతోను, వణకుతోను కొనసాగింపవలెనని బైబిలు బోధించుట లేదా? విశ్వాసులు వారంతట వారే ప్రయాసపడి, పరలోకమును పొందుకొను ప్రక్రియలో చురుగ్గా తమ పాత్రను వహించాలని పౌలు హెచ్చరించాడని ఈ వాదనలోని అంతర్భావము. దీనిని కూడా మనము సందర్భసహితముగా చూద్దాము.

'రక్షణ కొనసాగించుట' అను ఈ మాటను ఫిలిప్పిలోని విశ్వాసులకు పౌలు వ్రాస్తున్నాడు. అతను ఇదివరకే దేవుని సర్వాధికార కృపా సిద్ధాంతమును వారికి బోధించాడు. వాస్తవానికి పౌలు తన పత్రికను ఈ ఆశీర్వచనముతో ప్రారంభించాడు :

"మన తండ్రియైన దేవుని నుండియు ప్రభువైన క్రీస్తునుండియు మీకు కృపయు సమాధానమును కలుగును గాక, మొదటి దినము నుండి ఇదివరకు సువార్త విషయములో మీరు నాలో పాలివారైయుండుట చూచి, మీలో ఈ సత్క్రియ నారంభించినవాడు యేసుక్రీస్తు దినమువరకు దానిని కొనసాగించునని రూఢిగా నమ్ముచున్నాను. గనుక మీ అందరి నిమిత్తము నేను చేయు ప్రతి ప్రార్థనలో ఎల్లప్పుడును సంతోషముతో ప్రార్థన చేయుచు, నేను మిమ్మును జ్ఞాపకము చేసికొనినప్పుడెల్ల నా దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాను." (ఫిలిప్పీ.1:2-6)

సువార్త సహవాసములోనికి విశ్వాసులను తెచ్చే సత్క్రియ ప్రారంభమును పౌలు దేవునికే ఆపాదించాడు. అలాగే ఆయన ప్రారంభించినది ఆయన మాత్రమే కొనసాగింపజేసి సంపూర్తి చేయగలడని దేవుని పట్ల అభయమును పునరుద్ఘాటించాడు. అయితే పౌలు మిషనరీగా పిలువబడ్డాడు. కాబట్టి చాలా కాలము ఒకే ప్రాంతములో ఆయన ఎన్నడును నివసించలేదు. మరియు ఫిలిప్పీ పట్టణము నుండి ఆయన వెడలిపోయిన పిమ్మట ఈ పత్రికను వ్రాసాడు.

“కాగా నా ప్రియులారా, మీరెల్లప్పుడును విధేయులైయున్న ప్రకారము, నా యొదుట ఉన్నప్పుడు మాత్రమే కాక మరి యెక్కువగా నేను మీతో లేని ఈ కాలమందును, భయముతోను వణుకుతోను మీ సొంత రక్షణను కొనసాగించుడి.”(ఫిలిప్పీ.2:12)

ఇప్పుడు తాను వారి మధ్య లేని సమయమందు కూడా క్రీస్తు కార్యము కొనసాగించుడి అని పౌలు ఫిలిప్పీవారిని హెచ్చరించాడు. ఇలా హెచ్చరిస్తూ, ఇది చలగాటమాడవలసిన విషయము కాదని, ఈ కార్యాన్ని భయముతోను వణుకుతోను చేయాలని జ్ఞాపకము చేశాడు. ఇక్కడ “భయము” అను పదమునకు “ఫోబస్” అను గ్రీకు పదము వాడబడినది. అలాగే “వణుకు” అను పదమునకు “ట్రామెస్” అను గ్రీకు పదము వాడబడినది. ఇక్కడ పౌలు - ఎవరి రక్షణను వారే భద్రపరచుకోవాలని బోధించాడంటూ ఈ వచనానికి పెడార్థము చెప్పేవారికి జవాబుగా ఆ తదుపరి వచనమును చదివితే సరిపోతుంది.

“ఎందుకనగా మీరు ఇచ్ఛయించుటకును కార్యసిద్ధి కలుగజేసికొనుటకును, తన దయాసంకల్పము నెరవేరుటకై మీలో కార్యసిద్ధి కలుగజేయువాడు దేవుడే.”(ఫిలిప్పీ.2:13)

ఫిలిప్పీ సంఘముపై దేవుడు సర్వాధికార శ్రద్ధను కలిగియున్నాడనే ఈ నిశ్చయతయే, పౌలుకు వారిని దేవుని హస్తాలలో ఉంచి వెళ్లే ధైర్యాన్ని ఇచ్చినది. మన దృష్టి ఆయన వైపు మరల్చులాగున చేయువాడు దేవుడేనని మరియు ఆయన దయాసంకల్పము చొప్పుననే మనము ప్రవర్తిస్తామని బోధించిన పౌలు మన రక్షణ విషయమై మనమే నిర్ణయాత్మక కారకమని ఖచ్చితముగా ఇక్కడ ప్రతిపాదించివుండడు. ఎవరైనా ఈ వచనానికి ఇట్టి పెడార్థము నిచ్చే భావమునిస్తే వారు పౌలు అర్థమును పూర్తిగా అపార్థము చేసుకొన్నవారవుతారు.

## ‘అయితే ఆత్మీయముగా దిగజారువారి సంగతేమిటి?’

ఆధునిక క్రైస్తవ్యములో ‘దిగజారుట’ అను ఈ పదము వాడుకలో ఉన్నప్పటికి క్రొత్త నిబంధనలో ఈ పదమే అగుపించదు.

దిగజారిన, దిగజారుట, దిగజారినవాడు మొదలగు పదములు క్రైస్తవునికి ఎప్పుడును వర్తింపజేయబడలేదు. ఇశ్రాయేలు జాతి దేవుని ఆజ్ఞలు మరియు ఆయన నాయకత్వమును అనుసరించుటలో విఫలులయ్యారనుటకు పాత నిబంధనలో మాత్రమే ‘దిగజారుట’ అను పదము వాడబడెను. క్రైస్తవులనబడిన వారు సంపూర్ణముగా వారి యజమానునకు అప్పగించుకొని వారి కాపరిని వెంబడిస్తు వారి రాజును అనుసరించువారు. అలా చేయని పక్షమున వారు క్రైస్తవులే కారు. ‘దిగజారిన క్రైస్తవుడు’ లేదా ‘శరీరసంబంధియైన క్రైస్తవుడు’ అను పదములు బైబిలులో ఎక్కడను వాడబడలేదు. కృప ద్వారా రక్షింపబడిన పాపులను గూర్చే మనమిక్కడ చదువుతాము. ఆర్మీనియన్ భావకుల బోధలఫలితముగా ‘దిగజారిన క్రైస్తవుడు’ లేదా ‘శరీర సంబంధియైన క్రైస్తవుడు’ అను పదములు మన క్రైస్తవ నిఘంటువులో చేర్చబడినవి. ఇదంతయూ ఒక వ్యక్తి పరలోకమును సంపాదించుకొనుటకు చేయవలసినదల్లా ఓ సాధారణ విశ్వాసపు ఒప్పుకోలు లేదా ‘పాపి ప్రార్థన’ అను భావనతో ప్రారంభమగును. ఒక వ్యక్తి వారు నేర్పిన ప్రార్థన చేసి వారు నిర్దేశించిన పద్ధతిని అవలంభించగానే అతడు రక్షింపబడ్డాడనియు, అతని గమ్యమును ఏదియు మార్చజాలదనియు అభయమిస్తారు.

‘ఒకసారి రక్షింపబడితే ఎప్పటికి రక్షింపబడినట్లే’ అను ప్రాచీన వేదాంతము ఇదే. ఇది బైబిలు ఆధారిత ‘నిత్య భద్రతకు’ విరుద్ధమైనదిగానున్నది. ఒకసారి రక్షింపబడితే ఎప్పటికిని రక్షించబడినట్లే అనువారు రక్షణను పాపియొక్క

ఒప్పుకోలుపై ఆధారితము చేస్తారు. అట్టి బాధ్యత ఆ వ్యక్తి పై వుంచుతారు. కానీ బైబిలు ఆధారిత నిత్యభద్రత, ఒకని రక్షణ కొరకైన బాధ్యతను పూర్తిగా సర్వాధికారియైన ప్రభువు పాదాల చెంత వుంచుతుంది..

ఇక్కడ సమస్య ఏమిటంటే, ఇలా సులువుగా విశ్వాసములోనికి నడిపించబడినవారు యదార్థముగా పశ్చాత్తాపడి, మారుమనస్సు నొంది నిజక్రైస్తవ్యాన్ని జీవించుటలో విఫలులవుతారు. వారిని ఎలా విభజించాలి? వారు ఇంక క్రైస్తవులు కారా? ఆర్మీనియన్ వేదాంతము ప్రకారము వారు మారుమనస్సుకు తగిన ఫలములు ఫలింపకపోయినను అది వారి నిజరక్షణను నిర్వీర్యపరచదని చెబుతారు. అట్టి వారిని కేవలము దిగజారిన లేదా శరీరసంబంధ క్రైస్తవులని పిలుస్తారు కాని విమోచింపబడిన వారిలో ఉపవిభజనను బైబిలు ఆమోదించదు. ఒక ప్రక్క ఫలానా వ్యక్తి ప్రభావవంతముగా రక్షింపబడాలి లేదా అసలు రక్షణే పొందక యుండాలి ఈ రెంటికి, మధ్య స్థితి లేదు. రక్షింపబడినవారు మారుమనస్సుకు తగిన నీతి ఫలములను తప్పక ఫలింతురు.

క్రైస్తవులందరు లేదా ఏ క్రైస్తవుడైనా పరిపూర్ణతను లేదా వ్యక్తిగత నీతిని సాధిస్తాడని ఇక్కడ నేను వాదించుటలేదు. నేనిక్కడ చెప్పదలచుకున్నదేమిటంటే వారు పాపేచ్ఛలనుండి మరల్చబడి వారి యజమానుని సంతోషపరిచే తపన కలిగియుంటారు. యదార్థమైన మారుమనస్సు, మార్పును ప్రారంభింపజేస్తుంది. మార్పు తక్షణమే జరగదు. మార్గమందు గొఱ్ఱెలు దారి తప్పతాయి, పాపులు పాపము చేస్తారు మరియు అపరిపూర్ణులు తొట్రిల్లుతారు. అయితే పరిపూర్ణతను సాధించునట్లు మనలను భద్రపరచి కొనసాగింపజేసేది మన సొంత సామర్థ్యము కాదు.

> "ప్రభువు ప్రతి దుష్కార్యము నుండి నన్ను తప్పించి తన పరలోక రాజ్యము చేరునట్లు నన్ను రక్షించును. యుగయుగములు ఆయనకు మహిమ కలుగును గాక" (1 తిమోతి.4:18)

వారు తొట్రిల్లినా విఫలత చెందరు. దేవుని కృపచే మనము కాపాడబడుదుము.

> యూదా.24,25 - "తొట్రిల్లకుండా మిమ్మును కాపాడుటకును తన మహిమ యెదుట ఆనందముతో మిమ్మును నిర్దోషులనుగా నిలువబెట్టుటకును శక్తిగల మన రక్షకుడైన అద్వితీయ దేవునికి, మన ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా మహిమయు మహత్యమును ఆధిపత్యమును అధికారమును యుగములకు పూర్వమును ఇప్పడును సర్వయుగములకును కలుగును గాక. ఆమేన్."

> "ఒకని నడత యెహోవా చేతనే స్థిరపరచబడును. వాని ప్రవర్తన చూసి ఆయన ఆనందించును. యెహోవా అతని చెయ్యి పట్టుకొని యున్నాడు గనుక అతడు నేలను పడినను లేవలేక యుండడు. నేను చిన్నవాడనైయుంటిని ఇప్పడు ముసలివాడనైయున్నాను. ఆయినను నీతిమంతులు విడువబడుటగాని వారి సంతానము భిక్షమెత్తుట గాని నేను చూచియుండలేదు. దినమెల్ల వారు దయాళులై అప్పయిచ్చుచుందురు వారి సంతానపు వారు ఆశీర్వదించబడుదురు." (కీర్తనలు.37:23-26 )

> "భూదిగంతముల నుండి నేను పట్టుకొని దాని కొనలనుండి పిలుచుకొనిన వాడా నీవు నా దాసుడవనియు నేను ఉపేక్షింపక యేర్పరచుకొంటిననియు నేను నీతో చెప్పియున్నాను. నీకు

తోడైయున్నాను. భయపడకుము నేను నీ దేవుడనైయున్నాను. దిగులుపడకుము నేను నిన్ను బలపరతును నీకు సహాయము చేయువాడను నేనే. నీతియను నా దక్షిణ హస్తముతో నిన్ను ఆదుకొందును." (యెషయా.41:9,10)

నిజమే, క్రైస్తవులు విఫలులవుతారు. అయితే మన పదిలత, క్రీస్తును మన హృదయమందు భద్రపరచుకొను మన సామర్థ్యముపై ఆధారపడదు. అది కేవలము మనలను భద్రపరచు క్రీస్తు సామర్థ్యముపై మాత్రమే ఆధారపడియుండును. ఆయన కృపాయుత దీర్ఘశాంతము మనలను ఎన్నటికిని మోసగించదు.

"విజయమొందుటకు న్యాయవిధిని ప్రబలము చేయువరకూ ఈయన నలిగిన రెల్లును విరువడు మక మకలాడుచున్న అవిసె నారను ఆర్పడు." (హెబ్రి 12:5)

"ధనాపేక్ష లేనివారై మీకు కలిగిన వాటిలో తృప్తిపొందియుండుడి. నిన్ను ఏ మాత్రమును విడువను నిన్ను ఎడబాయను అని ఆయనయే చెప్పెను గదా." (మత్తయి.12:20)

శరీరమనే ఈ గుడారములో మనము నివసించుచున్నంత కాలము పాపమనే క్యాన్సర్(కొరుకుపుండు) మన నరనరములలో ప్రవహిస్తూ ఉంటుంది. కనుక మనమెప్పడు అసంపూర్ణులుగానే యుందుము. అందుచేతనే నిత్య జీవపు వాగ్ధానమునందు ఆ పరిపూర్ణగృహములో ధరించుటకు మనకొక పరిపూర్ణశరీరము అనుగ్రహింపబడుతుందన్న వాగ్ధానము కూడా ఇమిడియున్నట్లుగా చూడగలము.

"సమాధాన కర్తయగు దేవుడే మిమ్మును సంపూర్ణముగా పరిశుద్ధపరచును గాక, మీ ఆత్మీయ జీవమును శరీరము మన ప్రభువైన యేసుక్రీస్తు రాకడయందు నిందారహితముగాను సంపూర్ణముగాను ఉండునట్లు కాపాడబడును గాక. మిమ్మును పిలుచువాడు నమ్మకమైనవాడు గనుక ఆలాగు చేయును." (1 థెస్స.5:23,24)

## పేతురు మాదిరి

అపోస్తులులందరిలోకెల్లా మనకు పేతురు వ్యక్తిగత వివరాలు క్షుణ్ణముగా దొరుకును. పేతురు జీవితములో ఎడతెగని విశ్వాసము, వైఫల్యము, లోయలు, శిఖరాలు మున్నగు వాటితో నిండిన వర్ణన మనకు లభిస్తాయి. కానీ లోపల ఓ బంగారుతీగ అంతర అల్లికవలె, క్రమేపీ అతని జీవితములో క్రీస్తు వైపు నుండి ప్రోద్బలం పొందుట, క్షమించబడుట మరియు భద్రపరచబడుట అగుపిస్తాయి.
ఉదాహరణకు - పేతురు క్రీస్తు చేత "సాతానా" అని గద్దింపబడిన ఏకైక శిష్యుడు. ఎందుకంటే క్రీస్తు మరణపు ఆవశ్యకతను అందులోని ఆత్మీయ అంతరార్థమును వివేచించుటలో పేతురు విఫలుడయ్యాడు (మత్తయి.16:23). కాని అతనిలోని ఈ అవగాహనాలోపం అతని పతనానికి దారి తీసిందా? లేదు. "సీమోను, సీమోను ఇదిగో సాతాను మిమ్మును పట్టి గోధుములవలె జల్లించుటకు మిమ్మును కోరుకొనెను గాని నీ నమ్మిక తప్పిపోకుండునట్లు నేను నీ కొరకు వేడుకొంటిని అని అటు తరువాత అతనితో యేసు చెప్పెను." తనకు తానుగా అతనిని వదలివేసివుంటే, పేతురు అతని తిరుగుబాటునందు అమాయకత్వమునందు కొనసాగియుండేవాడు. కాని, క్రీస్తు అతని విశ్వాసమును బలపరచి అతని నిమిత్తమై ప్రార్థించి అతనిని భద్రపరచెను.

యేసును చేరుకొనుటకై అలజడి కలిగిన సముద్రముపై నడచిన ఏకైక అపోస్తలుడు పేతురు. ఎంతటి అద్భుత క్షణమది! కాని మార్గమధ్యలో భయము మరియు అనుమానము కలిగినవాడై అతడు మునిగిపోసాగాడు. యేసు అతనిని "అల్ప విశ్వాసి" అని పిలిచెను. పేతురు విశ్వాసలోపము అతని నిత్యనాశనమునకు కారణమాయెనా? లేదు. ప్రభూ నన్ను రక్షించు అని మొర్రపెట్టగానే వెంటనే క్రీస్తు తన హస్తము చాపి రేగిన అలల నుండి అతనిని కాపాడెను. (మత్తయి.14:31). పేతురు విఫలమాయెను గాని క్రీస్తు విజయుడాయెను.

రూపాంతరకొండపైన యేసు ధర్మశాస్త్రము మరియు ప్రవక్తలకు ప్రతినిధులైన మోషే మరియు ఏలియాతో సంభాషిస్తున్నాడు. పాత నిబంధనలోని నాయకులపై క్రీస్తుకుగల ఆధిపత్యాన్ని గ్రహించుటలో పేతురు విఫలుడయ్యాడు. వారిని సమానముగా గౌరవించులాగున పేతురు మూడు గుడారములు వేయదలచాడు. అప్పడు - "ఇదిగో నా ప్రియ కుమారుడు ఈయనయందు నేను ఆనందించుచున్నాను; అయన మాట వినుడి" అని చెబుతూ దేవుడు పేతురును సరిచేసెను. (మత్తయి.17:5).

తన సొంత అవగాహనకు తనను వదలి వేసియుంటే క్రీస్తు ఆధిక్యతను మరియు కృప చేత విశ్వాసము ద్వారా రక్షణయను నూతన నిబంధనను పేతురు ఎన్నటికి గ్రహించియుండెడివాడు కాడు. కాని పేతురు తన స్వబుద్ధిపై ఆధారపడులాగున విడిచిపెట్టబడలేదు. అతడు దేవునిచే నడిపింపబడి నేర్పింపబడ్డాడు. పేతురలోని దైవిక జ్ఞాన లోపము, అతని వైఫల్యమునకు దారి తీసియుండెది. కానీ, దేవుడు నమ్మదగినవాడు.

ప్రభు రాత్రి భోజన సమయములో క్రీస్తు విషయమై మనుష్యులందరు అభ్యంతరపడినా, నేను అభ్యంతరపడనని పేతురు చెప్పాడు. అదే రాత్రి పేతురు ఆయనను ఎరుగనని ముమ్మారు బొంకునని యేసు ముందుగానే తెలిపాడు. తరువాత క్రీస్తు గెత్సెమనెలో ప్రార్థించినప్పడు ఆయనతో పాటు మెలకువగానుండి ప్రార్థించుమని యేసు పేతురును పలుమార్లు కోరాడు. కానీ పేతురు నిద్రించాడు తరువాత ఆ రాత్రే, తీర్పు జరుగుతుండగా ప్రవచనము నెరవేరునట్లు తన ప్రభువును తిరస్కరించి ఆ పిమ్మట తన వైఫల్యం విషయమై విలపించాడు. పేతురు క్రీస్తు విషయమై మూడు మార్లు బొంకినప్పడు ఆయన విశ్వాసములో నుండి శాశ్వతముగా తొలగిపోయి ఉండవలసినది. విశ్వాసమునందు కొనసాగుటలో పేతురుకు కలిగిన వైఫల్యము తన నిత్యనాశనానికి దారి తీసియుండవలసినది.

కానీ పునరుత్థానమైన పిమ్మట యేసు వ్యక్తిగతముగా పేతురును కలిసి "నీవు నన్ను ప్రేమించుచున్నావా? అని ముమ్మారు ఆయనను అడిగెను. పేతురు అనుకూలముగా స్పందించిన ప్రతిసారి క్రీస్తు అతనితో "నా గొఱ్ఱెలను మేపుము" అని చెప్పెను (యోహాను.21:15-17). పేతురు తొట్రుపడెను, శపించెను, బొంకెను మరియు పారిపోయెను. కాని క్రీస్తు ఆయనను లేవనెత్తి యథాస్థానపరచి తన మందలోనికి మరలా కొనిపోయి తానే ఆయనకై సిద్ధపరచిన గమ్యమును హామిగా ఇచ్చెను. యాభై రోజుల పిమ్మట పెంతెకొస్తు సమయములో నూతన నిబంధన సంఘమును ఉనికిలోనికి తెచ్చిన ఆ గొప్ప ప్రసంగాన్ని చేయుటకు క్రీస్తు పేతురును ఎన్నుకొనెను (అపో.కా.1,2 అధ్యాయాలు).

ఒకవేళ విశ్వాసుల పదిలత విషయమై ఆర్మీనియన్ భావన సరియైనదైతే, పేతురు తన జీవితములో పలుమార్లు రక్షణను కోల్పోయి తిరిగి పొందివుండాలి. కాని పేతురు యొక్క ప్రతి వైఫల్యము మరియు తిరస్కృతులయందు క్రీస్తే ఆయనను సంధిచేసి సమకూర్చి విశ్వాసమందు భద్రపరచెను. పేతురు నిర్ణయాలన్నియూ తన వినాశనానికే గాని విమోచనకు దోహదపడునవి కావు. అయితే క్రీస్తు నిర్ణయాలన్నియూ పేతురును ఖండించుటకు కాక

ఎల్లప్పడును  రక్షించుటకే ఉద్దేశింబబడియుండెను. ఇట్టి భద్రతను మనము ప్రభువునందు కలిగియున్నాము. మన పాపముల వెల చెల్లింపబడియున్నది. మన వైఫల్యాలన్నియూ యేసుక్రీస్తు రక్తము చేత పరిష్కరించబడినవి. మనలను శాశ్వతముగా ప్రేమించిన వాని విశ్వాస్యత మన బలహీనతలకు అతీతముగా మనలను భద్రపరచును.

## రోమా.8:29,30

రోమా 8వ అధ్యాయమునందు పౌలు ద్వారా బయలుపరచబడిన దేవుని ప్రణాళిక మరియు ఉద్దేశము ఈ సిద్ధాంతము యొక్క పరకాష్టకు చేరినవి.

> "ఎందుకనగా తన కుమారుడు అనేక సహోదరులలో జ్యేష్ఠుడగునట్లు, దేవుడెవరిని ముందుగా ఎరిగెనో, వారు తన కుమారునితో సారూప్యముగలవారగుటకు వారిని ముందుగా నిర్ణయించెను. మరియు ఎవరిని ముందుగా నిర్ణయించెనో వారిని పిలిచెను. ఎవరిని పిలిచెనో వారిని నీతిమంతులగా తీర్చెను. ఎవరిని నీతిమంతులుగా తీర్చెనో వారిని మహిమపరచెను."

1) దేవుడు తన కరుణను బట్టి నిత్యత్వమందు క్రీస్తు సహోదరులుగా నుండు నిమిత్తము కొందరు వ్యక్తులను ఏర్పరచుకొనెను. వారందరిలో, యేసు వారసత్వ సర్వహక్కులు కలిగిన జ్యేష్టుడు. అది సంపూర్ణముగా పతనమైన వారిలో నుండి భేషరతు ఎన్నిక.
2)  ఈ విధముగా ఏర్పరచబడిన వారు ప్రభావవంతముగా పిలువబడ్డారు. అది అబేధ్యమైన కృప.
3) ఏర్పరచబడిన ఆ ప్రజలు మాత్రమే క్రీస్తు ప్రాయశ్చిత్తము ద్వారా నీతిమంతులుగా తీర్చబడ్డారు అది పరిమిత ప్రాయశ్చిత్తము.
4) ఇలా ఎన్నుకోబడి నీతిమంతులుగా తీర్చబడిన, వారు దేవుని దృష్టియందు మునుపే మహిమ పరచబడ్డారు. ఇది పరిశుద్ధుల పదిలత.

దేవుని దృష్టిలో మనము మన జ్యేష్టుడు, మన ప్రభువైన కాపరియు రక్షకుడు, మన శరీరమునకు శిరస్సు, మన పునాది రాయి, మన వరుడు, మరియు పెనిమిటి, మన ఆత్మల ప్రేమికుడు, మన పస్కా గొర్రె, మన ప్రతిక్షేపణ మరియు విడుదల మన స్నేహితుడు, మరియు ఆదరణ కర్త, మన విమోచకుడు, మన విశ్వాసమునకు కర్త మరియు దానిని కొనసాగించువాడు, దేవుని శాశ్వత వాక్కు, తండ్రియొక్క అద్వితీయ కుమారుడు, పునరుత్థాన ప్రతిఫలము, జీవాహారము, మన జీవజలము, మరియు సర్వమైన క్రీస్తుతో కూడా పరలోక స్థలములో సురక్షితముగా భద్రపరచబడ్డాము. ఆమేన్.

## విమోచించబడిన వారి విలువ

మానవులు  శరీరానుసారులైన ఘోరపాపులు అని కృపా సిద్ధాంతాలు మనకు బోధిస్తాయి. వారు స్వతహాగా ఏ విలువ, మంచితనము లేనివారు. కాని దేవుని కృప వారికి వర్తింపజేయబడినపుడు, మాటలతో వర్ణింపశక్యము కానంతగా  ఆశ్చర్యము కలిగించునట్లు వారు పునః నిర్మింపబడి పునరుద్ధరింపబడినవారవుతారు. ఆయన ప్రియ కుమారుని సారుప్యములోనికి వారు పునఃసృష్టించబడ్డారు.

“ప్రియులారా, యిప్పడు మనము దేవుని పిల్లలమైయున్నాము. మనమిక ఏమవుదుమో అది యింక ప్రత్యక్షపరచబడలేదు గాని ఆయన ప్రత్యక్షమైనపుడు ఆయనయున్నట్లుగానే ఆయనను చూతుము గనుక ఆయనను పోలియుందుమని యెరుగుదుము.”(1 యోహాను.3:2)

ఆ గొప్ప మార్పు ఎన్నిక యొక్క అనివార్య ఫలితము. ఎన్నుకోబడి విమోచింపబడిన పాపులు దేవుని పరిశుద్ధ సన్నిధిలో అంధులుగా మరియు తిరుగుబాటు దారులుగా మిగిలిపోతారని లేఖనాలు బోధించుట లేదు. దానికి ప్రతిగా దేవుడు వారిని ప్రశస్త నిధులుగా నిర్మించాడు.

“నమ్మకమైన సాక్షియు, మృతులలోనుండి ఆది సంభూతుడుగా లేచినవాడును, భూపతులకు అధిపతియునైన యేసుక్రీస్తు నుండియు, కృపా సమాధానములు మీకు కలుగునుగాక.”(ప్రకటన.1:5)

“మా దేవునికి వారిని ఒక రాజ్యముగాను యాజకులనుగాను చేసితివి గనుక; వారు భూలోకమందు ఏలుదురని క్రొత్త పాట పాడుదురు.” (ప్రకటన.5:10)

దేవుని పరిశుద్ధులు, రాజులకు రాజైన వానితో కలిసి పాలించి ఏలుటకు అధికారము కలిగియుంటారు.

“పరిశుద్ధుల లోకమునకు తీర్పుతీర్చుదురని మీరెరుగురా? మీవలన లోకమునకు తీర్పు జరగవలసియుండగా, మిక్కిలి అల్పమైన సంగతులను గూర్చి తీర్పు తీర్చుటకు మీకు యోగ్యత లేదా? మనము దేవదూతలకు తీర్పు తీర్చుదుమని యెరుగరా? ఈ జీవన సంబంధమైన సంగతులను గూర్చి మరి ముఖ్యముగా తీర్పు తీర్చవచ్చును గదా?” (1 కొరింథి.6:2,3)

అంత మాత్రమే గాక, మనలను ఆయన సుందరమైన వారినిగా చేయును. క్రీస్తు తన ప్రజలకు బూడిదకు ప్రతిగా పూదండయు, దుఃఖమునకు ప్రతిగా ఆనంద తైలమును భారభరితమైన ఆత్మకు ప్రతిగా స్తుతి వస్త్రమును ఇచ్చును.” ఒక దినాన ఈ పురాతన భూమి క్రీస్తు యొక్క ప్రేత వస్త్రమువలె చుట్టబడును. కాని మనమైతే ఊహించనంతగా మహిమన్విత దశకు మార్చబడుదము.

“అయినను దేవుడు కరుణా సంపన్నుడైయుండి, మనము మన అపరాధములచేత చచ్చినవారమైయుండినప్పడు సయితము మనయెడల చూపిన తన మహా ప్రేమ చేత మనలను క్రీస్తుతో కూడా బ్రతికించెను. కృప చేత మీరు రక్షింపబడియున్నారు. క్రీస్తు యేసునందు ఆయన మనకు చేసిన ఉపకారము ద్వారా అత్యధికమైన తన కృపామహిమైశ్వర్యమును రాబోవు యుగములలో కనబరచు నిమిత్తము..” (ఎఫెస్సీ.2:4,6)

“మనయెడల ప్రత్యక్షము కాబోవు మహిమ యెదుట ఇప్పటి కాలపు శ్రమలు ఎన్నతగినవి కావని యెంచుచున్నాను.” (రోమా.8:18)

దీనిని ఆలోచించండి, తండ్రి యెన్నుకున్న ప్రజలను కుమారునికి బహుమతిగా ఇచ్చాడు. దేవుడు ఆయన కుమారునికి అపరిశుభ్రమైన విలువలేని బహుమతిని ఇవ్వడు. సంఘము, క్రీస్తునకు స్వచ్ఛమైన మరియు

కన్యకయైన వధువుగా కూడా సూచించబడినది. ఎందుకంటే విలువలేని, అపరిశుభ్రమైనదానిని యేసు వివాహ మాడి దానితో ఏక శరీరి కాజాలడు.

"దేవాసక్తితో మీ యెడల ఆసక్తి కలిగియున్నాను. ఎందుకనగా పవిత్రురాలైన కన్యకను ఒక్కడే పురుషునికి అనగా క్రీస్తుకు సమర్పింపవలెనని, మిమ్మును ప్రధానము చేసితిని."(2 కొరింథి.11:2)

"........సర్వాధికారియగు ప్రభువునగు మన దేవుడు ఏలుచున్నాడు; ఆయనను స్తుతించుడి, గొఱ్ఱెపిల్ల వివాహమహోత్సవ సమయము వచ్చినది ఆయన భార్య తన్నుతాను పరిశుద్ధపరచుకొనియున్నది. గనుక మనము సంతోషపడి ఉత్సహించి ఆయనను మహిమపరచెదమని చెప్పగా వింటిని మరియు ఆమె ధరించు కొనుటకు ప్రకాశములును నిర్మలములునైన సన్నపు నార బట్టలు ఆమెకియ్యబడెను. అవి పరిశుద్ధుల నీతిక్రియలు. మరియు అతడు నాతో యీలాగు చెప్పెను. గొఱ్ఱెపిల్ల విందుకు పిలువబడినవారు ధన్యులని వ్రాయుము. మరియు ఈ మాటలు దేవుని యథార్థమైన మాటలని నాతో చెప్పెను." (ప్రకటన.19:7-9)

మరియు అదే విధముగా ఆ ప్రజలను కుమారుడు తిరిగి తండ్రికి బహూకరించును వారు ఎంతో విలువకలవారిగా అగుపించుటలేదా? నా భావమేమనగా, గొప్ప మార్పు రానున్నది. విమోచనావాగ్ధానము పాప క్షమాపణకంటె అధికమైయుండి అద్భుతమైనదిగానుండును. ఎన్నుకొనబడినవారి దేహ, ప్రాణ, ఆత్మల సంపూర్ణ విమోచన, క్రీస్తు ప్రాయశ్చిత్త కార్య అంతిమఉద్దేశము. ఏదైన వస్తువు విలువ, దానికై చెల్లించబడిన వెలను బట్టి నిర్ణయించబడుతుంది. వెల ఎంత ఎక్కువగా ఉంటుందో విలువ అంత అధికముగా ఉంటుంది. ఎన్నుకోబడిన వారికై చిందించబడిన దేవుని రక్తముకన్న మించిన వెల భూమియందును పరలోకమందును ఎన్నడును చెల్లించబడలేదు. కానీ రక్షింపబడినవారిలోనున్న స్వీయ విలువను బట్టి ఆ గొప్ప త్యాగభరిత వెల చెల్లించబడలేదు, దానికి బదులుగా వారు "ఘనతకొరకైన పాత్రలుగా" పునః సృష్టించబడ్డారు.

మృతులైన, విలువలేని, తిరుగుబాటుదారులైనవారు తండ్రియొక్క సర్వాధికార కరుణ మరియు కుమారుని ప్రాయశ్చిత వెల నిమిత్తము తరాలబడి సాక్ష్యులుగా ఉండులాగున కృపామకుటాలుగా, ధవళ వస్త్రము ధరించిన వారుగా క్రీస్తు రక్తము ద్వారా కడుగబడియున్నారు. ఎన్నుకోబడినవారి భద్రత కేవలము దేవుని విశ్వాస్యతయందే ఆధారపడియున్నది.

ఒక ప్రత్యేక ప్రజలను లేపుటలో దేవుడే తన ఉద్దేశ్యమును సాధించును. దేవుడు తన కుమారునికి ఒక వధువును సిద్ధపరచును. శాశ్వతముగా "ఆత్మతోను, సత్యముతోను" ఆరాధించు ప్రజలను దేవుడు కలిగియుండును దేవుని కృపామర్మము మానవ హేతుకతకు, అవగాహనకు అతీతముగానుండును. అయినను ఆయన చేయునదంతటిలో ఓ దివ్య ఉద్దేశముండునని మనమెరుగుదుము. దేవుని స్వంత ఉద్దేశముల నిమిత్తము మరియు ఆయనకు మహిమ కలుగులాగున, మనమాయన పవిత్రప్రేమ మరియు నోచుకొననికృపను పొందినవారము.

ఆయన మనలను పరిపూర్ణులనుగా చేయును. ఆయన మనలను శోభాయమానముగా చేయును. ఆయన మనలను నిత్యలనుగా చేయును. ఆయన మనలను పరిశుద్ధులనుగా చేయును. ఆయన మనలను నిర్మలముగా చేయును. ఆయన మనలను అవినాశకులనుగా చేయును. ఆయన మనలను క్రీస్తువలె చేయును ఆయనకే సమస్త మహిమ, ఘనత, స్తుతి, ఆరాధన చెందులాగున ఇవన్నియు దేవుడే చేయును.

"సహోదరులారా, మిమ్మును పిలిచిన పిలుపును చూడుడి. మీలో లోకరీతిని జ్ఞానులైనను, ఘనులైననూ, గొప్ప వంశమువారైననూ అనేకులు పిలువబడలేదు గాని ఏ శరీరియు దేవుని యెదుట అతిశయింపకుండునట్లు జ్ఞానులను సిగ్గుపరచుటకు లోకములోనుండి వెఱ్ఱివారిని దేవుడు ఏర్పరచుకొనియున్నాడు. బలవంతులైనవారిని సిగ్గుపరచుటకు లోకములో బలహీనులైనవారిని దేవుడు ఏర్పరచుకొనియున్నాడు. ఎన్నికైన వారిని వ్యర్థము చేయుటకు లోకములో నీచులైన వారిని, తృణీకరింపబడినవారిని, ఎన్నికలేనివారిని దేవుడు ఏర్పరచుకొనియున్నాడు. అయితే ఆయన మూలముగా మీరు క్రీస్తు యేసునందున్నారు. అతిశయించువాడు ప్రభువునందే అతిశయించవలెనని వ్రాయబడినది నెరవేరునట్లు దేవుని మూలమగా ఆయన మనకు జ్ఞానమును నీతియు పరిశుద్ధతయు విమోచనమునాయెను." (1 కొరింథి.1:26-31)

***ఇదే దేవుని సార్వభౌమత్వము, ఇదే ఆయన కృప. రక్షణ 'కృపచేత మాత్రమే.'***